ఈనాడు

హైదరాబాద్ 8-3-2018 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 207

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 20+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

లలితా జ్యువెల్లరిలో వజ్రాభరణాల సంబరాలు!

ఉగాది శుభాకాంక్షలు



క్యారెట్ రూ.46000 నుంచి!

V.A గ్రాముకు రూ.975 మాత్రమే



100% Quality. E-F Colour Grade & VVS Clarity.

మా దగ్గర కొన్న వజ్రాభరణాలకు 100% ఎక్స్ఛేంజ్ చేసుకునే సౌకర్యం మరియు 85% క్యాష్‌బాక్ సౌకర్యం.

అన్ని వజ్రాభరణాలకు అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్ అందజేస్తాం.
(Certified by Internationally Recognized Gemmology Bodies.)

వజ్రపు వ్యాసం (సెంట్లలో)	సాధారణంగా మార్కెట్‌లో వజ్రాల ధర (ఒక క్యారెట్‌కు)	వజ్రాల న్యాయమైన ధర (ఒక క్యారెట్‌కు)
0 నుంచి 0.0749	రూ.67000 నుంచి 76000	రూ.46000
0.0750 నుంచి 0.1349	రూ.76000 నుంచి 85000	రూ.66500
0.1350 నుంచి 0.1749	రూ.98500 నుంచి 105000	రూ.83000
0.1750 నుంచి 0.2249	రూ.108500 నుంచి 112000	రూ.94000

ధరలు సర్వదేశ ఎగుమతి దిగుమతులకు తగినట్లు నిర్ణయించబడతాయి.

మరెవరికీ సాధ్యంకాని సదుపాయమిది!



ఇదివరకు ఉన్న తరుగు ~~8%~~ | ఉగాది కానుక తరుగు 7%



ఇదివరకు ఉన్న తరుగు ~~8%~~ | ఉగాది కానుక తరుగు 7%



ఇదివరకు ఉన్న తరుగు ~~9%~~ | ఉగాది కానుక తరుగు 8%



ఇదివరకు ఉన్న తరుగు ~~9%~~ | ఉగాది కానుక తరుగు 8%

100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్ మీరు మునుపెన్నడూ చూడని ఆకట్టుకునే లక్షలాది డిజైన్లతో లెక్కలేనన్ని కౌంటర్లు.

ఆదా చేయాలంటే.. పోల్చి చూడండి!

మీరు చేయాల్సిన నాలుగు విషయాలు

1. మనసుకు నచ్చిన నగను మొబైల్‌లో క్లిక్ చేసి, దానికి 'ఎస్టిమేట్ స్లిప్' మా వద్ద తీసుకోండి.
2. నగ ఫొటో, ఎస్టిమేట్‌స్లిప్‌ను పెట్టుకుని కనీసం నాలుగైదు షోరూంలలో ధరలు పోల్చిచూడండి.
3. BIS 916 హాల్‌మార్క్ ముద్ర ఉందా అని సరిచూసుకోండి.
4. ఏ షోరూంలో అయితే మీకు నచ్చిన నగ తక్కువ ధరకు లభిస్తోందో అక్కడే కొని లబ్ధి పొందండి.

ఓ షోరూంలో డిజైన్ నచ్చి, అక్కడ తరుగు అధికంగా ఉంటే.. ఆ నగను మొబైల్‌లో క్లిక్ చేసి, ఎక్కడ తరుగు తక్కువగా ఉంటుందో అక్కడే చూపించి, ఆర్డర్ చేసి కొనుక్కోండి.



కనువిందు చేసే సంప్రదాయ మరియు వినూత్నమైన వెండిసామగ్రి.
మార్కెట్‌లోనే అతి తక్కువ ధరకు అందిస్తున్నాం!



Lalithaa®

లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

హైదరాబాద్ : 6-3-883, SBR సౌక్, రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా, సోమాజిగూడ సర్కిల్. ఫోన్: 040 - 6748 6677.

వైజాగ్ : 29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్, ద్వారకా నగర్. ఫోన్: 0891 - 6600001.

తిరుపతి : 481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, మాస్కో రోడ్డు. (V.V. మహల్ రోడ్డు). ఫోన్: 0877 - 666 0505 / 0606 / 7888.

చెన్నై • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ www.lalithaajewellery.com

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

హైదరాబాద్ 8-3-2018 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 207

రూ. 5-00 పేజీలు 20+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi




మోదీజీ.. మీతో వేగలేం

కేంద్రంతో తెదేపా

కటీఫ్

రాజీనామా





ఉద్దేశం నెరవేరనప్పుడు ఎందుకుండాలి

- ప్రత్యేక హోదా ఇవ్వమని చెప్పి మనల్ని కించపరిచేలా వ్యవహరించారు
- అందుకే వైదొలుగుతున్నాం
- అశోక్, సుజనాలతో గురువారం రాజీనామా చేయిస్తాం..
- ప్రధానికి చెప్పాలనుకున్నా అందుబాటులోకి రాలేదు
- కేంద్రం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంది.
- రాష్ట్రంలో భాజపా మంత్రుల రాజీనామాలు వారిష్టం
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టీకరణ

‘మావి గొంతెమ్మకోర్కెలు కావు. మేం కోరుతున్న అంశాలు అన్యాయమైనవైతే చెప్పండి. న్యాయమైతే వెంటనే చేయండి. ప్రతి అంశాన్ని సమీక్షించండి. దగాపడ్డ ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేసే బాధ్యత తీసుకోవాలని కేంద్రాన్ని కోరితే.. మొండి వైఖరి అవలంబించడం సమాఖ్య వ్యవస్థ ఎలా అవుతుందో మీరే ఆలోచించాలి.

విభజన బిల్లు పార్లమెంటులో పాస్ అయినప్పుడు ఇప్పటి ఆర్థిక మంత్రి, ఉపరాష్ట్రపతి ప్రతిపక్ష నాయకులుగా ఉంటూ పోరాడారు. దాన్ని అమలు చేయడంలో ఎందుకింత నిర్లక్ష్యం? ఎందుకీ ఉదాసీనత?

దేశ రక్షణ కోసం వినియోగించే డబ్బులు కూడా మనమేదో ఇమ్మని అడిగినట్లు అర్థమొచ్చేలా అరుణ్‌జైట్లీ దిల్లీలో మాట్లాడారు. ఇది చాలా బాధాకరం, అవమానకరం. సమస్యను ఎలా పరిష్కరించాలనేది ఆలోచించకుండా, కేంద్ర రాష్ట్ర సంబంధాలను పట్టించుకోకుండా కేంద్రం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంది.

- ఇద్దరు కేంద్ర మంత్రులతో రాజీనామాకు నిర్ణయం
- ప్రత్యేక హోదాను కేంద్రం తిరస్కరించడంపై ఆగ్రహం
- ఎన్డీయేలో కొనసాగడంపై తరువాత నిర్ణయం
- అటు దిల్లీలో.. ఇటు రాష్ట్రంలో వేగంగా పరిణామాలు
- జైట్లీ ప్రకటనతో భగ్గుమన్న నేతలు



రాజీనామా చేయనున్న భాజపా మంత్రులు

హోదా పోరు పతాక స్థాయికి చేరింది.

ప్రత్యేక హోదా కోసం దేన్నికైనా సిద్ధమంటూ ప్రకటిస్తూ వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం బుధవారం అర్ధరాత్రి కీలక నిర్ణయం తీసుకుంది. నేడా రేపా అంటూ ఉత్కంఠ రేపిన పార్టీ కేంద్ర మంత్రుల రాజీనామా అంశానికి ముగింపునిచ్చింది. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న మా ఇద్దరు మంత్రులు అశోక్‌గజపతి రాజు, సుజనా చౌదరిలు రాజీనామా చేస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియా ముఖంగా విస్పష్ట ప్రకటన చేశారు. ప్రతిగా రాష్ట్రప్రభుత్వంలోని భాజపా మంత్రులిద్దరు కూడా రాజీనామా చేయాలని నిర్ణయించారు. దీంతో భాజపా, తెదేపాల దోస్తీకి తెర పడినట్లయింది. అంతకు ముందు బుధవారం ఉదయం రాష్ట్రంలో, దిల్లీలో హోదా కేంద్రంగా అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ‘హోదా’కు సమానంగా నిధులివ్వడానికి కేంద్రం కట్టుబడి ఉందని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ దిల్లీ మీడియా ముందు పునరుద్ఘాటించారు. ఉద్యమాలు, సెంటిమెంటులు నిధులు పెంచలేవంటూ హోదాపై పార్టీల పోరునుద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ పరిణామం తెదేపాలో ఆగ్రహం పెంచింది. అదే తమ మంత్రుల రాజీనామాకు ప్రకటనకు మరింత వేగిరపరిచింది. ఇటు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే క్రమంలో చంద్రబాబు... విభజన హామీలు, ‘హోదా’ పూర్వపరాలు, రాష్ట్రం పడుతున్న ఇబ్బందులు, కేంద్రం తీరుతెన్నులపై సుదీర్ఘంగా మూడు గంటలపాటు ప్రసంగించారు. కేంద్ర మంత్రుల రాజీనామా ప్రకటనకు అది పూర్వరంగంగా నిలిచింది. అసెంబ్లీలోనే కీలక ప్రకటన రావచ్చని భావించినా అది జరగలేదు. చంద్రబాబు అర్ధరాత్రి తీసుకున్న సంచలన నిర్ణయం... అటు భాజపా, విపక్ష వైకాపా ముందు కొత్త సవాలును ఉంచింది. తెలుగుదేశం సహా ఇతర పార్టీలు వేసే తదుపరి అడుగులేమిటనేది ఆసక్తికరంగా మారింది.

ఉదయం నుంచీ

- ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు అమలుచేయాలన్న డిమాండ్‌తో తెదేపా ఎంపీలంతా గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేశారు.
- ఎంపీల నిరసనలతో బుధవారం లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ఉదయం 11 గంటలకు రెండునిమిషాల్లోనే సభను వీడి వెళ్లారు.
- ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో పార్లమెంటు ముట్టడి ఉద్రిక్తమైంది. పోలీసులు లాఠీచార్జి చేశారు.
- ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే ప్రతిపాదన తమ వద్ద లేదని కేంద్ర ప్రణాళికశాఖ మంత్రి రావ్ ఇంద్రజిత్ సింగ్ మరోసారి చెప్పారు.
- మధ్యాహ్నం అసెంబ్లీలో కేంద్ర ప్రభుత్వం తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నిర్లక్ష్యంపై గట్టిగా నిలదీశారు.
- సాయంత్రం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విలేకరులతో మాట్లాడారు. ‘ప్రత్యేక హోదా’తో సమానమైన మొత్తాన్ని అందించడానికి కేంద్రం కట్టుబడి ఉందని చెప్పారు.
- జైట్లీ ప్రకటన అనంతరం చంద్రబాబు ఎంపీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంపీలంతా కేంద్రం నుంచి వైదొలగాలనే సూచించారు.
- మంత్రులతోనూ చంద్రబాబు సమాలోచనలు జరిపారు. వారూ వైదొలగేందుకే సుముఖత చూపారు.
- కేంద్రమంత్రులిద్దరితో ముఖ్యమంత్రి ఫోన్లో మాట్లాడారు. వారిద్దరూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని చెప్పారు.
- కేంద్రమంత్రులిద్దరూ రాజీనామా చేస్తారని విలేకరుల సమావేశంలో చంద్రబాబు ప్రకటించారు.

కేంద్రంలో కుదుపు

- ఎన్డీయేకు రాంరాం చెప్పిన మొదటి మిత్రపక్షం

విసిగి.. వేసారే!

- కేంద్రసాయంపై నిరాశతోనే నిర్ణయం

ఎప్పుడూ పూర్తికాలం లేరు

మాట తప్పితే ఎలా

వివరాలు, ప్రత్యేక కథనాలు 2, 14, 15 పేజీల్లో

హోదా అసాధ్యం

‘విభజన సమయంలో ‘ప్రత్యేక హోదా’ విధానం అమల్లో ఉన్నందున- ఏపీకి ఆ హోదా ఇస్తామని వాగ్దానం చేశారు. రాజ్యాంగపరంగా ఏర్పాటైన 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదా ఎవ్వరికీ ఇవ్వొద్దని సిఫారసు చేసింది. దానికి బదులు రెవిన్యూ లోటు ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు పరిహారం ఇచ్చింది. రాజకీయాంశాలు వనరుల పరిమాణాన్ని (క్వాంటమ్ ఆఫ్ మనీని) పెంచలేవు. ఎందుకంటే కేంద్రానికి అయాచిత నిధుల ప్రవాహం లేదు. కేంద్ర నిధుల్లో దేశంలోని అన్ని రాష్ట్రాలకూ ఒకే రకమైన హక్కు ఉంటుంది. సెంటిమెంట్ అన్నది వనరుల పరిమాణాన్ని నిర్ధారించలేదు. ఏ రాష్ట్రానికి ఎంత నిధులివ్వాలన్నది ఆర్థిక సంఘం నిర్ణయిస్తుంది. విభజన కారణంగా ఏపీ దెబ్బతిన్న విషయం నాకు తెలుసుకాబట్టి వ్యక్తిగతంగా వారి పట్ల సానుభూతి ఉంది.’



ఇదీ సంగతి!



ఆ బిల్లును అనుమతించలేం

- అందులో వాస్తవ ఆధారాలు లేవు
- రిజర్వేషన్ల పెంపుపై తెలంగాణకు కేంద్రం స్పష్టీకరణ
- 62 శాతాన్ని సమర్థించుకునేలా సమాచారమివ్వాలని లేఖ

ఈనాడు - దిల్లీ, హైదరాబాద్: తెలంగాణలో విద్యా, ఉద్యోగాల్లో ముస్లింలు, గిరిజనులకు రిజర్వేషన్లు పెంచాలంటూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదిత బిల్లులో వాస్తవ ఆధారాలు చూపలేకపోయిందని.. అందుకే ప్రతిపాదిత బిల్లును అనుమతించలేమని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. మరోవైపు రాష్ట్రం పంపిన బిల్లుపై కొన్ని స్పష్టమైన వివరణలు కోరుతూ లేఖ రాసింది. బుధవారం రాజ్యసభలో తెదేపా ఎంపీ దేవేందర్‌గౌడ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్సరాజ్ గంగారం అహిర్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. తెలంగాణ ప్రతిపాదిత బిల్లును ప్రక్రియ ప్రకారం ఆయా మంత్రిత్వశాఖలకు పంపామని తెలిపారు. “ఆర్టికల్ 16(4) ప్రకారం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని 9 మంది సభ్యులున్న రాజ్యాంగ ధర్మాసనం 16.11.1992న తీర్పు ఇచ్చింది. అసాధారణ పరిస్థితుల్లోనే ఆ శాతాన్ని పెంచుకోవచ్చని వెసులుబాటు కల్పించింది. తెలంగాణ ప్రభుత్వం ఈ విధమైన వాస్తవ ఆధారాలు ప్రతిపాదిత బిల్లులో చూపలేకపోయింది” అని సిబ్బంది వ్యవహారాల శాఖ పేర్కొందని అహిర్ తెలిపారు. కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ, గిరిజన వ్యవహారాల శాఖ తమ తమ అభిప్రాయాలను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి పంపాయని అహిర్ పేర్కొన్నారు.

మరోవైపు రిజర్వేషన్లను పెంచేందుకు ఉద్దేశించి రాష్ట్రం పంపిన బిల్లుపై కొన్ని స్పష్టమైన వివరణలు కోరుతూ కేంద్రం లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వం

(మిగతా 2లో)



బుధవారం పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద నినాదాలు చేస్తున్న తెరాస ఎంపీలు

రిజర్వేషన్ల పెంపు హక్కు రాష్ట్రాలకే ఉండాలి

5లో

పార్లమెంటులో తెరాస ఎంపీల నిరసన

నేడు వీహబ్‌కు శ్రీకారం

- మహిళా పారిశ్రామికవేత్తలకు చేయూతే లక్ష్యం
- ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్
- టీశాట్ కార్యాలయంలో తాత్కాలిక కార్యాలయం
- హాజరుకానున్న క్షిపణి మహిళ టెస్సీ థామస్, వాణి కోల
- దేశంలో తొలిసారిగా మహిళల కోసం ఇంక్యుబేటర్

2లో

కేంద్రం నుంచి వైదొలుగుతున్నాం

- అశోక్, సుజనాలతో గురువారం రాజీనామా చేయిస్తాం..
- ఉద్దేశం నెరవేరనప్పుడు కేంద్రంలో ఉండటం వృథా
- దీన్ని ప్రధానికి చెప్పాలనుకున్నా అందుబాటులోకి రాలేదు
- ఎన్డీయేలో కొనసాగాలా? వద్దా? అనేది తదుపరి నిర్ణయిస్తాం
- ప్రత్యేక హోదా విషయంలో కించపరిచేలా వ్యవహరించారు
- కేంద్రం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంది
- విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



ఈనాడు - అమరావతి

కేంద్ర మంత్రివర్గం నుంచి తెలుగుదేశం మంత్రులు వైదొలుగుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. మంత్రులు అశోక్‌గజపతిరాజు, సుజనాచౌదరిలతో గురువారం పదవులకు రాజీనామా చేయించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఏ ఉద్దేశంతో అయితే కేంద్ర మంత్రివర్గంలో చేరామో అదే నెరవేరనప్పుడు ఇంకా అక్కడ ఉండటం వృథా అన్న ఉద్దేశంతోనే బయటకొచ్చేయాలనుకున్నామని అన్నారు. ప్రస్తుతం తొలి అడుగుగా ప్రభుత్వం నుంచి బయటకొచ్చామని, ఎన్డీయేలో కొనసాగాలా? వద్దా? అనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని అన్నారు. దీనిపైన ఏం చేయాలో తదుపరి నిర్ణయిస్తామన్నారు. పరిపక్వత కలిగిన రాజకీయ నాయకుడిగా ఈ విషయాన్ని ప్రధాని మోదీకి చెప్పడం బాధ్యతగా భావించి సంప్రదించినా ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదని వ్యాఖ్యానించారు. బుధవారం రాత్రి 11 గంటలకు వెలగపూడి సచివాలయంలో మంత్రులు కళావెంకట్రావు, యనమల రామకృష్ణుడుతో కలిసి చంద్రబాబు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...'ఆంధ్రప్రదేశ్‌కు సాయం చేసే ఉద్దేశం కేంద్రంలో ఏ మాత్రమూ కనిపించడం లేదు. ఈ విషయంలో వారు ముందే ఓ నిర్ణయానికి వచ్చేసినట్లుంది. దేశ రక్షణ కోసం వినియోగించే డబ్బులు కూడా మనమేదో ఇమ్మని అడిగినట్లు అర్థమొచ్చేలా అరుణ్‌జైట్లీ దిల్లీలో మాట్లాడారు. ఇది చాలా బాధాకరం, అవమానకరం. విభజన చట్టంలోని అంశాలు, రాజ్యసభలో అప్పటి ప్రధాని ఇచ్చిన హామీలు నెరవేర్చండి.. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడండంటూ ఎన్నిసార్లు అడిగినా ఏ మాత్రం స్పందించనందునే మరో మార్గం లేక బయటకొచ్చేశాం. 29సార్లు దిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిశాను. మూడుసార్లు వారిని నిలదీశాను. రాష్ట్రానికి జరిగిన అన్యాయం, విభజన చట్టంలోని 19 అంశాల ప్రస్తుత పరిస్థితి గురించి బుధవారం శాసనసభలో సుదీర్ఘంగా వివరించా. ఎక్కడా రెచ్చగొట్టేటట్లు మాట్లాడలేదు. కేవలం జరిగిన అన్యాయాన్ని మాత్రమే వివరించాను. ఇవన్నీ చెప్పాక.. ఆ వెంటనే అరుణ్‌జైట్లీ విలేకరుల సమావేశం పెట్టి ప్రత్యేక హోదా ఇవ్వం, ప్రోత్సాహకాలు ఇవ్వమంటూ మనల్ని కించపరిచేలా మాట్లాడారు. కేంద్రం డబ్బులంతా మనమే ఏదో అడుగుతున్నట్లు ఆయన వ్యాఖ్యలు చేయడం సరికాదు. సమస్యను ఎలా పరిష్కరించాలనేది ఆలోచించకుండా, కేంద్ర రాష్ట్ర సంబంధాలను పట్టించుకోకుండా కేంద్రం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంది. ప్రత్యేక హోదా ఎవరికీ ఇవ్వడం లేదని, అందులో ఉన్న అంశాలన్నింటినీ ప్రత్యేక సాయం రూపంలో ఇస్తామని అప్పట్లో ప్రకటించి ఇప్పుడు ఈశాన్య రాష్ట్రాలకు ఇస్తూ మనకు ఇవ్వకుండా వివక్ష చూపిస్తున్నారు. మీకు ప్రత్యేక హోదా ఇస్తే బిహార్‌కు ఇవ్వాల్సి వస్తోందని కేంద్రం పోలిక పెట్టడం సరికాదు' అని వ్యాఖ్యానించారు.

అన్ని విధాల ఒప్పించడానికి ప్రయత్నించా..

కేంద్రంలో ఎందుకు కొనసాగుతున్నామో చాలా రోజులుగా చెబుతూనే ఉన్నా. రాష్ట్ర ప్రయోజనాల సాధన విషయంలో కేంద్రాన్ని ఒప్పించడానికి, నచ్చజెప్పడానికి అన్ని విధాలుగా ప్రయత్నించా. అవేవి పనిచేయనప్పుడు కనీసం గౌరవంగా బయటకొచ్చేసి మన పని మనం చేసుకుందామనే మంత్రివర్గం నుంచి వైదొలగాలని నిర్ణయించాం. రాష్ట్ర మంత్రులు, కేంద్రంలోని తెదేపా మంత్రులు, ఎంపీలతో చర్చించి ఈ నిర్ణయం ప్రకటిస్తున్నాం. రాష్ట్రానికి అన్యాయం జరిగినందునే విధిలేని పరిస్థితుల్లోనే బయటకొచ్చాం. సెంటిమెంట్‌ను ఇప్పటికైనా గౌరవిస్తారని ఆశిస్తున్నా. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఇప్పటికైనా కేంద్రం ముందుకొచ్చి సమస్యలు పరిష్కరించాలి.

కేంద్ర స్పందన చూసే తదుపరి కార్యాచరణ

'మా నిర్ణయంపై కేంద్రం ఎలా స్పందిస్తుందనే దానిపై భవిష్యత్తు కార్యాచరణ ఆధారపడి ఉంటుంది. ప్రజలంతా సంఘటితంగా ఉండాలి. మన హక్కులు కాపాడుకోవడంలో కలిసి ముందుకుపోదాం. రాష్ట్రంలో విధ్వంసం జరిగితే మనమే నష్టపోతాం. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో స్పందిస్తున్న వారందరికీ ధన్యవాదాలు. అందరి ధ్యేయం రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటమే. దీనిపై రాజకీయాలు చేయడానికి నేను సిద్ధంగా లేను. ప్రధాని కార్యాలయం చుట్టూ పదే పదే తిరగడం వారికేం (వైకాపా) పని? అలాంటి వారి గురించి నేనేం మాట్లాడతా? మేమంటే మిత్రపక్షం తిరిగినా అర్థం ఉంది? వైకాపాకు సంబంధం ఏమిటి? మీరు(విలేకరులు) దీనిపై వారిని ప్రశ్నించాలి. రాహుల్‌గాంధీ ఎలా సాయం చేస్తారో చెప్పాలి కదా? ఈఏపీ ఇస్తారా? ప్రత్యేకహోదా ఇస్తారా? చెప్పాల్సిన అవసరం ఉంది. నేనెవరితోనూ వెళ్లాల్సిన అవసరం లేదు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏంచేయాలో అది చేస్తాం. దేశంలో ఆంధ్రప్రదేశ్ ఒక రాష్ట్రం. మనమూ పన్నులు కడుతున్నాం. కేంద్రాన్ని వ్యతిరేకించానంటే రాష్ట్రం కోసమే. నాలుగేళ్లుగా అన్ని ప్రయత్నాలూ చేశా. ఇప్పటికైనా నిర్ణయం తీసుకోకుంటే రాష్ట్రానికి నష్టం జరుగుతుందనే ఉద్దేశంతోనే బయటకొచ్చేశాం. కేంద్ర బడ్జెట్ చూశాక నేనే స్పందించి గట్టిగా మాట్లాడా. దీన్ని అర్థం చేసుకోకపోగా.. కేంద్రం వ్యతిరేక ధోరణిలో మాట్లాడింది. చివరకు మంత్రుల రాజీనామా దాకా తెచ్చారు. దేశంలో ఆంధ్రప్రదేశ్ కూడా ఒక రాష్ట్రం. మనం కూడా పన్నులు కడుతున్నాం. మనకూ అడిగే హక్కు ఉంది. న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. కూటములు, రాజకీయాల గురించి ఇప్పుడు మాట్లాడటం సరికాదు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు వక్రీకరించడం సరికాదు' అని పేర్కొన్నారు.

భాజపా మంత్రుల రాజీనామాలు వారిష్టం

మీరు కేంద్ర మంత్రివర్గం నుంచి వైదొలిగిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న భాజపా మంత్రులు రాజీనామా చేస్తారా? అని విలేకరులు అడగ్గా...'దాని గురించి నాకు తెలీదు. అది వారిష్టం...' అని వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని కేంద్రం ఇంత దారుణంగా మోసం చేయడం వెనుక కారణం ఏముంటుందని విలేకరులు అడగగా... 'నాకైతే తెలీదు...' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు.

వారికి ఇంకా ఏం? కావాలి?

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కింద ఏడు జిల్లాలకు ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన రూ.350 కోట్లు ఇచ్చారు. తర్వాత ప్రధానమంత్రి ఆమోదం (క్లియరెన్స్) లేదని చెప్పి ఖాతా నుంచి ఆ సొమ్మును వెనక్కి తీసుకున్నారు. దీన్ని ఎలా అన్వయించుకోవాలి. వారు సాయం చేస్తున్నారా? లేదా? అనేది ప్రజలే చెప్పాలి. కేంద్రం రాజధానికి ఇచ్చిన నిధులకు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఇప్పటివరకూ ఇచ్చిన నిధులకు కూడా వినియోగ పత్రాలు ఇచ్చాం. వారికి ఇంకా ఏం? కావాలి?

- తొలి ఆర్థిక సంవత్సరంలో రూ.16,078 కోట్లు ఆర్థిక లోటు ఉందని కాగ్ తేల్చింది. అది అధీకృత సంస్థ కాదా? రైతు రుణమాఫీ, సామాజిక భద్రత పింఛన్లు, డిస్కమ్‌లకు చెల్లించిన సొమ్మును మినహాయిస్తే రెవెన్యూ లోటు రూ.4117 కోట్లే వస్తుందని చెబుతున్నారు. ఇప్పటికే రూ.3979 కోట్లు ఇచ్చేసినందున ఇంకా రూ.138 కోట్లే వస్తాయంటున్నారు. అన్ని తప్పుడు లెక్కలు వేశారు. కాగ్ చెప్పింది కూడా పరిగణనలోకి తీసుకోకుండా మేమే సొంతంగా లెక్కలు వేస్తాం. రెవెన్యూ లోటు కింద ఇంతే వస్తుంది అనడం ఎంత మాత్రం సరికాదు. ఫించన్లకు సంబంధించి సరిగ్గా లెక్కలేయలేదు. గత నాలుగేళ్లలో మొత్తం రూ.23 వేల కోట్లు లోటు ఉంటే ఇప్పటివరకూ రూ.4 వేల కోట్లు కూడా రాలేదు.
- పోలవరం ప్రాజెక్టు కింద రూ.7918 కోట్లు ఖర్చు చేశాం. కేంద్రం ఇప్పటివరకూ రూ.5349 కోట్లు ఇచ్చింది. మరో రూ.2565 కోట్లు ఇవ్వాలి. దీనిపైన అడిగితే పనులు పురోగతి ఉండాలి కదా? అంటున్నారు. ఇదేమి న్యాయం?..అని సీఎం చంద్రబాబునాయుడు ప్రశ్నించారు.

ఏపీ మంత్రివర్గం నుంచి వైదొలగనున్న భాజపా మంత్రులు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మంత్రివర్గం నుంచి వైదొలగాలని భాజపా నిర్ణయించింది. మంత్రులు కామినేని శ్రీనివాస్, మాణిక్యాలరావు గురువారం తమ పదవులకు రాజీనామా చేయనున్నారు. కేంద్ర మంత్రివర్గం నుంచి వైదొలగాలని తెదేపా నిర్ణయించిన కొద్దిసేపటికే భాజపా మంత్రి మాణిక్యాలరావు, ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ, ఎమ్మెల్సీ మాధవ్, ఇతర నేతలు విజయవాడలో అత్యవసరంగా సమావేశమయ్యారు. అనంతరం ఆకుల సత్యనారాయణ, మాధవ్‌లు విలేకరులతో మాట్లాడారు. 'గురువారం మా మంత్రులిద్దరూ పదవులకు రాజీనామాలు చేయబోతున్నారు. రాష్ట్రాభివృద్ధికి చేస్తున్న కృషి గురించి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ చేసిన ప్రకటనను తెదేపా తప్పుగా అర్థం చేసుకుంది. తెదేపా వైదొలగటంతో మా మంత్రులు రాజీనామా చేయబోతున్నారు. కనుక గురువారం మంత్రివర్గ సమావేశానికి కూడా హాజరు కారు...' అని ప్రకటించారు.



ఆస్పత్రిలో కర్ణాటక లోకాయుక్త జస్టిస్ విశ్వనాథ్ శెట్టి

కర్ణాటక లోకాయుక్తకు కత్తిపోట్లు

సమాచార హక్కు చట్టం కార్యకర్త దుశ్చర్య

ఈనాడు–బెంగళూరు: కర్ణాటక లోకాయుక్త జస్టిస్ విశ్వనాథశెట్టిపై ఆయన కార్యాలయంలో, పట్టపగలే హత్యాయత్నం జరిగింది. బెంగళూరులోని విధానసౌధ ముంగిట అత్యంత రద్దీ ప్రాంతంలో ఉండే కార్యాలయంలో జరిగిన ఈ ఘటన సంచలనం సృష్టించింది. తుమకూరుకు చెందిన న్యాయవాది, సమాచార హక్కు చట్టం కార్యకర్త తేజరాజ్ శర్మ బుధవారం ఈ దురాగతానికి పాల్పడ్డాడు. తన ఫిర్యాదులకు తగిన స్పందన లేదనే ఆగ్రహంతో ఈ దాడికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. దాడిలో జస్టిస్ విశ్వనాథశెట్టి ఎడమ చేయి, రొమ్ము, పొట్టపై మొత్తం ఐదు కత్తిపోట్లు పడ్డాయి. రక్తపుమడుగులో విలవిల్లాడుతున్న విశ్వనాథశెట్టిని లోకాయుక్త సిబ్బంది సమీపంలోని మాల్యా వైద్యాలయానికి చేర్చారు. అత్యవసర చికిత్స విభాగంలో ఆయనకు సేవలందించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హుటాహుటిన వైద్యాలయానికి వెళ్లి విశ్వనాథశెట్టి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రితో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. 'తేజరాజ్ శర్మ కుటుంబానిది రాజస్థాన్. ఐదు దశాబ్దాల కిందట కర్ణాటకలోని తుమకూరుకు వచ్చి కుటుంబం స్థిరపడింది. ప్రభుత్వ కార్యాలయాలకు మేజాలు, బల్లలు, ఇతర సామగ్రిని సరఫరా చేసే గుత్తేదారుగా పనిచేస్తున్నాడు. తనకు దక్కని టెండర్లపై ఫిర్యాదును లోకాయుక్త పట్టించుకోలేదనే ఆగ్రహంతో గతంలో రెండుమార్లు కార్యాలయానికి కత్తితో వచ్చాడని, ధైర్యం చాలక వెనుదిరిగాడని తేలింది. బుధవారం చేసే పనిలో విజయవంతమవుతాడని జ్యోతిష్కులు చెప్పడంతో అఘాయిత్యానికి తెగించాడని పోలీసు దర్యాప్తులో తేలింది.

తెలంగాణకు మహిళా విశ్వవిద్యాలయం

ఈనాడు, హైదరాబాద్:తెలంగాణకు మహిళా విశ్వవిద్యాలయం రానుంది. దీంతో రాష్ట్రానికి మహిళా వర్సిటీ లోటు తీరనుంది. ఇందుకు ఆర్థిక సహకారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సైతం అంగీకరించడంతో చరిత్రాత్మక ప్రాధాన్యం ఉన్న కోఠి మహిళా కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమైంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించాలని కసరత్తు చేస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడంతో.. తెలంగాణలో మరోటి ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చింది. బాలికా విద్యను ప్రోత్సాహించేందుకు కేంద్రం నియమించిన విద్యపై కేంద్రీయ సలహా మండలి(కేబ్) ఉప సంఘానికి ఛైర్మన్‌గా పనిచేసిన కడియం శ్రీహరి పలుమార్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్‌ను కలిసి విన్నవించారు. కేంద్రమంత్రి నుంచి హామీ లభించినట్లు సమాచారం. కేంద్రం నుంచి సహకారం లేకున్నా మహిళా కళాశాలను వర్సిటీగా మారిస్తే పెద్దగా నిధులు కూడా అవసరం లేదని ప్రభుత్వ ఉద్దేశం. ప్రస్తుతం ఈ కళాశాల ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉంది. యూజీసీ స్వయం ప్రతిపత్తి హోదా కూడా పొందింది. మూడుసార్లు న్యాక్ గుర్తింపు దక్కించుకుంది. నగరం నడిబొడ్డున ఉండటం... బాలికలకు



భద్రతాపరంగా కూడా అనుకూలమైన ప్రాంతంలో ఉండటంతో దీన్ని వర్సిటీగా మార్చాలని నిర్ణయించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే వర్సిటీగా మార్చేందుకు అవసరమైన చట్టాలు మార్చేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

రూ.100 కోట్లు అవసరం

విశ్వవిద్యాలయానికి అవసరమైన దాదాపు అన్ని మౌలిక వసతులు మహిళా కళాశాలలో ఉన్నాయి. పరిశోధనకు ప్రయోగశాలలతోపాటు వసతిగృహాలు, ఆడిటోరియం తదితర కొన్ని వసతులు కల్పిస్తే చాలు. మొత్తం మీద రూ.100 కోట్లు వెచ్చిస్తే అన్ని వసతులతో కూడిన విశ్వవిద్యాలయంగా మార్చవచ్చని ఓయూ ఉపకులపతి ఆచార్య రామచంద్రం చెప్పారు.

కేంద్ర ఉద్యోగులకు 2శాతం డీఏ పెంపు

దిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు జనవరి ఒకటవ తేదీ నుంచి వర్తించేలా కరవు భత్యాన్ని (డీఏ) 2శాతం మేర కేంద్ర కేబినెట్ పెంచింది. బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం మూల వేతనం/పింఛనుపై 5శాతంగా ఉన్న డీఏ 7శాతానికి పెరుగుతుంది. ఈనిర్ణయం వల్ల 48.41 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 61.17 లక్షల మంది పింఛనుదారులు లబ్ధి పొందుతారు.

చంద్రబాబుపైనా కేసులు పెడతారేమో: నారాయణ

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వం నుంచి చంద్రబాబునాయుడు బయటకురావడం సంతోషకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. విభజన హామీలను అమలు చేయడంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు. తెలుగు రాష్ట్రాలకు కేంద్రం చేస్తున్న అన్యాయంపై ముఖ్యమంత్రులు ఉద్యమించాలన్నారు. 'తెగదెంపులు చేసుకున్నందున బిహార్‌కు చెందిన లాలూ ప్రసాద్‌పై కేసులు పెట్టినట్లు చంద్రబాబుపైనా కేసులు పెట్టొచ్చు. అలా చేసినప్పటికీ.. పోరాడితే విజయం లభిస్తుంది' అని నారాయణ అన్నారు.

ఇంటర్ వరకు తెలుగు బోధన తప్పనిసరి!

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వరకు తెలుగు బోధించటం అనివార్యం కానుంది. ఈ అంశంపై ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. అందుకు చట్టబద్ధతను తీసుకువచ్చేందుకు చట్టాన్ని తీసుకురావాలని భావిస్తోంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సంబంధిత బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ పాఠ్య ప్రణాళికను బోధించే పాఠశాలలతోపాటు.. సీబీఎస్ఈ, ఐసీఎస్ సిలబస్‌ను బోధించే అన్ని పాఠశాలలు తెలుగును అనివార్యంగా బోధించాలి. అందుకు విరుద్ధంగా వ్యవహరించే పాఠశాలల అనుమతులు రద్దు చేయటంతోపాటు రూ.లక్ష వరకు అపరాధం విధించాలనికూడా ప్రభుత్వం ఆ బిల్లులో ప్రతిపాదించినట్లు సమాచారం. అలాగే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆర్టీసీకి వచ్చే నష్టాల భర్తీకి చట్టబద్ధత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రేటర్ కమిషనర్‌ను ఇప్పటికే ఆర్టీసీ పాలకవర్గంలోకి తీసుకున్న ప్రభుత్వం..నేరుగా గ్రేటర్ బడ్జెట్ నుంచి నిధులు ఇచ్చేలా మున్సిపల్ కార్పొరేషన్ చట్టంలో సవరణలు చేయాలని తాజాగా నిర్ణయించింది. దీంతోపాటు..శివారు ప్రాంతాలను ఆయా స్థానిక సంస్థల్లో ఎప్పుడైనా విలీనం చేసేందుకు వీలుగా స్థానిక సంస్థల చట్టంలో మార్పులు చేయాలని తీర్మానించిన సర్కారు సంబంధించిన బిల్లునూ ఈ సమావేశాల్లోనే ఆమోదింపజేయాలని భావిస్తోంది.

విమానాశ్రయం వరకు మెట్రో

శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రోరైలును నడిపేలా స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్పీవీ)ని ఏర్పాటు చేసేందుకు వీలుగా బిల్లును తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మార్గం నిర్మాణానికి సుమారు రూ.నాలుగు వేల కోట్ల వరకు వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేసిన సర్కారు..ఈ ప్రాజెక్టులో హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్(హెచ్ఎంఆర్ఎల్)కు 49 శాతం, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ)కు 51 శాతం వాటా ఇవ్వాలని బిల్లులో ప్రతిపాదించింది. వీటిలోపాటు..పంచాతీయతీరాజ్ చట్ట సవరణ, దివ్యాంగులకు కేటాయించిన మెకానిక్, డ్రైవర్ పోస్టులను ఇతరులకు కేటాయించడం తదితరాలకు సంబంధించిన బిల్లుల ముసాయిదాలను సిద్ధం చేసే పనిలో అధికారులున్నారు.

'ఆధార్' గడువుపై ఆదేశాలిస్తాం: సుప్రీం

దిల్లీ: 'ఆధార్‌తో అనుసంధానం' తుది గడువు పొడగింపు విషయంలో నెలకొన్న అనిశ్చితిపై.. సుప్రీం కోర్టు దృష్టి సారించింది. దేశంలోని బ్యాంకులు, స్టాక్ ఎక్స్ఛేంజీలు వంటి వివిధ ఆర్థిక సంస్థలపై దీని ప్రభావం పడనున్న నేపథ్యంలో.. ఈ అంశంపై సరైన ఆదేశాలు జారీ చేస్తామని బుధవారం పేర్కొంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఈ మేరకు వెల్లడించింది. వివిధ సేవలు, పథకాల ప్రయోజనాలు పొందేందుకు.. ఆధార్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. ఇందుకోసం మార్చి 31ని తుది గడువుగా విధించింది. అయితే ఈ గడువు లోపు ఆధార్ చట్టబద్ధతను సవాలు చేస్తూ వచ్చిన పిటిషన్లపై.. నిర్ణయం తీసుకోవడం సాధ్యపడకపోవచ్చని ధర్మాసనం తెలిపింది. ఇటు గడువుపై ఆదేశాలు ఎప్పుడు ఇస్తామన్న విషయంపైనా స్పష్టతనివ్వలేదు. ఇటు ఈ గడువును మరింత పొడగించే అవకాశాలున్నట్లు కేంద్రం కూడా మంగళవారం సుప్రీంకు సంకేతాలిచ్చింది.

పరీక్షలకు ఆధార్ తప్పనిసరి చేయొద్దు

దిల్లీ: అఖిల భారత స్థాయిలో నిర్వహించే నీట్ తదితర పరీక్షలకు దరఖాస్తుచేసుకునే విద్యార్థులను ఆధార్ సంఖ్య జత చేయాల్సిందేనంటూ నిర్బంధం చేయవద్దని సీబీఎస్ఈని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆధార్‌కు బదులుగా పాస్‌పోర్టు సంఖ్య, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు స్టేట్‌మెంట్, ఓటరుకార్డు లేదా రేషన్‌కార్డులలో దేనినైనా సరే గుర్తింపు పత్రంగా పొందవచ్చని స్పష్టం చేసింది. ఈ సమాచారాన్ని వెంటనే సీబీఎస్ఈ తన వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. ఆధార్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను పరిష్కరించేంత వరకు మాత్రమే తాజా ఆదేశాలు వర్తిస్తాయని స్పష్టంచేసింది.

2018 నీట్ పరీక్షకు హాజరుకాగోరే విద్యార్థుల ఆధార్ నమోదు సంఖ్యను తీసుకొనే అధీకృత ఆదేశాలను సీబీఎస్ఈకి తామేమీ ఇవ్వలేదని ధర్మాసనానికి విశిష్ట ఆధార్ సంఖ్య ప్రాధికార సంస్థ (ఉడాయ్) తెలిపింది. 2018 నీట్‌కు ఆధార్ నమోదు సంఖ్యను సీబీఎస్ఈ తప్పనిసరి చేయటాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఉడాయ్ ఈ వివరణ ఇచ్చింది. సీబీఎస్ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను గుజరాత్ హైకోర్టు ఫిబ్రవరి 27న తోసిపుచ్చగా సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలయ్యింది. నీట్ పరీక్షకు జమ్ముకశ్మీర్, మేఘాలయ, అసోం రాష్ట్రాల నుంచి దరఖాస్తుచేసుకునే విద్యార్థులు పాస్‌పోర్టు, ఓటరు కార్డు, రేషన్ కార్డు వంటివి తమ గుర్తింపునకు ఉపయోగించుకోవచ్చని ఉడాయ్ నుంచి సూచనలు ఉన్నాయని అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ ధర్మాసనానికి తెలిపారు. నీట్ 2018కి దరఖాస్తు గడువు ఈ నెల 9వ తేదీతో ముగియనుంది.

పరస్పర ఆమోద వివాహాల్లో తృతీయపక్షం జోక్యం తగదు: సుప్రీం

దిల్లీ: పరస్పర ఆమోదంతో ఇద్దరు వివాహం చేసుకునేటప్పుడు వారి బంధువులు గానీ, తృతీయపక్షానికి చెందిన మరే ఇతర వ్యక్తిగానీ జోక్యం చేసుకునేందుకు, బెదిరించడానికి లేదా వారిపై హింసకు పాల్పడడానికి వీల్లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. పరువు హత్యల నుంచి జంటల్ని కాపాడాలంటూ శక్తివాహిని అనే స్వచ్ఛంద సేవాసంస్థ 2010లో దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్ర నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం బుధవారం ఈ వ్యాఖ్యలు చేసింది. దీనిపై సవివర తీర్పును వెలువరిస్తామని తెలిపింది. కుల, లేదా గ్రామస్థాయి 'ఖాప్' పంచాయతీలను గుర్తించేది లేదనీ, కొందరు వ్యక్తుల సమావేశంగానే వాటిని చూస్తామనీ స్పష్టం చేసింది. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకునేవారు తమ ప్రాణాలకు ప్రమాదం ఉందని భావిస్తే రాష్ట్ర ప్రభుత్వాలు వారికి తప్పనిసరిగా రక్షణ కల్పించాలని కేంద్రం తెలిపింది.

నేడు వీహబ్‌కు శ్రీకారం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ పారిశ్రామికవేత్తల శిఖరాగ్ర సదస్సు (జీఈఎస్)లో ప్రకటించిన విధంగా మహిళా పారిశ్రామికవేత్తల అభ్యున్నతి కోసం వీహబ్ పేరిట ప్రత్యేక పథకానికి గురువారం శ్రీకారం చుట్టనుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ పథకాన్ని తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం టీహబ్ తరహాలో వీహబ్ ఇంక్యుబేటర్‌ను ఏర్పాటు చేసి..అంకుర పరిశ్రమల ఏర్పాటు చేయించడంతోపాటు..వారికి పెట్టుబడిదారుల(వెంచర్ క్యాపిటలిస్టులు) ద్వారా సహకారం అందించడం, నిపుణులతో సలహాలు, సూచనలు ఇప్పించి ఈ రంగంలో ఎదిగేందుకు ప్రోత్సాహం కల్పించడం ఈ పథకం ఉద్దేశం. డీఆర్‌డీవో ప్రాజెక్టు సంచాలకురాలు, ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్త టెస్సీ థామస్, దేశంలోని ప్రముఖ వెంచర్ క్యాపిటలిస్టు వాణి కోల (కొలారి వెంచర్ క్యాపిటల్) తదితర ప్రముఖులు ఇందులో పాల్గొంటున్నారు.

జీఈఎస్ స్ఫూర్తితో..: గతంలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ పారిశ్రామికవేత్తల శిఖరాగ్ర సదస్సు..మహిళా పారిశ్రామికవేత్తలకు అవకాశాలివ్వాలన్న నినాదంతో సాగింది. చివరిరోజు వక్తలు మహిళా పారిశ్రామికవేత్తలకు చేయూతనివ్వాలని కోరారు. దీనిపై స్పందించిన కేటీఆర్.. వీహబ్ పేరిట వారికోసం ప్రత్యేకపథకం చేపడతామని అప్పట్లో ప్రకటించారు. మంత్రి ఆదేశాలకు అనుగుణంగా దీనికి సంబంధించిన విధివిధానాలను పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ రూపకల్పన చేశారు. దానిని సీఎం కేసీఆర్ ఆమోదం తెలిపారు.

రూ.15 కోట్లతో నిధి: వీహబ్ ఇంక్యుబేటర్ రూ.15 కోట్లతో ఏర్పాటవుతుంది. మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఆలోచనలకు తెలియజేస్తే, వాటి ఆచరణకు అనువైన వేదికను ఇందులో ప్రభుత్వం సిద్ధం చేస్తుంది. అంకుర పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు సహకరిస్తుంది. పారిశ్రామిక రంగంలో పేరొందిన నిపుణుల ఆధ్వర్యంలో మహిళలకు మార్గనిర్దేశనం చేస్తుంది. గురువారం జరిగే ప్రారంభ కార్యక్రమంలో వీహబ్‌కు సహకారం అందించే దిశగా ప్రభుత్వం పలు సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటుంది.

ఆ బిల్లును అనుమతించలేం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదించిన 62 శాతం రిజర్వేషన్లను సమర్థించుకునేలా సమాచారం ఇవ్వాలని సూచించింది. తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల బిల్లు-2017లో కొన్ని విషయాలకు వివరణలు పంపించాలంటూ కేంద్ర హోంశాఖ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ అందినట్లు తెలిసింది. ఈ లేఖలోని అంశాల ఆధారంగా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వం సమాచారాన్ని ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. జనాభా ప్రాతిపదికన ముస్లింలకు 12 శాతం (ప్రస్తుతం 4 శాతం), గిరిజనులకు 10 శాతం (ప్రస్తుతం 6 శాతం) రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ బిల్లును రూపొందించింది. ఈ బిల్లుకు గత ఏడాది శాసనసభ ఆమోదం తెలిపి.. కేంద్రానికి పంపించింది. బిల్లును పరిశీలించిన కేంద్ర హోంశాఖ పరిధిలోని న్యాయ, రాజకీయ విభాగం సమీక్షించి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ విషయాన్ని ప్రభుత్వ అధికారులు సీఎంకు నివేదించారు. సీఎం సూచనలు, మార్గదర్శకాల మేరకు వివరణలను పొందుపరిచేందుకు కసరత్తు చేస్తున్నారు.

గ్రహం అనుగ్రహం

8–3–2018 గురువారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; బహుళ పక్షం
సప్తమి: తె. 5-23 తదుపరి అష్టమి
అనూరాధ నక్షత్రం: రా. 2-29 తదుపరి జ్యేష్ఠ
అమృత ఘడియలు: మ. 3-18 నుంచి 5-01 వరకు
వర్జ్యం: ఉ.శే. 6-44 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-13 నుంచి 11-00 వరకు
తిరిగి మ. 2-55 నుంచి 3-43 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6-18; సూర్యాస్తమయం: సా.6-04

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
మహబూబ్‌నగర్	38.2	20.0
కర్నూలు	38.0	21.4
మెదక్	37.8	16.7
హన్మకొండ	37.5	19.5
అనంతపురం	37.1	18.2
సూర్యాపేట	37.0	25.0
నిజామాబాద్	37.0	22.0
రామగుండం	37.0	20.0
ఆదిలాబాద్	37.0	16.1
హైదరాబాద్	36.5	21.3
ఖమ్మం	36.0	23.0
కరీంనగర్	36.0	22.0

నేడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్

• ఉదయం 11.30 గంటలకు సమర్పణ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు గురువారం శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ఆయన సభ ముందు ఉంచుతారు. ఉదయం 11.30 గంటలకు శాసనసభలో ఈ కార్యక్రమం ఉంటుంది. రాష్ట్ర శాసనమండలిలో పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ బడ్జెట్ సమర్పిస్తారు. గురువారం ఉదయం 7.30 గంటలకే రాష్ట్ర మంత్రిమండలి సమావేశం కానుంది. ముఖ్యమంత్రి నివాసం వద్ద ఉన్న ఫిర్యాదుల విభాగం హాలులో మంత్రివర్గం నిర్వహిస్తారు. రాష్ట్ర బడ్జెట్‌కు అక్కడ లాంఛనంగా ఆమోదం తెలియజేస్తారు. ఆ తర్వాత ఉభయసభలకు సమర్పిస్తారు. వచ్చే సాధారణ ఎన్నికలకు ముందు ఇదే పూర్తి స్థాయి బడ్జెట్. ఎన్నికల ముందు ఇక సమర్పించేది ఓట్ ఆన్ అకౌంట్. ఈ నేపథ్యంలో తెదేపా 2014 ఎన్నికల ప్రణాళికలో అపరిష్కృతంగా ఉన్న అంశాలకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యం దక్కనున్నట్లు సమాచారం. ఇందులో కీలకంగా నిరుద్యోగభృతికి నిధులు కేటాయించనున్నట్లు తెలిసింది. అదే సమయంలో సామాజిక అంశాలకు, సంక్షేమానికి పెద్దపీట వేయనున్నట్లు సమాచారం.

ఖండాలు కలిసి ఉండేవనడానికి మరిన్ని ఆధారాలు

- భారత భూభాగంపై సరికొత్త మండూకం
- ఆఫ్రికాలోని కప్పల డీఎన్‌ఏతో పోలికలున్నాయన్న సీసీఎంబీ పరిశోధన

ఈనాడు, హైదరాబాద్: ఖండాల భూభాగాలు ఒకప్పుడు కలిసి ఉండేవి అనడానికి మరిన్ని శాస్త్రీయ ఆధారాలు లభించాయని పరిశోధకులు చెబుతున్నారు. దేశంలో అంతరించిపోతున్న జీవ జాతులపై వేర్వేరు ప్రాంతాల్లో పరిశోధనలు చేస్తున్న సీసీఎంబీ శాస్త్రవేత్తలు ఈ మేరకు అంచనాకు వచ్చారు. ఇప్పటి వరకు చూడని ఒక కొత్త మండూక జాతిని వారు గుర్తించారు. తమిళనాడులోని పశ్చిమ కనుమల్లోని తూర్పు భాగంలో ముదురు గోధుమ రంగులోని కప్పను గుర్తించారు. పంది ఆకారంలో ముక్కు, ఒకసారి ఆగి మూడుసార్లు చప్పుడు చేస్తూ ఇప్పటివరకు భారత భూగంలో చూసినవాటికి భిన్నంగా ఇది కన్పించింది. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం ఖండాల భూభాగాలు వేరు పడ్డాయి అనడానికి కొత్త జాతి కప్పనే మరోసారి శాస్త్రీయ ఆధారంగా నిలిచింది. ఇక్కడ మన భూగంలో పెరుగుతోన్న సరికొత్త జాతి కప్పకు సంబంధించి డీఎన్‌ఏ ఆఫ్రికాలో ఉన్న కప్ప జాతితో పోలికలు ఉన్నట్లు గుర్తించారు. అంటే భారత్, ఆఫ్రికా ఖండాలు ఒకప్పుడు కలిసి ఉండేవనడానికి ఇది ఆధారంగా నిలుస్తోంది. 65 మిలియన్ సంవత్సరాల క్రితం గోండ్వానా నుంచి భారత ఉపఖండం వేరు పడిందని అంచనాలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 2003లోనే ఇది నిరూపితమైనా మరోసారి అది రుజువైందని సీసీఎంబీ చీఫ్ సైంటిస్ట్ రమేశ్ కె అగర్వాల్ అన్నారు. 2014లో మరణించిన భారత సరీసృప శాస్త్రవేత్త ఎస్ భూపతి పేరును ఈ కప్పకు పెట్టామని వెల్లడించారు. జాతులు అంతరించడానికి అవి పెరిగే, నివసించే భౌగోళిక ప్రాంతంలోని వాతావరణం దెబ్బతినడమే కారణమని అగర్వాల్ 'ఈనాడు'తో అన్నారు. వీటిని కాపాడుకునేందుకు ఆయాచోట్ల జీవవైవిధ్యం దెబ్బతినకుండా చూడాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. ఏడాది క్రితం శాస్త్రవేత్తల బృందం జీవవైవిధ్య హాట్‌స్పాట్స్ గుర్తించే క్రమంలో ఈ సరికొత్త కప్ప జాతి వెలుగుచూసింది.

తొగాడియాకు తృటిలో తప్పిన ప్రమాదం

సూరత్: విశ్వహిందూ పరిషత్ అగ్రనేత ప్రవీణ్ తొగాడియాకు బుధవారం తృటిలో ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న వాహనాన్ని ఓ ట్రక్కు వెనక నుంచి ఢీకొంది. తనది బుల్లెట్ ప్రూఫ్ వాహనం కావడంతో బతికి బైటపడ్డానని ఆయన చెప్పారు. తనకున్న జడ్-ప్లస్ కేటగిరీ భద్రతను గుజరాత్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఉపసంహరించిందని ఆరోపించారు.

వైకాపా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి నోటీసులు

నేడు విచారణ • అరెస్టు చేసే అవకాశం?

ఈనాడు, నెల్లూరు: నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని గేమింగ్ చట్టం కింద నమోదైన కేసులో విచారణకు రావాలని పోలీసులు నోటీసు జారీ చేశారు. సీఆర్‌పీసీ సెక్షన్ 41(ఎ) కింద బుధవారం ఉదయం 7.50 గంటలకు పోలీసులు ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి.. గత ఏడాది మార్చి, 2017లో నమోదైన కేసులో విచారణకు రావాలని కోరారు. రాజ్యసభ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి అమరావతి వెళ్తున్నట్లు చెప్పటంతో గురువారం ఉదయం తొమ్మిది గంటలకు హాజరుకావాలంటూ నోటీసు అందించి వచ్చారు.

జగతి పబ్లికేషన్స్‌కు ఊరట

ఈనాడు, హైదరాబాద్: జగన్ అక్రమాస్తుల కేసులో భాగంగా జగతి పబ్లికేషన్స్ పెట్టుబడుల వ్యవహారంలో రూ.34.66 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను జప్తు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చర్యను అప్పిలేట్ అథారిటీ (దిల్లీ) తప్పుబట్టింది. ఈడీ జప్తు చెల్లదంటూ ఇటీవల ఉత్తర్వులు వెలువరించింది. టి.ఆర్.కన్నన్, ఎ.కె.దండమూడి, మాధవ్ రామచంద్రన్‌లను ప్రలోభపెట్టి, బెదిరించి వారి నుంచి రూ.34.66 కోట్లను జగతి పబ్లికేషన్స్‌లోకి పెట్టుబడులు రాబట్టారన్న సీబీఐ కేసు ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. అనంతరం దీనికి సంబంధించి 2013 మే 31న రూ.34.66 కోట్ల డిపాజిట్‌లను తాత్కాలిక జప్తు చేస్తూ ఈడీ అధికారులు ఉత్తర్వులు జారీ చేయగా.. అడ్జ్యుడికేటింగ్ అథారిటీ 2013 నవంబరు 4న ధ్రువీకరించింది. అడ్జ్యుడికేటింగ్ అథారిటీ ఉత్తర్వులను సవాలు చేస్తూ జగతి పబ్లికేషన్స్ అప్పిలేట్ అథారిటీని ఆశ్రయించింది. ఇరుపక్షాల వాదనలు విన్న అప్పిలేట్ అథారిటీ జప్తు చెల్లదంటూ జగతి పబ్లికేషన్స్ పిటిషన్‌ను అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

తిరుపతి విశిష్టతను మరింత పెంచడానికి 'ప్రపంచ ఆధ్యాత్మిక ఉత్సవం' పేరిట ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరిగే ఈ ప్రపంచ ఆధ్యాత్మిక ఉత్సవానికి అందరూ ఆహ్వానితులే.

ఈనాడు

ఉపేక్షిస్తే ఉపద్రవమే

విధివిహిత బాధ్యతల రీత్యా పటిష్ఠ సామాజిక భద్రతా సాధనంగా వర్ధిల్లాల్సిన ఉత్కృష్ట భూమిక, పోలీసు యంత్రాంగానిది. వాస్తవంలో, దేశం నలుమూలలా ఎన్నో సందర్భాల్లో రక్షక భటులు భక్షక భటులుగా అప్రతిష్ఠ పాలయ్యే దురవస్థ అంతులేని కథగా కొనసాగుతోంది. సంఘటిత నేరగాళ్ల వర్గమని సాక్షాత్తు సర్వోన్నత న్యాయస్థానమే తూష్ణీకరించినా పోలీసుల పనిపోకడల్లో, క్షేత్రస్థాయి స్థితిగతుల్లో పెద్దగా మార్పు రానేలేదని ఇటీవలి 'ఈనాడు' ప్రత్యేక కథనాలు స్పష్టీకరించాయి. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వసూల్ రాజాల గురించి 'ఈనాడు' బయటపెట్టిన వివరాలపై ఉన్నతాధికారుల అంతర్గత విచారణ దరిమిలా 40మందిపై బదిలీ వేటు పడటం తాజా పరిణామం. బెదిరింపులు, సెటిల్‌మెంట్లతో వసూళ్ల దందా సాగిస్తూ శాఖాపరమైన చర్యలకు 'అర్హత' సాధించినవారి జాబితాలో హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు కనిపిస్తున్నా- ఇక్కడికిదే సమగ్ర చిత్రం కాదు. వాణిజ్య సముదాయాలు, మద్యం దుకాణాలు, పబ్బులు, హోటళ్ల వద్ద నెలవారీ మామూళ్లు దండుకుంటూ అడ్డంగా దొరికిపోయిన పాత్రధారుల వెనక అసలు సూత్రధారుల జుట్టు పట్టి ఈవలకు లాగితేనేగాని- అక్రమార్క వ్యవస్థ విశ్వరూపం ప్రస్ఫుటం కాదు. అధికార సిబ్బందిపై ఏమైనా చర్యలు తీసుకున్నా మూడు నెలల్లో వాళ్లు మళ్ళీ తిరిగొచ్చేసిన బాగోతాలు ఎన్నో చూశామని గతంలోనే ఆక్షేపించిన సుప్రీంకోర్టు- పోలీసు యంత్రాంగం మేరమీరకుండా కచ్చితమైన విధినిషేధాలు ఉండి తీరాలనీ నిర్దేశించింది. దశాబ్దాలుగా అటువంటి హితవాక్యాలెన్నో అరణ్యరోదనమైన పర్యవసానాలేమిటో నేడు తరతమ భేదాలతో రాష్ట్రాలన్నింటా కళ్లకు కడుతున్నాయి. శాంతిభద్రతల పరిరక్షణే విధ్యుక్త ధర్మంగా మెలగాల్సిన పోలీసులు అక్రమ సెటిల్‌మెంట్ల మాటున సర్కారీ గూండాల అవతారమెత్తి లక్షలు, కోట్లు ఎడాపెడా దండుకుంటున్నారు. అవకతవకల ఉరవడిలో హైదరాబాద్ ఉదంతం మచ్చుకు ఒకటే. చాపకింద నీరులా దేశమంతటా విక్రమిస్తున్న ఈ తరహా అక్రమాల్ని ఉపేక్షిస్తే ఉపద్రవమే!

కేంద్ర హోం శాఖామాత్యులుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలోనే రాజ్‌నాథ్ సింగ్, దేశంలో ఠాణాలకు సంస్కరణల చికిత్సను ప్రతిపాదించారు. సాధారణ పౌరుడికి ప్రభుత్వమంటే పోలీస్ కానిస్టేబులేనంటూ అభివృద్ధి, శాంతి స్థాపనలో అతడు భాగస్వామి కావాలని రాష్ట్రపతిగా ప్రణబ్ ముఖర్జీ అభిలషించారు. ఖాకీవనంలో నిజాయతీపరులు, కర్తవ్య నిష్ఠాగరిష్ఠుల సేవల్ని మరుగున పరచేలా సిగ్గుమాలిన ఉదంతాలు తరచూ వెలుగుచూస్తూనే ఉన్నాయి. మొన్నీమధ్య ఓ శుభకార్యంలో పాల్గొవడానికి వచ్చిన విదేశీయుల్ని గుంటూరు జిల్లా పోలీసులు బెదిరించి వసూళ్లకు పాల్పడిన వైనం భారత దౌత్య విభాగానికి అందిన ఫిర్యాదుల ద్వారా వెలుగు చూసింది. కరీంనగర్ జిల్లాలో భూ వివాదాన్ని ఆదాయ వనరుగా మలచుకుని లంచం గుంజుతూ దొరికిపోయిన సీఐకి, రెండు వారాల క్రితమే అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానం రెండేళ్ల జైలు, పదివేల రూపాయల జరిమానా విధించింది. ఇవి చిన్న చేపలు. కరడుగట్టిన నేరగాడు నయీమ్‌ను, స్టాంపు పత్రాల కుంభకోణాసురుడు తెల్గీని అడ్డుపెట్టుకుని ప్రజాప్రతినిధులతోపాటు పోలీసు సిబ్బందీ కోట్లకు కోట్ల రాబడి కళ్లజూసిన బాగోతాలు ఆమధ్య గగ్గోలు పుట్టించాయి! ఫిర్యాదు రాగానే నమోదు చేసి, పకడ్బందీ సాక్ష్యాధారాలతో నేరనిరూపణకు సహకరించడం పోలీసు యంత్రాంగం ప్రాథమిక విధి. బాధితుల గుండెమంట చల్లార్చడంకన్నా రకరకాల ఒత్తిళ్లకు తలొగ్గి కేసులు నీరుగార్చి కాసుల పంట పండించుకోవడం పట్ల యావ లావైన రక్షకభట వ్యవస్థలో జవాబుదారీతనం ఏనాడో మంటగలిసింది. గాడి తప్పి వర్తించినా తమను ఏదోలాగా గట్టెక్కించగల రాజకీయ శక్తుల ప్రాపకం ఉందన్న భరోసాతో చెలరేగిపోతున్నవాళ్ల సంఖ్య పోనుపోను పెచ్చరిల్లుతోంది. అటువంటి కలుపుమొక్కల్ని చురుగ్గా ఏరిపారేసే సమగ్ర పోలీసు సంస్కరణలు నేడు అత్యవసరం.

ఆసియా పసిఫిక్ ప్రాంతంలో పోలీసుల లంచాల మేత అత్యధికమని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వంటి సంస్థల అధ్యయన నివేదికలు సోదాహరణంగా వెల్లడిస్తున్నాయి. ఆ జాబితాలో వియత్నాం, థాయ్‌లాండ్, కంబోడియా, పాకిస్థాన్‌ల తలదన్నుతూ ముందున్నది ఇండియాయే! నేరగాళ్లకు సింహస్వప్నం కావాల్సిన యంత్రాంగం ప్రస్తుత దుస్థితిగతుల్ని వెన్నంటి అడపా దడపా కొన్ని మెరుపులూ కానవస్తున్న మాట నిజం. మహిళల భద్రతను లక్షించి అవతరింపజేసిన 'షీ టీమ్స్', అంతర్జాల నేరగాళ్లను కట్టడి చేసేందుకంటూ కొలువుతీర్చిన సైబర్ విభాగాలు, సాంకేతికత దన్నుతో పోలీసు శాఖలో తక్షణ స్పందన (రియల్ టైమ్ గవర్నెన్స్) వంటివి తెలుగు రాష్ట్రాల్లో గుణాత్మక పరివర్తనను సూచిస్తున్నాయి. కొత్తగా పుట్టుకొస్తున్న నేరగాళ్లపై కొరడా ఝుళిపించేలా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నిర్ణాయక చొరవ కనబరచడం స్వాగతించదగింది. అసలంటూ పోలీసుల పనిపోకడల్ని సాంతం సంస్కరించకపోతే, దాని తాలూకు దుష్ప్రభావాలు ఎన్ని దశాబ్దాలైనా జాతి జనుల్ని వేధిస్తూనే ఉంటాయి. శాంతిభద్రతల పరిరక్షణకు ఉద్దేశించిన యంత్రాంగం తామే కట్టుతప్పి చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని యథేచ్ఛగా నేరాలకు తెగబడుతూ చెలరేగిపోతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. పోలీస్ బలగాలు స్వీయ అదుపాజ్ఞల్లో మెలగడం పాలక పక్షాలకు కలిసొస్తుందేమో గాని, ఆ వ్యవస్థ మౌలిక లక్ష్యమే దెబ్బతినిపోతోంది. రెబీరో, పద్మనాభయ్య, మలీమత్ ప్రభృత కమిటీల సిఫార్సులు ఆచరణకు నోచుకోలేదన్న అసంతృప్తితో- పౌరుల సంతృప్త స్థాయి ఆధారంగా పోలీసుల పనితీరు మదింపు వేయాలని జస్టిస్ వర్మ కమిటీ చేసిన సూచనలూ అలాగే పోగుపడి ఉన్నాయి. అవినీతి సిబ్బందిపై వేటు, పోలీసుల విధుల్లో వృత్తినైపుణ్యాలకు చోటు- ప్రజాప్రభుత్వాల తక్షణ కర్తవ్యం. స్నేహపూరిత, ప్రజాహిత విభాగంగా పోలీసు యంత్రాంగం వన్నెలీనడమే ప్రజాస్వామ్యానికి సౌభాగ్యప్రదం!



అవకాశాల బరిలో సై అంటే సై



ఎస్.మహేంద్రదేవ్

మహిళా సాధికారత అన్నమాట కొంతకాలంగా విస్తృతంగా వినిపిస్తోంది. వేల ఏళ్లుగా స్త్రీలపట్ల సమాజంలో పేరుకుపోయిన వివక్షను రూపుమాపి- ప్రగతి పథంలో వారికి పురుషులతో సమాన ఛాయా కల్పించడమే తొలి ప్రాథమ్యంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నారు. మరో పన్నెండేళ్లలో అంటే 2030నాటికి ప్రపంచాన్ని సుస్థిరాభివృద్ధి బాట పట్టించాలన్నది ఐక్యరాజ్య సమితి నిర్దేశించుకున్న అజెండా. బాలికలు, మహిళలను సాధికారికంగా తీర్చిదిద్దడమే మానవాళి సమగ్ర వికాసానికి మూలధాతువు అని గుర్తించిన 'సమితి' ఆ క్రమంలో అనేక కార్యక్రమాలను చేపట్టి అమలు చేస్తోంది. 'మేధోపరంగా, ఆధ్యాత్మికంగా మహిళలు పురుషులతో సమానమైన శక్తి సామర్థ్యాలు కలిగి ఉన్నారు, ఏ రంగంలోనైనా కాలిడి అత్యుత్తమ పనితీరు కనబరచే సత్తా వారికి ఉంది' అని జాతిపిత మహాత్మా గాంధీ వ్యాఖ్యానించారు. మహిళా సాధికారత సాధనలో ఆయన వ్యాఖ్యలే దారిదీపాలు కావాలి.

భారత్ వెనకబాటు

మహిళా సమానత విషయంలో చాలా దేశాలతో పోల్చిచూస్తే భారత్ బాగా వెనకబడి ఉంది. ప్రపంచ ఆర్థిక ఫోరం 2017లో విడుదల చేసిన 144 దేశాల స్త్రీ పురుష సమానత సూచీలో భారత్ 108వ స్థానంలో మగ్గుతోంది. మహిళలకు ఆర్థిక భాగస్వామ్యం కల్పించడానికి సంబంధించి భారత్ 139వ స్థానంలో, విద్యా సాధికారత సాధనలో 112, ఆరోగ్య సాధన క్రమంలో 141వ స్థానాల్లో ఉంది. బంగ్లాదేశ్ సైతం మనకంటే మెరుగైన స్థితిలో 47వ స్థానంలో ఉండటం గమనార్హం. రాజకీయ సాధికారత విషయంలో మాత్రం భారత్ 15వ స్థానంలో చెప్పుకోదగిన స్థాయిలో ఉంది. యుఎన్‌డీపీ విడుదల చేసిన స్త్రీ పురుష అసమానతల సూచీలోనూ భారత్ అధ్వానంగా ఉంది. 'బ్రిక్స్'లోని ఏ దేశంతో పోల్చినా భారత్ అట్టడుగునే కొట్టుమిట్టాడుతోంది. ప్రసవ సమయంలో తల్లుల మరణాల సంఖ్య ఇతర 'బ్రిక్స్' దేశాలతో పోలిస్తే భారత్‌లోనే అత్యధికం. పాతికేళ్లు నిండిన మాధ్యమిక విద్యావంతులైన యువతుల సంఖ్య దేశంలో 36శాతం మాత్రమే. రష్యాలో వీరి సంఖ్య 95శాతం, దక్షిణాఫ్రికాలో 74శాతం, చైనాలో 70శాతంగా ఉంది. పదిహేనేళ్ల వయసు దాటి ఉపాధి బాటలో ముందడుగు వేసిన మహిళల సంఖ్య భారత్‌లో 29శాతమే! చైనాలో ఆ సంఖ్య 64శాతం, కాగా బ్రెజిల్‌లో అది 56శాతంగా ఉంది. ఇండియాకు సంబంధించి ఈ గణాంకాలు కొంత నిరాశావహంగానే ఉన్నప్పటికీ- దేశ సామాజిక వాతావరణంలో గుణాత్మక మార్పు పొడగడుతున్న సూచనలను కొట్టిపారేయలేం. మునుపటితో పోలిస్తే భిన్న రంగాల్లో మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరుగుతోంది. ఆర్థిక, వాణిజ్య, రక్షణ, విద్య, శాస్త్ర సాంకేతిక, కళలు, సంగీత, సాహిత్య రంగాల్లో తమదైన ముద్ర వేస్తూ ఎదుగుతున్న వనితాలోకం- రాజకీయాల్లోనూ తమ ప్రజ్ఞాపాటవాలు చాటుతోంది. ఈ మెరుపులు ఎలా ఉన్నా- శతాబ్దాల వివక్షణ ఈ దేశాన్ని జాడ్యంలా పట్టిపీడిస్తూనే ఉంది. స్త్రీ పురుష సమానత, సాధికారతలపై 2017-18కి గాను ప్రభుత్వ ఆర్థిక సర్వే కొన్ని ఆసక్తికర విషయాలు బయటపెట్టింది. 2005-06నుంచి 2015-16 మధ్య పదేళ్ల కాలావధిలో మహిళా సాధికారతతో ముడివడిన 17 సూచీల్లో భారత్ పద్నాలుగింట భేషైన పనితీరు కనబరచింది. అయితే ఉపాధి విషయంలో, గర్భ నిరోధకాలను వినియోగంలో మిగిలిన దేశాలతో పోలిస్తే భారత్ బాగా వెనకబడి ఉంది. దేశంలోని 47శాతం మహిళలకు గర్భనిరోధకాలకు సంబంధించిన అవగాహనే లేదు.

శాస్త్ర సాంకేతికతను ఒడిసిపట్టి మానవాళి వినువీధుల్లో దూసుకుపోతున్న ప్రస్తుత తరుణంలోనూ- పురిట్లోనే ఆడశిశువుల గొంతు నులిమే అమానుష సంస్కృతి కొనసాగుతుండటం గుండెల్ని మెలిపెడుతోంది. 'కొడుకు పుడితే బాగుంటుంది' అని తల్లిదండ్రులు పరితపించే పరిస్థితి దేశంలో నేటికీ కనిపిస్తుండటం బాధాకరం. ఆడశిశువుల భ్రూణహత్యలకు సమాజంలో ప్రబలిన ఈ విపరీత ధోరణే కారణం. ఆడబిడ్డల ఉసురు తీసే ఈ వైపరీత్యమే- దేశంలో స్త్రీ పురుషుల నిష్పత్తి దిగజారడానికీ కారణమవుతోంది. నీతి ఆయోగ్ ఇటీవల దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఆరోగ్య స్థితిగతులపై సమర్పించిన నివేదికలో స్త్రీ పురుష నిష్పత్తి ఆందోళనకరంగా దిగజారుతున్న వాస్తవాలను వెల్లడించింది. 2013-'15 మధ్యకాలంలో కేరళలో వెయ్యిమంది పురుషులకు 967మంది మహిళలు ఉండగా, హరియాణాలో ఆ నిష్పత్తి 831గా ఉంది. గర్భస్రావం, రోగాలు, పౌష్టికాహార లేమి వంటి కారణాలవల్ల ఏటా దేశంలో 20 లక్షలమందికిపైగా మహిళలు కన్నుమూస్తున్నారు. కొడుకు పుడితే ఇక మళ్ళీ సంతానం జోలికి వెళ్ళాల్సిన అవసరం లేదనుకునే కుటుంబాలే దేశంలో అధికం. తొలి సంతానం అమ్మాయి అయితే- అబ్బాయి జన్మించే వరకూ ఆగే కుటుంబాలే భారత్‌లో ఎక్కువ. పెళ్లయ్యాక ఎప్పటికైనా కూతురు పుట్టినిల్లు వదిలి అత్తవారి దగ్గరికి వెళ్ళిపోవాల్సిందేనన్న అభిప్రాయం స్థిరపడి ఉండటం, ఆస్తిమీద కొడుకులకే కానీ కూతుళ్లకు హక్కు లేదన్న భావన, అమ్మాయిల పెళ్ళిళ్లకోసం తలకుమించి ఖర్చుపెట్టాల్సి ఉంటుందన్న భయాల కారణంగా ఆడపిల్లలను కాదనుకునే దురన్యాయం సమాజంలో విస్తరించింది. ఈ ధోరణి ప్రబలంగా ఉండటంవల్లే బాలికల ఆరోగ్యం మన దేశంలో పట్టించుకోనక్కర్లేని అంశంగా మారింది! కాబట్టే ఒకటి నుంచి అయిదేళ్ల లోపు వయసున్న వారిలో 75శాతం మేర బాలికలే మరణాల బారిన పడుతున్నారు. అబ్బాయిలకు తప్ప బాలికలకు పౌష్టికాహారం అవసరం లేదన్న ధోరణి ఇప్పటికీ దేశంలో విస్తరించి ఉండటం ఆందోళన కలిగించే అంశం.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం

దృక్పథం మారాలి

ప్రపంచవ్యాప్తంగా భిన్న రంగాల్లో పురుషులకు దీటుగా మహిళలు అమిత వేగంతో దూసుకుపోతున్నా- ఇండియాలో ఇప్పటికీ సామాజిక వివక్షణ కొనసాగడం బాధాకరం, దారుణం! పురుషస్వామ్య దృక్కోణంలో మార్పు ఇప్పుడు కీలకావసరం. మహిళా హక్కులకు ముమ్మార్లు తలాఖ్ విఘాతంగా భావించిన సర్వోన్నత న్యాయస్థానం ఆ విధానానికి చరమగీతం పాడాలని ఇటీవల తీర్పు వెలువరించింది. ఒకరకంగా ఇది మహిళాలోకం సాధించిన విజయం. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని విద్యారంగంలో ప్రవేశపెడుతున్న బేటీ బచావ్ బేటీ పఢావ్ వంటి కార్యక్రమాలవల్ల ప్రాథమిక, మాధ్యమిక స్థాయి చదువులకు సంబంధించి స్త్రీ, పురుష సమానత సూచీలో భారత్ పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోంది. అయితే ఉన్నత విద్యా వ్యవస్థకు సంబంధించినంతవరకూ అసమానతలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. పంచాయతీ రాజ్ వ్యవస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ ఉన్నప్పటికీ- పార్లమెంటు ఉభయ సభలు, రాష్ట్రాల శాసనసభల్లో మాత్రం వారి ప్రాతినిధ్యం అంతకంతకూ తగ్గిపోతోంది. లోక్‌సభలో 12శాతం, రాజ్యసభలో 11శాతం మహిళా ఎంపీలు మాత్రమే ఉన్నారు. దేశవ్యాప్తంగా 4,118మంది శాసనసభ్యుల్లో మహిళలు తొమ్మిది శాతం మాత్రమే ఉండటం గమనార్హం. బిహార్, హరియాణా, రాజస్థాన్ వంటి రాష్ట్రాల అసెంబ్లీల్లో అత్యధికంగా 14శాతం మహిళలు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ శాసన సభల్లో మహిళలు 11 శాతం, తొమ్మిది శాతంగా ఉన్నారు. 2015లో సుప్రీంకోర్టులో మహిళా జడ్జీల వాటా నాలుగు శాతం (26మందికిగాను ఒకరు)కాగా, దేశవ్యాప్తంగా హైకోర్టుల్లో 10శాతం (517లో 54)గా ఉంది. దేశంలో నిర్ణయాత్మక స్థానాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాల్సి ఉంది. అప్పుడే అందరి ప్రాతినిధ్యంతో కూడిన సామాజిక పురోగతి సాధ్యపడుతుంది.

హింసకు అంతమెప్పుడు?

సుస్థిరాభివృద్ధి సాధనలో ఏర్పరచుకున్న లక్ష్యాలపై ఐక్యరాజ్య సమితి వెలువరించిన నివేదిక ఆందోళనకర వాస్తవాలను వెల్లడించింది. మహిళలపై పెరుగుతున్న హింస, స్త్రీ పురుష అసమానతలు విస్తరించడం, దిగజారుతున్న బాలికల ఆరోగ్య స్థితిగతులపై 'సమితి' బయటపెట్టిన గణాంకాలు ఆందోళనపరుస్తున్నాయి. దేశంలో స్త్రీలపట్ల హింస అంతకంతకూ పెరిగిపోతోంది. ఇది ఒకరకంగా మానవహక్కులపై పాశవిక దాడి. ఈ హింస ఏ ఒక్క దేశానికో మాత్రమే పరిమితం కాలేదు. మహిళలను లక్ష్యంగా చేసుకొని ఇంటా బయటా దాడులు పెరుగుతున్నాయి. సాధారణంగా బాగా తెలిసినవాళ్లు లేదా ఇళ్లలో దగ్గరివాళ్లే ఈ దాడులకు తెగబడుతున్నారు. మానవ అక్రమ రవాణా, అంతర్జాలంలో ఫొటోలను మార్చి 'పోస్ట్'చేసి మహిళలను వేధింపులకు గురి చేయడం వంటి సమస్యలు అన్ని దేశాల్లో ఉన్నాయి. వీటివల్ల మహిళలు భౌతికంగా, మానసికంగా, ఉద్వేగపరంగా నిస్పృహకులోనై కొన్ని సందర్భాల్లో మృత్యువు ఒడికీ చేరుతున్నారు. ఈ తరహా హింస పెరిగే కొద్దీ సామాజికంగా, కుటుంబపరంగా మహిళలపై ఒత్తిడి అధికమవుతుంది. వారు ఎక్కడికీ వెళ్ళలేని, ఏమీ చేయలేని పరిస్థితుల్లోకి జారుకుంటారు. సామాజిక భాగస్వామ్యంలో మహిళల పాత్రను దెబ్బతీసే పరిణామమిది. మరీ ముఖ్యంగా భారత్‌లో స్త్రీలపై హింస ఆందోళనకరంగా పెరుగుతోంది. అత్యాచారాలు మితిమీరుతున్నాయి. దిల్లీలో 2012లో 'నిర్భయ' ఘటన యావత్ దేశాన్నీ వణికించింది. ఈ ఆరేళ్ల కాలంలో అత్యాచార ఘటనలు ఏ కోశానా తగ్గుముఖం పట్టకపోవడం గమనార్హం. అత్యాచారాలకు సంబంధించి ప్రసార మాధ్యమాల్లో ప్రముఖంగా ప్రచురితమవుతున్నాయి. 'మృగాళ్ల' బారిన పడకుండా తప్పించుకోవడంపై ఎక్కడికక్కడ అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. మరోవంక 'విశాఖ తీర్మానం'లో నేరగాళ్లను కట్టడి చేయడంపై స్పష్టమైన సూచనలు చేసినా ఫలితం నాస్తి. ఏటా దిల్లీలోనే అత్యధిక అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. పొద్దువాలితే చాలు దేశంలోని వివిధ ప్రాంతాలు మహిళల సంచారానికి ఏమాత్రం అనువుకానివిగా మారిపోతున్నాయి. ప్రభుత్వంతోపాటు పౌర సమాజమూ ఉమ్మడిగా కదిలితే తప్ప ఈ సమస్యను అడ్డుకోవడం సాధ్యమయ్యే పనికాదు. రాజ్యాంగ, చట్టబద్ధమైన రక్షణ ఛత్రాలు ఎన్ని ఉన్నా- మహిళలపట్ల పురుషుల దృక్పథంలో మార్పు రానంతవరకూ పరిస్థితి యథాతథంగానే ఉంటుంది. జనాభాలో సగభాగం ఆక్రమించిన మహిళలకు అన్ని రంగాల్లోనూ సముచిత వాటా కల్పించి, చిత్తశుద్ధితో వారిని ప్రోత్సహిస్తేనే సమానత్వం సాధ్యపడుతుంది.

(రచయిత- ఇందిరాగాంధీ అభివృద్ధి పరిశోధన సంస్థ సంచాలకులు, ఉపకులపతి)


వేధించే వ్యాధి... పరిష్కారమేది?

ప్రపంచంలో దాదాపు పదిశాతం వయోజనులు దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారు. మరణానికి దారితీస్తున్న ఇరవై ప్రధాన రోగాల్లో మూత్రపిండాల వ్యాధి ఒకటి. దీనికి చికిత్స అత్యంత ఖర్చుతో కూడుకున్నది. రోగులతోపాటు వారి కుటుంబ స్థితిగతులనూ ఈ వ్యాధి ప్రతికూలంగా ప్రభావితం చేస్తోంది. పురుషాధిక్య ప్రపంచంలో మహిళల ఆరోగ్యంపై కుటుంబాలు చిన్నచూపుతో ఉంటున్నాయన్నది నిష్ఠురసత్యం. అందువల్లే నేడు అంతర్జాతీయ కిడ్నీ దినాన్ని పురస్కరించుకుని- స్త్రీలు ఎదుర్కొంటున్న ఈ సమస్యను మహిళా దినోత్సవం రోజున ప్రత్యేకంగా వెలుగులోకి తీసుకువస్తున్నారు. మహిళల ఆరోగ్యం వారి వ్యక్తిగత విషయం మాత్రమే కాదని, అదొక సామాజిక అంశమని ఈ సందర్భంగా గుర్తించాలి. మహిళల్లో కిడ్నీ వ్యాధులపై మరింత నిశిత అధ్యయనంతోపాటు- భావితరాలకు ఈ అంశంపై మార్గదర్శకం చేసే అవకాశంగా నేటి కిడ్నీ దినోత్సవాన్ని ఉపయోగించుకోవాల్సి ఉంది.

దెబ్బతీసే రక్తపోటు

రక్తంలోని చెడు పదార్థాలను మూత్రపిండాలు ఎప్పటికప్పుడు వడపోస్తుంటాయి. ఇందుకోసం కిడ్నీల్లో ఫిల్టర్లు (నెఫ్రోన్లు) ఉంటాయి. మగవారికన్నా ఆడవారిలో పుట్టినప్పుడు వీటి సంఖ్య తక్కువగా ఉంటుంది. అందువల్ల వారిలో స్వల్ప కారణాలకూ కిడ్నీలు త్వరగా దెబ్బతినే అవకాశం ఉంటుంది. గర్భధారణ సమయంలోనూ వీటిల్లో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. హార్మోన్ల ప్రభావం వల్ల అవి అవసరానికి మించి పనిచేస్తాయి. మూత్రపిండాలు బలహీనపడటానికి దారితీసే పరిణామమిది. ఆరోగ్య సంరక్షణలో జాగ్రత్త వహించకపోతే గర్భిణీ స్త్రీల్లో కిడ్నీలు నెమ్మదిగా దెబ్బతింటాయి. ఈ మార్పును గుర్తించడం అంత సులభం కాదు. 90 శాతం కేసుల్లో ముదిరిన తరవాతే వ్యాధి బయటపడుతుంది. వయసు మీరాక, ఆలస్యంగా గర్భం దాల్చేవారికి కిడ్నీ వ్యాధి బెడద ఎక్కువగా ఉంటుంది. కృత్రిమ గర్భధారణకు వాడే కొన్ని మందుల ప్రభావం వల్లా మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. 'ప్రీఎక్లంప్సియా' అని పిలిచే గర్భధారణ సమయంలో అధిక రక్తపోటు వస్తుంది. అది మూత్రపిండ వైఫల్యానికి దారితీయవచ్చు. పది శాతం గర్భిణులకు ఈ సమస్య ఎదురుకావచ్చు. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మూత్రపిండ వైఫల్యానికి, ప్రసూతి మరణాలకు దారితీస్తున్న ప్రధాన కారణమిది.

అంతర్గతంగా ఉండే కిడ్నీ సమస్య గర్భధారణపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇలాంటివారిలో వ్యాధి ఉద్ధృతమయ్యే ప్రమాదమూ ఉంటుంది. ఆయా దేశాల సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక స్థితిగతులూ మహిళల్లో వ్యాధి విస్తృతికి కారణమవుతాయి. చట్టవిరుద్ధమైన గర్భస్రావాలూ కిడ్నీల వైఫల్యానికి కారణమవుతాయి. ప్రసూతి న(క)ష్టాలకన్నా గర్భిణీ స్త్రీల్లో అధిక రక్తపోటు- గర్భస్థ, నవజాత శిశు మరణాలకు కారణం అవుతుంది. అలాంటివారిలో తక్కువ బరువుతో పిల్లలు పుట్టే అవకాశమూ ఎక్కువే. ఇటువంటి



నేడు ప్రపంచ 'కిడ్నీ డే'

చిన్నారుల్లో చిరుప్రాయంలోనే అధిక రక్తపోటు, గుండె జబ్బులు, మూత్రపిండాల సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంటుంది. ఏ దేశంలోనూ గర్భిణీ స్త్రీలకు గాని, నవజాత శిశువుల్లో గాని మూత్రపిండాల వ్యాధులను గుర్తించే ఎలాంటి క్రమబద్ధమైన 'స్క్రీనింగ్' కార్యక్రమాలు లేవు. కొన్ని వ్యాధులు కేవలం మహిళల్లోనే కనిపిస్తాయి. వాటిలో ప్రధానమైంది యుక్తవయస్సులో అధికంగా కనిపించే 'ల్యూపస్'. శరీరంలో రోగనిరోధక శక్తి విఫలమైనప్పుడు ఇది వస్తుంది. స్త్రీలలో ఉండే ఎక్స్ క్రోమోజోమ్, ఈస్ట్రోజెన్ హార్మోన్ ప్రభావం వల్ల ఈ పరిస్థితి ఎదురవుతుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 50 లక్షల మంది మహిళలు ఏటా ఈ వ్యాధికి గురవుతున్నారు. మహిళలను వేధించే మరో సమస్య కీళ్ళవాతం. ల్యూపస్, కీళ్లవాతం రెండూ ఎక్కువగా కిడ్నీ వ్యాధులకు కారణమవుతున్నాయి. గర్భధారణ సమయంలో ఈ రెండు వ్యాధులు విజృంభించే అవకాశం ఉంటుంది. తద్వారా కిడ్నీ వ్యాధి పెరిగి గర్భిణీ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది.

పక్కాగా పరిశోధనలు

ప్రపంచవ్యాప్తంగా సుమారు ఇరవై కోట్ల మంది మహిళలు ఏటా కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారు. ఫలితంగా అరవై వేలకు పైగా మరణాలు నమోదవుతున్నాయి. బాధితుల్లో మహిళలే అధిక శాతం. వైద్యం స్త్రీలకు అందుబాటులో లేకపోవడమూ కాదనలేని నిజం. అనేక పరిమితులవల్ల ఆడవారు జబ్బు గురించి త్వరగా బయటపడరు. వైద్య సహాయం కోరరు. 'డయాలసిస్' చేయించుకునేవారిలో ఎక్కువ మంది స్త్రీలు గుండె జబ్బుతో చనిపోతారు. 'హీమోడయాలసిస్' చేసుకునే స్త్రీల శాతం తెలుగు రాష్ట్రాల్లో చాలా తక్కువ. ఎవరో ఒకరు వీరికి తోడుగా ఉండాల్సి రావడం, వీరికోసం మిగిలినవారు సమయం కేటాయించాల్సి రావడం వంటి పరిమితులు ఇందుకు ప్రధాన కారణం! కిడ్నీ మార్పిడి చికిత్సలో ఉన్న వ్యత్యాసం లింగ వివక్షణకు నిలువెత్తు నిదర్శనం. పురుషులకు స్త్రీలు కిడ్నీ దాతలుగా ఎక్కువగా దర్శనమిస్తారు. భార్యలు తరవాత తల్లులు, అక్కాచెల్లెళ్లు కిడ్నీ దాతలుగా ముందుకు వస్తారు. మహిళలకు కిడ్నీ అవసరమైనప్పుడూ కుటుంబంలోని ఆడవారే దాతలుగా ఉంటారు. దాతల్లో మగవారు తక్కువగా ఉంటారు. భర్తలు కిడ్నీ ఇచ్చే శాతం చాలా పరిమితంగా ఉండగా, తీసుకునే వారిలో అధిక శాతం భర్తలు ఉండటం గమనార్హం. భారత్, ఆఫ్రికా దేశాల్లోనే కాదు... అమెరికా, జపాన్ లాంటి దేశాల్లోనూ ఈ వ్యత్యాసం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. లైంగిక హార్మోన్ల ప్రభావంపై విస్తృతంగా అధ్యయనాలు జరగాల్సిన అవసరం ఉంది. తద్వారా కిడ్నీ వ్యాధుల బారి నుంచి మహిళలకు తగిన రక్షణ కల్పించవచ్చు. గర్భధారణ సమయంలో, ఇతరత్రా వచ్చే ప్రత్యేక జబ్బులపైనా పరిశోధనలు చేపట్టాలి. ఆయా విభాగాల్లో ఫలితాలను సమగ్రంగా విశ్లేషించి, అవసరమైన సురక్షిత వ్యాధి సంరక్షణ ప్రణాళికలను రూపొందించి భవిష్యత్ తరాలకు అందజేయాలి!

– డాక్టర్ శ్రీభూషణ్ రాజు

(రచయిత- నిమ్స్‌లో మూత్రపిండాల విభాగం అధిపతి)

ధర్మ మార్గం

'ధర్మం' అనే మాట అనడానికి, వినడానికి బాగుంటుంది. అర్థం చేసుకొని, ఆచరణలో పెట్టడమే కష్టం. ధర్మాన్ని ఆచరించే పద్ధతుల్ని 'ధర్మమార్గాలు' అంటాం. వాటి చర్చ మహాభారతంలో అనేక పర్యాయాలు వస్తుంది. 'ఇతరులు నీ పట్ల ఎలా ఉంటే నీకు అయిష్టం కలుగుతుందో, వారితో నువ్వు అలా ఉండవద్దు... అదే పరమ ధర్మం' అంటాడు విదురుడు.

నీతి తప్పి అధర్మమార్గాన ప్రవర్తించేవాడు న్యాయస్థానంలో శిక్షల్ని తప్పించుకోవచ్చునేమో గాని, అంతరాత్మ వేసే శిక్షల నుంచి తప్పించుకోలేడు. 'ధర్మవాణిజ్యం' అంటే ధర్మకార్యాల్ని ధనార్జనకు సాధనంగా చేసుకోవడం! అలాంటి ఎందరినో సమాజంలో చూస్తుంటాం. ధర్మం పేరు చెప్పి డబ్బు సంపాదించుకొనే అలాంటి వ్యక్తుల వల్ల, ధార్మికుల్నీ సమాజం ఒక్కోసారి అనుమానిస్తుంటుంది.

ధర్మాల్లో ఒకటి- అహింస. అదే బౌద్ధుల దృష్టిలో గొప్ప ధర్మం. అహింసా ధర్మమే బుద్ధుడి ప్రధాన బోధన. అదే ఆయన ధ్వజ సంకేతం. అందుకే ఆయనను 'ధర్మ కేతువు'గా భావిస్తారు. ధర్మాన్ని శాసించగలిగింది బ్రహ్మ శాసనం. అలాగే రాజయోగానికి మరో పేరు 'ధర్మమేఘం'. అది సమాధి స్థితిలో సిద్ధశక్తుల్ని వర్షిస్తుందని సాధకుల విశ్వాసం.

ధర్మానికి మూలం వేదం. ధర్ముడు అంటే, యముడు. ధర్మం లోకాన్ని నడిపిస్తుంది. లోక వ్యవహారాల్లో అందరికీ న్యాయం జరిగేలా, తన కర్తవ్యాన్ని తాను నిర్వహిస్తుంది. శ్రుతులు, స్మృతులు ధర్మబద్ధమైన కృత్యాల్ని తెలియజేస్తాయి. 'సత్యం వద' అనేది వేద వాక్యం. దాన్ని బౌద్ధులు ప్రమాణంగా భావించకున్నా, 'సత్యమే పలకాలి' వంటి వాక్యాల్ని ప్రామాణికాలుగా స్వీకరిస్తారు. స్మృతి, ధర్మ శాస్త్రం అనేవి పర్యాయపదాలు. అందరికీ శ్రేయస్సు కలిగించేది ధర్మం. దానికి వ్యతిరేకమైనది అధర్మం. ధర్మాన్ని మనం రక్షిస్తే, అది మనల్ని రక్షిస్తుంది.



అంతర్యామి

ధార్మిక గుణాల వల్ల మనిషి దైవం కాగలడు. మనిషి తన బుద్ధిహీనత కారణంగా మెట్టు దిగి పశువులా మారగలడు. మానవుడు దైవస్థాయికి చేరడానికి దారి చూపేది 'ధర్మజ్యోతి'. ఆచారాలు, సంప్రదాయాలే ధర్మ జ్యోతులు. అవి రుషిపుంగవులు ప్రసాదించిన వెలుగు దివ్వెలు. స్వార్థం అనే చీకటి నుంచి నిస్వార్థం అనే వెలుగు వైపు అవి మనుషుల్ని నడిపిస్తాయి. అహంకారం నుంచి నిరహంకార స్థితికి చేరుస్తాయి. వాటిని ఆధారం చేసుకొన్నవారు లోకంలో ఉన్నారు. వారికి భక్తులు గుడులు కట్టి పూజిస్తారు. మహర్షులు సూచించిన ధర్మ మార్గంలో నడిచి, అవే అడుగుజాడల్ని లోకానికి మిగిల్చి వెళ్లిన మహాపురుషులు ఎందరో!

మానవుడు తన ధర్మాన్ని తాను నిర్వర్తించినప్పుడే, దేవుడు చేయూతనందిస్తాడు. అది అతడు ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. మనిషి తన పనిని తాను నిర్వర్తించకుండా, అన్నింటికీ దేవుడే దిగివచ్చి సహాయం చేస్తాడనుకోవడం ఓ భ్రమ! ప్రయత్నమే పరమేశ్వరుడు. గజేంద్రుడు మొసలితో తీవ్రంగా పోరాడి, శక్తి అంతా అయిపోయిన తరవాతే దైవానికి శరణాగతుడయ్యాడు. ఇలాంటి పౌరాణిక గాథలన్నీ మనిషి పాటించాల్సిన ధర్మాన్ని గుర్తుచేస్తుంటాయి.

ఏది మానవ ధర్మమో చాటిచెప్పాలని మహాత్ములెందరో కృషిచేశారు. వారి మార్గాలు భిన్నంగా కనిపించినా, సారాంశం ఒకటే! 'లోకమాన్య' బాలగంగాధర తిలక్ చెప్పినట్లు- వేదాన్ని ప్రమాణంగా అంగీకరించడం, సంప్రదాయంగా వచ్చే విభిన్న సాధనా మార్గాల్ని అనుసరించడం, భక్తితో ఉండటం... ఇవన్నీ ధర్మజ్యోతి వెదజల్లే వెలుగు కిరణాలు. రుషీశ్వరులు ప్రబోధించిన ధర్మం కాబట్టి 'ఆర్షధర్మం' అంటాం. ఇటువంటి కాంతికిరణాల్ని ప్రపంచమంతటా ప్రసరింపజేసిన ఆధునిక రుషీశ్వరుడు- స్వామి వివేకానంద. ఎన్నటికీ ఆరిపోని అఖండ ధర్మజ్యోతి ఇది. దీని వెలుగులోనే ప్రజలందరూ సుఖశాంతులతో జీవిస్తారు!

– పి. భారతి

తెరుచుకోనున్న సినిమా హాళ్లు

- చిత్ర పరిశ్రమకీ, డిజిటల్ ప్రొవైడర్లకీ మధ్య కుదిరిన రాజీ
- ఏప్రిల్ తొలివారం నుంచి కొత్త ఛార్జీల అమలు

ఈనాడు - హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో సినిమా హాళ్లు తెరచుకోనున్నాయి. గురువారం నుంచే సినిమాల ప్రదర్శన మొదలు కాబోతోంది. శుక్రవారం నుంచి కొత్త చిత్రాల సందడి మొదలవుతుంది. థియేటర్లలో ప్రదర్శన యంత్రాల్ని నిర్వహిస్తున్న డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లు వసూలు చేసే ఛార్జీలకి నిరసనగా.. నిర్మాతలు, పంపిణీదారులు, ప్రదర్శనకారులు ఏకతాటిపైకి వచ్చి మార్చి 2 నుంచి థియేటర్లలో సినిమాల ప్రదర్శనని నిలిపివేశారు.


మాట్లాడుతున్న డి.సురేష్‌బాబు. చిత్రంలో జెమినీ కిరణ్, మురళీమోహన్‌రావు, శ్యాంప్రసాద్‌రెడ్డి, దామోదర్ ప్రసాద్

అప్పటి నుంచి థియేటర్లు మూతపడ్డాయి. బుధవారం జరిగిన చర్చల్లో ఛార్జీల తగ్గింపుతో పాటు, మరికొన్ని డిమాండ్లకి డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లు అంగీకారం తెలపడంతో సమస్య పరిష్కారమైంది. ఈ విషయంలో తాత్కాలికంగా చిత్ర పరిశ్రమకీ, డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లకీ మధ్య ఓ ఒప్పందం కుదిరినట్టు దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమ ఐకాస కన్వీనర్ డి.సురేష్‌బాబు తెలిపారు. ఆ ఒప్పందంలోని ఛార్జీలు ఏప్రిల్ మొదటివారం నుంచి అమలవుతాయని ఆయన స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని చలన చిత్ర వాణిజ్య మండలి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో డి.సురేష్‌బాబు మాట్లాడుతూ.. "నెల రోజులుగా చలన చిత్ర పరిశ్రమ ఐకాసకీ, డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లకీ మధ్య చర్చలు జరుగుతున్నాయి. మా డిమాండ్లలో కొన్నింటికి డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లు ఒప్పుకొన్నారు. ఇంకా పరిష్కారం కావల్సిన సమస్యలు చాలా ఉన్నాయి. ఒక్కొక్క సమస్యకి పరిష్కారం కనుక్కొనే ప్రయత్నం చేస్తున్నాం. 8వ తేదీ నుంచి యథావిధిగా థియేటర్లు ప్రారంభమవుతాయి." అని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు జెమినీ కిరణ్, కె.ఎల్.దామోదర్‌ప్రసాద్, శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, మురళీమోహన్ రావు, ముత్యాల రాందాస్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పెంపు హక్కు రాష్ట్రాలకే ఉండాలి

- పార్లమెంటులో తెరాస ఎంపీల నిరసన

ఈనాడు, దిల్లీ: విద్యా, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు 50 శాతానికి పరిమితం చేయాలని రాజ్యాంగం ఏమైనా చెప్పిందా? అంటూ తెరాస ఎంపీలు ప్రశ్నించారు. రిజర్వేషన్ల కోటా పెంపుపై తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని కేంద్రం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పార్లమెంటు ఒకటో నంబరు గేటు వద్ద ఎంపీలు జితేందర్‌రెడ్డి, కేశవరావు, వినోద్‌కుమార్, కల్వకుంట్ల కవిత, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, బాల్క సుమన్, గొడెం నగేశ్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మల్లారెడ్డిలు ప్లకార్డులతో నిరసన వ్యక్తంచేశారు. అన్ని రాష్ట్రాలకు ఒకే నీతి ఉండాలని.. అప్పుడే కేంద్రం చెబుతున్న సమాఖ్య స్ఫూర్తి నిలుస్తుందని వారు తెలిపారు. తెరాస లోక్‌సభాపక్షనేత జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ''రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) సవరించాలంటూ మూడు రోజులుగా పార్లమెంటులో డిమాండ్


బుధవారం పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద నినాదాలు చేస్తున్న తెరాస ఎంపీలు

చేస్తున్నాం. తమిళనాడు, రాజస్థాన్, మహారాష్ట్రల్లో ఇప్పటికే 50 శాతం కన్నా ఎక్కువ రిజర్వేషన్లు అమలవుతున్నాయి. అన్ని అధికారాలు మా చేతుల్లోనే ఉండాలి, మేం చెప్పినట్లే రాష్ట్రాలు నడవాలన్న కేంద్ర ధోరణిని ఖండిస్తున్నాం. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించుకొనే హక్కు రాష్ట్రాలకు కల్పించాలి. రాష్ట్రంలో వెనకబడిన వర్గాలను దృష్టిలో ఉంచుకొనే ఈ డిమాండ్ చేస్తున్నాం. రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి తెలంగాణసహా మరికొన్ని రాష్ట్రాలు తీర్మానాలు చేసి పంపినా కేంద్రం స్పందించడం లేదు'' అని జితేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఎంపీ కవిత మాట్లాడుతూ.. రాష్ట్రాల్లో విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ల పెంపు హక్కు ఆయా రాష్ట్రాలకే ఇవ్వాలన్నారు. రిజర్వేషన్లు ఇంత శాతమే ఉండాలని రాజ్యాంగంలో ఎక్కడా చెప్పలేదని పేర్కొన్నారు. కోర్టు తీర్పుని అడ్డుపెట్టి రాష్ట్రాలను నియంత్రించాలని కేంద్రం చూస్తోందని ఆరోపించారు. రిజర్వేషన్లు ఎవరికి ఇవ్వాలి? ఏ ప్రాతిపదికన ఇవ్వాలనేది రాష్ట్రాలే నిర్ణయించుకోగలవని ఎంపీ కేశవరావు అన్నారు. "రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు ఇస్తున్నారంటున్నారు. ఎంతమంది ఉన్నారు? ఎవరికి అవసరం ఉన్నాయి? అనేది రాష్ట్రాలే చూడగలవు." అని కేశవరావు అన్నారు. ఏదైనా బలమైన కారణం ఉంటే రిజర్వేషన్లు పెంచుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పులో ఉందని ఆయన గుర్తుచేశారు.

బాసరలో దోపిడీ దొంగల బీభత్సం

- తండ్రీ కొడుకుల దారుణ హత్య
- వాళ్ల హోటల్లో పనిచేసే వ్యక్తే నిందితుడని అనుమానం

బాసర, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా బాసరలో మంగళవారం రాత్రి తండ్రీ కొడుకులు దారుణ హత్యకు గురయ్యారు. కేరళలోని ఎర్నాకులానికి చెందిన వదస్సెరీన్ గోపీనాథ్ (65)తన కుమారుడు రతీష్ (45), కోడలు శివరాణిలతో కలిసి బాసర


గోపీనాథ్, రతీష్ (పాత చిత్రాలు)

రైల్వేస్టేషన్ వద్ద ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. మంగళవారం హోటల్‌ను మూసివేసిన అనంతరం నిద్రకు ఉపక్రమించారు. పిట్టగోడ మీదుగా ఇంటిపైకి ఎక్కి మెట్లమార్గంలో ఇంటిలోపలికి ప్రవేశించిన గుర్తుతెలియని దుండగులు నిద్రిస్తున్న తండ్రీకొడుకులను గొంతుకోసి చంపారు. అనంతరం ఆభరణాలు, నగదును అపహరించారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేసి హార్డ్‌డిస్క్‌ను హోటల్‌కు దూరంగా చెట్లపొదల్లో పడవేశారు. ఘటనస్థలిని పరిశీలించిన నిర్మల్ ఎస్పీ విష్ణువారియర్ డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం బృందాలతో ఆధారాలు సేకరించారు. హోటల్‌లో పని చేసేందుకు రెండు రోజులక్రితం ముంబాయ్ నుంచి వచ్చిన నేపాలీ యువకుడు ప్రకాష్ ఈ దారుణానికి పాల్పడట్లు అనుమానిస్తున్నారు.

కూచిభొట్ల హత్య కేసులో నేరాన్ని అంగీకరించిన దోషి

వాషింగ్టన్: భారతదేశానికి చెందిన ఇంజినీర్ కూచిభొట్ల శ్రీనివాస్ (32) హత్య కేసులో నిందితునిగా ఉన్న అమెరికా నౌకాదళ ఉద్యోగి ఆడమ్ ప్యూరింటన్ (52) తన నేరాన్ని అంగీకరించాడు. గత ఏడాది ఫిబ్రవరి 22న కాన్సాస్‌లోని ఒక బార్ వద్ద జాతి విద్వేష దాడికి శ్రీనివాస్ బలైన ఉదంతం తెలిసిందే. ఆ ఘటనలో శ్రీనివాస్‌ని రక్షించబోయిన స్నేహితుడు అలోక్ మాడసానిపై, ఘటనాస్థలి నుంచి పరారవుతున్న నిందితుడిని పట్టుకోబోయిన మరో పాదచారిపైనా కాల్పులు జరిపినందుకు న్యాయస్థానంలో ఆడమ్‌పై వేర్వేరు అభియోగాలు మోపారు. గత నవంబరులో నిందితుడు తన నేరాన్ని అంగీకరించలేదు. తర్వాత నిజాన్ని అంగీకరించాడు. హత్యా నేరానికి గానూ జీవితాంతం, హత్యాయత్నానికి గానూ కనీసం 146 నెలలు, గరిష్ఠంగా 653 నెలలు శిక్ష పడే అవకాశం ఉంటుందని న్యాయమూర్తి వివరించారు. ఎంత శిక్ష పడేదీ మే 4న ఖరారవుతుంది. నిందితుడి వాదనను మే 8న వినాల్సి ఉండగా దీనిని మార్చి 6వ తేదీకి మార్చారు.

హర్షం వ్యక్తం చేసిన సునయన: తన భర్త హత్య కేసులో దోషి నేరాన్ని అంగీకరించడంపై కూచిభొట్ల భార్య సునయన హర్షం వ్యక్తంచేశారు. 'దీనివల్ల నా శ్రీను మళ్లీ వెనక్కి రాలేకపోవచ్చు. విద్వేష నేరం ఎప్పటికీ ఆమోదయోగ్యం కాదనే సందేశాన్ని మాత్రం ఇది పంపిస్తుంది' అని పేర్కొన్నారు.

తెరాస నాయకుడి హత్య


దేవయ్య మృతదేహం

గంభీరావుపేట, న్యూస్‌టుడే: పట్టపగలు అందరూ చూస్తుండగానే రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో బుధవారం తెరాస నాయకుడు హత్యకు గురయ్యారు. గ్రామస్థులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... స్థానిక ఎంపీటీసీ చంద్రకళ భర్త దేవయ్య తెరాస నాయకుడు. యాదవ సంఘం మండల అధ్యక్షుడు కూడా. మధ్యాహ్నం ఓ ఇంట్లో శుభకార్యానికి వెళ్లి భోజనం చేస్తుండగా గ్రామానికి చెందిన వంగ సందీప్ వెనుకనుంచి దేవయ్యపై కత్తితో దాడిచేశాడు. ఆర్తనాదాలు చేస్తూ డాబాపై నుంచి దిగుతుండగా సందీప్ మళ్లీ పొట్టలో పొడిచాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిని కత్తితో బెదిరిస్తూ దేవయ్య ప్రాణాలు విడిచేవరకు అక్కడే ఉన్నాడు. పాత కక్షల నేపథ్యంలో ఈ హత్య జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

పరీక్షలకు భయపడి పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య


ప్రభావతి (పాత చిత్రం)

మూసాపేట, న్యూస్‌టుడే: 'పరీక్షలంటే నాకు భయం. ఎంత ప్రయత్నించినా గణితం, భౌతిక శాస్త్రాల్లోని పాఠ్యాంశాలను నేర్చుకోలేకపోతున్నాను. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నాను' అంటూ ఓ పదోతరగతి విద్యార్థిని లేఖ రాసి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కూకట్‌పల్లి పరిధి ఆచార్య వినోభావేపురం(ఏవీబీపురం)లో ఉండే అజయ్ కుమార్, ధనలక్ష్మిల ఏకైక సంతానమైన ఎన్.ప్రభావతి(15) స్థానిక సెయింట్‌రీటా పాఠశాలలో చదువుతోంది. తండ్రి కారుడ్రైవర్‌గా పనిచేస్తుండగా తల్లి ఓ ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూల దుకాణం నిర్వహిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం తల్లిదండ్రులు బంధువుల ఇంటికి వెళ్లగా..ఆ రోజు రాత్రి ఇంట్లో ప్రభావతి ఒక్కరే ఉంది. బుధవారం మధ్యాహ్నం సహచర విద్యార్థులు వచ్చి చూసేసరికి ప్రభావతి కనిపించకపోవడం, వెనుకగదికి గడియపెట్టి ఉండటంతో తలుపులు బద్దలుకొట్టి చూశారు. అప్పటికే ఆమె ఉరి వేసుకుని ఉంది. ఆత్మహత్యకు ముందు ఆమె రాసిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వర్సిటీలలో విభాగాల వారీగా రిజర్వేషన్లు

ఈనాడు, హైదరాబాద్: కేంద్రీయ, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో రిజర్వేషన్లు ఆయా విభాగాల(డిపార్ట్‌మెంట్లు) ప్రాతిపదికన ఉండాలని యూజీసీ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు విశ్వవిద్యాలయాన్ని యూనిట్‌గా తీసుకోగా అలహాబాద్ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో విభాగాల వారీగా చూడాలని యూజీసీ ఆదేశాలు ఇచ్చింది. దీనిపై నెల రోజుల్లోగా కొత్త రోస్టర్ పాయింట్లు తయారు చేసి తమకు పంపించాలని అన్ని విశ్వవిద్యాలయాలకు లేఖలు రాసింది. కొత్త విధానం వల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఖాళీలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. కాగా యూజీసీ ఆదేశాలు ఇచ్చినా ఇంకా మార్గదర్శకాలు రాన్నందున ఈ నెలాఖరులో ఇవ్వనున్న ఆచార్యుల భర్తీకి ప్రకటనలకు ఎలాంటి ఆటంకం ఉండదని ఉన్నత విద్యామండలి వర్గాలు చెబుతున్నాయి.

TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION
Prathibha Bhavan, M.J.Road, Nampally, Hyderabad

TSPSC

ASSISTANT EXECUTIVE ENGINEERS IN VARIOUS ENGINEERING SERVICES (GENERAL RECRUITMENT)
NOTIFICATION NO. 31/2017
PRESS NOTE

It is here by informed that the interviews (I-spell) for the post of Assistant Executive Engineers in various Engineering services vide Notification No. 31/2017 is scheduled to be held from 13/03/2018 onwards at TSPSC Office, Prathibha Bhavan, MJ Road, Nampally, Hyd. For the list of candidates and detailed schedule candidates can visit Commission's website www.tspsc.gov.in

Hyderabad. Sd/-
Dt: 07/03/2018 **SECRETARY**
DIPR 654PP/CL/ADVT/1/1/2017-18

తెలంగాణ ప్రభుత్వము
కె. దామోదర్ రెడ్డి ఎస్.ఎఫ్.ఎస్
అటవీ మండలాధికారి నిర్మల్

సంఖ్య 2869/ఎఫ్.డిఓ.ఎన్/ఎస్.3 — అటవీ మండలాధికారి కార్యాలయం. నిర్మల్
24.02.2018.

తెలంగాణ అటవీ చట్టము 1967 సెక్షన్ 44 (2–బి) క్రింద నోటీసు

తెలంగాణ అటవీ చట్టము 1967 సెక్షన్ 20 మరియు 29 ప్రకారము అక్రమముగా కలప రవాణా చేయుచున్న ఈ దిగువ పేర్కొనబడిన వాహనములపై అటవీ నేరము నమోదు చేయబడినది ఏ విధమైన రహదారి పత్రాలు లేకుండా కలపను అక్రమ రవాణా చేయడం తెలంగాణ అటవీ చట్టం 1967 ప్రకారం నేరము వాహనములకు సంబంధించిన వ్యక్తులు ఎవరూ సంప్రదించలేదు.

వాహనముల పేర్లు వాహనములపై ఉన్న నెం.
మామడ అటవీ కార్యాలయము.

1) ఆటో నెం. AP01X0623 2) యమహా విఓ AP01J0516 3) టివి.యస్ NO NUMBER FRAME No. 1305F55430 4) కారు AP28S4499 5) సుజుకి మ్యాక్ 100 డి.యల్. ఎక్స్.రెడ్ కలర్ 6F523999 6) బజాజ్ ఆటో నెం. నిల్.... 7) బజాజ్ నెం. పాత... AP 01C-4635 8) బైక్ 3 NO AP25E 7635 APIC6522 NO నెంబర్ 9) వ్యాన్ AP25U3596... 10) సుజుకి బైక్ FRAME No. 9503F49080 11) ఎ.సి.ఇ. ఆటో No AP25V3249 12) వ్యాన్ AP 07 W5006 (BLUE COLOUR). 13) టాటా ఇండిక No. AP25TV0703 14) బజాజ్ మెగా మ్యాక్ ఆటో AP15TB2880 15) టాట ఎ.సి.ఇ. ట్రాలీ. AP01TA0394 16) ఆటో. AP 01V9161 17) టాటా. ఎ.సి.ఇ. AP01W6662 18) బజాజ్ ఆటో AP25Z2921 19) టాట సూపర్ వ్యాన్ MH38E1945 20) బజాజ్ ఆటో No. AP01V6339 21) సుజుకి సమురాయ్ బైక్ APIC4483 SUZUKI SAMARI NO. NUMBER 22) సుజుకి మ్యాక్ ఆర్ 100 No. P15H1992. 23) బజాజ్ ఎ.సి.ఇ. ఆటో AP250921 24) టాటా ఎ.సి.ఇ AP25X9071 25) బజాజ్ ఎ.సి.ఇ. ఆటో AP01X0423 26) (06) మోటర్ సైకిల్ సుజుకి సమురాయ్ 4) హీరో హోండ స్ప్లెండర్ (1) హీరో హోండ సిడి. డీలక్స్ (1) SPLENDER-01C20F15014, CD DELUXE-07E23F34962 27) ఎ.సి.ఇ ఆటో AP15U9413 28) టాటా 1109 హిచ్ఇఎక్స్ 2 MH23W5486 29) టాటా సూపర్ ఎ.సి.ఇ నెం. MH21X3842 30) చవర్ టవేర నెం. TS12UA0885. 31) మహేంద్ర మ్యాక్ ట్రాక్. బియర్‌రింగ్ AP01V7284

దిమ్మదుర్తి అటవీ కార్యాలయము

1) హోండా సిని 2 వీలర్ AP 158080 2) సుజుకి సమురాయ్ 2 విలర్ AP15M434 3) సుజుకి సమురాయ్ 2 వీలర్, APIX4498 4) బజాజ్ ఆటో APOIN5702 5) బజాజ్ మెగా మ్యాక్ ఆటో. AP01X2609 5) హీరో గ్లామర్ 2 విలర్. AP25AQ4517. 5) టాటా ఎ.సి.ఇ. 4 వీలర్ AP25Y0233 6) టాటా సుజుకి 2 వీలర్. (UDOR) 7) టాటా ఎ.సి.ఇ. AP15TA9069. 8) హీరో హోండా స్ప్లెండర్ 2) సుజుకి సమురాయ్ 9) సుజుకి సమురాయ్ APJC 5958 10) (మహేంద్ర ట్రాక్టర్ మరియు ట్రాలీ No. AP01TA 0213 TROLLY No. AP01TA0216. 11) మహేంద్ర ట్రాక్టర్ మరియు ట్రాలీ NO APO1R 4863 TROLLY NO. APO1AA 0136 13) మహేంద్ర ట్రాక్టర్ మరియు ట్రాలీ NO AP15BA7849 TROLLY NO AP15BA 7847 13) బజాజ్ ఆటో. NO TS01UA 0852 14) ఆటో ఎ.సి.ఇ. TA 160A2510.

బైంసా అటవీ కార్యాలయము

1) టాటా సఫారి AP04H2345 2) ఇండిక కారు. AP25AB5547 3) స్కార్పియో AP22M4329 నిర్మల్ అటవీ కార్యాలయము 4) ఆటో TS01 UA-3977 5) ఇన్నోవా TS16EA-90298 6) బజాజ్ ఆటో AP01 V 9568 7) టాటా ఇండిక కారు AP25K - 6824 8) టాటా ఇండిక కారు AP13N-7907 9) మారుతి సుజుకి ఎస్టీం కారు AP09A-2844 10) టాటా సూపర్ ఎ.సి. AP29X 5260 11) టవేర AP01 U - 0313 12) టాటా సూమో NILL 13) ఎ.పి.ఇ. ఆటో AP01 X - 2374 14) మహేంద్ర మ్యాక్ AP09 V 5466 15) మహేంద్ర ట్రాకర్ మరియు ట్రాలి AP01L-5860 AP01 T-7233 16) టాటా సూమో AP12 N - 5457 17) ఇండిక డి.ఎల్.ఇ. MH 2011-2013 18) ఎ.పి.ట్రాలి ఆటో AP22 X - 0208 19) బొలెరో పికాప్ వ్యాన్ AP25 W-0338 20) హేచర్ వ్యాన్ AP23 OU - 4070 21) ఇండిక కారు AP9 AE-0939 22) ఇండిక కారు AP13TV - 0194 23) ఇండిక కారు AP09 AS - 3052 24) అశోక్ లేలాండ్. MH34AB-5653 25) ఇండిక కారు AP25 W-1358 26) టవేర MH26L-1729 27) మహేంద్ర పికాప్ వ్యాన్ MH04RG-6416 28) (టాటా ఆర్ ఎక్స్ పికాప్ హోండా సిని డిస్కవరి... REDG No.MH26H-70151 TS01 RG-4168 AE-2196)

కావున పైన తెలిపిన వాహనములకు సంబంధించినవారు పై వాహనములకు ఎందుకు ప్రభుత్వ పరము చేయకూడదో తెలుపుతూ అటవీ మండలాధికారి నిర్మల్ గారికి ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 15 రోజులలోపు లిఖిత పూర్వకముగా సంజాయిషీ ఇవ్వవలయును. అట్లు సంజాయిషీ యివ్వని యెడల తెలంగాణ అటవీ చట్టము 1967 సెక్షన్ 44(2-ఎ) క్రింద దఖలుపడిన అధికారముల మేరకు అధీకృత అధికారి పైన తెలిపిన వాహనములను ఈ కార్యాలయ రికార్డులలో ఉన్నట్టి సాక్ష్యాధారాల మేరకు ప్రభుత్వ పరము చేయబడునని తెలుపనైనది.

DIPR3199/ CL/ADVT/1/1/2017-18 **సం/– అధీకృత అధికారి/అటవీ మండలాధికారి, నిర్మల్**

ఏప్రిల్ 29న 10 లక్షల మందితో బహిరంగసభ

యాదవ, కురుమలతో నిర్వహిస్తాం: మంత్రి తలసాని

ఈనాడు, హైదరాబాద్: చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఏప్రిల్ 29న 10 లక్షల మంది యాదవ, కురమలతో భారీ బహిరంగ సభను హైదరాబాద్ జింఖానా మైదానంలో నిర్వహిస్తామని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ తెలిపారు. బుధవారమిక్కడ యాదవ, కురమ నాయకులతో సమీక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సభ నిర్వహణకు జిల్లా వారీగా రెండు కులాల నేతలతో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలు ఈ నెల 11 నుంచి జిల్లాల్లో పర్యటించి సభ ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తాయన్నారు. విస్తృత ప్రచారం కల్పించి ఎక్కువ మంది సభకు తరలివచ్చేలా చూస్తామన్నారు. గొల్ల, కురుమల సంక్షేమానికి ఏ ప్రభుత్వమూ చేపట్టనన్ని సంక్షేమ కార్యక్రమాలను కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వం చేస్తోందన్నారు. సంక్షేమ భవనాల కోసం కోకాపేటలో విలువైన 10 ఎకరాల భూమి, రూ.10 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. యాదవ కులస్తుడిని రాజ్యసభకు పంపుతానని కేసీర్ చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమాలన్నింటిని చేసినందుకే సీఎంకు కృతజ్ఞతలు తెలిపేందుకు సభ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

జాతీయస్థాయిలో బీసీలకు కేసీఆర్‌తోనే న్యాయం

దేశంలోని వెనుకబడిన వర్గాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వారానే సంపూర్ణ న్యాయం జరుగుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగురామన్న అన్నారు. 70 ఏళ్లుగా బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని.. కాంగ్రెస్, భాజపాలే దీనికి కారణమన్నారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ లేకపోవడమే నిదర్శనమన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "సీఎం కేసీఆర్ దేశం దశ మార్చేందుకు జాతీయ స్థాయిలో కొత్త కూటమి ఏర్పాటుకు ఆలోచిస్తున్నారు. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే ఓబీసీ మంత్రిత్వ శాఖ ప్రతిపాదన తెచ్చారు. తెలంగాణ కోసం ఆయన రాజీనామా చేయగా, ఓబీసీ మంత్రిత్వ శాఖ నిర్ణయం అమలు కాలేదు. సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత బీసీల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపారు' అని తెలిపారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం

తెదేపా శాసనసభా పక్షం నిర్ణయం

శాసనసభ సమావేశాల్లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని తెలుగుదేశం శాసనసభా పక్షం(టీడీఎల్పీ) నిర్ణయించింది. బుధవారం టీడీఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, ఆర్.కృష్ణయ్య, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి, ఉపాధ్యక్షుడు అమర్‌నాథ్‌బాబు తదితరులు సమావేశమై శాసనసభ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు, రిజర్వేషన్ల పెంపు దళితులు, బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను సభలో ప్రస్తావిస్తామన్నారు. అంతకుముందు తెదేపా నేతలు మాజీ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

9న సీఎల్పీ సమావేశం

హైదరాబాద్, న్యూస్‌టుడే: బడ్జెట్ సమావేశాలు ఈనెల 12 నుంచి ప్రారంభం కానుండటంతో కాంగ్రెస్ శాసనసభా పక్షం ఈ నెల 9వ తేదీన ప్రత్యేకంగా సమావేశం కానుంది. సీఎల్పీ నేత జానారెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశానికి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టివిక్రమార్క, మండలిలో విపక్ష నేతలు షబ్బీర్ అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు హాజరవుతారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై ఈ సందర్భంగా చర్చిస్తారు.

★ ముఖ్యమంత్రి కేసీఆర్ రహస్య అజెండాతో థర్డ్ ఫ్రంట్ రాజకీయాలు చేస్తున్నారని మండలిలో విపక్ష ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు.

జూన్‌కల్లా ఆచార్యుల నియామకాలు

- ఈ నెలాఖరులో విశ్వవిద్యాలయాల నుంచి ప్రకటనలు
- పీహెచ్‌డీ పూర్తికి గరిష్ఠ గడువు ఐదేళ్లే
- అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి
- ఉపకులపతుల సమావేశంలో నిర్ణయాలు వెల్లడించిన కడియం శ్రీహరి


వీసీలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి.

ఈనాడు - హైదరాబాద్: వచ్చే జూన్ నెలాఖరుకు రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని.. ఎంపికైన వారికి నియామక పత్రాలు కూడా అందజేస్తామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి వెల్లడించారు. ఈ నెలాఖరుకు వర్సిటీలు ఉద్యోగ ప్రకటనలు జారీ చేస్తాయని.. ఏప్రిల్, మేలలో దరఖాస్తుల పరిశీలన, ముఖాముఖిల నిర్వహణ తదితర ప్రక్రియలు ఉంటాయన్నారు. ఈ మేరకు ఆయా వర్సిటీల ఉపకులపతులు సైతం హామీ ఇచ్చారని చెప్పారు. ప్రైవేటు వర్సిటీలకు ఇప్పట్లో అనుమతి ఇచ్చే ఉద్దేశం లేదన్నారు.

గత అక్టోబరులో గవర్నర్ నరసింహన్ ఉపకులపతులతో సమావేశం నిర్వహించి 10 లక్ష్యాలను నిర్దేశించిన సంగతి తెలిసిందే. మళ్లీ ఆరు నెలలకు ప్రగతిని సమీక్షిస్తామని గవర్నర్ చెప్పడం.. ఆ గడువు దగ్గర పడటంతో ఉపముఖ్యమంత్రి కడియం బుధవారమిక్కడ ఉపకులపతులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా 10 లక్ష్యాలపై ప్రగతిని తెలుసుకున్నారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య, కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, లక్ష్యాల్లో ప్రగతిని కడియం విలేకర్ల సమావేశంలో వివరించారు.

ముఖ్యమైన నిర్ణయాలు.. ఆదేశాలివీ..

★ రాష్ట్ర ప్రభుత్వం 1061 ఖాళీల భర్తీకి జీఓ ఇచ్చినా.. కొన్ని విభాగాలకు ఎక్కువ.. డిమాండ్, అధిక కోర్సులున్న విభాగాలకు తక్కువ పోస్టులు మంజూరు చేశారని, వాటిల్లో మార్పులు చేసుకోవాలని ఉపకులపతులు కోరారు. "అలాంటివి ఉంటే ఆమోదం తెలుపుతాం. రిజర్వేషన్ అమలులో కూడా ఇటీవల కేంద్రం మార్పులు చేసిన నేపథ్యంలో వాటిని మళ్లీ నిర్ణయించి రోస్టర్ పాయింట్లు తయారు చేస్తాం. మొత్తానికి ఈ నెలాఖరుకు ప్రకటనలు జారీ చేస్తాం' ' అని కడియం పేర్కొన్నారు.

★ 2017-18 బడ్జెట్‌లో వర్సిటీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.419 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. కొన్ని వర్సిటీల్లో పనులు ప్రారంభం కాలేదు. ఈ నెలాఖరుకు అన్ని పనులు ప్రారంభం కావాలని ఉపకులపతులకు ఆదేశం.

★ జిల్లాల సంఖ్య 31కి పెరిగినందున ఆరు సంప్రదాయ విశ్వవిద్యాలయాల పరిధిని కొత్తగా నిర్ణయించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి వాటిపై చర్చించి ప్రభుత్వం మార్గదర్శకాలిస్తుంది.

★ అన్ని వర్సిటీలు, కళాశాలల్లో జూన్ నాటికి సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పరికరాలు ఏర్పాటు చేయాలి. వాటిని ఏర్పాటు చేస్తేనే అనుబంధ గుర్తింపు ఇచ్చే నిబంధన పెట్టాలి.

★ పీహెచ్‌డీ ప్రవేశాల్లో గందరగోళాన్ని అరికట్టేందుకు ప్రవేశం నుంచి పట్టా ఇచ్చేవరకు ఏకరూపంలో ఉండేలా మార్గదర్శకాలను తయారీ. గరిష్ఠంగా అయిదేళ్లలో పీహెచ్‌డీ పూర్తి చేయాలి.

ఎందుకు చేయలేకపోతున్నారు..?..

"ఆచార్యుల ఖాళీలను భర్తీ చేసుకోమని జీఓ ఇస్తే ఒక్క ప్రకటన కూడా జారీ చేయలేదు. సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టమంటే అదీ లేదు.. ఎందుకని? ఎక్కడ ఆటంకాలు ఉన్నాయి? నేనుగానీ...ఇంకెవరైనాగానీ ఫలానా వారికి ఉద్యోగం ఇవ్వండని ఒత్తిడి తెస్తున్నామా? ఎవరైనా అలాచేస్తే నాకు చెప్పండి. మళ్లీ గవర్నర్ సమావేశం నిర్వహిస్తే ఏం సమాధానం చెప్పాలి" అని కడియం శ్రీహరి ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశం ప్రారంభంలో ఉపకులపతులను ఉద్దేశించి మాట్లాడారు. వర్సిటీలకు ఇచ్చిన నిధుల్లో 10 శాతం కూడా ఖర్చు చేయలేదన్నారు. ఉపకులపతులకు ఆరోగ్యం బాగా లేకున్నా.. నలుగురు విద్యార్థులు వచ్చి అడిగినా పరీక్షలు వాయిదా వేస్తున్నారు? ఇలాగైతే విద్యా వాతావరణం ఎలా కల్పిస్తాం? అని ప్రశ్నించారు.

ఎకరం ఉంటే డిగ్రీలో రిజర్వేషన్

వ్యవసాయ, ఉద్యాన డిగ్రీ కోర్సుల 'రైతు కోటా'లో మార్పు

ఈనాడు, హైదరాబాద్ : వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య డిగ్రీ కోర్సుల్లో 'రైతు కోటా' రిజర్వేషన్ పొందాలంటే కనీసం 3 ఎకరాల సొంత సాగుభూమి ఉండాలనే పరిమితిని ఎకరానికి తగ్గిస్తూ వ్యవసాయశాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఉమ్మడి ఏపీ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 3 ఎకరాల పరిమితి ఉండటం వల్ల ఎక్కువ మంది రైతుల పిల్లలకు ఈ రిజర్వేషన్ వర్తించడం లేదని 'ఈనాడు' గతంలో వెలుగులోకి తెచ్చింది. దీనికి స్పందించిన ఆచార్య జయశంకర్ వ్యవసాయ విద్యాలయం భూ పరిమితిని రద్దు చేస్తూ కనీసం పట్టాదారు పాసు పుస్తకం ఉంటే చాలని.. అది ఉన్న విద్యార్థులందరికీ ఈ రిజర్వేషన్ వర్తింపజేస్తామని నిర్ణయించి ప్రభుత్వ అనుమతిని అడిగింది. కానీ భూమి పరిమితి నిర్ణయించకపోతే కొందరు దుర్వినియోగం చేసే అవకాశం ఉందని, కనీసం ఎకరం ఉండాలనే నిబంధనను ప్రభుత్వం పెట్టింది. ఈ మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త రిజర్వేషన్‌ను అమలుచేయాలని జయశంకర్ వర్సిటీని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య డిగ్రీ సీట్లలో 40 శాతం రైతు కోటా కింద భర్తీచేస్తారు. కచ్చితంగా భూమి ఉన్నవారి పిల్లలకే వీటిని కేటాయిస్తారు. విద్యార్థి పేరుతో లేదా అతని తల్లిదండ్రుల పేరుతో పట్టాదారు పాసుపుస్తకం ఉండాలి. విద్యార్థి తాత, నాయనమ్మ, అమ్మమ్మ పేరుతో భూమి ఉంటే రిజర్వేషన్ వర్తించదు. ఏదైనా గ్రామ పంచాయతీ పరిధిలోనే పదో తరగతి వరకు చదివి ఉండాలి. రైతుల పిల్లలకు ఈ కోర్సుల్లో సీట్లు ఇస్తే వారు చదివిన తర్వాత ఆధునాతన శాస్త్రీయ పరిజ్ఞానంతో తిరిగి వ్యవసాయం చేసి పంటల దిగుబడులు పెంచుతారని ఈ రిజర్వేషన్ అమలుచేస్తున్నారు.

ఎంఎంటీఎస్ రెండోదశను డిసెంబరులోగా పూర్తి చేయాలి: తుమ్మల

ఈనాడు, హైదరాబాద్ : హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్ రెండో దశ పనులను వేగంగా చేపట్టాలని, ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైల్వే అధికారులతో మంత్రి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..రైల్వే పనులన్నింటినీ వేగవంతం చేయాలన్నారు. భద్రాచలం రోడ్డు నుంచి కొవ్వూరు వరకు ప్రతిపాదించిన రైల్వే లైన్ పనులు, సత్తుపల్లి, దమ్మపేట ద్వారా జీలుసమిల్లి వరకు బ్రాడ్‌గేజ్ లైన్ పనుల అలైన్‌మెంటును పరిశీలించారు. రాష్ట్రంలో 460 రైల్వే లెవల్ క్రాసింగుల వద్ద వంతెనలు(ఆర్వోబీ)లను నిర్మించాలని, వాటిల్లో 52 నిర్మాణాల ప్రతిపాదనలను ఆమోదించినట్లు మంత్రి తెలిపారు. రూ. 2,700 కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించినట్లు వివరించారు. నిర్మాణ వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం భరిస్తాయని చెప్పారు. ట్రాఫిక్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో 4 వరుసల వంతెల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ శివారు మియాపూర్-పటన్‌చెరు ప్రాంతంలో రైల్వే టెర్మినల్ నిర్మాణం ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు తుమ్మల పేర్కొన్నారు. సమావేశంలో రహదారులు, భవనాలు, రైల్వే, సింగరేణి అధికారులు పింగలి సతీష్, లింగయ్య, జీవీ రమణారెడ్డి, జేవీఎల్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పాదరక్షల ఆకృతి, అభివృద్ధి సంస్థలో ప్రవేశాలు

- డిగ్రీ, పీజీ కోర్సుల్లో 210 సీట్లు
- వచ్చే నెల 27 నుంచి 29 వరకు ప్రవేశ పరీక్షలు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక జాతీయ పాదరక్షల ఆకృతి, అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీడీఐ)లో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీ కోర్సులు 2018-19 విద్యాసంవత్సరం నుంచి ప్రారంభం కానున్నాయి. 4 సంవత్సరాల బ్యాచిలర్ డిగ్రీలో 3 కోర్సులు, రెండేళ్ల మాస్టర్ డిగ్రీలో రెండు కోర్సులలో కలిసి 210 సీట్లలో ప్రవేశాలు కల్పించనున్నారు. ప్రవేశాల కోసం ఎఫ్‌డీడీఐ తాజాగా ప్రకటన జారీ చేసింది. బ్యాచిలర్ ఇన్ ఫుట్‌వేర్ డిజైన్, ప్రొడక్షన్‌లో 30 సీట్లు, బ్యాచిలర్ ఇన్ రిటైల్, ఫ్యాషన్ మర్చండైజ్‌లో 60, బ్యాచిలర్ ఇన్ ఫ్యాషన్ డిజైన్‌లో 30 సీట్ల చొప్పున, మాస్టర్ ఇన్ ఫుట్‌వేర్ డిజైన్, ఎంబీఏ ఇన్ రిటైల్‌లో 30, ఫ్యాషన్ మర్చండైజ్‌లో 60 సీట్లలో ప్రవేశాలుంటాయి. వీటిల్లో ప్రవేశాల కోసం అఖిల భారత స్థాయిలో కంప్యూటర్ ఆధారిత ఎంపిక పరీక్ష (ఏఐఎస్‌టీ) నిర్వహిస్తారు. డిగ్రీకి ఇంటర్, పీజీకి డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు. పరీక్షలు రాయనున్న అభ్యర్థులు వచ్చే నెల 22 వరకు ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ఏప్రిల్ 27, 28, 29 తేదీల్లో దేశవ్యాప్తంగా 39 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఫలితాలను మే 21న ప్రకటిస్తారు. జూన్ 12 నుంచి 17 వరకు కౌన్సెలింగ్ ఉంటుంది. ఆగస్టు1 నుంచి తరగతులు నడుస్తాయి.

కోర్సులకు భారీ డిమాండ్: ఎఫ్‌డీడీఐ జాతీయ ప్రాధాన్యం గల సంస్థ (ఐఎన్‌ఐ). దేశంలోని 91 సంస్థలకు కేంద్రం ఇటీవల ఈ హోదాను ఇచ్చింది. విశ్వవిద్యాలయాలతో సంబంధం లేకుండా ఈ సంస్థలు స్వయం ప్రతిపత్తితో నడుస్తాయి. వీటిల్లోని కోర్సులకు భారీఎత్తున డిమాండ్ ఉంది. ప్రస్తుతం డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థికి ఏడాదికి రూ. 10 లక్షల ప్రారంభ వేతనం, పీజీ విద్యార్థులకు రూ. 15 లక్షల ప్రారంభ వేతనం ఇస్తున్నారు. దేశ, విదేశాల్లో పాదరక్షలు, తోలు ఉత్పత్తుల తయారీ సంస్థలు చివరి సంవత్సరంలో ఉన్న విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నాయి.

డిజైన్ స్టూడియో మంజూరు: హైదరాబాద్ ప్రాంగణం 13 ఎకరాల్లో రూ. 200 కోట్లతో నిర్మాణమైంది. తాజాగా కేంద్రం దీనికి డిజైన్ స్టూడియోను మంజూరు చేసింది. డిజైన్ స్టూడియోతో విద్యార్థులకు ఆకృతులపై శిక్షణ ఇస్తారు. పాదరక్షల ఉత్పత్తి సంస్థలకు అవసరమైన డిజైన్లను తయారు చేస్తారు. తెలంగాణలోని ఎఫ్‌డీడీఐ ప్రాంగణం వచ్చే ఆగస్టు నుంచి పూర్తిస్థాయిలో నడుస్తుందని సంస్థ సంచాలకులు అరుణ్‌కుమార్ గైక్వాడ్ బుధవారం 'ఈనాడు'తో తెలిపారు.

సాధారణ ఎన్నికలకు సమాయత్తం: రజత్‌కుమార్

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఏడాది జరిగే సాధారణ ఎన్నికల ఏర్పాట్లకు సమాయత్తమవుతున్నామని తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి డాక్టర్ రజత్‌కుమార్ చెప్పారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'స్వేచ్ఛగా, ప్రజాసామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటాం. ప్రస్తుతం వినియోగిస్తున్న ఈవీఎం యంత్రాలు నూటికి నూరు శాతం పని తీరును చూపుతున్నాయి. వాటిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయన్నది న్యాయపరిధిలోని అంశం. ఓటరుకు మరింత భరోసా ఇచ్చేందుకు రశీదు ఇచ్చే అంశాన్ని పరిశీలించాం. రానున్న ఎన్నికల సందర్భంగా మరిన్ని కేంద్రాల్లో రశీదు వచ్చే విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓటర్ల తొలగింపుపై ప్రస్తుతం ఎలాంటి ఫిర్యాదులూ అందలేదు. రాష్ట్రంలో జిల్లాల సంఖ్య పెరగటంతో నిర్వహణ మరింత సులువుగా, వేగంగా సాగుతుంది. రాజ్యసభ ఎన్నికలకు నామపత్రాలు దాఖలు చేసేందుకు మంగళవారం వరకు గడువు ఉంది. బుధవారం వరకు నామపత్రాలు దాఖలు కాలేదు' అని డాక్టర్ రజత్‌కుమార్ వివరించారు.

కేటీఆర్‌కు పరిపక్వత లేదు

- ప్రజల దృష్టిని మరల్చేందుకే మూడో కూటమి
- బస్సు యాత్రలో పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ విమర్శలు


సిరిసిల్ల సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వీహెచ్, రేవంత్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, భట్టివిక్రమార్క, పొన్నం ప్రభాకర్ తదితరులు

వేములవాడ, న్యూస్‌టుడే, ఈనాడు డిజిటల్, సిరిసిల్ల: మంత్రి కేటీఆర్‌కు పరిపక్వత లేదని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. తన భార్య పద్మావతి ఎమ్మెల్యేగా ప్రాతినిత్యం వహిస్తున్న కోదాడలో మంత్రి కేటీఆర్ తనపై బురదజల్లే ప్రయత్నం చేశారన్నారు. గత ఎన్నికల్లో తన వద్ద రూ.3 కోట్లు దొరికాయని అబద్ధాలు చెప్పాడని కానీ అప్పుడు రూ.1.57 వేలు మాత్రమే దొరికాయని ఆ కేసును కోర్టు కొట్టివేసిందన్నారు. మిషన్ భగీరథను కమీషన్ భగీరథగా మార్చారని.. ఆంధ్రా గుత్తేదార్ల వద్ద 6 శాతం కమీషన్లు తీసుకున్న వారికి తమను విమర్శించే స్థాయి లేదని ఆరోపించారు. ప్రజాచైతన్య బస్సు యాత్రలో భాగంగా బుధవారం వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజల దృష్టిని మరల్చేందుకే సీఎం కేసీఆర్ మూడో కూటమి పేరిట కొత్త నాటకం ప్రారంభించారన్నారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేసినట్లుగానే వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారికి కూడా హామీలు ఇచ్చి మోసం చేస్తున్నాడన్నారు.

ఇసుకను కొల్లగొడుతున్న కేసీఆర్ బంధువులు.. ఇసుకను కొల్లగొట్టేందుకు.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ ఇసుకరీచ్‌లను కేసీఆర్ కుటుంబ సభ్యులు తన బంధువులకే అప్పగించి రూ.వేల కోట్లల్లో అక్రమార్జనకు పాల్పడుతున్నారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. నేరెళ్ల దళితులపై జరిగిన దాడి ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ పథకం కోసం అప్పులు తెచ్చి.. ఆ పనులను 6శాతం కమీషన్ తీసుకుని గుత్తేదారులకు అప్పగించారని ఆరోపించారు. శాసనసభ్యుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ. . జిల్లాలోని నేత కార్మికులను ఆదుకునే లక్ష్యంతో రూ. 220కోట్లతో కోటి బతుకమ్మ చీరను ఆర్డర్లు ఇస్తే.. ప్రభుత్వం కమీషన్ల కోసం నాణ్యతలేని సూరత్ చీరలను ఆడపడుచులకు అంటకట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో శాసనాసభపక్ష నేత టి.జీవన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్‌గౌడ్, వీహెచ్.హన్మంతరావు, కాంగ్రెస్ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు నేరెళ్ల శారద, షబ్బీర్‌అలీ, వి.హన్మంతు, శ్రీధర్‌బాబు, మల్లు బట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు.

నేడు ముగియనున్న బస్సుయాత్ర

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చేపట్టిన తొలి విడత ప్రజా చైతన్య బస్సు యాత్ర నేటితో పూర్తి కానుంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ యాత్ర ఫిబ్రవరి 26న రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నుంచి ప్రారంభమైంది. హోలీని పురస్కరించుకుని యాత్రకు మూడురోజుల విరామం ఇచ్చారు. మార్చి 9వ తేదీ వరకు యాత్ర కొనసాగాల్సి ఉన్నా..అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో 8వ తేదీతోనే యాత్రను ముగించాలని తాజాగా నిర్ణయించారు. మొత్తం 8 రోజుల పర్యటనలో బస్సు యాత్ర 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగింది. బహిరంగ సభల ద్వారా తెరాస ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నాయకులు తమ ప్రసంగాల్లో ప్రాధాన్యం ఇచ్చారు. తాము అధికారంలోకి వస్తే రైతుల పంటల బీమా ప్రీమియం సొమ్మును ప్రభుత్వం ద్వారానే చెల్లించడంతో పాటు..రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. నిరుద్యోగ యువతకు నెలకు మూడు వేల నిరుద్యోగ భృతి ఇచ్చే అంశాన్ని నొక్కిచెప్పారు. బస్సు యాత్ర పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిందని పార్టీ నాయకత్వం భావిస్తుండగా.. పార్టీ జాతీయ స్థాయి నాయకులు ఎవరూ యాత్రలో పాల్గొనకపోవడం,జైపాల్‌రెడ్డి లాంటి నేతలు యాత్రకు దూరంగా ఉండటం వంటి అంశాలు పార్టీలో అంతర్గత చర్చకు దారితీశాయి. మరోవైపు యాత్రలో ఇతర పార్టీలకు చెందిన ముఖ్య నాయకుల చేరికలు ఉంటాయని భావించినా ఆ స్థాయి నాయకులెవరూ చేరకపోవడం శ్రేణులను నిరాశ పరిచింది.

కేసీఆర్ చొరవతో జాతీయ స్థాయిలోనూ మహిళాభ్యున్నతి

టీజీవోల ఛైర్మన్ శ్రీనివాస్‌గౌడ్

ఈనాడు, హైదరాబాద్ : ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో దేశవ్యాప్తంగా మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఛైర్మన్ వి.శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణను మహిళాభ్యున్నతిలో అగ్రభాగాన నిలిపిన కేసీఆర్ జాతీయ స్థాయిలోనూ వారి అభివృద్ధికి పూనుకుంటున్నారని చెప్పారు. బుధవారం టీజీవో భవన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో తొలిసారిగా మహిళను అధ్యక్షురాలిగా చేసిన ఘనత తమ సంఘానిదేనని చెప్పారు. టీజీవో అధ్యక్షురాలు మమత మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ నిర్మాణంలోనూ మహిళలు చురుకైన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు.

బ్యాంకుల వైఖరిని నిరసిస్తూ త్వరలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా

ఈనాడు, హైదరాబాద్ : మహిళా పారిశ్రామికవేత్తలపై బ్యాంకుల వైఖరిని నిరసిస్తూ త్వరలో దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తామని జాతీయ చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంఘం అధ్యక్షురాలు డీవీవీ శ్రీలక్ష్మి వాణి తెలిపారు. దేశవ్యాప్తంగా మహిళా పారిశ్రామికవేత్తలకు ఇచ్చే రుణాలు 5 శాతం కూడా ఉండడం లేదన్నారు. బుధవారం హైదరాబాద్ నాంపల్లిలోని సంఘం కార్యాలయంలో జరిగిన అంతర్జాతీయ మహిళాదినోత్సవాల్లో ఆమె మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తల అభ్యున్నతికి చేయూతనిస్తోందన్నారు. సీఎం కేసీఆర్ దేశంలోని సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం అభినందనీయమని, తమ సంఘం తరఫున ఆయన నిర్ణయానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని చెప్పారు.

తెరాస ఎంపీల ఆందోళన వెనక మజ్లిస్ హస్తం : జి.కిషన్‌రెడ్డి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రిజర్వేషన్ల పెంపుదలకై పార్లమెంటులో తెరాస ఎంపీలు చేస్తోన్న ఆందోళన వెనుక మజ్లిస్ పార్టీ హస్తముందని.. దీనికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం ఎంఐఎం వహిస్తోందని భాజపా శాసనసభాపక్ష నేత కిషన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేసే అధికారం రాష్ట్రాలకు బదిలీ చేయాలని తెరాస ఎంపీలు పార్లమెంటు సమావేశాలను అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. ఇలా రాష్ట్రాలకు అధికారమివ్వడమనేది కీలకమైన అంశమని.. కేవలం లోక్‌సభలో చట్టం చేస్తే సరిపోదన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా రాష్ట్రంలోని ముస్లింలకు అమలు చేస్తోన్న 4 శాతం రిజర్వేషన్లను 12 శాతానికి పెంచాలని ఆందోళన చేస్తూ.. రాష్ట్ర ప్రతిష్ఠను దిగజారుస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్‌కు వచ్చిన ఆలోచనను దేశ ప్రజలపై రుద్దాలనుకోవడం సరైంది కాదన్నారు. ముస్లింలకు అమలు చేస్తోన్న 4 శాతం రిజర్వేషన్లను రద్దుచేసి.. వాటిని గిరిజనులకు బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్రిపురలో కమ్యూనిస్టు నేతల విగ్రహాలను సీపీఎం నాయకులే కూల్చివేసి.. ఆ నిందను భాజపాపై మోపుతున్నారని ఆరోపించారు.

మైసూర్ మహారాజువి నువ్వే.. రాజకన్య నీదే!

- ఆమెను దక్కేలా చేస్తానని నమ్మించి వ్యాపారి నుంచి రూ.5 కోట్లు కాజేసిన మోసగాడు
- నిందితుడితోపాటు సహకరించిన ఇద్దరి అరెస్టు

చార్మినార్, న్యూస్‌టుడే: 'పూర్వజన్మలో నీవు సాక్షాత్తూ మైసూర్ మహారాజువి.. నాలుగు వేల ఏళ్ల క్రితం రాజ్యపాలనంతా నీ కనుసైగలతో సాగింది.. నాడు నీ సరసన ఉన్న రాజకన్య తిరిగి మైసూర్‌లో జన్మించింది.. ఆమె పేరిట రూ.కోట్ల విలువైన ఆస్తులున్నాయి. ఆమెను నీకు దక్కేలా చేస్తా' అని ఓ వ్యాపారికి మాయమాటలు చెప్పి ఓ మోసగాడు రూ.కోట్లు దండుకున్నాడు. ఆ మోసగాడిని, అతనికి సహకరించిన భార్య, ఓ రౌడీషీటర్‌ను బుధవారం మీర్‌చౌక్ పోలీసులు అరెస్టు చేశారు. రూ.13.50 లక్షల నగదు, బ్లాక్‌మ్యాజిక్‌కు ఉపయోగించే సామగ్రిని, ఎయిర్‌పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారు.పురానిహవేలీలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో దక్షిణ మండలం డీసీపీ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. కర్ణాటకలోని బీదర్ జల్‌సంగీకి చెందిన వ్యాపారి రుస్తుంపటేల్(42) పాతబస్తీ యాఖుత్‌పురా దారాబ్‌జంగ్ కాలనీలో నివాసం ఉంటున్నారు. గతంలో చిన్నగోల్కొండలో ఉన్న సమయంలో బీదర్‌కు చెందిన మిత్రుడు ఆజం ద్వారా రాజేంద్రనగర్ చింతల్‌లోని గోల్డెన్‌కాలనీకి చెందిన బ్లాక్‌మ్యాజిక్ చేసే మెహతాబ్ హుస్సేన్(40) అలియాస్ ఆదిల్‌తో పరిచయమైంది. పటేల్‌ను మోసగించాలని ఆదిల్ పథకం పన్నాడు. రైస్‌పులింగ్ మంత్ర పాత్ర ఉందని, దాని ఒక భాగం అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.2500 కోట్ల విలువ చేస్తుందని నమ్మించాడు. జలసంగీలో తవ్వకాలు చేస్తే బంగారు గనులు దక్కుతాయని అతడి నుంచి రూ.8లక్షలు తీసుకొని తవ్వకాలు చేశాడు. అక్కడ ఏమీ లభించకపోవడంతో నీవు మంచి మనస్సుతో కార్యం తలపెట్టలేదని బుకాయించాడు. ఇలా వ్యాపారిని నమ్మిస్తూ రూ.5కోట్ల వరకు దండుకున్నాడు. పూర్వజన్మలో మైసూర్ రాజువని, రాజకన్య నీకోసం పుట్టిందని, ఆమెను నీకు దక్కేలా చేస్తానని ఓ యువతి ఫొటోలు, ఆమె రాసిందంటూ లేఖలను చూపించాడు. నిందితుడికి ఆయన భార్య షకీనా ఫాతిమా(36)కూడా తోడై వ్యాపారిని నిండా ముంచారు. చివరకు వీరి మోసాన్ని గుర్తించిన బాధితుడు డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా ఆదిల్ తుపాకీతో బెదిరించాడు. ఆ వ్యాపారి తన జోలికి రాకుండా చూడాలని మల్లెపల్లికి చెందిన రౌడీషీటర్ మహ్మద్ యూసఫ్(44) అలియాస్ జంగ్లీయూసఫ్‌కు రూ.8.5 లక్షలు చెల్లించాడు. దీంతో రౌడీషీటర్ బాధితుడిని బెదిరించాడు. ఈ నేపథ్యంలో బాధితుడు పటేల్ మీర్‌చౌక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.


పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

makarandam@eenadu.in

మకరందం

పట్టు పరికిణీ కట్టి చిట్టిచిట్టి చేతులతో గుమ్మం ముందు ముగ్గులేసే చిట్టితల్లుల్ని చూడండి... ఎంత కనుల పండువగా ఉంటుందో... వారు తీర్చిదిద్దిన రంగవల్లులు ఆరోజే చెరిగిపోవచ్చు. కానీ ఆ దృశ్యం మన గుండెల్లోంచి ఏనాటికీ చెరిగిపోదు. కన్నకూతురు మిగిల్చే తీపిజ్ఞాపకాలు గుండెలో నిక్షిప్తంగా ఉంటాయి. ఆమెను అత్తారింటికి పంపేటప్పుడు కన్నీరై వర్షిస్తాయి. ఇది నాన్నలకు ఆడపిల్లలు మాత్రమే ఇవ్వగలిగే అపురూప కానుక. అలాంటి తీపిగాయాలు ఆడపిల్లల నుంచి అమ్మానాన్నలకు దక్కే వరాలు.

"కోడలొచ్చాక కొడుకు కొడుకు కాదు. పెళ్లయి వెళ్లిపోయినా పిల్లలు తల్లయినా కూతురు కూతురే.' అని పెద్దలు చెబుతారు.

ప్రతి పురుషుడిలో కొంత స్త్రీప్రకృతి కలిసి ఉండడాన్ని 'ఏండ్రిగొని' అంటారు. ఈ ప్రవృత్తి లేకుంటే మనిషి మేధావి కాలేడన్నాడు ప్రముఖ కవి కాలే రిడ్జ్! మగవారిలో మార్దవంతో పాటు మేధావి తనం ఉనికికి సైతం ఈ రసాయన ప్రక్రియ కారణమవుతుంది. ఇదే స్త్రీత్వానికి పట్టాభిషేకం. దీన్నే మన పురాణాలు అర్ధనారీశ్వర తత్త్వంగా అభివర్ణించాయి. పరమ శివుడు తన సగ దేహభాగం పార్వతికి ఇచ్చాడంటే అర్థం అదే. హక్కులలో సగం, ఆకాశంలో సగం వంటివి కేవలం నినాదాలు. ఆత్మలో సగం అర్ధాంగి సొత్తు. కవులలో, కళాకారులలో, నిజ జీవిత విజేతలలో యువతులు రగిల్చే స్ఫూర్తి, ఉత్తేజం అనితర సాధ్యం. 'క్రైం అండ్ పనిష్మెంట్'తో లోక ప్రసిద్ధుడైన దోస్తవ్ స్కీ సృష్టించిన అపూర్వమైన పాత్రలకు ఆయన ప్రేమించిన పోలినా సుస్లోవా అనే అమ్మాయి స్ఫూర్తిగా నిలిచిందంటారు సాహితీవేత్తలు. ఆల్‌ఫ్రెడ్ నోబుల్ డైనమైట్ కనుక్కోవడంలో దాని మూలంగా లభించిన అపార సంపదతో ప్రతిష్ఠాత్మక నోబుల్ బహుమతి వ్యవస్థను రూపొందించడంలో ఆయన ప్రియురాలు బెర్తా అనురాగం ప్రేరణగా నిలిచింది.

ఆమె ఆంతర్యం అగాధం...
ఆమె లేకుంటే అంతా శూన్యం...
ఆమె సృష్టికి ఓ కానుక...
ఆమె ఓ మధుర భావన...
ఆమె శక్తి అపారం...
ఆమె యుక్తి అమూల్యం...
ప్రేరణ ఆమే... లాలనా ఆమే...
తల్లిగా... తోబుట్టువుగా...
తోడుగా... నీడగా...
ఆమె పాత్ర అనితరసాధ్యం...
అందుకే ఆమెకు
శతకోటి వందనాలు...
అభినందన చందనాలు...

అమృతమూర్తికి అభివందనం!

ప్రాచీన ప్రాకృత గాథల్లో ఒక పచ్చిబాలింత ఉదంతం మనల్ని కన్నీరు పెట్టిస్తుంది. ఆమెది పూరిగుడిసె. బయట హోరున వాన. కొబ్బరి ఆకుల పందిరిలాంటి పైకప్పు. ఎక్కడికక్కడే కారిపోతోంది. ఆమె ఒళ్లోని పసిబిడ్డ తడిచిపోతాడన్న వేదనతో కన్నీరుమున్నీరుగా ఏడుస్తూ తన చీరకొంగును గొడుగులా ఎత్తిపట్టుకుంది. అయినా ఆ పసివాడు తడిచిపోతున్నాడు 'వర్షపు నీటితో కాదు... ఆ తల్లి కార్చే కన్నీటితో'...

నాలుగు పెదవులు కలిసినప్పటికన్నా రెండు పెదవులు కలిసి రెట్టింపు తీపిని ఎప్పుడిస్తాయంటే అమ్మా అని పిలిచినప్పుడు. ప్రపంచంలోని గొప్పవారిలో ఎక్కువమంది తమ తల్లుల జీవ లక్షణాలను పుణికి పుచ్చుకున్నవారే' అని పరిశోధనల్లో తేలింది. స్త్రీకి గౌరవ వాచకం ఇల్లాలైతే... ఇల్లాలికి గౌరవవాచకం అమ్మ!

అనేక దశల్లో సమాజానికి చుక్కానిగా నిలిచిన మహిళలు మన ఆచార వ్యవహారాలకూ ఆధార భూమికలు. తరతరాలుగా మగవాడి విజయానికి వెన్నెముకగా నిలిచిన మహిళ... సప్తపదిలో భర్త చిటికెన వేలు పట్టుకుని ఒద్దికగా వెనక నడిచిన మహిళ ఈ ఆధునిక యుగంలో ప్రపంచాన్నే తన చూపుడు వేలితో శాసించాలని... చిటికెన వేలితో నడిపించాలని సమాయత్తం కావడం ఈ యుగం ప్రత్యేకత. రాబోయేది మహిళా యుగమే. ధీశక్తిలో, స్థైర్యంలో, ముందుచూపులో, వివేకంలో స్త్రీదే ముందంజ. ఆధునిక మహిళ సాధించిన అమోఘ విజయమిది.

– వై.శ్రీలక్ష్మి

దార... జాయ... పత్ని... వీరెవరు?



స్త్రీకి మన భాషలో పదుల సంఖ్యలో పర్యాయపదాలు.. అవి ఆమె నిర్వహించే విభిన్న పాత్రలకు ప్రతిరూపాలు! ఇల్లాలికి ఇంగ్లిష్‌లో ఉన్నదొకటే మాట.. వైఫ్! మరి మనకో?.. జాయ, పత్ని, భార్య, దార, సతి.. ఎన్నో! వీటిలో ఒక్కోమాటను ఒక్కో ప్రత్యేక సందర్భంలో ప్రస్తావిస్తుంటారు.

- అగ్నిసాక్షిగా వివాహం జరిగి, యజ్ఞయాగాదులతో సహధర్మచారిణిగా వ్యవహరించే స్త్రీ.. పత్ని. ఆవిడే ధర్మపత్ని.
- ఆలు అంటే.. ఇంటి ఆలు. ఇంటికి యజమానురాలు అని. ఆమె ఇల్లాలు.
- బిడ్డలకు జన్మనిచ్చిన ఇల్లాలికి జాయ అని పేరు.
- భార్య అంటే అర్థం.. భర్త దేశాంతరం వెళ్లినప్పుడు అతడి స్థానంలో కుటుంబ భారం వహించేది అని....
- సత్వగుణంతో శోభించేది సతి. అన్నివేళలో భర్తతో కలిసిమెలసి అన్యోన్యంగా జీవించేది.. దార!

ఏ పాత్రకు అదే ప్రత్యేకం! ఒక్కో పాత్రకు ఒక్కో సంబోధన. పురుషుడి జీవితంలో తాళికట్టిన భార్య ఇన్ని పాత్రలు పోషిస్తుంటే.. స్త్రీగా, గృహిణిగా, తల్లిగా, ప్రియురాలిగా, నాయికగా.. ఆకాశంలో సగమై, శివుడి శరీరంలో భాగమై, ఇంటికి దీపమై, కంటికి వెలుగై.. ఈ సృష్టికే శోభను చేకూరుస్తోంది. మహిళ లేకుంటే సృష్టేలేదు. అందం, ఆకర్షణ, సమర్థత, దక్షత, తెలివితేటలు, ఓర్పు.. స్త్రీ సహజ లక్షణాలు. కనుకనే ఆమె రూపం అపురూపం. లావణ్యానికి ప్రతిరూపం. అందానికున్న పర్యాయపదాలన్నీ ఆమెకే సొంతం. సరిగ్గా అర్థం చేసుకుంటే ఆమె స్వరూపం.. విశ్వరూపం.

–కప్పగంతు రామకృష్ణ



రామాయణం కాదు.. సీతమ్మ కథ

లోకమంతా అనుకుంటున్నట్లు వాల్మీకి తన కావ్యాన్ని రామాయణంగా చెప్పలేదు. 'సీతాయాశ్చరితం మహత్' - అన్నాడు. నేను రాస్తున్నది సీతమ్మ కథ. మహనీయమైన సీతమ్మ కథ. లోకానికి మేలు చేకూర్చాలని వాల్మీకి భావించాడు. 'కవిసమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ తన రామాయణ కల్పవృక్ష కావ్యంలో సీతమ్మలోని ధీరత్వాన్ని అత్యద్భుతంగా వర్ణించాడు. లంకలోని అశోకవనంలో సీతమ్మ కూర్చున్న తీరును వర్ణిస్తూ విశ్వనాథ


ఆకృతి రామచంద్ర విరహాకృతి కన్బొమతీరు స్వామి చా
పాకృతి కన్నులన్ ప్రభు కృపాకృతి కైశికమందు స్వామి దే
హాకృతి సర్వదేహమున యందును రాఘవవంశమౌళి ధ
ర్మాకృతి కూరుచున్న విధంబంతయు రామచంద్రు ప్రతిజ్ఞమూర్తియై

అంటూ సీతమ్మతల్లి రామచంద్రుడి పరాక్రమానికి చిహ్నంగా కూర్చుందని చెప్పారే కానీ రావణాసురుడు తీసుకువచ్చిన అబలగా కూర్చుని బాధపడుతున్నట్లు రాయలేదు. అదీ సీతమ్మ తల్లి ధీరత్వం.

యుక్తి... శక్తి... అనురక్తి!

తొలినుంచీ మన సమాజంపై మహిళల ముద్ర అనంతం. తమ తెలివితేటలు, ధీశక్తి, ప్రేమానురాగాలతో ఆధ్యాత్మిక ప్రపంచాన్ని సుసంపన్నం చేసిన వారి గాథలు మనకు పాఠాలు చెబుతాయి..

సతీ లీలావతి!



భార్య తన అనురాగాన్ని భర్తకు పరిపూర్ణంగా అందజేస్తుంది. మంచి దారిలో నడవాలనుకుంటుంది. దారి తప్పితే.. ప్రేమతోనో.. తెలివితోనో.. తన దారికి తెచ్చుకునే ప్రయత్నం చేస్తుంది. అలాంటి భార్యే లీలావతి.

ఈ కథంతా విష్ణు పురాణంలోనిది. హిరణ్యకశిపుడు జీవితమంతా విష్ణు ద్వేషంతోనే గడిపాడు... మరి అతని కుమారుడైన ప్రహ్లాదుడికి అంత విష్ణుభక్తి. ఇలా ఎందుకు వచ్చిందనేది అటు మనస్తత్వ శాస్త్రానికీ, ఇటు భారతీయ స్త్రీల చాతుర్యానికీ సంబంధించిన గొప్ప విషయం. ప్రహ్లాదుడు లీలావతి కడుపులో ఉండగా హిరణ్యకశిపునికి తపస్సు చేయాలని సంకల్పం కలిగింది. శివుడు ప్రత్యక్షమై వరాలన్నీ ఇచ్చి సాగనంపేదాకా తపస్సు చేయాలని నిర్ణయించుకుని పొద్దున్నే వెళ్లిన వాడు సాయంత్రానికే తిరిగి వచ్చేశాడు. అదేమని అడిగితే అడవిలో పెద్ద అవరోధం ఏర్పడిందని చెప్పాడు. ఈయన ఒక చెట్టు కింద స్థిమితంగా కూర్చుని కళ్లు మూసుకుని ఓం నమఃశివాయ అనడం మొదలుపెట్టాడో లేదో అదే చెట్టుపై ఒక చిలుక వాలి నారాయణ, నారాయణ అని రొద చేయడం ప్రారంభించిందట. దీంతో హిరణ్యకశిపుడి ఏకాగ్రత చెల్లాచెదురైపోయింది. ఎన్నిసార్లు పట్టుదలగా కూర్చుని మళ్లీ తపస్సు మొదలుపెట్టినా ఇదే పరిస్థితి ఉంటోంది. చివరికి ఆయనకు విసుగొచ్చి మరోసారెప్పుడైనా ప్రయత్నిద్దామని ఇంటికి వచ్చేశాడు. లీలావతి చాలా తెలివైంది. చిలకరూపంలో వచ్చినవాడు నారద మహర్షి అని గ్రహించింది.


అయినా నమ్మలేనట్లుగా మొహం పెట్టి .. ఏదీ ఏమంది? ఎలా అంది?...

నాలుగేసి అక్షరాలు పలకడం చిలకలకి సాధ్యమవుతుందా- మీ భ్రమగానీ

సరిగ్గా అలాగే పలికిందా! చిలక ఎలా అందో సరిగ్గా అలాగే చెప్పండి... అని పదే పదే రెట్టించింది.

ప్రశ్నలకు సమాధానం రాబట్టడంలో ఆమె నైపుణ్యం అపారమైంది. ప్రేమగా, లాలనగా, గోముగా అడుగుతూ 108 సార్లు శ్రీమన్నారాయణ జపం పూర్తి చేయించింది. ఇదంతా హిరణ్యకశిపుడు బడలిక తీర్చుకోవడానికి లీలావతి ఒళ్లో తలవాల్చి సేదతీరుతున్నప్పుడు జరిగింది. అప్పటికి ప్రహ్లాదుడు తల్లి కడపులో తొమ్మిది నెలల పసికందుగా ఉన్నాడు. ఇలా పుట్టబోయే పిల్లవాడికి తండ్రితోనే నారాయణ మంత్రోపదేశం జరిగేలా చేసింది. ఇలా దారితప్పిన తన భర్తను అపార నైపుణ్యంతో మంచి మార్గంవైపు మళ్లించేందుకు ప్రయత్నించింది లీలావతి

జ్ఞానమయి మైత్రేయి



అన్ని రంగాల్లో ఆడపిల్లలు ముందుకొస్తున్న రోజులివి. సంప్రదాయాలు, కట్టుబాట్లు అడ్డుగోడలుగా ఉన్న కాలంలో మహిళకు చదువుకునే అవకాశం ఎక్కడిది? అలాంటి రోజుల్లోనే తన ప్రజ్ఞతో వేదవిద్యను ఔపోసన పట్టిన మేధావి మైత్రేయి. ఆడపిల్లల చదువుకు నాంది పలికిన మహోన్నతురాలామె...

గురుకుల నిర్వహణలో, విద్యాబోధనలో యాజ్ఞవల్క్యుడికి తోడ్పడుతూ, ఆయనకు సహధర్మచారిణిగా ఉండి బ్రహ్మజ్ఞాన ఉన్నత శిఖరాలధిరోహించిన సుమనిస్విని మైత్రేయి. మైత్రేయి జనక మహారాజు మంత్రి మిత్రయుడి కుమార్తె. తండ్రితో పాటు జనకుడి ఆస్థానానికి వెళుతూ అక్కడ జరిగే పండిత గోష్ఠులను, వేదాంత చర్చలను బాల్యం నుంచే శ్రద్ధగా, ఆసక్తితో వినేది. పినతల్లి గార్గి బ్రహ్మవాదిని. ఆమె పాండిత్య ప్రభావం మైత్రేయిని ఎంతగానో ఆకర్షించింది. తన తండ్రి యింట ఓసారి బసచేసిన యాజ్ఞవల్క్య మహర్షి చొరవ, ధీశక్తి, సాహసం ఆమెపై గొప్ప ప్రభావం చూపాయి. ఆయన వివాహితుడైనా ఒప్పించి, మెప్పించి అన్ని సంపదలను త్యజించి అతన్ని పెళ్లి చేసుకుంది. జ్ఞాన సముపార్జనలో మహోన్నత శిఖరాలను అధిరోహించింది. యాజ్ఞవల్క్య మహర్షి వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించాలనుకుని తన సంపాదనను భార్యలిద్దరికీ పంచి ఇవ్వబోగా తన భాగాన్ని మైత్రేయి వద్దంది. ఈ నశ్వర సంపదతో నాకు అమృతత్వం వస్తుందా అని అడిగింది. తన వాటా కూడా ముని మొదటి భార్య కాత్యాయనికి ఇచ్చేసి భర్తతో పాటు తానూ వానప్రస్థానానికి బయలుదేరింది. అక్కడ బోధన, సాధన మరింత తీవ్రం చేసింది. జనకుడు, గార్గి వంటివారితో నిరంతరం బ్రహ్మజ్ఞానం గురించి చర్చలు జరిగేవి. వాటిలో ఏకాగ్రత, శ్రద్ధతో ఆమె చెప్పే సమాధానాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసేవి. ఆ చర్చల సారమే 'బృహదారణ్యకోపనిషత్తు'. మైత్రేయిని బ్రహ్మజ్ఞానానికి అర్హురాలిగా చేసి యాజ్ఞవల్క్యుడు హిమాలయాలకు వెళ్లిపోయాడు. ఒకవైపు ధర్మపత్నిగా గృహస్థ ధర్మాలు నిర్వర్తిస్తూనే మరోవైపు వేదజ్ఞాన సముపార్జనకు స్త్రీలూ అర్హులేనని నిరూపించిన మైత్రేయి అబలకాదు సబల. నాటికీ, నేటికీ ఆమె మహిళా శక్తికి నిదర్శనంగా నిలిచింది.

త్యాగానికి ప్రతిరూపం చిన్నమ్మ!



ఓ తల్లి త్యాగం యుగయుగాలుగా నిలిచిపోయిన వైనం రామాయణంలో మనకు కనిపిస్తుంది. ఆమె లక్ష్మణుడి తల్లి సుమిత్రా దేవి. పాశ్చాత్య తత్వవేత్త మాక్స్ ముల్లర్ 'ఇద్దరు స్త్రీమూర్తులకు పాదాభివందనం' అన్నారు. తమ వ్యక్తిత్వాలతో ఆయనను విశేషంగా ఆకట్టుకున్న ఇద్దరు మాతృమూర్తుల్లో సుమిత్ర ఒకరు.. రెండో ఆమె పాండవుల తల్లి కుంతీదేవి. త్యాగమంటే ఈ జాతికి నేర్పిన తల్లులు వారిద్దరూ అన్నారాయన.

అయోధ్యను పాలించిన దశరథ మహారాజుకు ముగ్గురు ధర్మపత్నులు. కౌసల్య, సుమిత్ర, కైకేయి. కౌసల్య కోసల రాజు కుమార్తె. కైకేయి కేకయరాజు కూతురు. మగధేశ్వరుడి కుమార్తె సుమిత్ర. పేరుకు తగ్గట్టే సౌమ్యురాలు. అటు పట్టపురాణి కాకపోయినా, కైకేయిలా భర్త ప్రేమను అమితంగా పొందలేకపోయినా.. వ్యథ చెందింది లేదు. సుమిత్రకు ఇద్దరు కుమారులు. లక్ష్మణుడు, శత్రుఘ్నుడు. లక్ష్మణుడు.. రాముడికి నీడలా ఉంటే. శత్రుఘ్నుడు.. భరతుడి వెన్నంటే ఉండేవాడు. వనవాసానికి బయల్దేరిన సీతారాములకు తోడుగా వనానికి వెళ్లమని లక్ష్మణుని ఆదేశించింది సుమిత్ర. 'వనవాసం కోసమే నువ్వు పుట్టావు. సీతారాములను జాగ్రత్తగా కాపాడు. ఇకపై నీకు రాముడే దశరథుడు, నన్ను సీతలో చూసుకో...రామందశరథం విద్ధి, మాం విద్ధి జనకాత్మజామ్ అని చెప్పింది. ఆ క్షణాన ఆమెలో కైకకున్న స్వార్థమూ లేదు. కౌసల్యకున్న మమకార దుఃఖమూ లేదు. పుత్ర వియోగంతో బాధపడుతున్న కౌసల్యను ఓదార్చింది తన దుఃఖాన్ని లోలోపల అణచుకొంది. రాముడు వనవాసానికి వెళ్లాడన్న దిగులుతో మృత్యుముఖానికి చేరుకున్న దశరథుడు సుమిత్ర ప్రవర్తనను గ్రహించి.. ఆమెనెంతో ఆదరించాడు. "హా సుమిత్రా! తపస్వినీ!!" అంటూ ప్రశంసించాడు. సుమిత్ర నిజంగా తపస్వినే! ఒక ఆదర్శవంతుడైన సోదరుడంటే ఇలా ఉండాలని ప్రపంచానికి సౌమిత్రి ద్వారా సందేశం అందించింది. రామాయణకావ్యంలో వాల్మీకి సృష్టించిన మహోన్నతమైన పాత్రల్లో సుమిత్ర ఒకటి. అలాంటి సుమిత్రలను సమాజంలో ఇంటింటా చూడాలని ఆకాంక్షిద్దాం!

– వేదప్రియ


ధైర్యం చెప్పిందామె...

ఇస్లాం సందేశం

ఇస్లాం ధర్మ ప్రచారంలో పురుషులతో సమానంగా మహిళలూ కృషి చేశారు. ముహమ్మద్ ప్రవక్త సతీమణి బీబీ ఖతీజ (రజి) ఇందుకు ఉదాహరణ.

"ఆందోళన చెందకండి. అల్లాహ్ మీకు ఎటువంటి అన్యాయం చేయరు" అని ఓ సందర్భంలో బీబీ ఖతీజ తన భర్త అయిన ప్రవక్త (స)కు ధైర్యాన్నిచ్చారు. హిరా గుహలో ధ్యానం చేస్తున్న ముహమ్మద్ ప్రవక్త (స)కు మొట్టమొదటిసారి ఖుర్ఆన్ వాణి వినిపించింది. దైవదూత జిబ్రాయిల్ ఖుర్ఆన్ వాణిని ప్రవక్త మనోఫలకంపై అవతరింపజేశారు. జిబ్రాయిల్ దూత అంతర్ధానమైన మరుక్షణం నుంచి ప్రవక్త (స) భయంతో కంపించిపోయారు. హుటాహుటిన ఇంటికి వెళ్లి భార్యతో.. 'దుప్పటి కప్పు' అంటూ వణుకుతూ పడుకున్నారు. భర్త పరిస్థితిని చూసి ఖతీజా కంగారుపడింది. కాసేపటికి ఆయన పరిస్థితి కుదుటపడింది. ప్రవక్త (స) హిరా గుహలో జరిగిన వృత్తాంతాన్ని భార్యకు వివరించారు. అప్పుడు ఆ స్త్రీమూర్తి "సత్య సంధులు, నిజాయతీపరులను అల్లాహ్ ఆదరిస్తార"ని భర్తకు ధైర్యాన్ని నూరిపోశారు. భర్త కష్టసుఖాల్లో చేదోడువాదోడుగా ఉంది. ఇస్లాంను స్వీకరించిన వారిలో మొట్టమొదటగా నిలిచిన ప్రవక్త (స)కు నైతికంగా అండగా నిలిచారామె. తన వద్ద ఉన్న నలభైవేల దీనార్‌లను ఇస్లామీయ ఉద్యమం కోసం దానమిచ్చారు. భర్త అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన కష్టాల్లో ఉన్నప్పుడు వెన్నంటి ఉంటూ.. ఆదర్శ మహిళగా గుర్తింపు పొందారు.

–ఖైరున్నీసా బేగం



వేదాలు చెప్పాయి

భారతీయ సంస్కృతికి పట్టుగొమ్మలుగా ఉన్న వేదాలు స్త్రీకి ఎంతో ప్రాధాన్యత ఇచ్చాయి. ఋగ్వేదం, యజుర్వేదం, అధ్వరణవేదాల్లోని అనేక మంత్రాలు స్త్రీ ఔన్నత్యాన్ని విశేషంగా ప్రశంసించటంతో పాటు మహిళల్ని ఎంతో గౌరవంగా చూడాలనే బాధ్యతను పురుషులకు నిర్దేశించాయి.

- స్త్రీలు ధైర్యవంతులుగా ఉండాలి : యజుర్వేదం, 10:03
- స్త్రీలు మంచి కీర్తి గడించాలి : అధర్వణవేదం, 14:1:20
- స్త్రీలు ఉత్తమ పాండిత్యం సంపాదించాలి : అధర్వణవేదం, 11:5:18
- స్త్రీ అందరినీ జ్ఞానవంతుల్ని చెయ్యాలి : అధర్వణవేదం, 14:2:74
- స్త్రీ ఎల్లప్పుడూ సంపదలతో సుఖంగా ఉండాలి : అధర్వణవేదం, 7:4:72
- స్త్రీలు ఎల్లప్పుడూ జ్ఞానవంతులుగా, తెలివిగలవారుగా ఉండాలి : అధర్వణవేదం, 7:47:1
- పరిపాలనకు సంబంధించిన సభలు, సమావేశాల్లో స్త్రీలు కూడా పాల్గొనాలి : అధర్వణవేదం, 7:38:4
- దేశపరిపాలన, సామాజిక సంస్కరణలు, ప్రభుత్వ కార్యకలాపాలను స్త్రీలు నాయకత్వం వహించి నడిపించాలి : ఋగ్వేదం, 10:85:46
- స్త్రీలు సభను ఉద్దేశించి ప్రసంగించాలి : ఋగ్వేదం, 10:85:26
- పిత్రార్జితంలో కుమారుడితో పాటు కుమార్తెకు కూడా సమాన హక్కు ఉంది : ఋగ్వేదం, 3:31:1

పూలబావికి ఆ పేరు!

ధర్మ సందేహం



తిరుమలలోని భూతీర్థం గురించి వివరించండి?

– నవీన్, హైదరాబాద్

తిరుమల శ్రీనివాసుడు అలంకార ప్రియుడు. రకరకాల పూలతో స్వామిని అలంకరించడం చూస్తుంటాం. శ్రీహరికి సమర్పించిన తులసి, పుష్పహారాలను ప్రసాదంగా భక్తులకు ఇచ్చే సంప్రదాయం తిరుమలలో లేదు. ఆ పవిత్ర నిర్మాల్యాన్ని ఎవ్వరూ ఉపయోగించకుండా ఓ బావిలో నిమజ్జనం చేస్తారు. ఆ బావి పేరు 'పూల బావి'. దీనినే భూతీర్థం అని కూడా పిలుస్తారు. ఈ తీర్థం.. భూదేవి వల్ల ఏర్పడిందని చెబుతారు. కాలాంతరంలో ఈ తీర్థం భూమిలో నిక్షిప్తమైపోయింది. శ్రీనివాసుని ఆనతిపై రంగదాసు అనే భక్తుడు ఒక బావిని తవ్వగా భూతీర్థం మళ్లీ వెలుగులోకి వచ్చిందని స్థల పురాణం తెలియజేస్తుంది.

– జీవీ శంకరరావు

ఈనాడు సినిమా



అనుష్క

ఇంతకంటే గొప్ప ఉద్యోగమా?

సినిమా కూడా ఉద్యోగం లాంటిదేనట. ఈ మాట అంటున్నది ఎవరో కాదు... అనుష్క. 'సినిమాలాంటి గొప్ప ఉద్యోగం ఎక్కడా ఉండదు' అనేది అనుష్క మాట. 'ఎందుకలా..?' అని అడిగితే "సినిమా అంటే ఇష్టపడనివాళ్లెవరు ఉంటారు? అలాంటి ఇష్టమైన వ్యాపకంలో బతుకుతూ, జీతం లాంటి పారితోషికం తీసుకుంటూ, సకల సౌకర్యాలూ అనుభవించడం గొప్ప అదృష్టం కాకపోతే మరేంటి?" అంటోంది. "ప్రతి ఉద్యోగంలోనూ చికాకులు ఉంటాయి. నటీనటులకు అది తప్పదు. కాకపోతే... ఇక్కడ సౌలభ్యాలు వేరు. కష్టపడి ఓ స్థాయి తెచ్చుకొంటే, రాణిలా చూస్తారు. మన మాటకు ఓ విలువ ఉంటుంది. తొమ్మిది నుంచి ఆరు గంటల వరకూ ఉద్యోగం చేస్తే అలసిపోతుంటాం. సెట్లో 24 గంటలున్నా అలుపు రాదు. ఇష్టమైన వృత్తిలో ఉండే ఆనందం, సంతృప్తి వేరు" అని చెబుతోంది అనుష్క.

అమెరికాలో ఫొటో షూట్



ఎన్టీఆర్



రామ్‌చరణ్

రామ్‌చరణ్, ఎన్టీఆర్ కథానాయకులుగా రాజమౌళి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనుంది. డి.వి.వి. దానయ్య నిర్మాతగా వ్యవహరిస్తారని సమాచారం. ప్రస్తుతం స్క్రిప్టు పనులు జరుగుతున్నాయి. మరోవైపు రామ్‌చరణ్, ఎన్టీఆర్ అమెరికా వెళ్లిపోయారు. ఈ సినిమా పనుల్లో భాగంగానే. అక్కడ వీరిద్దరిపై ఫొటో షూట్ నిర్వహించబోతున్నారు. చరణ్, ఎన్టీఆర్‌తో పాటుగా రాజమౌళి తనయుడు కార్తికేయ అమెరికా బయల్దేరారు. అక్కడ రెండు రోజుల పాటు ఈ ఫొటో షూట్ సాగబోతోంది. తిరిగొచ్చాక బోయపాటి శ్రీను సినిమాతో బిజీ అవుతారు రామ్ చరణ్. త్రివిక్రమ్ సినిమా పనుల్లో పడిపోతారు ఎన్టీఆర్. ఈ రెండు చిత్రాలూ ముగిసిన తరవాతే రాజమౌళి చిత్రం ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. ఈలోగా కథానాయికలుగా కొంతమంది పేర్లు బయటకు వస్తున్నాయి. రాశీ ఖన్నా, సమంతను కథానాయికలుగా ఎంచుకున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే చిత్రబృందం మాత్రం వీటిపై స్పందించలేదు.

కొత్త పాట గురూ!

చూపుల వంతెనపై హృదయం పరుగిడెనే

చిత్రం: కృష్ణార్జున యుద్ధం, రచన: శ్రీజో
గానం: ఎల్.వి.రేవంత్, సంజిత్ హెగ్డే
సంగీతం: హిప్‌హాప్ తమిళ

పల్లవి:
కృష్ణ: నా కనులే కనని ఆ కలనే కలిసా
నీ వలనే బహుశా ఈ వరస
నా ఎదలో నలిగే ఓ ప్రశ్నే అడిగా
నే వెతికే స్నేహం నీ మనసా
ఒడ్డు చేరలేని ఈ అలే, దాటుతోంది
సాగరాలనే
ఒక్క గుండె ఇంక చాలదే, కమ్ముతుంటే
ఈ అల్లరే...
అర్జున్:
ఐ వన్నా ఫ్లై వన్నా ఫ్లై నీ సగమై సగమై
నా నిజమే ఎదురై, పిలిచినదా
లవ్ ఫీలింగ్ ఇట్ ఇన్‌సైడ్, ఈ వెలుగే
వరమై
యే కథలో వినని భావమిదా
చరణం1:
కృష్ణ: ఊహలకే సరిహద్దులు లేవని
ఈ క్షణమే తెలిసే
అందుకనే చూపుల వంతెనపై హృదయం
పరుగిడెనే
అర్జున్: వెన్నెలకన్నా చల్లని సెగతో ఫీల్ దిస్
మోమెంట్ స్వే
నీ వేకువలో వెచ్చని ఊహై ఐ విల్ మెల్ట్
యువర్ హార్ట్ అవే
ఒక ప్రాణం, అది నీదవనీ
గర్ల్ యువర్ స్మైల్, నా జగమవనీ
కృష్ణ: నా కనులే కనని ఆ కలనే కలిసా
నీ వలనే బహుశా ఈ వరస
అర్జున్:
ఐ వన్నా ఫ్లై, వన్నా ఫ్లై, నీ సగమై సగమై
నా నిజమే ఎదురై పిలిచినదా
చరణం2:
కృష్ణ: వెతికా నేనే, కన్ను నీ లోకంలో
నడిచా నీడై, ప్రతి అడుగూ నీతో
నీ తలపు విడిచే నిమిషమిక నాకెదురుపడదే
అరెరే చిలిపి మదికే తెలిసెనిక నా కలల
బరువే
అర్జున్:
ఐ వన్నా ఫ్లై, వన్నా ఫ్లై నీ సగమై సగమై
నా నిజమే ఎదురై పిలిచినదా
లవ్, ఫీలింగ్ ఇట్ ఇన్‌సైడ్ ఈ వెలుగే
వరమై
యే కథలో వినని భావమిదా



అనుపమ పరమేశ్వరన్, నాని

మాతృభాషపై ప్రేమ...పాటపై మక్కువ సరిహద్దుల్ని చెరిపేసింది. గీత రచయిత శ్రీజో ఉండేది అమెరికాలో. చేసేది సాఫ్ట్‌వేర్ ఉద్యోగం. కానీ ఆయన కలం స్వచ్ఛమైన తెలుగు భావాల్ని పలికిస్తుంది. 'సాహసం శ్వాసగా సాగిపో'లో వెళ్లిపోమాకే..., 'నిన్ను కోరి'లో అడిగా అడిగా..., 'భాగమతి'లో మందార మందార... ఇలా పలు చిత్రాల్లో గీతాల్ని రచించిన శ్రీజో ప్రస్తుతం నాని, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటిస్తున్న 'కృష్ణార్జున యుద్ధం'లో ఐ వన్నా ఫ్లై... అంటూ పాట రాశారు. ఆ పాట ప్రయాణం గురించి ఆయన చెప్పిన విషయాలివీ...

"మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన 'ఎక్స్‌ప్రెస్ రాజా'లో నేను పాట రాశా. మరోసారి ఆయన దర్శకత్వంలో పనిచేసే అవకాశం వచ్చింది. సినిమాలో నాని ద్విపాత్రాభినయం చేశారు. కృష్ణ అనే ఓ పల్లెటూరి యువకుడిగా, అర్జున్ అనే రాక్‌స్టార్‌గా ఆయన తెరపై దర్శనమిస్తారు. వారిద్దరి జీవితాలు ఓ దశలో కీలకమైన మలుపు తీసుకొంటాయి. ఆ సందర్భంలో ఇద్దరిని దృష్టిలో ఉంచుకొని ఓ పాట రాయాలన్నారు దర్శకుడు. అదే ఈ పాట. విభిన్నమైన నేపథ్యాలున్న ఇద్దరి వ్యక్తుల మదిలోని భావాల్ని ఆవిష్కరిస్తూ ఓ పాట రాయడం సవాల్‌గా అనిపించింది. కృష్ణ పల్లెటూరి యువకుడు కాబట్టి అతని కోసం అచ్చమైన తెలుగునీ... అర్జున్ రాక్‌స్టార్ కాబట్టి అక్కడక్కడ ఆంగ్ల పదాల్ని ఉపయోగిస్తూ పాట రాశా. అలాగని పాటలో ఆంగ్లం, తెలుగు వేర్వేరుగా వినపడదు. ఆంగ్ల పదాలు కూడా తెలుగు శబ్దాలకి తగ్గట్టుగా పాటలో ఇమిడిపోయేలా పాట రాశా. 'ఐ వన్నా ఫ్లై వన్నా ఫ్లై, నీ సగమై సగమై...' అంటూ సాగుతాయి పాటల్లోని పదాలు. ఏ పాట రాసినా భాష, భావంతో పాటు... శబ్దాన్నీ కీలకంగా పరిగణిస్తుంటా. అమెరికాలో ఉంటూ అన్ని రకాల పాటలు వింటుంటా. ఆంగ్ల ప్రభావం నాపై ఉంటుంది. కానీ అచ్చమైన తెలుగు మాటలతో పాటలు రాయడమే నాకు ఇష్టం. మనం ఏ భాషలో ఆలోచిస్తామో, ఆ భాషపై మక్కువ, పట్టు ఎప్పటికీ తగ్గదు. కానీ ఈ సినిమాలో రాక్‌స్టార్ ఉంటాడు కాబట్టి ఆ పాత్రకి తగ్గట్టుగా కొన్ని ఆంగ్ల పదాల్ని కలుపుకొని ఈ పాట రాశా. అరుదైన ఈ సందర్భం నాలోని రచయితకి ఓ కొత్త అనుభవాన్నిచ్చింది. నాలుగు రోజుల్లో ఈ పాటని పూర్తి చేశా. హిప్ హాప్ తమిళ సంగీతంతో పాటు రేవంత్, సంజీత్ హెగ్డే బాగా పాడారు. కథానాయకుడు నానికి ఈ పాట బాగా నచ్చిందని దర్శకుడు చెప్పారు. పాటకి ఆన్‌లైన్‌లో చక్కటి స్పందన లభిస్తోంది. ఇందులోని ప్రతి పంక్తి కూడా ఎంతో తృప్తినిచ్చింది. 'చిన్న సినిమా' అనే చిత్రంతో నా పాటల ప్రయాణం మొదలైంది. కోన వెంకట్ ప్రోత్సాహంతో 'గీతాంజలి' చిత్రానికి రాశా. ఆయనవల్లే 'సాహసం శ్వాసగా సాగిపో' చిత్రంలో పాట రాశా. ఆ తర్వాత యువీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్ ప్రోత్సహించి పలు చిత్రాల్లో పాటలు రాసే అవకాశమిచ్చారు. నేను పుట్టింది విశాఖపట్నంలో, పెరిగింది హైదరాబాద్‌లో. అమెరికాలో స్థిరపడినప్పటికీ తెలుగుపై మమకారం పెరిగిందే తప్ప, తగ్గలేదు. సిరివెన్నెల సీతారామశాస్త్రి, వేటూరి గీతాల్ని అమితంగా ఇష్టపడుతుంటా. ఆ పాటల్లోని భావాలు నన్నెంతగానో ఆలోచింపజేసేవి. అలా నాకు గీత రచనపై ఆసక్తి పెరిగింది. అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' చిత్రంలోనూ పాట రాశా'.



శ్రీజో

శివ.. హ్యాపీడేస్.. స్ఫూర్తితో!



అనిల్ సుంకర, సంయుక్తా హెగ్డే, నిఖిల్, సిమ్రాన్ పరింజ, శరణ్

నిఖిల్, సిమ్రాన్ పరింజ, సంయుక్తా హెగ్డే నాయకానాయికలుగా నటించిన చిత్రం 'కిరాక్ పార్టీ'. శరణ్ కొప్పిశెట్టి దర్శకుడు. రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఈ నెల 16న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది. కథానాయకుడు మాట్లాడుతూ "ఇది నా 15వ చిత్రం. నా హృదయానికి బాగా దగ్గరైన కొన్ని చిత్రాల్లో ఇదొకటి. తొలి సినిమా 'హ్యాపీడేస్' తర్వాత పూర్తిస్థాయి కాలేజీ నేపథ్యంతో కూడిన మరో చిత్రం చేయాలని ఉండేది. ఆ కోరిక 'కిరాక్‌పార్టీ'తో నెరవేరినందుకు ఆనందంగా ఉంది. అందరికీ నచ్చే ఓ మంచి చిత్రమిది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రతి ఒక్కరూ వాళ్ల జీవితాన్ని తెరపై చూసుకొనేలా ఉంటుందీ చిత్రం. 'శివ', 'హ్యాపీడేస్' చిత్రాల స్ఫూర్తితో కన్నడలో విజయవంతమైన 'కిరాక్‌పార్టీ'ని తెలుగు ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కించాం" అన్నారు. నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ "మార్చి 15న ఇంటర్ పరీక్షలు పూర్తవుతాయి. ఆ మరుసటి రోజే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తుండడం ఆనందంగా ఉంది. 'శివ' చూశాక అలాంటి సినిమా చేయగలనా? లేదా ? అనే ఆలోచన ఉండేది. ఆ సినిమా స్ఫూర్తితోనే ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. 'శివ', 'హ్యాపీడేస్' తరహాలో పూర్తిస్థాయి కాలేజీ నేపథ్యంతో కూడిన చిత్రమిది. శరణ్ కొప్పిశెట్టి చిత్రాన్ని బాగా తెరకెక్కించారు. చందు మొండేటి, సుధీర్‌వర్మ రచన పరంగా చక్కటి సహకారం అందించారు. సినిమా ప్రచారంలో భాగంగా ఓ పోటీని నిర్వహిస్తున్నాం. సినిమాలో ఉపయోగించిన కారుని ఈ పోటీలో గెలిచిన విజేతకి తొలి బహుమతిగా అందజేస్తాం. గురువారం నుంచే రెండు తెలుగు రాష్ట్రాల్లో టూర్ నిర్వహిస్తున్నాం" అన్నారు.

కోటికొక్కడున్నా చాలు



నిత్యామేనన్

సుదీప్, కె.ఎస్.రవికుమార్ కాంబినేషన్‌లో తమిళ, కన్నడ భాషల్లో రూపొంది విజయం సాధించిన చిత్రాన్ని నిర్మాత కల్యాణ్ ధూళిపాళ్ల 'కోటికొక్కడు'గా తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. నిత్యామేనన్ నాయికగా నటించింది. ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నిర్మాత కల్యాణ్ మాట్లాడుతూ "డబ్బులో పుట్టి పెరిగిన కొడుకు తన తండ్రి ఆ ధనం కోల్పోయినప్పుడు ఎలా ఆ డబ్బుని సంపాదించి తండ్రిని కోటికొక్కడుగా నిలిపాడనేదే ఈ చిత్రకథ. ప్రేమ, తండ్రీకొడుకుల అనుబంధం, వినోదం, యాక్షన్‌తో కె.ఎస్.రవికుమార్ చూడచక్కగా రూపొందించారు. ఐదు పాటలు, ఐదు పోరాట దృశ్యాలుంటాయి. తండ్రీకొడుకులుగా ప్రకాష్‌రాజ్, సుదీప్ నటన ఆకట్టుకుంటుంది. ఈ నెల 9న తెలుగులో విడుదల చేస్తున్నాను. ఇది తమిళ్‌లో 'ముడింజ పుడిచి పారె', కన్నడలో 'కోటిగొబ్బ' పేర్లతో విడుదలై విజయాన్ని సాధించింద'న్నారు. కార్యక్రమంలో శోభారాణి, వి.సముద్ర, బి.ఎ.రాజు పాల్గొన్నారు.

ఆట పట్టించాడు!



శివానీ

వెండితెరపై చూసుకోవాలన్న నా కలని నెరవేర్చిన చిత్రం 'ఏ మంత్రం వేసావె'. అదృష్టం కలిసిరావడంతో అవకాశం సులభంగానే లభించింది. నిజాయతీ, మంచితనం కలగలిసిన అమ్మాయి పాత్రలో కనిపిస్తా. అందరికీ చేరువయ్యే భావోద్వేగాలు నా పాత్రలో ఉంటాయి" అని చెప్పింది శివానీ సింగ్. విజయ్ దేవరకొండ సరసన 'ఏ మంత్రం వేసావె'లో నటించిన కథానాయిక ఈమె. శ్రీధర్ మర్రి స్వీయ నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని మల్కాపురం శివకుమార్ సమర్పిస్తున్నారు. చిత్రం ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా శివానీ సింగ్ బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. "కథానాయికగా నేను నటించిన తొలి చిత్రమిదే. విజయ్ దేవరకొండతో కలిసి నటించడం చక్కటి అనుభవం. చాలాసార్లు ఆట పట్టించేవాడు"అంది శివానీ. సినీ ప్రవేశం గురించి మాట్లాడుతూ "పుట్టి పెరిగిందంతా దిల్లీలోనే. అమ్మానాన్నల ప్రోత్సాహంతో మోడలింగ్‌లోకి అడుగుపెట్టాను. ఆ తర్వాత పలు ఉత్పత్తులకి ప్రచార కర్తగా వ్యవహరించా. ప్రస్తుతం కొన్ని టీవీ షోలకి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నా. రంగస్థలంతో అనుబంధం ఉండటంతో, సినిమాలపై ఆసక్తి పెరిగింది. దాంతో ముంబయిలో అడుగుపెట్టా. ఆడిషన్స్ గురించి పెద్దగా కష్టపడకుండానే 'ఏ మంత్రం వేసావె'తో తొలి అవకాశం లభించింది.



ఛరిష్మా, అరుణ్ తేజ్ పై క్లాప్‌నిస్తున్న శ్రీకాంత్

హాయ్.. హాయ్

అరుణ్ తేజ్, ఛరిష్మా శ్రీకర్ జంటగా నటిస్తున్న చిత్రం 'నీతోనే హాయ్.. హాయ్'. బి.యన్.రెడ్డి అభినయ దర్శకత్వం వహిస్తున్నారు. డా.ఎస్.కీర్తి, డా.జి.పార్థసారథి రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైందీ చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి కథానాయకుడు శ్రీకాంత్ క్లాప్‌నిచ్చారు. 'మా' అధ్యక్షుడు శివాజీరాజా కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు రేలంగి నరసింహారావు గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు మాట్లాడుతూ "మధ్య తరగతి మనస్తత్వాలు, మానవత్వం నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. ఒక అందమైన ప్రేమకథకి, వాణిజ్యాంశాల్ని మేళవించి రూపొందిస్తున్నామ"న్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "దర్శకుడు తయారు చేసిన కథ బాగుంది. అనుభవమున్న ఆయన ఒక మంచి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారనే నమ్మకం మాకుంద"న్నారు. సంగీతం: రవి కల్యాణ్, సమర్పణ: యలమంచిలి ప్రవీణ్.

పంచ్ డైలాగ్

కన్నబిడ్డలను సరిగా చూడలేనివాడు తండ్రి కాదు.. అందరికీ అన్నం పెట్టలేని వాడు దేవుడు కాదు. - **రాయలసీమ రామన్న చౌదరి,**
పంపినవారు: రాజు, రాజోలు

సంజయ్‌కు ఆస్తి రాసిచ్చిన అభిమాని



సంజయ్ దత్

సినీ తారల వీరాభిమానులు తమ అభిమానాన్ని చాటుకోవడానికి కొన్నిసార్లు విచిత్రమైన చర్యలకు పాల్పడుతుంటారు. అభిమాన తారల పేర్లను టాటూ వేయించుకోవడం దగ్గర్నుంచి వారికి గుడి కట్టడం వరకూ అలాంటివెన్నో వినే ఉంటారు. అయితే బాలీవుడ్ కథానాయకుడు సంజయ్ దత్‌ను ఆరాధించే ఓ మహిళాభిమాని చేసిన పని మాత్రం ఆయనతో పాటు అందరూ విస్తుపోయేలా చేసింది. తన పేరిట ఉన్న ఆస్తినంతా తన అభిమాన కథానాయకుడికి చెందేలా వీలునామా రాసింది. ముంబయికి చెందిన నిషి త్రిపాఠి అనే మహిళకు సంజయ్‌దత్ అంటే ఎనలేని అభిమానం. 62 ఏళ్ల వయసులో ఆమె అనారోగ్యంతో గత జనవరి 29న కన్నుమూసింది. అయితే ఆ తర్వాతి రోజే ఓ ఆశ్చర్యకరమైన విషయం తెలిసింది. ఆమె ఖాతాలో ఉన్న నగదుతో పాటు లాకర్‌లో ఉన్న విలువైన వస్తువులు సంజయ్ దత్‌కు దక్కేలా మరణించడానికి కొన్ని నెలల క్రితమే వీలునామా రాసినట్లు తేలింది. "ఈ విషయాన్ని బ్యాంకు అధికారుల ద్వారా తెలుసుకున్న సంజయ్ షాక్‌కు గురయ్యారు. తనపై ఆమెకున్న అభిమానాన్ని చూసి ఆశ్చర్యపోయారు. అయితే ఆ ఆస్తిని తీసుకోవడానికి అంగీకరించలేదు. ఆమె కుటుంబ సభ్యులకే ఆ ఆస్తి చెందేలా చేయడానికి సహకారం అందిస్తున్నార"ని సంజయ్ వ్యక్తిగత న్యాయవాది సుభాష్ జాదవ్ వెల్లడించారు. ఈ విషయం విన్నవారంతా ఓ నటుడిపై మరీ ఇంత అభిమానముంటుందా అని నివ్వెరపోతున్నారు.

ప్రేమ..భావోద్వేగాలు



ఆండ్రియా

అంజలి, ఆండ్రియా, వసంత్ రవి ప్రధానపాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'తారామణి'. రామ్ దర్శకుడు. ఈ సినిమాను అదే పేరుతో డి.వెంకటేష్ తెలుగులోకి తీసుకువస్తున్నారు. ఈ చిత్రంలోని తొలి గీతాన్ని హైదరాబాద్‌లో ప్రముఖ గాయని, సంగీత దర్శకురాలు యం.యం.శ్రీలేఖ చేతులు మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "తమిళంలో విజయవంతమైన ఈ చిత్రాన్ని తెలుగులోకి తీసుకురావడం ఆనందంగా ఉంది. 'తారామణి' నేను చూశా. మహిళలు కష్టాలను, కుటుంబ సమస్యలను ఎదుర్కొని వాటిని అధిమిస్తున్న తీరును ఇందులో చక్కగా చూపించారు. ప్రేమ, భావోద్వేగాలు అన్ని కలిసి ఉన్న సినిమా. యువన్ శంకర్‌రాజా చక్కటి పాటలు అందించారు. తెలుగులోనూ విజయవంతం కావాలని కోరుకుంటున్నా" అన్నారు.

ఆ ఊరిలో ఏం జరిగింది?

అశోక్ కుమార్, ప్రియాంక శర్మ జంటగా నటించిన చిత్రం 'అనగనగా ఒక ఊళ్లో'. సాయికృష్ణ కెవి దర్శకుడు. కె.చంద్రరావు నిర్మాత. హైదరాబాద్‌లో పాటలు విడుదలయ్యాయి. దర్శకుడు మాట్లాడుతూ "పల్లెటూరి నేపథ్యంలో సాగే కథ ఇది. రాజోలు పరిసర ప్రాంతాల్లో తెరకెక్కించాం. యాజమాన్య అందించిన బాణీలు ఆకట్టుకుంటాయి. ఈనెలలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు. సుమన్, బెనర్జీ, పృథ్వీ, మహేష్ వర్మ తదితరులు నటించారు.



ప్రియాంక, అశోక్

కొత్త సంస్థల్ని ఆహ్వానించాలి

'చిత్ర పరిశ్రమకి చెందిన కొద్దిమంది వ్యక్తుల ప్రమేయంతోనే డిజిటల్ సంస్థలు ఇష్టానుసారంగా ఛార్జీలు వసూలు చేసే పరిస్థితి వచ్చింది. ఇప్పుడు ఇంత శాతం తగ్గించండి అంటూ ఆ సంస్థలతో బేరసారాలు సాగించాల్సిన అవసరం లేదు. కొత్త డిజిటల్ సంస్థల్ని ఆహ్వానించి కొత్తగా ఒప్పందం చేసుకొంటేనే పరిశ్రమకి లాభం చేకూరుతుంది" అన్నారు నిర్మాత నట్టికుమార్. థియేటర్ల ప్రదర్శనల నిలిపివేత గురించి ఆయన బుధవారం హైదరాబాద్‌లో మాట్లాడుతూ "ఆరు రోజులుగా ప్రదర్శనల్ని నిలిపివేయడంతో చిన్న నిర్మాతలు, ప్రదర్శనకారులు తీవ్రంగా నష్టపోయారు. క్యాంటిన్, పార్కింగ్ దగ్గర పనిచేసే కార్మికులు జీవనాధారాన్ని కోల్పోయారు. కొత్త సంస్థల్ని ఆహ్వానించడంపై పరిశ్రమ పెద్దలు త్వరగా ఓ నిర్ణయం తీసుకోవాలి" అన్నారు.



నట్టికుమార్

షకీలాగా రిచా

శృంగార తారగా 90ల్లో మలయాళ చిత్ర పరిశ్రమను ఏలిన నటి షకీలా. కేరళలోనే కాకుండా తెలుగు, తమిళ, కన్నడ భాషల్లోనూ గుర్తింపు సాధించారామె. ఇప్పుడు ఆమె జీవిత కథ వెండితెరకు రాబోతుంది. ఇంద్రజిత్ లంకేష్ దర్శకత్వం వహించనున్నారు. వెండితెరపై షకీలా పాత్రలో బాలీవుడ్ భామ రిచా చద్దా నటించనుంది. "షకీలా జీవిత కథతో ఈ చిత్రం తెరకెక్కనుంది. 90ల్లో మలయాళీ చిత్ర పరిశ్రమను ఏలిన తార షకీలా. ఆసియా వ్యాప్తంగా ఆమెకు అభిమానులున్నారు. షకీలా జీవిత కథ చాలా ఆసక్తికరం. వచ్చే నెల్లో సెట్స్‌పైకి తీసుకెళ్లడానికి సన్నాహాలు జరుగుతున్నాయి "అని రిచా సన్నిహిత వర్గాలు చెప్పాయి.



రిచా చద్దా

ఆడపిల్లకు చదువెందుకు దండగ అన్నారు.
ఉద్యోగాలు చేయాలా? ఊళ్లేలాలా? అన్న
సమాజాన్ని దాటొచ్చారు!
ఉద్యోగాలు చేస్తామంటే పాఠాలు చెప్పే
పంతులమ్మ కొలువైతే తప్ప ఒప్పుకోమన్నారు.
అనుక్షణం అనుమానిస్తూనే ఉద్యోగానికి
పంపించిన రోజుల్నీ చూసొచ్చారు.
ఇలా ఒక్కో కంచె దాటుతూ అచంచలమైన
ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసుకున్నారు మహిళలు.
అన్ని రంగాల్లోనూ అగ్రతాంబూలం
అందుకుంటున్నారు.
మగాళ్లు అడుగేయడానికి ఆలోచించే కొలువుల్లో
చేరి.. దూసుకుపోతున్నారు.
యుద్ధ విమనాలు నడుపుతున్నారు.
అటవీ అధికారులుగా క్రూరమృగాలకు
కాపుకాస్తున్నారు.
నేర పరిశోధనలో వీర విహారం చేస్తున్నారు.
నావికాదళంలోనూ సత్తా చాటుతున్నారు.
విభిన్న రంగాల్లో నారీ భేరీ మోగిస్తున్నారు.
ఇంతుల విజయం ఇంతింత కాదయా అని
నిరూపిస్తున్న స్త్రీ మూర్తుల అనుభవాలు
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా...



గాజు తెరల్ని ఛేదించారు!



ఆకాశంలో 'అవని'



దేశంలో 'మిగ్ 21 బైసన్ 'యుద్ధవిమానాన్ని నడిపిన తొలి భారతీయ మహిళ అవనీ చతుర్వేది. ఈమె మధ్యప్రదేశ్, షాడోల్ జిల్లా, డియోల్యాండ్ అనే చిన్న పట్టణంలో ఉన్నత విద్యాభ్యాసాన్ని పూర్తిచేసింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఫైటర్ స్క్వాడ్రన్‌లో తొలి మహిళా పైలట్ బ్యాచ్‌లో ఎంపికై, హైదరాబాద్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శిక్షణ తీసుకుంది. టేబుల్ టెన్నిస్, చెస్ లాంటివాటిపై ఆసక్తే కాదు, చిత్రలేఖనంలోనూ అనుభవం అవని సొంతం. అన్న ఆర్మీ ఆఫీసర్ కావడంతో దానిని స్ఫూర్తిగా తీసుకున్న అవని చిన్నవయసు నుంచీ ఆర్మీలో ఉద్యోగం చేయాలనుకుంది. విమానం నడపాలనే ఆసక్తితో, కాలేజీ రోజుల్లో ఫ్లైయింగ్ క్లబ్‌లో చేరింది. ఆ అనుభవంతోనే యుద్ధవిమానాలను నడిపితే ఎలా ఉంటుందని అనుకుంది. అలాంటి అవకాశాన్ని అందుకోవాలనుకుంది. అలా శిక్షణ వైపు వెళ్లింది. 'మంచి ఫైర్ ఫైటర్ కావాలనేది నా కోరిక. ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటా. మహిళలకు ఈ తరహా ఉద్యోగం ఒకవిధంగా సాహసమే. కానీ నేను దీన్ని ఓ సవాలుగా తీసుకున్నా. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకుంటూ, నన్ను నేను మెరుగుపరచుకోవాలనుకుంటున్నా. దేశరక్షణలో నేను కూడా ఒక భాగం కావడం నిజంగా గర్వకారణమే కదా.. ఇంతకు మించిన ఆనందం ఇంకేం ఉంటుంది చెప్పండి..' అంటున్న అవని ఈ రంగంలోకి రావాలనుకునే ఎందరో మహిళలకు నిజంగా స్ఫూర్తిదాయకమే.

అబద్ధాలు పసిగడతారు

ఫోరెన్సిక్ విభాగంలో ఉద్యోగాలు చేసే మహిళల సంఖ్య చాలా తక్కువ. అలాంటి విభాగంలో చేరి తన సత్తా చాటుకున్నారు అనితా ఎవాంజలీన్. ప్రస్తుతం పోలీస్ అకాడమీలో ఫోరెన్సిక్ విభాగాధిపతిగా ఉన్నారామె. ప్రొఫెసర్‌గా మారి అక్కడ విద్యార్థులకు తన పాతికేళ్లకు పైగా అనుభవాన్ని రంగరించి పాఠాలు చెబుతున్నారు. ఈ వృత్తిలోకి రాకముందు కూడా ఉపాధ్యాయినిగా పనిచేసిన అనుభవం అనితది. టీచర్‌గా పనిచేస్తున్నా కూడా తనది సైన్స్ నేపథ్యం కావడంతో ల్యాబులూ, టెస్టులపై ఆసక్తి ఉండేది. ఆ తరువాత ఫోరెన్సిక్ విభాగంలో కూడా డిగ్రీలు పూర్తిచేశారు. అందుకే ఇందులో ఉద్యోగం రాగానే ఏ మాత్రం ఆలోచించకుండా చేరిపోయారు. అప్పటికే అబ్బాయిల ఆధిపత్యం ఉన్న రంగం అది! అందులోనూ తనకంటూ ఒక ప్రత్యేకతా, గుర్తింపూ ఉండాలన్న తపనతో కష్టపడ్డారు. ఒకానొక సమయంలో నాలుగునెలల బిడ్డతో వేరే ప్రాంతానికి బదిలీమీద వెళ్లాల్సి వచ్చినా వెనుకంజవేయలేదు. 'నా వల్ల ఈ పని కాదు. మహిళైనంత మాత్రానా నాకు ప్రత్యేక వెసులుబాటు అవసరం లేదు' అనే ఆలోచన ఆవిడది.



ఫోరెన్సిక్ విభాగంలో వీఐపీ డ్యూటీ ఉంటుంది. ప్రధానమంత్రీ, రాష్ట్రపతి లాంటివారు వచ్చినప్పుడు వాళ్లకు పెట్టబోయే ఆహారానికి పరీక్ష చేసే విభాగం అది. 'దాంట్లో కేవలం అబ్బాయిలనే నియమించడం ఎందుకూ, నేనూ ఆ డ్యూటీ చేయగలుగుతా' అని అడిగి మరీ ఆ విభాగంలో పనిచేశారామె. అప్పటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు హైదరాబాద్ వచ్చినప్పుడు ఫుడ్ ఫోరెన్సిక్ విభాగంలో తన బాధ్యతలు నిర్వహించి అందరి ప్రశంసలూ అందుకున్నారు. ఇలా ఎప్పటికప్పుడూ మనోధైర్యంతో ముందడుగు వేస్తూ ఎందులోనూ తిరుగులేదని నిరూపించుకున్న ఆమెకు హ్యాట్సాఫ్!

ఇది తరణీ విజయం



దేశంలోనే తొలి మహిళానావికాదళంగా గుర్తింపు తెచ్చుకుందీ బృందం. ప్రపంచాన్ని చుట్టి రావడానికి ఐఎన్ఎస్‌వీ తరిణి నౌకలో బయలుదేరిన ఈ ఆరుగురు మహిళల బృందం ఎనిమిది నెలలపాటు సముద్రయానం చేసింది. లెఫ్టినెంట్ కమాండర్ వర్తికా జోషి నేతృత్వంలో బయలుదేరిన ఈ బృందంలో లెఫ్టినెంట్ కమాండర్ ప్రతిభాజామ్వాల్, పి.స్వాతి, బొడ్డపాటి ఐశ్వర్య, విజయాదేవి, పాయల్‌గుప్తా ఉన్నారు. ఇండియన్, పసిఫిక్, అట్లాంటిక్ సముద్రాల మీదుగా 21,600 నాటికల్ మైళ్ల దూరం నౌకపై ప్రయాణం చేసి, లోకం చుట్టిన తొలి మహిళలుగా వీళ్లు అరుదైన గుర్తింపు తెచ్చుకున్నారు. గతేడాది సెప్టెంబరు 10న గోవా నుంచి రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ లాంఛనంగా ప్రారంభించిన వీరి ప్రయాణం, ఆస్ట్రేలియా లోని ఫ్రెమెన్‌టెల్, న్యూజిల్యాండ్‌లోని లిటిల్‌టాన్, ఫాక్‌ల్యాండ్స్‌లోని పోర్టు స్టాన్లీ ప్రాంతాల మీదుగా సాగి, చివరిగా దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌కు ఈ నెల 14వ తేదీకి చేరనుంది. అలాగే రానున్న ఏప్రిల్‌లో తిరిగి గోవాకు చేరుకుని ఆ సాహస ప్రయాణాన్ని పూర్తి చేయనున్నారు. తాము చేసిన సముద్రప్రయాణం, అలాగే ఈ సాహసంపై ప్రపంచవ్యాప్తంగా అవగాహనను అందించడమే తమ లక్ష్యమంటారు ఈ సాహస వనితలు.

పులులకు ఎదురెళ్తారు!

అడవిలో దారితప్పి ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఎదురుగా నోట్లో ఒక అడవి పందిని పట్టుకున్న పులి కనబడితే... పులుల గణన కోసం అడవిలోకి వెళ్లినప్పుడు... ఏకంగా మూడు పిల్లలతో దర్జాగా విహరిస్తున్న పులి ఆమడ దూరం నుంచి వెళ్తే...ఇవన్నీ అటవీశాఖలో పనిచేస్తున్న మహిళలు నిత్యం ఎదుర్కొనే సంఘటనలు.



అడవి పేరు వింటేనే... ఏదో తెలియని భయం. మరి పులులూ, చిరుతలూ, ఎలుగుబంట్లు వంటి క్రూర మృగాలు ఉన్నాయంటే... అడవిని దోచుకు తినే స్మగ్లర్లు పొరపాటునో, గ్రహపాటునో తిరుగుతుంటే... ఎవరైనా అటు వైపు వెళ్తారా... కానీ ఈ మహిళల ఉద్యోగం అడవిలోనే. వీళ్ల పని నల్లమల అడవుల పరిరక్షణ. స్మగ్లర్లూ, వేటగాళ్ల దాడులతో అటవీ పరిరక్షణ దినదిన గండంగా మారినా మొక్కవోని ధైర్యంతో విధులు నిర్వహిస్తున్నారు. అడవులు వన్యప్రాణుల సంరక్షణలో తమ వంతు పాత్ర నిర్వహిస్తూ రాణిస్తున్నారు. అటవీ శాఖలో క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించేందుకు 2008 నుంచి ప్రభుత్వం మహిళలకు అవకాశం కల్పించింది. ఇప్పుడు ఎన్ఎస్‌టీఆర్ పరిధిలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లోని అటవీ పరిరక్షణా విధుల్లో దాదాపు 50 మందికి పైగా మహిళలు ఆ అవకాశాన్ని సొంతం చేసుకున్నారు. క్రూర మృగాలను ప్రత్యక్షంగా చూసే అవకాశం రావడం ఓ జ్ఞాపకం అంటారు వీళ్లు. అటవీ హద్దుల్లో తిరగడం, పులుల గణన, వాటి పాదముద్రలు సేకరించడం, వన్యప్రాణుల సంరక్షణ... భూ ఆక్రమణలు, తవ్వకాలు, చెట్ల నరికివేత గుర్తించి సంరక్షించడం వీరి ప్రధాన విధులు. రోజూ అడవి మొత్తం తిరిగి ఓ నివేదిక అందించాలి. 'విధుల్లో చేరిన కొత్తలో స్మగ్లర్లు మా కళ్లముందే ఎడ్ల బండ్లమీద వెదురు దుంగలను తీసుకెళ్తే ఏమీ చేయలేక భయంతో ఉండిపోయేవాళ్లం. అలాంటిది ఇప్పుడు చిన్న పుల్ల కూడా మా కంటిని దాటి అడవి నుంచి బయటికి వెళ్లనివ్వం. అదే దీక్షతో ధైర్యంగా పని చేస్తున్నాం.. .' అంటారా అమ్మాయిలు.

మహిళా సాధికారతతోనే మార్పు



సాధించాలన్న తపనకు విలువలూ, అంకితభావం తోడైతేనే...విజయం సాధ్యమవుతుందంటారు మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్. రామోజీ ఫిల్మ్‌సిటీలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో మహిళా ఉద్యోగినులను ఉద్దేశించి మాట్లాడారు.

మన దేశం చాలా భిన్నమైనది. అలానే పురుషాధిక్యత కలిగింది కూడా. మాటల్లో చెప్పేటప్పుడు అమ్మాయిల్ని దేవతలతో పోల్చి చూస్తారు కానీ కుటుంబం, సమాజం కూడా ఇంకా చిన్న చూపు చూడటం మానలేదు. అభివృద్ధి సాధించాలి అంటే అది మహిళలతోనే సాధ్యమవుతుందని నేను నమ్ముతాను. లింగవివక్ష, అమ్మాయిలపై అఘాయిత్యాలు వంటి సామాజిక రుగ్మతలు రూపు మాపాలి. సమాన విద్య అందించాలి. ఆధునిక సమాజంలో మహిళలు అన్నిరంగాల్లోనూ దూసుకెళ్తూ తమని తాము నిరూపించుకుంటున్నారు. ఈ క్రమంలో మహిళలు మార్పుని అంగీకరించగలగాలి. ఆ సమయంలో అటు విధుల్నీ, ఇటు కుటుంబ బాధ్యతల్నీ సమన్వయం చేసుకోవడమే ఆమె ముందున్న అసలైన సవాల్. కుటుంబం, ఉద్యోగం సమన్వయం చేసుకునే క్రమంలో దేనికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలో తెలిస్తే అనుకున్నది సాధించడం కష్టమేం కాదు. అప్పుడే ఒత్తిడినీ అధిగమించొచ్చు.

లక్ష్యం అనేది మన జీవితంలో చాలా ముఖ్యమైనది. అది స్పష్టంగా ఉండాలి. దానికోసం నిరంతరం పనిచేయగలగాలి. అలానే ఫలితం ఏది వచ్చినా పనిలో మార్పు లేకుండా కొనసాగగలగాలి. అప్పుడే అమ్మాయిలు తామనుకున్నదాన్ని సాధించగలుగుతారు. 'ఒక పని గురించి చెప్పాలంటే పురుషులకు చెప్పండి. అదే ఆ పని పూర్తవ్వాలంటే మాత్రం మహిళకి చెప్పండి...' అంటూ మార్గరేట్ థాచర్ చెప్పిన మాటే అమ్మాయిల శక్తి సామర్థ్యాలను చెబుతోంది. ఆధునిక మహిళలు ఇప్పుడు అన్నింటా అడుగులేస్తున్నారు. ఉన్న అవకాశాలను ఉపయోగించుకుంటూ అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నారు. రెండు పదులు దాటకుండానే తామెంచుకున్న కెరీర్‌లో స్థిరపడుతున్నారు. అయితే నేటి యువతరాన్ని పక్కదారి పట్టించడానికి బోలెడు ప్రతిబంధకాలు కూడా చుట్టూ ఉన్నాయి. వాటిల్లో టీవీలూ, వీడియోలు, సోషల్‌మీడియా వంటివెన్నో. వాటికి దూరంగా ఉండగలగాలి. అనవసరమైన, సమయం వృథా చేసే వ్యాపకాలను వదిలించుకోవడం మంచిది. భయాలను పోగొట్టుకోవాలి. అప్పుడే తామెంచుకున్న రంగంలో నిలదొక్కుకోగలుగుతారు. కాలం చాలా విలువైనది దాన్ని వృథాకానివ్వకుండా చేసుకుంటే మీరనుకున్నది చేయొచ్చు.

కొందరు వ్యక్తులు ఎప్పుడూ ప్రతికూలంగానే ఆలోచిస్తారు. అలాంటివారికి దూరంగా ఉండండి. ఒకరిమీద చెప్పడం, ప్రతిదీ ఫిర్యాదు చేయడం వంటివన్నీ మీ ఆలోచనలపై ప్రతికూల ప్రభావం చూపించేవే. అలాంటివారికి వీలైనంత దూరంగా ఉండి, మిమ్మల్ని ప్రోత్సహించేవారినే మీ చుట్టూ ఉంచుకోవాలి. అయితే ఇతర రంగాలతో పోల్చితే.. వ్యాపారం కొంత భిన్నమైనది. 'మార్గదర్శి' తోడుంటే ఆనందం మీ వెంట ఉంటుందనే నమ్మకం కలిగించాం కాబట్టే ఈ స్థాయికి చేరుకోగలిగాను. ఈ క్రమంలో మా పిల్లలూ, కుటుంబం తోడ్పాటు కూడా ఎంతో ఉందని గర్వంగా చెబుతా...

ఆ దేశాల్లో చట్టాలు మహిళల నేస్తాలు!

మనదేశంలో లింగవివక్షా, గృహింసా, భ్రూణహత్యలు.. ఇలా పలు రకాల సమస్యలు మహిళలు సాధికారత సాధించే క్రమంలో ముందర కాళ్ల బంధంగా మారుతున్నాయి. ప్రపంచంలో కొన్ని దేశాలు మాత్రం ఆడవారిని అందలం ఎక్కించే దిశగా కొన్ని చట్టాలను చేశాయి. ఇదిగో చదవండి.. ఒక్కో దేశానిదీ ఒక్కో తీరు!



ఫిన్‌ల్యాండ్: ఈ దేశంలో సమానత్వ హక్కు చట్టం ఉంటుంది. ప్రతి విషయంలోనూ పురుషులతో సమానంగా మహిళలకీ హక్కులుంటాయి. భార్యాభర్తలు ఉద్యోగులైతే.. పిల్లల సంరక్షణ కోసం మగవారికీ సెలవులు ఉంటాయి. కేవలం ఆడవారికే ఆ బాధ్యత వదిలేయకుండా వారూ చూసుకోవాల్సి ఉంటుంది. కాలేజీ, ఆఫీసూ.. ఇలా ప్రతిచోటా సమాన హక్కులు ఉంటాయి. వాటికోసం పోరాడేందుకు నిత్యం అవగాహన కూడా కల్పిస్తుంటుంది ప్రభుత్వం.

స్వీడన్: అత్యధికంగా మాతృత్వ సెలవులు ఇస్తోన్న దేశమిది. ప్రసవానంతరం 69 వారాల పాటు వేతనంతో కూడిన సెలవులు వస్తాయక్కడ. పైగా ప్రభుత్వ రంగంలో పనిచేసేవారైతే తమ భర్తకీ ఆ సెలవులు పంచొచ్చు. అందుకే అక్కడ ఉద్యోగం చేసే మహిళల సంఖ్య 77శాతంగా ఉంది.

యూకే: మహిళల్ని బాధించే సమస్యల్లో ప్రసవ మరణాలు ఒకటి. యూకేలో ఈ శాతం చాలా స్వల్పంగా ఉంటుంది. ఎందుకంటే మహిళల ఆరోగ్యంపట్ల చాలా అప్రమత్తంగా ఉండేలా ప్రభుత్వాధికారులు జాగ్రత్తలు తీసుకుంటారు.

ఆస్ట్రేలియా: రంగం ఏదైనా కావచ్చు ఈ దేశంలో అన్ని రంగాల్లోనూ మహిళలు అగ్రస్థానంలో కనిపిస్తారు. లింగవవిక్ష అనేపదానికి అక్కడ తావులేకపోవడమే కారణం.

ఐస్‌ల్యాండ్: మహిళల్ని గౌరవించడంలో మొదటిస్థానం ఐస్‌ల్యాండ్‌ది. అంతర్జాలంలో ప్రోనోగ్రఫీని పూర్తిగా నిరోధించడంలో సఫలమైంది. సినిమాల విషయంలోనూ సెన్సార్ బోర్డు పక్కాగా పనిచేస్తుంది. మహిళల్ని అసభ్యంగా చిత్రీకరించే ఎలాంటి వీడియోకీ వెండితెరమీద తావుండదక్కడ. అంతేకాదు పార్లమెంట్‌లోని సగం సీట్లు మహిళకే కేటాయిస్తారు.

అంకెల్లో మనం



మన దేశంలో వివిధ ఉద్యోగాల్లో ఉన్న మహిళల శాతం, వారి వేతనాల్లో ఉన్న భేదాల వివరాలు చూస్తే...

- ఒక సంస్థనూ, వ్యవస్థను నడిపే రంగంలో కేవలం 1 నుంచి 3 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు.
- రాజకీయ పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వాళ్లు మొత్తంగా కేవలం 9 శాతం మాత్రమే ఉన్నారు.
- ఇప్పటికీ కేవలం 7 శాతం మహిళలు మాత్రమే పౌరసేవల విభాగంలో ఉద్యోగాలు చేస్తున్నారు.
- గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే మహిళలకు పురుషులు అందుకునే వేతనంలో అరవైశాతం మాత్రమే అందుతోంది. పట్టణ ప్రాంతాల్లో ఉన్న మహిళల వేతనాల్లో కూడా ఈ వ్యత్యాసాలున్నాయి.
- ఉద్యోగాలు చేస్తున్న గ్రామీణ మహిళల్లో 89.5 శాతం మంది వ్యవసాయం, పరిశ్రమల రంగంలోనే ఉండటం గమనార్హం.
- ఏదైనా సంస్థ బోర్డు సభ్యుల్లో ఉండే మహిళలు 7.7 శాతం మాత్రమే. అది కూడా సాంకేతికతా, మీడియా, టెలీకమ్యూనికేషన్ రంగాల్లో వీరిసంఖ్య ఎక్కువగా ఉంది.

ఈ సేవలు మనకే

అత్యాచారం, నిర్లక్ష్యం, నిరాదరణ, వివక్ష... అన్నీ మన చుట్టూ ఉండే మహిళలకు ఎప్పుడో ఒకప్పుడు ఎదురయ్యే సమస్యలే.

ఇలాంటి పరిస్థితుల్లో మహిళా సాధికారత, స్వేచ్ఛ.. సాధ్యమేనా...? అందరికీ కాకపోవచ్చు కానీ... మా దృష్టికి వస్తే గనుక.. ఏదో ఒకవిధంగా సాయం చేస్తాం... చేయూత అందిస్తాం అని చెబుతున్నాయి కొన్ని స్వచ్ఛంద సంస్థలు.

మై ఛాయిసెస్: మహిళా సాధికారతా, ఉపాధి, ఆర్థికస్వేచ్ఛతో జీవించడానికి తగిన అవకాశాలను, ఆదరణ అందించే దిశగా కృషి చేస్తుందీ సంస్థ. హైదరాబాద్‌లో మూడేళ్లక్రితం ప్రారంభమైన ఈ సంస్థ ఇప్పటివరకూ వందలాదిమంది మహిళలు, చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపింది. మహిళల ఉపాధి దిశగా తోడ్పాటు అందించడమే కాదు, బాల్యవివాహాలూ, లైంగిక వేధింపులూ, గృహహింస, వ్యభిచారవృత్తిలో కూరుకుపోయినవారికీ సాయం చేస్తుంది. మేమున్నామంటూ భరోసా కల్పిస్తోంది. ప్రస్తుతం మూడు కేంద్రాల నుంచి పనిచేస్తోందీ సంస్థ.

'లాయర్స్ కలెక్టివ్: నిరుపేద మహిళలూ, చిన్నారులకు చట్టపరమైన చేయూతను ఉచితంగా అందించే దిశగా దేశరాజధానిలో ప్రారంభమైందే 'లాయర్స్ కలెక్టివ్'. ఇందులో న్యాయవాదులూ, చట్టపరంగా సలహాలిచ్చే నిపుణులూ, మానవహక్కుల సంఘం కార్యకర్తలు ఉంటారు. చట్టపరంగా మహిళలకు ఎదురయ్యే సమస్యల్ని ఆన్‌లైన్‌ద్వారా పరిష్కరిస్తారు వీళ్లు.

అభయ: మానసికంగా దృఢంగా ఉన్న మహిళ తన కోసం తాను నిలబడుతుంది. అదే ధైర్యం ఇతరుల్లోనూ నింపాలనే ఉద్దేశంతో ఏర్పాటైందే అభయ. మహిళకు ఆర్థిక స్వేచ్ఛ ఆమె జీవితంలో వెలుగులు నింపుతుందనే అంశానికి ప్రాధాన్యమిచ్చి ఆ దిశగా కృషి చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మహిళలకు ఆర్థిక చేయూత, అలాగే చదువుకు దూరమైన నిరుపేద చిన్నారులు చదువుకునేలా చేయడం ఈ సంస్థ ప్రధాన ఉద్దేశం. సొంతవారి నిరాదరణకు గురయ్యే వృద్ధులకు నీడనందిస్తోంది. కుట్టు మిషను నుంచి ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో మహిళలకు శిక్షణనందించి ఉపాధి కల్పిస్తోంది. అలాగే చిరు వ్యాపారాలు చేసుకోవడానికి మహిళలకు రుణాలనూ ఇప్పిస్తోంది. మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది.

ఉద్యోగిని: ఈ సంస్థ పూర్తిగా నిరుపేద, నిరక్షరాస్యులైన మహిళల కోసం పనిచేస్తుంది. వాళ్లకు రకరకాల నైపుణ్యాలు నేర్పించి, వాళ్లకాళ్లపై వాళ్లు నిలబడేలా చేయూత అందిస్తుంది. అందుకోసం అవసరమైన నైపుణ్యాలు నేర్పించడం, ఆసక్తి ఉన్న రంగంలో వ్యాపారం చేసేలా రుణాలు ఇచ్చి ప్రోత్సహించడం, మార్కెటింగ్ నైపుణ్యాలు పెంచడం, నిపుణుల సలహా ఇప్పించడం.. ఇలా ఎన్నో చేస్తోంది. దిల్లీలో ప్రారంభమైన ఈ సంస్థ ప్రస్తుతం ఐదు రాష్ట్రాల్లో పనిచేస్తోంది. రాబోయే రెండేళ్లలో దాదాపు లక్షమంది మహిళలకు ఉపాధి కల్పించడమే ఈ సంస్థ ప్రధాన ఉద్దేశం.

విమెన్ ఆన్ వింగ్స్: పేదరికం కారణంగా ఎంతోమంది భారతీయ మహిళలూ, అమ్మాయిలు వ్యభిచారం, బాల్యవివాహాలకు బలి అవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అలాంటి మహిళల్ని గుర్తించి వారికి ఏదో ఒకవిధంగా ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటైందే ఈ సంస్థ. అలా ఇప్పటివరకూ లక్షా ఎనభైరెండువేలమందికి ఉపాధి అవకాశాలు కల్పించి, వాళ్ల జీవనవిధానాన్నే మార్చేసింది.

చదువు

ఈనాడు హైదరాబాద్ గురువారం మార్చి 8, 2018 ■ e-mail: edc@eenadu.in



నాణ్యమైన ఫార్మా కోర్సులకు నైపర్

సైన్స్ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో అంతే స్పీడుతో కొత్త కొత్త వ్యాధులూ పుట్టుకొస్తున్నాయి. వాటి నివారణకు ఔషధాలను కనిపెట్టడం ఎప్పటికప్పుడు సవాలుగా మారుతోంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఫార్మా పరిశ్రమ రోజురోజుకీ విస్తరిస్తూనే ఉంది. మనదేశంలో కూడా ఈ పరిశోధనలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఇందుకు కావాల్సిన నిపుణుల అవసరాలూ పెరుగుతున్నాయి. ఈ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జాతీయ ఫార్మాస్యూటికల్ విద్య, పరిశోధన సంస్థలను నెలకొల్పింది. అవి పలు రకాల కోర్సులను అందిస్తున్నాయి. వాటిని పూర్తి చేసినవారి కోసం ఎన్నో ఉద్యోగావకాశాలు ఎదురుచూస్తున్నాయి.



మనదేశం ఫార్మా పరిశోధనలకు పెద్ద పీట వేసింది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ రిసెర్చ్‌లు ఎక్కువగానే జరుగుతున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల దాదాపు 200కు పైగా ఫార్మా కంపెనీలు ఉన్నాయి. బల్క్‌డ్రగ్‌కు భాగ్యనగరం కీలక కేంద్రం. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న వ్యాక్సిన్లలో సుమారు 33 శాతం ఒక్క హైదరాబాద్‌లోనే తయారవుతున్నాయి. ఆఫ్రికా దేశాలకు తక్కువ ధరకే వ్యాక్సిన్లను అందిస్తున్న ఘనత కూడా మనదే. ఈ నేపథ్యంలో ఫార్మారంగంలో పెరుగుతున్న ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోడానికి అవసరమైన పలు పీజీ, పీహెచ్‌డీ కోర్సులను ఆఫర్ చేస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (నైపర్) గురించి తెలుసుకుందాం.

జాతీయ ప్రాధాన్య సంస్థగా గుర్తింపు పొందిన నైపర్ వివిధ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీతోపాటు, పీహెచ్‌డీలను కూడా అందిస్తోంది. దీని మొదటి కేంద్రాన్ని పంజాబ్‌లోని మొహాలీలో ఏర్పాటు చేశారు. తర్వాత అహ్మదాబాద్, కోల్‌కతా, గువాహటి, రాయ్‌బరేలీ, హాజీపూర్, హైదరాబాద్‌లలో కూడా ఈ కేంద్రాలను నెలకొల్పారు.

పీజీలు, పీహెచ్‌డీలు

బయోటెక్నాలజీ, క్లినికల్ రిసెర్చ్, మెడిసినల్ కెమిస్ట్రీ, మెడికల్ డివైజెస్, నేచురల్ ప్రోడక్ట్స్, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ (బయోటెక్నాలజీ, ఫార్ములేషన్స్, ప్రాసెస్ కెమిస్ట్రీలలో), ఫార్మాస్యూటిక్స్, ఫార్మాకో ఇన్‌ఫర్మేటిక్స్, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, ఫార్మసీ ప్రాక్టీస్, రెగ్యులేటరీ టాక్సికాలజీ, ట్రెడిషనల్ మెడిసిన్‌లలో ఎంఎస్ (ఫార్మా), ఎంఫార్మా, ఎంటెక్ (ఫార్మా) డిగ్రీలతో పాటు ఎంబీఏ (ఫార్మా) కూడా అందిస్తోంది. కెమికల్ సైన్సెస్, బయోలాజికల్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌ల నుంచి పది విభాగాల్లో పీహెచ్‌డీలను నైపర్ ఆఫర్ చేస్తోంది.

పీజీలో మెడికల్ కెమిస్ట్రీ కోర్సుకు మాత్రం ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ) చేసి సీఎస్ఐఆర్ నెట్ లేదా యూజీసీ నెట్ ఉత్తీర్ణత సాధించాలి. ఫార్మా టెక్నాలజీ పీజీ కోర్సుకు కెమికల్ ఇంజినీరింగ్ పూర్తిచేసి గేట్‌లో క్వాలిఫై కావాలి. మిగతా అన్ని పీజీలకు బీఫార్మసీ ఉత్తీర్ణులైనవారు అర్హులు.

రెండు స్థాయుల్లో వడపోత

దేశవ్యాప్తంగా ఉన్న ఏడు నైపర్‌ల్లోకి ప్రవేశం కోసం సాధారణంగా ఏటా ఏప్రిల్‌లో నోటిఫికేషన్ వెలువడుతుంది. జూన్‌లో ఉమ్మడి ప్రవేశపరీక్ష (జేఈఈ)ను నిర్వహిస్తారు. తర్వాత ర్యాంకుల వారీగా అభ్యర్థులు ఎంచుకున్న ప్రాంతంలో సీటు కేటాయించడానికి కౌన్సెలింగ్ జరుగుతుంది. పీహెచ్‌డీ కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఎం-ఫార్మసీ ఉత్తీర్ణత పొంది నైపర్-జేఈఈలో అర్హత సాధించాలి. అన్ని ప్రోగ్రామ్‌ల అభ్యర్థులు జీప్యాట్, గేట్, నెట్‌ల్లో ఏదో ఒకదానిలో క్వాలిఫై అయి ఉండటం తప్పనిసరి.

అన్ని సంస్థల్లో కలిపి వివిధ కోర్సుల్లో దాదాపు 750 సీట్లు ఉన్నాయి. వాటిలో 134 సీట్లు హైదరాబాద్ క్యాంపస్‌లో ఉన్నాయి. దేశవ్యాప్తంగా మూడు వేల ఫార్మా విద్యాసంస్థల నుంచి సుమారు లక్షల మంది అభ్యర్థులు జేఈఈకి హాజరవుతారు. రాతపరీక్ష తర్వాత గ్రూప్ డిస్కషన్ లేదా ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ రెండు స్థాయుల్లో వడపోసి చివరికి 750 మందికి పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. కేంద్ర ప్రభుత్వ కోటా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ ఉంటుంది. మొత్తం అభ్యర్థుల్లో 50-60 శాతం వరకు అమ్మాయిలే ఉండటం విశేషం.

హైదరాబాద్ నైపర్ ఆఫర్ చేసే కోర్సులు



కోర్సులు	అంశాలు
పీహెచ్‌డీ	మెడికల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ (ప్రాసెస్ కెమిస్ట్రీ)
ఎంఎస్ (ఫార్మా)	మెడికల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్ ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, ఫార్మాస్యూటక్స్ రెగ్యులేటరీ టాక్సికాలజీ
ఎంటెక్ (ఫార్మా)	ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ (ప్రాసెస్ కెమిస్ట్రీ)
ఎంబీఏ (ఫార్మా)	ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్

అవకాశాలు అపారం

నైపర్‌లో పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. ఉద్యోగావకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే కోర్సులు పూర్తి చేసినవారు అమెరికా, న్యూజిలాండ్, స్పెయిన్, లండన్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లోని ఫార్మా రంగాల్లో పరిశోధకులుగా, సైంటిస్టులుగా చేస్తున్నారు. ప్రాంగణ నియామకాలు కూడా పెద్దఎత్తున జరుగుతున్నాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, నొవార్టీస్, అబాట్ ఇండియా, సన్ ఫార్మా, జీఎస్‌కే, బయోకాన్, అరబిందో తదితర అనేక ప్రముఖ ఫార్మా కంపెనీలు భారీ ప్యాకేజీలతో ఆఫర్ లెటర్లు అందిస్తున్నాయి. హైదరాబాద్ క్యాంపస్‌కి సంబంధించి గత ఏడేళ్ల నుంచి ఏటా దాదాపు 85 శాతం పైనే ప్రాంగణ నియామకాలకు ఎంపికవుతున్నారు. మిగిలిన వాళ్లు పరిశోధనల వైపు వెళుతున్నారు. ఫార్మసీ విద్యలో హైదరాబాద్ క్యాంపస్‌కు దేశంలోనే తొలి స్థానం దక్కడం విశేషం. కొత్త ఔషధాల పరిశోధనలో ఫార్ములా అభివృద్ధికి సంబంధించి 14 పేటెంట్ హక్కులను హైదరాబాద్ నైపర్ దక్కించుకోవడం విశేషం. వివిధ ఫార్మా కంపెనీలు, జాతీయ, అంతర్జాతీయ ఫార్మా పరిశోధన సంస్థలతో ఈ నైపర్‌కు అవగాహన ఒప్పందాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా విశేష గుర్తింపు ఉన్న ప్రముఖ వ్యక్తులతో అతిథి ఉపన్యాసాలు ఇప్పిస్తుంటారు. 20,773 పుస్తకాలతో కూడిన విశాలమైన గ్రంథాలయం, ఫార్మా పరిశోధనలకు సంబంధించిన రూ. కోట్ల విలువైన అధునాతన పరికరాలతో కూడిన ల్యాబ్, అమ్మాయిలు, అబ్బాయిలకు ప్రత్యేక హాస్టల్ సదుపాయం హైదరాబాద్ క్యాంపస్‌లో అందుబాటులో ఉన్నాయి.

ప్రతి విద్యార్థికీ ఫెలోషిప్

నైపర్‌లో సీటు పొందిన ప్రతి విద్యార్థికీ కేంద్ర ప్రభుత్వం నుంచి ఫెలోషిప్ అందుతుంది. పీజీ కోర్సుల్లో చేరేవారికి రెండేళ్లపాటు నెలకు రూ. 12,400, పీహెచ్‌డీ అభ్యర్థులకు అయిదేళ్లపాటు నెలకు రూ. 28,500 అందిస్తారు. ఎంబీఏ (ఫార్మా) కోర్సుల్లో చేరే విద్యార్థులకు ఎలాంటి ఫెలోషిప్ ఉండదు.

విద్యార్థులు సెమిస్టర్లవారీగా కోర్సు ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. వివిధ పీజీ కోర్సులకు సంబంధించి నాలుగు సెమిస్టర్లకు రూ. 1,08,088 (ఎస్సీ, ఎస్టీలకు రూ. 44,200); ఎంబీఏ (ఫార్మా) కోర్సుకు రూ. 3,10,400 (ఎస్సీ, ఎస్టీలకు రూ. 45,700) ఫీజుగా నిర్ణయించారు. పీహెచ్‌డీ కోర్సుల్లో చేరే వారు నాలుగు సెమిస్టర్లకు రూ. 1,09,588 (ఎస్సీ, ఎస్టీలకు రూ. 48,700) చెల్లించాలి. అయిదేళ్ల వరకు పరిశోధన సాగించవచ్చు. విడతలవారీగా కోర్సు ఫీజులు చెల్లించే అవకాశం ఉంది. ఆర్థిక స్థోమతలేని అభ్యర్థులు బ్యాంకు రుణాలు పొందే వీలుంది.

మరిన్ని వివరాలకు...

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (నైపర్), బాలానగర్, హైదరాబాద్-500037, తెలంగాణ. ఫోన్- 040-23073741, 23073740, ఫ్యాక్స్-040-23073751,

ఈ-మెయిల్: projectdirector@niper-hyd.ac.in

వెబ్‌సైట్: www.niperhyd.ac.in

అయిదారేళ్లుగా తెలుగు రాష్ట్రాల నుంచి ఈ కోర్సుల్లో చేరేందుకు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మొహాలీ, హైదరాబాద్ క్యాంపస్‌ల్లో మాత్రమే ఎంబీఏ (ఫార్మా) అందుబాటులో ఉంది. మొత్తం కోర్సులో 40 శాతం థియరీకి, మిగతా 60 శాతం ప్రాక్టికల్స్, ఇంటర్న్‌షిప్‌లకు కేటాయించారు.

● *గొర్లె బాలకృష్ణ,* ఈనాడు, హైదరాబాద్

Flipping through the pages అంటే?

English Language Skills

పేపర్ లేదా మ్యాగజీన్‌ను మన చేతుల్లోకి తీసుకున్నపుడు ఒక్కో పేజీని చదువుతూవెళ్లం. క్షుణ్ణంగా చదవటానికి ముందు ఓసారి పేజీలను తిరగేస్తాం. ఈ వ్యక్తీకరణను సమర్థంగా చెప్పే Phrasal Verb ఏమిటో తెలుసా? దాన్ని ఉదాహరణలతో నేర్చుకుందాం!

Venkatesh: What are you doing, Nataraj? (ఏం చేస్తున్నావ్ నటరాజ్?)

Nataraj: Just flipping through the magazine, for I have nothing better to do (ఈ మేగజీన్ పేజీలను తిరగేస్తున్నా, అంతకన్నా మెరుగైన పనేమీ లేదు కాబట్టి).

Venkatesh: I heard that you and Krishna had a heated exchange yesterday. Is that true? (నిన్న నీకూ, కృష్ణకూ చాలా తీవ్రంగా వివాదం జరిగిందని విన్నాను. నిజమేనా?)

Nataraj: He was finding fault with me for nothing, and I had to bite back (నేనేం చేయనప్పటికీ నన్ను తను తప్పు పట్టాడు. అందుకని నేనూ ఘాటుగా సమాధానం ఇచ్చా).

Venkatesh: He is always like that, trying to pick holes in the behaviour of some one or the other (అతనెప్పుడూ అంతే, ఇతరుల్లో ఏదో ఒక తప్పు పడుతూనే ఉంటాడు).

Nataraj: I do not know when he will improve, and if he will improve at all (అతనెప్పుడు మెరుగవుతాడో తెలీడం లేదు నాకు, అసలు తప్పులు పట్టడం నుంచి బయటపడతాడా అని కూడా నాకు సందేహమే).



ఎం. సురేశన్

Venkatesh: OK, let us leave that alone. Are we leaving for Hyderabad tomorrow? (సరేలే, వాడిని వదిలెయ్. రేపు మనం హైదరాబాద్‌కు వెళ్తున్నామా?)

Nataraj: Yea, I am ready. We should head off at 6 in the morning tomorrow, promptly. Otherwise we are sure to miss the opportunity (అవును. నేను సిద్ధంగానే ఉన్నాను. రేపు మనం ఆరింటికల్లా బయల్దేరాలి, ఆలస్యం చేయకుండా. లేకపోతే మనం ఆ అవకాశాన్ని కోల్పోతాం).

Venkatesh: Just give me a call, and I will at your door step (నాకోసారి ఫోన్ చేయి, నీ తలుపు ముంగిట ఉంటాను).



Look at the following phrasal verbs from the conversation:

1) Flip through a magazine = Look for a short while at the pages of the magazine (Without reading it thoroughly) (అంత క్షుణ్ణంగా చదవకుండా ఏదైనా సంచిక పుటలు తిప్పుతూ ఉండటం).

a) Prabhakar: What happened yesterday? I heard that some thieves entered your place (నిన్న ఏం జరిగింది? మీ ఇంట్లో దొంగలు పడ్డారని విన్నాను).

Sukumar: Alone at home, I was flipping through the pages of story book, when I heard a sudden noise. I became alert and phoned the police, but the thieves by then had escaped. Nothing stolen, fortunately (ఒంటరిగా ఇంట్లో ఉండి, ఏదో కథల పుస్తకం పేజీలు తిరగేస్తున్నా. ఇంతలో ఉన్నట్టుండి శబ్దం వినపడింది. నేను కాస్త చురుకుగా పోలీసులకు ఫోన్ చేశా. అప్పటికే దొంగలు పారిపోయారు. అదృష్టవశాత్తూ ఏం దొంగిలించలేదు).

b) Sudha: I had nothing to do yesterday, it being a holiday. I whiled away my time looking through a cookery book (నిన్న సెలవవడం వల్ల ఏం చేయడానికీ పాలుపోలేదు. ఏదో వంటల పుస్తకం తిరగేస్తూ కాలం గడిపేశా).

Nalini: Did you learn anything, or did you just flipped through the pages of the book? (ఏమైనా నేర్చుకున్నావా లేదా ఊరికనే పేజీలు తిరగేశావా?)

2) Bite back = Do something bad to others because they have done bad to you (మనకు కీడు చేసినవాళ్లకు మనం కీడు చేయడం).

a) Sudhakar: For no fault of mine, he abused me in a very bad language (నేనేం తప్పు చేయకుండానే నన్ను తను బూతులు తిట్టాడు).

Nikhil: You should have bitten back him. He takes pleasure in hurting others' feelings (అతన్ని నువ్వు కూడా దూషించి ఉండాల్సింది. అతనికి ఇతరుల భావాలను దెబ్బతీయడం ఒక సరదా).

b) Chalam: Seshachalam is quite harmless. Even if others hurt him, he stays quiet and smiles (శేషాచలం కీడు చేసే రకం కాదు. ఇతరులు అతన్ని బాధించినా ఊరికనే ఉంటాడు, చిరునవ్వు చిందిస్తాడు).

Sekhar: Yea, so he is. But I don't know why he does not bite back at others when they insult him (అవును, అతనంతే. కానీ నాకర్థం కానిది ఇతరులు తనను అవమానించినపుడు, ఎందుకతను వాళ్లను తిరిగి తిట్టడని).

3) Head off = Start a journey or leave a place (ప్రయాణానికి బయల్దేరడం).

a) Balaram: Jayaram is not yet here. Why is he so unpunctual? (జయరాం ఇక్కడ లేడు. అతనెప్పుడూ ఎందుకు ఆలస్యం చేస్తాడు?)


Vishnu: He had phoned me that he was heading off in the morning itself. I don't know the reason why he hasn't been here still (నాకతను ఫోన్ చేశాడు, తాను పొద్దున్నే బయల్దేరతానని. ఇంకా ఇక్కడ ఉండకపోవడానికి కారణమేంటో నాకు తెలీడం లేదు).

b) Subbarao: Dinakar is always late. He never arrives at a place promptly (దినకర్ ఎప్పుడూ ఆలస్యమే. సరైన సమయానికి ఎక్కడికీ ఎప్పుడూ రాడు).

Mallesh: That is always the trouble with him. He promises to head off at the proper time, but delays it somehow or the other (ఎప్పుడూ అతనితో అదే చిక్కు. సరైన సమయానికి బయల్దేరి వస్తానని చెబుతాడు కానీ, ఏదోవిధంగా ఆలస్యం చేస్తాడు).

లైబ్రరీ

కాంపిటీటివ్ ఎగ్జామ్స్, అకడమిక్, ప్రవేశపరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఇటీవల మార్కెట్‌లోకి విడుదలైన పుస్తకాల వివరాలు.



పదోతరగతి

1) టీఎస్- ఆల్ ఇన్ వన్ - సీసీఈ మోడల్ క్వశ్చన్స్; తెలుగులో- పేజీలు: 762 + 634, ధర: రూ.342 ఇంగ్లిష్‌లో - పేజీలు: 760 + 620, ధర: రూ. 378 వీటితో పాటు ఆల్ ఇన్ వన్ - ప్రీవియస్ పబ్లిక్ పేపర్స్ ఉచితం.

ప్రచురణ: వీజీఎస్ పబ్లిషర్స్

ఆర్ఆర్‌బీ

జనరల్ అవేర్‌నెస్ ఆన్ కరెంట్ అఫైర్స్

పేజీలు: 96, రూ. 60

ప్రచురణ: ఉద్యోగ సోపానం



నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎన్‌పీసీఐఎల్, ముంబయి

సంస్థ: భారత అణుశక్తి విభాగానికి చెందిన న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్), ముంబయి. **పోస్టు:** మెడికల్ ఆఫీసర్

ఖాళీలు: 16 **అర్హత, వయసు, ఎంపిక:** నిబంధనల ప్రకారం.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 21.03.2018 నుంచి 19.04.2018 వరకు

వెబ్‌సైట్: https://npcilcareers.co.in/

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్

పోస్టులు: సేఫ్టీ అసిస్టెంట్ తదితరాలు. **ఖాళీలు:** 08

అర్హత: పదోతరగతితోపాటు ఇండస్ట్రియల్ సేఫ్టీలో ఏడాది డిప్లొమా, పీజీ. **ఎంపిక:** ప్రాక్టికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా.

దరఖాస్తు: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** 19.03.2018 **హార్డ్ కాపీలను పంపడానికి చివరితేది:** 23.03.2018 **వెబ్‌సైట్:** http://www.cochinshipyard.com/

ప్రవేశాలు

జిప్‌మర్, పుదుచ్చేరిలో ఎంబీబీఎస్ ప్రవేశాలు

కోర్సు కాలవ్యవధి: 4 సంవత్సరాల 6 నెలలు, ఏడాది ఇంటర్న్‌షిప్.

మొత్తం సీట్ల సంఖ్య: 200 (జిప్‌మర్ పుదుచ్చేరి-150, జిప్‌మర్ కరైకాల్-50)

అర్హత: ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/ బయోటెక్నాలజీ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణత. **వయసు:** 31.12.2018 నాటికి 17 సంవత్సరాలు నిండి ఉండాలి. **రాతపరీక్ష తేది:** 03.06.2018

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: 13.04.2018

వెబ్‌సైట్: http://jipmer.puducherry.gov.in/

వాక్ఇన్ ఇంటర్వ్యూ

ఐకార్ - ఐఐఓపీఆర్

పోస్టులు: యంగ్ ప్రొఫెషనల్-01, అకౌంట్స్ అసిస్టెంట్-01

అర్హత, వయసు: ఐఐఓపీఆర్ నిబంధనల ప్రకారం.

ఇంటర్వ్యూ తేది: 20.03.2018 **వేదిక:** ఐకార్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రిసెర్చ్ (ఐఐఓపీఆర్), పెదవేగి, పశ్చిమ గోదావరి జిల్లా, ఏపీ.

వెబ్‌సైట్: http://dopr.gov.in/

మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్, హైదరాబాద్

పోస్టు: ట్రేడ్ అప్రెంటిస్ **ఖాళీలు:** 40

కాలవ్యవధి: ఒక ఏడాది **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ. **ఇంటర్వ్యూ తేది:** 12.03.2018 **వేదిక:** ఏఎంటీఎల్ బిల్డింగ్-మిధాని (డీఎంఆర్ఎల్ దగ్గర).

వెబ్‌సైట్: http://midhani.gov.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

విగ్రహాల ధ్వంసంపై ఆగ్రహం

- తీవ్రంగా ఖండించిన ప్రధాని మోదీ..
- తక్షణ చర్యల దిశగా రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు
- కోల్‌కతాలో శ్యామాప్రసాద్ ముఖర్జీ ప్రతిమపై దాడి

కోల్‌కతా, చెన్నై, దిల్లీ, లఖ్‌నవూ, అగర్తలా: విభిన్న దృక్పథాలు, ఆలోచనలు, ఉద్యమాలకు నేతృత్వం వహించిన ప్రముఖుల విగ్రహాలు ప్రతీకార దాడులకు గురికావటంపై దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతోంది. త్రిపురలో కమ్యూనిస్టు యోధుడు లెనిన్ విగ్రహాలను పెకిలించి వేసిన తర్వాత తమిళనాడులో పెరియార్, ఉత్తర్‌ప్రదేశ్‌లో అంబేడ్కర్, కోల్‌కతాలో శ్యామాప్రసాద్ ముఖర్జీ విగ్రహాలకు నష్టం కలిగించే ఘటనలు జరిగాయి. దేశంలోని 'భిన్నత్వంలో ఏకత్వం' సంస్కృతికి ఇవి విఘాతం కలిగిస్తున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. విగ్రహాల విధ్వంస చర్యలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. దోషులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ఈ విషయంపై చర్చించిన ప్రధాని.. వరుస ఘటనలపై ఆందోళన వ్యక్తంచేశారని తెలిసింది. విధ్వంస చర్యలను తక్షణమే కట్టడి చేయలంటూ హోంమంత్రిత్వ శాఖ నుంచి అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు వెళ్లాయి. 'ఇలాంటి హేయమైన చర్యలు ఎప్పటికీ సమర్థనీయం కావు. దోషులెవరైనా కఠిన చర్యలు తప్పవు" అంటూ కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం పార్లమెంటు వెలుపల వ్యాఖ్యానించారు. త్రిపురలో లెనిన్, తమిళనాడులో పెరియార్ విగ్రహాలను అపవిత్రం చేసిన ఘటనలు తీవ్రవిచారకరమైనవని భాజపా అధ్యక్షుడు అమిత్‌షా పేర్కొన్నారు. విగ్రహ విధ్వంస ఘటనలపై ఆయన వరుసగా పలు ట్వీట్లు చేశారు. విగ్రహాల కూల్చివేతలను తమ పార్టీ సమర్థించబోదన్నారు. త్రిపుర, తమిళనాడుల్లోని విగ్రహాల విధ్వంసాల్లో భాజపా సభ్యులెవరైనా పాల్గొంటే వారిపై పార్టీ పరంగా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. తమిళనాడు భాజపా నాయకుడు, ఆ పార్టీ జాతీయ కార్యదర్శి హెచ్.రాజాపై ఎలాంటి చర్యలు ఉండబోవని స్పష్టం చేశారు.



బుధవారం చెన్నైలోని పెరియార్ విగ్రహం వద్ద పోలీసుల బందోబస్తు

భాజపాపై విపక్షాల ధ్వజం

త్రిపుర, తమిళనాడుల్లో నేతల విగ్రహాల విధ్వంసాన్ని విపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. భాజపా కార్యకర్తలు అసహనంతో వ్యవహరిస్తున్నారని, పేదలను అవమానించేలా వారి ప్రవర్తన ఉంటుందని విమర్శించాయి. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. తమిళనాడులో పెరియార్ విగ్రహంపై దాడి తమిళులనే కాకుండా ఆయన సిద్ధాంతాలను విశ్వసించే దేశంలోని వారందరినీ అవమానించినట్లేనని లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. విగ్రహాల విధ్వంసం తీవ్ర అవమానకరమని తృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్ ఓబ్రియాన్ వ్యాఖ్యానించారు. తమిళనాడులో శాంతిభద్రతలు సంఘ్‌పరివార్, ఫాసిస్టు శక్తుల చేతుల్లోకి వెళ్తున్నట్లుందని సీపీఐ నేత డి.రాజా ధ్వజమెత్తారు. విగ్రహాల ధ్వంసంపై ప్రకటనలకే పరిమితంకాకుండా గట్టి చర్యలు తీసుకోవాలంటూ భాజపా నేతలపై బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి మండిపడ్డారు. మంగళవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు రాజ్యాంగ నిర్మాత డా.బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయటంపై దళితులు తీవ్ర నిరసనకు దిగారు.

కోల్‌కతాలో నిందితులను బంధించిన ప్రజలు

జన్‌సంఘ్ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ప్రతిమపై బుధవారం దాడికి పాల్పడిన ఏడుగురు నిందితులను కోల్‌కతా పోలీసులు ఘటనా స్థలంలోనే అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఒక మహిళ ఉన్నారు. నిందితులందరూ వామపక్ష 'రాడికల్' గ్రూప్ సభ్యులని పోలీసులు తెలిపారు. విగ్రహం ముఖంపై నల్లని సిరా పూయటంతో పాటు నష్టం కలిగించేందుకు యత్నించగా స్థానికులు వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారని పోలీసులు వెల్లడించారు.

తమిళనాట ఉద్రిక్తత

చెన్నై - న్యూస్‌టుడే: తమిళనాడులో ద్రావిడర్ కళగం వ్యవస్థాపకులు, దివంగత పెరియార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా ఉద్రిక్తతకు దారితీసింది. బుధవారం పలుచోట్ల ఆందోళనలు జరిగాయి. త్రిపురలో లెనిన్ విగ్రహం కూల్చినట్లే... రేపు తమిళనాడులో పెరియార్ విగ్రహాలు కూలతాయంటూ భాజపా జాతీయ కార్యదర్శి హెచ్.రాజా ఫేస్‌బుక్ పేజీలోని పోస్టు ఆందోళనలకు ప్రధాన కారణమైంది. వేలూరు జిల్లా తిరుపత్తూరులో పెరియార్ విగ్రహాన్ని మంగళవారం రాత్రి ఇద్దరు ధ్వంసం చేయడంతో వారిని స్థానికులు పట్టుకుని, దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ దుశ్చర్యకు పాల్పడినవారిలో ఒకరు భాజపా స్థానిక నిర్వాహకుడిగా తేలడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలోని పెరియార్ విగ్రహాలకు బుధవారం పటిష్ఠ పోలీసు భద్రత కల్పించారు. పెరియార్ విగ్రహం ధ్వంసానికి నిరసనగా ద్రావిడర్ కళగం, ఇతర పార్టీల తరఫున రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాయి. చెన్నైలో గుర్తుతెలియని వ్యక్తులు కొందరు బ్రాహ్మణుల జంధ్యాలు తెంచేసి కోయంబత్తూరులోని భాజపా కార్యాలయంపై పెట్రోలు బాంబు విసిరారు. ఈ ఘటనలో పెరియార్ ద్రావిడర్ కళగానికి చెందిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పెరియార్ అసలు పేరు ఈవీ రామస్వామి నాయకర్. పెరియార్‌గా సుప్రసిద్ధులైన ఆయన సంఘ సంస్కర్తగా, కులవివక్ష నిర్మూలనకు, స్త్రీ స్వేచ్ఛకు కృషి చేశారు.

వెనక్కి తగ్గిన హెచ్.రాజా

పెరియార్‌పై తన ఫేస్‌బుక్ పేజీలో వచ్చిన వ్యాఖ్యలకు మనస్ఫూర్తిగా చింతిస్తున్నట్టు భాజపా జాతీయ కార్యదర్శి హెచ్.రాజా వ్యాఖ్యలు ప్రకటన విడుదల చేశారు. త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని తొలగించడాన్ని ప్రస్తావిస్తూ, తమిళనాడులో పెరియార్ విగ్రహాలు కూడా తొలగిస్తారన్న విషయాన్ని తన అనుమతి లేకుండా తన సిబ్బంది ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారని పేర్కొన్నారు. ఆ పోస్టును తాను తొలగించానని స్పష్టం చేశారు.

లెనిన్ విగ్రహాలు కూల్చడం ప్రజాస్వామ్యాన్ని కూల్చడమే

- వామపక్ష పార్టీల నేతల ధ్వజం

బషీర్‌బాగ్, హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: ఎన్నికల ఫలితాల అనంతరం త్రిపురలో లెనిన్ విగ్రహాలను కూల్చివేయడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. లెనిన్ విగ్రహాల కూల్చితను నిరసిస్తూ బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. బాబుజగ్జీవన్‌రామ్ చౌరస్తాలో భాజపా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫాసిస్టు గుండాల మాదిరిగా భాజపా, సంఘ్ పరివార్ శక్తులు పని చేస్తున్నాయని ఆరోపించారు. లెనిన్ విగ్రహాలను కూల్చడమంటే ప్రజాస్వామ్యాన్ని, మానవత్వాన్ని కూల్చడమేనన్నారు. విగ్రహాల కూల్చివేతలపై ప్రధాని సహా కేంద్ర మంత్రులందరూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. విదేశీయుల విగ్రహాలు వద్దని చెబుతున్నారని గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలు సైతం విదేశాలలో ఉన్నాయనే విషయాన్ని విస్మరించవద్దని హితవు పలికారు. దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాదినేని వెంకటేశ్వర్‌రావు, సీహెచ్ మురహరి, మాజీ ఎంపీ అజీజ్ పాషా, నేతలు కె.గోవర్ధన్, జానకిరామారావు, తాండ్రకుమార్, సైకిలాబ్, పలు విద్యార్థి, యువజన, మహిళా సంఘాల నేతలు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి.. చాడ వెంకటరెడ్డి: భాజపా చర్యలతో ప్రజలు శాంతియుతంగా బతికే పరిస్థితులు లేకుండా పోతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. త్రిపుర ఎన్నికల ఫలితాలు వెలువడిన 48 గంటల్లోనే ఆ రాష్ట్రంలో భౌతికదాడులు, లెనిన్ విగ్రహాల కూల్చివేత, ప్రతిపక్షాల ఆస్తుల విధ్వంసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. దీని వెనుక ఆరెస్సెస్, అనుబంధ సంస్థల ప్రమేయం ఉందన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలో దళితులు, మైనార్టీలపై దాడులకు పాల్పడుతూ అలజడులు సృష్టిస్తున్న భాజపా శక్తులను ప్రజలు ఎదుర్కోవాలన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి ఇ.టి.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



త్రిపురలో లెనిన్ విగ్రహం కూలివేతను ఖండిస్తూ హైదరాబాద్‌లో భాజపాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేస్తున్న వామపక్ష నాయకులు. చిత్రంలో తమ్మినేని వీరభద్రం తదితరులు

స్తంభించిన చట్ట సభలు

- పార్లమెంటులో మూడోరోజూ నిరసనల హోరు
- ఆందోళన కొనసాగించిన తెదేపా, తెరాస, కాంగ్రెస్, వైకాపా...

ఈనాడు, దిల్లీ: పార్లమెంటులోని ఉభయ సభలూ వరుసగా మూడో రోజూ కార్యకలాపాలను చేపట్టలేకపోయాయి. విపక్షాల ఆందోళనలు, నిరసనలతో సభాప్రాంగణాలు దద్దరిల్లాయి. తెలుగుదేశం, తెరాస, వైకాపా, కాంగ్రెస్, ఏఐఏడీఎంకె, తృణమూల్‌కాంగ్రెస్, వామపక్షాలు ఎవరికి వారు తమ తమ నినాదాలతో సభామధ్యంలోకి వచ్చి సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. పదేపదే అవాంతరాలతో రాజ్యసభ, లోక్‌సభలు పలుమార్లు వాయిదాపడ్డాయి. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవటంతో ఉభయసభాధినేతలు గురువారానికి వాయిదా వేశారు. సోమవారం నుంచి మొదలైన పార్లమెంటు మలి విడత సమావేశాల్లో గత మూడు రోజులుగా ఇదే పరిస్థితి. ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు అమలుచేయాలన్న డిమాండ్‌తో తెదేపా ఆందోళన కొనసాగించింది. ఆ పార్టీ ఎంపీలంతా తొలుత పార్లమెంటు వెలుపల గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తంచేశారు. మరోవైపు వైకాపా సభ్యులూ ప్రధాన ద్వారం వద్ద ఆందోళన కొనసాగించారు. ఇంకోవైపు తెరాస ఎంపీలు రిజర్వేషన్ల కోటా పెంపు కోసం ఆందోళన చేపట్టారు. శివసేన మరాఠీకి మాతృభాష కోసం ఉద్యమించగా.. ఏఐఏడీఎంకె సభ్యులు కావేరీ నదీయాజమాన్య మండలి ఏర్పాటుతో పాటు, పెరియార్ విగ్రహ ధ్వంసానికి నిరసనగా ఆందోళనకు దిగింది. కాంగ్రెస్ ఎంపీలు నీరవ్‌మోదీని తిరిగి రప్పించాలన్న డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. నిరసనలకు దిగిన సభ్యులతో బుధవారం కూడా లోక్‌సభ సభామధ్యమం కిక్కిరిసిపోయింది. స్పీకర్ సుమిత్రామహాజన్ ఉదయం 11 గంటలకు కేవలం రెండునిమిషాల్లోనే సభ వీడి వెళ్లారు. సభను వాయిదా వేస్తున్నట్లు చెప్పకుండానే ఆమె తన స్థానం నుంచి నిష్క్రమించారు. ఆ తర్వాత కొద్దిసేపటికి లోక్‌సభ టీవీలో మధ్యాహ్నం 12 గంటల వరకు సభను వాయిదా వేసినట్లు వెల్లడించారు. మధ్యాహ్నం సభ ప్రారంభమైన తర్వాతా అదే పరిస్థితి పునరావృతం కావటంతో సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు.



బుధవారం పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద తెదేపా ఎంపీల నిరసన

సభాపతి ప్రయత్నాలు విఫలం: మధ్యాహ్నం 1.30 గంటలకు సభాపతి సుమిత్రా మహాజన్ తన ఛాంబర్‌లో వివిధ సభాపక్ష నాయకులతో సమావేశమై ఆందోళనలు విరమించాలని కోరారు. సభను శాంతియుతంగా నిర్వహించడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నేతలంతా వారి వారి రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితులను వివరించి కేంద్రం న్యాయంచేస్తేనేసహకారం ఉంటుందని చెప్పారు.

రాజ్యసభలోనూ యథాతథం: ప్రతిపక్షాల ఆందోళనలతో రాజ్యసభలోనూ ప్రతిష్టంభన నెలకొంది. తెలుగుదేశం, తృణమూల్‌కాంగ్రెస్, కాంగ్రెస్, ఏఐఏడీఎంకె, డీఎంకె సభ్యులు తమ నిరసనలను కొనసాగించారు. సభ్యులు ప్లకార్డులుపట్టుకొని ఆందోళన చేయడాన్ని సభాధ్యక్షుడు వెంకయ్యనాయుడు ఆక్షేపించారు. విపక్షాలు ప్రస్తావిస్తున్న అన్నింటిపై చర్చకు సిద్ధమని ప్రకటించారు. అయినా వినిపించుకోకపోవడంతో సభను మధ్యాహ్నం రెండుగంటలకు వాయిదావేశారు. ప్రారంభమైన తర్వాతా అదే పరిస్థితి కనిపించడంతో ఉపసభాపతి కురియన్ సభను గురువారానికి వాయిదావేశారు.

కావడి కుండల్లో నీళ్లు, మట్టి తెచ్చిన శివప్రసాద్: రోజుకో వేషం, ఇతివృత్తంతో ఆందోళన కొనసాగిస్తున్న తెలుగుదేశం సభ్యుడు శివప్రసాద్ బుధవారం కావడి కుండల్లో మట్టి, నీళ్లు పెట్టుకొని వచ్చి నిరసన తెలిపారు.

రోజంతా వరస పరిణామాలు

ఈనాడు, అమరావతి: రెండు మూడు రోజులుగా అటు దిల్లీ.. ఇటు అమరావతిలో ఒకటే హడావుడి. ప్రత్యేక హోదా డిమాండుతో తెలుగుదేశం ఎంపీలు పార్లమెంటులో ఆందోళన చేస్తుంటే.. అమరావతిలో శాసనసభ వేదికగా మిత్రపక్షాల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. బుధవారం మరింత వేడెక్కిన రాజకీయం ఉదయం నుంచి సాయత్రం దాకా ఎప్పుడేం జరుగుతుందో... అన్నట్లుగా సాగింది. అర్ధరాత్రికి అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో మంత్రుల రాజీనామాలతో భాజపా, తెదేపా మధ్య చెలిమికి చెల్లుచీటి పడింది.

- ఉదయం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానంపై చర్చ సందర్భంగా మాట్లాడిన తెదేపా సభ్యులు భాజపాపై విరుచుకుపడ్డారు. దీనికి భాజపా సభ్యులు అడ్డుచెప్పారు. చంద్రబాబు ప్రసంగం సందర్భంగా కీలక ప్రకటన చేసే వీలుందని అందరూ ఊహించినా... చివరికి రెండు, మూడు రోజుల్లో కేంద్రం స్పందించాలని మాత్రమే ఆయన డిమాండ్ చేశారు.
- అసెంబ్లీలో చంద్రబాబు ప్రసంగం ముగిసిన కొద్ది నిమిషాలకే ఆర్థికమంత్రి జైట్లీ దిల్లీలో విలేకరులసమావేశం నిర్వహించారు. ఇప్పటిదాకా చెప్పిన దానికి మించి రాష్ట్రానికి అదనంగా ఇచ్చేదేమీ లేదని కుండబద్దలు కొట్టారు.
- జైట్లీ ప్రకటనతో తీవ్ర అసంతృప్తి చెందిన చంద్రబాబు బుధవారం సాయంత్రం సీఆర్‌డీఏ సమీక్షతోపాటు ఇతర కార్యక్రమాల్ని రద్దు చేసుకున్నారు. మంత్రులతో చర్చించి చివరకు కేంద్ర మంత్రివర్గం నుంచి వైదొలగాలనే కీలక నిర్ణయం ప్రకటించారు. ప్రధానికి చెప్పి వైదొలగుదామంటూ కొద్దిసమయం వేచి చూడటంతో నిర్ణయం వెలువరించటం జాప్యమైంది.
- అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు జరుగుతున్న సమయంలోనే భాజపా మంత్రులు రాజీనామా చేస్తున్నారంటూ ప్రచారం మొదలైంది. తెగతెంపులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన వెలువడిన వెంటనే గవర్నర్‌కు రాజీనామాలు సమర్పించాలని భాజపా జాతీయ కార్యదర్శి రామ్ మాధవ్ మంత్రులకు సూచించారనే ప్రచారం జరిగింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు హరిబాబు సైతం మంత్రులకు ఈ విధమైన సమాచారమే ఇచ్చినట్లు లాబీల్లో ప్రచారం నడిచింది. మంత్రి కామినేని శ్రీనివాస్ అది నిజం కాదని ఖండించారు. చివరికి తెదేపా మంత్రులు వైదొలగుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించిన వెంటనే రాష్ట్ర మంత్రివర్గంలోని ఇద్దరు భాజపా మంత్రులు పదవులకు రాజీనామా సమర్పించాలని నిర్ణయించారు.
- రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలకు సమాంతరంగా... బుధవారం మధ్యాహ్నమే దిల్లీలో ఇతర పార్టీల కేంద్ర మంత్రులు జరగబోయేది తమకు తెలుసన్నట్లు వ్యవహరించారు. మీపార్టీ కేంద్ర మంత్రివర్గం నుంచి ఎప్పుడు వైదొలగుతోందంటూ రాష్ట్ర ఎంపీలకు ప్రశ్నలు గుప్పించారు. పార్లమెంటులో ఆందోళనలు చేస్తుండగానే.. మంత్రి సుజనాచౌదరి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, ఎంపీలు అవంతి శ్రీనివాస్, రవీంద్రబాబు, రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావులు... ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీని కలిశారు. అనంతరం రక్షణమంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం, సహజయవాయువులశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్‌లను కూడా కలిసి సాయంపై మాట్లాడారు. ఈసందర్భంగా ఎవరి నుంచి సానుకూలత వ్యక్తం కాలేదు. పైగా... 'మీరు జగన్ ట్రాప్‌లో ఇరుక్కున్నారు. అందులో నుంచి బైటకు రాలేక మమ్మల్ని లక్ష్యంగా చేసుకున్నారు. మంత్రివర్గం నుంచి మీరు బయటికి వెళ్లాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు కదా... అది అమల్లోకి తెచ్చేది ఈ రోజా, రేపా' అంటూ ప్రశ్నించినట్లు సమాచారం.

ఫ్రాన్స్‌తో ఒప్పందాలకు కేంద్ర కేబినెట్ సమ్మతి

- పునరుత్పాదక ఇంధనంలో హెలెనిక్ రిపబ్లిక్‌తో ఎంఓయూ
- స్వాతంత్ర్య సమరయోధులకు 2020 వరకూ పింఛన్లు
- ప్రధాని మోదీ అధ్యక్షతన నిర్ణయాలు

దిల్లీ: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ భారత పర్యటన నేపథ్యంలో రెండు దేశాల మధ్య పలు ఒప్పందాలు జరుగనున్నాయి. స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా ఇరు దేశాలు పలు రంగాల్లో సహకరించుకోనున్నాయి. ప్రజల మధ్య సత్సంబంధాలు, పర్యావరణ పరిరక్షణ, వలస విధానాలకు సంబంధించిన నిర్ణయాలను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం కేంద్ర కేబినెట్ సమావేశం జరిగింది. రెండు దేశాల మధ్య ప్రజల వలసలు ప్రాథమికంగా ఏడేళ్లు చెల్లుబాటయ్యే ఒప్పందం వీటిలో ఒకటి. దీనికి సంబంధించిన అనుమతులు వాటంతటవే పునరుద్ధరణ నిబంధనను చేర్చనున్నారు. విద్యార్థులు, విద్యావేత్తలు, పరిశోధకులు, నిపుణుల రాకపోకలకు ఇది ఉపకరిస్తుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హతల పరస్పర గుర్తింపు, విద్యా సంస్థల గుర్తింపునకు, సాంకేతిక రంగాల్లో సహకారానికి సంబంధించిన ప్రతిపాదనలనూ కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఈ నెల 9 నుంచి ఫ్రాన్స్ అధక్షుడు భారత్‌లో పర్యటించనున్నారు.

- హెలినిక్ రిపబ్లిక్‌తో పునరుద్పాదక ఇంధనాలకు సంబంధించిన అవగాహన ఒప్పందానికీ కేంద్ర కేబినెట్ అనుమతి తెలిపింది.
- సులభతర వ్యాపార నిర్వహణలో మన దేశ ర్యాంకును మరింత మెరుగుపరచుకోవాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం ...వాణిజ్యపరమైన వివాదాల సత్వర పరిష్కారానికి వీలుకల్పించేలా రెండు చట్టాలను సవరించాలని నిర్ణయించింది. తక్కువ విలువ గల వాణిజ్య వివాదాలను సత్వరం పరిష్కరించుకొనేందుకు, కక్షిదారుల మధ్య పరస్పర అంగీకారం ఉంటే కోర్టుల వెలుపల మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి వీలుకల్పించేలా సంబంధిత చట్టాలను సవరించటానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.
- స్వతంత్రత సైనిక్ సమ్మాన్ యోజన (ఎస్ఎస్ఎస్‌వై) పథకాన్ని 2020 వరకూ కొనసాగించేందుకు కేంద్ర కేబినెట్ అంగీకరించింది. వాస్తవానికి ఈ పథకం 2017 మార్చి 31వ తేదీతో ముగిసింది. ఈ పథకం ప్రకారం స్వాతంత్ర్యసమర యోధులకు నెలవారీ పింఛన్లను అందజేస్తుంది. వారి మరణానంతరం వారిపై ఆధారపడిన భార్య/భర్త, అవివాహిత కుమార్తెకు నిబంధనల గౌరవ భృతిని అందజేస్తారు.

నేడు ఉద్యోగినులకు ప్రత్యేక సాధారణ సెలవు

తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వులు

గవర్నర్, సీఎంల అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

ఈనాడు, హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారాన్ని రాష్ట్రంలోని ఉద్యోగినులకు ప్రత్యేక సాధారణ సెలవు దినంగా ప్రకటిస్తూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ నిర్మాణంలో మహిళలు కీలక పాత్ర పోషించారని, జాతీయ సమగ్రత, శాంతి, సామరస్యంలోనూ వారు అందరికీ స్ఫూర్తిగా నిలిచారని గవర్నర్ పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే దేశం పురోగమిస్తుందని కేసీఆర్ తెలిపారు.

ఆడపడుచులకు 50శాతం రిజర్వేషన్లుండాలి

ఉపరాష్ట్రపతి ఆకాంక్ష

ఈనాడు, దిల్లీ: దేశం మరింత పురోభివృద్ధి సాధించాలంటే మహిళలకు చట్టసభల్లోనూ 50 శాతం రిజర్వేషన్లు ఉండాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. గురువారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఆడపడుచులకు శుభాకాంక్షలు తెలిపారు. దేశం ప్రగతి పథంలో ముందుకు వెళ్లడానికి జనాభాలో దాదాపు సగభాగంగా ఉన్న మహిళలకు పార్లమెంటు, అసెంబ్లీల్లోనూ 50 శాతం ప్రాతినిధ్యం ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రతిస్థాయిలో మహిళల పట్ల గౌరవం పెరగాలంటే అందుకు ముందుగా తల్లిదండ్రులే పూనుకోవాలన్నారు. బాలికల పట్ల బాలురకు గౌరవం కల్పించేలా బాలికల్లో భయం పోగట్టేలా తల్లిదండ్రులు యత్నించాలన్నారు. తల్లిదండ్రుల తర్వాత ఆ బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు సూచించారు.

ఐటీబీపీకి తొలి మహిళా 'కంబాట్ ఆఫీసర్'

మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించిన బిహార్ యువతి



ప్రకృతి

దిల్లీ: ఇండో-టిబెటన్ సరిహద్దు పోలీసు దళం (ఐటీబీపీ) తొలిమహిళా అధికారిగా బిహార్‌లోని సమస్తిపూర్ జిల్లాకు చెందిన పాతికేళ్ల ప్రకృతి ఎంపికయ్యారు! నేరుగా 'కంబాట్ ఆఫీసర్' హోదాలో ఆమె చేరుతుండటం విశేషం. భద్రతా దళాల్లో మహిళా అధికారులను నియమించేందుకు అవకాశం కల్పిస్తూ 2016లో ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అదే ఏడాది యూపీఎస్సీ నిర్వహించిన కేంద్ర సాయుధ పోలీసు దళాల (సీఏపీఎఫ్) పరీక్షలకు ప్రకృతి హాజరైంది. మంచి ప్రతిభ కనబరచి తొలి ప్రయత్నంలోనే విజయం సాధించింది. ఏరికోరి ఐటీబీపీనే ఎంపిక చేసుకుంది. ప్రకృతి. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తిచేసిన ఆమె... త్వరలోనే డెహ్రాదూన్‌లోని ఐటీబీపీకి చెందిన 'ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ'లో చేరనుంది. శిక్షణ అనంతరం ఆమె అసిస్టెంట్ కమాండెంట్ హోదాలో విధులు నిర్వర్తించనుంది.

మహిళా ఆర్థిక సాధికారత సాధనకు రూ.11 వేల కోట్ల పైచిలుకు సాయం!

బిల్-మెలిండా గేట్స్ ఫౌండేషన్ ప్రకటన

వాషింగ్టన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్' మహిళా ఆర్థిక సాధికారతకు మరింత ఊతమిచ్చే 170 కోట్ల డాలర్ల(సుమారు రూ. 11 వేల కోట్ల పైచిలుకు) పథకాన్ని ప్రకటించింది. భారత్‌తో సహా నాలుగు దేశాల్లో మహిళా సాధికారత సాధన కార్యక్రమాలకు ఈ నిధులను వినియోగిస్తారు. భారత్‌తో పాటు కెన్యా, టాంజేనియా, ఉగాండాల్లో స్త్రీ, పురుష సమానత సాధన, ఉపాధి అవకాశాల పెంపు, వ్యవసాయ రంగానికి మద్దతు, మహిళా బృందాలకు చేయూత వంటి కార్యక్రమాలను చురుగ్గా చేపట్టడమే ఈ పథకం లక్ష్యంగా ఉంది. మహిళ ముందుగా ఆర్థికపగ్గాలను చేతబూనడం ద్వారానే స్వయంగా తాను ముందడుగేయడమే కాక... కుటుంబం పరిస్థితిని కూడా బాగా మెరుగుపరచడానికి వీలుకలుగుతుందని గేట్స్ ఫౌండేషన్ మంగళవారం పేర్కొంది. మహిళ చేతిలో కాస్త డబ్బు ఉండి....దానిని ఖర్చుపెట్టే విషయంలో ఆమెకు అధికారం, స్వతంత్రం ఉంటే వారిలో స్థయిర్యం బాగా పెరుగుతుంది. అంతేకాదు, పురుషుల కంటే స్త్రీలు తక్కువ అనే అభిప్రాయాలనూ తుడిచిపెట్టేయగలుగుతుంది అని ఫౌండేషన్ సహ-సారథి మెలిండా గేట్స్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కదిలింది రైలు.. కదిలించేది అతివలు



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దక్షిణ నైరుతి రైల్వే విభాగం పరిధిలోని బెంగళూరు సిటీ రైల్వే స్టేషన్- పట్నా మధ్య సంచరించే సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైల్లో సేవలందించే వారంతా మహిళలే ఉండేలా ఏర్పాట్లు చేశారు. రైలు డ్రైవర్, కోడ్రైవర్, గార్డు, భద్రత సిబ్బంది, టిక్కెట్ కలెక్టరు, తనిఖీ సిబ్బంది.. అంతా మహిళలే! ఈ ఉద్యోగులతో కూడిన రైలు బుధవారం మధ్యాహ్నం సిటీ రైల్వేస్టేషన్ నుంచి పట్నాకు బయలుదేరింది.
– న్యూస్‌టుడే, బెంగళూరు

లైంగిక దాడి కేసులో బాలీవుడ్ నటుడు జితేంద్రపై విచారణ మొదలు

సిమ్లా: హిందీ చిత్రసీమకు చెందిన సీనియర్ నటుడు జితేంద్ర లైంగిక దాడికి పాల్పడినట్లుగా వచ్చిన ఆరోపణలపై.. పోలీసులు విచారణ మొదలుపెట్టారు. సిమ్లాలోని మహిళా పోలీస్‌స్టేషన్ ఈ విచారణను ప్రారంభించింది. 47 ఏళ్ల క్రితం జితేంద్ర తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ ఇటీవల ఓ మహిళ ఈ ఫిర్యాదు చేశారు. జితేంద్రకు తాను దగ్గరి బంధువునని. . 1971లో తాను 18 ఏళ్ల వయసులో ఉండగా ఆయన తనపై అత్యాచారం చేశారని ఆమె పేర్కొన్నారు.

ట్రంప్‌పై శృంగారతార దావా

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు వ్యతిరేకంగా. . శృంగార చిత్రాల నటి స్టెఫానీ క్లిఫొర్డ్ కోర్టుకెక్కారు. ట్రంప్‌తో తనకున్న లైంగిక సంబంధం గురించి బయటపెట్టకుండా ఉండేందుకు.. 2016 అక్టోబర్‌లో ట్రంప్ న్యాయవాది మైకెల్ కోహెన్ బలవంతంగా ఒప్పందంపై తనతో సంతకం చేయించారని ఆమె ఆరోపించారు. ఇందుకోసం కోహెన్ రూ.84లక్షలను తనకు చెల్లించారని పేర్కొన్నారు.

మెరుగైన వైద్యం కోసం అమెరికా చేరిన పారికర్

పనాజీ: మెరుగైన వైద్యం నిమిత్తం గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ బుధవారం అమెరికా చేరారు. పారికర్ తీవ్రస్థాయి క్లోమగ్రంధి క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు అంతకుముందు ఆయనకు వైద్యం అందించిన ముంబయిలోని లీలావతి ఆసుపత్రి; గోవా మెడికల్ కళాశాల వర్గాలు వెల్లడించాయి.

నిర్మల్ ఇన్‌ఫ్రా సీఎండీ అరెస్టు

దిల్లీ: రూ.433 కోట్ల డిపాజిట్లను వసూలు చేసి, వాటిని తిరిగి చెల్లించకుండా ప్రజల్ని మోసగించిన కేసులో భోపాల్‌కు చెందిన నిర్మల్ ఇన్‌ఫ్రా సీఎండీ ఆశిష్ చౌహాన్, జనరల్ మేనేజర్ అభిషేక్ చౌహాన్‌లను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) బుధవారం అరెస్టు చేసింది.

సిద్ధరామయ్య సూచనతోనే శశికళకు కారాగార వైభవం

విచారణలో వెల్లడించిన పూర్వ కారాగారాధికారి

బెంగళూరు, న్యూస్‌టుడే: బెంగళూరు పరప్పన అగ్రహార కారాగారంలో శిక్షను అనుభవిస్తున్న తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి శశికళకు అన్ని సదుపాయాలూ కల్పించాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యే తనను ఆదేశించారని విశ్రాంత ఏడీజీపీ సత్యనారాయణరావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతోనే తాను ఆమెకు మంచం, పరుపు, దిండు, ఇతర సదుపాయాలను కల్పించానని చెప్పారు. సత్యనారాయణరావు ఆరోపణల్లో నిజం లేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు.

రాజస్థాన్‌లో కమలదళానికి ఎదురుదెబ్బ

స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ కన్నా వెనుకబాటు

జైపుర: రాజస్థాన్‌లో అధికార భారతీయ జనతా పార్టీకి ఎదురు దెబ్బ తగిలింది. ఇటీవల జరిగిన 21 జిల్లాల పరిధిలోని స్థానిక సంస్థల ఉపఎన్నికల్లో అధికార పార్టీ...విపక్ష కాంగ్రెస్ కన్నా వెనుకబడి పోయింది. బుధవారం వెల్లడైన ఫలితాల్లో కాంగ్రెస్ 20స్థానాల్లో, భాజపా 11 స్థానాల్లో, స్వతంత్రులు రెండు చోట్ల గెలుపొందారు. రెండు లోక్‌సభ స్థానాలకు ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థుల చేతిలో భాజపా అభ్యర్థులు ఓడిపోయారు.



ఆష్నీ బియాని (కిశోర్ బియానీ)



దేశీయ రిటైల్ రంగంలో ఫ్యూచర్ గ్రూపు ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. బిగ్‌బజార్ విక్రయ కేంద్రాల ద్వారా దేశంలోని ప్రధాన నగరాలన్నింటికీ చేరువైన ఈ గ్రూపునకు అధినేత కిశోర్ బియానీ. ఆయన పెద్ద కూతురే ఆష్నీ బియానీ. బియానీ కుటుంబంలో చదువుకోవడానికి ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టిన మొట్టమొదటి మహిళ ఈమెనే. బెంగళూరులోని సృష్టి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్, డిజైన్ టెక్నాలజీ నుంచి ఆమె గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.
ప్రత్యేకత: ఫ్యూచర్ కన్జ్యూమర్ లిమిటెడ్‌లో 2014 నవంబరు నుంచి ఆమె డైరెక్టరుగా పనిచేస్తున్నారు. కుటంబమంతా హాయిగా షాపింగ్ చేసేలా బిగ్ బజార్ విక్రయ కేంద్రాలను 70,000 చదరపు అడుగుల నుంచి లక్ష చదరపు అడుగులు పెంచడానికి ఆమె నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం బిగ్ బజార్ విక్రయాల్లో వృద్ధికి తోడ్పడింది. సంప్రదాయ కంపెనీల మార్గంలో కాకుండా వినూత్న వ్యూహాలతో ముందుకు తీసుకెళ్తున్నారు.

నందిని పిరమాల్(అజయ్ పిరమాల్)



పిరమాల్ గ్రూప్ అధిపతి అజయ్ పిరమాల్ ఏకైక కుమార్తె నందిని పిరమాల్. పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్‌కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈమె ఎంతటి అలుపులేకుండా సంస్థ బాధ్యతల్లో ఉన్నా.. అప్పుడప్పుడూ వంటలు చేయడంపై దృష్టి సారించడం విశేషం. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి బీఏ(పాలిటిక్స్, ఫిలాసఫీ, ఎకనమిక్స్); స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి ఎమ్‌బీఏ చేశారు.
ఆ ర్యాంకు ఘనత ఆమెదే: నందిని నాయకత్వంలో కంపెనీకి చెందిన ఓటీసీ వ్యాపారం బాగా వృద్ధి చెందింది. 2008లో 40వ ర్యాంకులో ఉండగా.. 2012 కల్లా ఏడో స్థానానికి వచ్చింది. 2014లో ప్రపంచ ఆర్థిక వేదిక ఈమెను 'యంగ్ గ్లోబల్ లీడర్'గా గుర్తించింది కూడా. అంతే కాదు దాతృత్వ కార్యక్రమాల్లో ముందుండే నందిని పిరమాల్ గ్రూప్‌నకు చెందిన దాతృత్వ విభాగం పిరమాల్ ఫౌండేషన్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు కూడా. అబాట్ లేబొరేటరీస్‌కు కంపెనీకి చెందిన బ్రాండెడ్ జనరిక్ మెడిసిన్ వ్యాపారాన్ని భారీ రేటుకు విక్రయించడంలో ఈమె కీలక పాత్ర పోషించారు.

ఈనాడు బిజినెస్

కొత్త బంగారు లోకం

కార్పొరేట్ రంగంలో మహిళల ప్రాతినిధ్యం తక్కువే. బోర్డు రూముల్లోనూ వారికి అవకాశాలు అంతంతమాత్రమే. కానీ, ఈ పరిస్థితులు ఎల్లప్పుడూ ఒకేలా ఉండవు. కాలం మారుతోంది. యువత దూసుకొస్తోంది. తమ శక్తియుక్తుల్ని నిరూపించుకుంటూ మహిళామణులు ముందడుగు వేస్తున్నారు. అటు ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవడమే కాదు.. ఉన్నత స్థాయి పదవులను సైతం అలవోకగా అందిపుచ్చుకుంటున్నారు. సవాళ్లను, అవరోధాలను అధిగమిస్తూ.. దొరికిన అవకాశాన్ని విజయానికి మార్గంగా మలుచుకుంటూ ముందుకెళ్తున్నారు. చందా కొచ్చర్, నైనాలాల్ కిద్వాయ్, ఇంద్రా నూయీ, కిరణ్ మజుందార్ షా లాంటి వాళ్లు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణలు. వీళ్లంతా తమతమ వ్యాపార రంగాల్లో విశిష్ఠ గుర్తింపును సాధించిన శక్తిమంత మహిళలు. ఇక కార్పొరేట్ వారసులుగా తమ సత్తా చాటుతున్నవారు కొందరైతే... భవిష్యత్ తారలుగా, కార్పొరేట్ మహరాణులుగా ఎదిగేందుకు సిద్ధమవుతున్నవారు మరికొందరు. కొందరేమో స్వయం కృషితో ఎదిగేందుకు ప్రయత్నిస్తుండగా.. ఇంకొంత మంది తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకొని విజయానికి బాటలు వేసుకుంటున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనాడు వాణిజ్య విభాగం అందిస్తున్న కథనం..

ఈశా అంబానీ

దేశంలోనే అత్యంత శ్రీమంతుడైన ముకేశ్ అంబానీ ముద్దుల తనయ ఈమె. అక్టోబరు 23, 1991లో జన్మించారు. ప్రఖ్యాత యేల్ యూనివర్శిటీ నుంచి సైకాలజీ, సౌత్ ఏషియన్ స్టడీస్‌లో డిగ్రీ పట్టా పొందారు. అనంతరం మెకెన్సీ అండ్ కంపెనీలో వ్యాపార విశ్లేషకురాలు (బిజినెస్ అనలిస్ట్)గా పనిచేశారు.
ప్రత్యేకత: 2014 అక్టోబరులో రిలయన్స్ జియో, రిలయన్స్ రిటైల్ బోర్డులో డైరెక్టరుగా నియమితులయ్యారు. అయితే ఆమె బాధ్యతలు చేపట్టి స్వల్పకాలమే అయినప్పటికీ తనను తాను నిరూపించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మున్ముందు గ్రూపులోని మరికొన్ని బాధ్యతలు అప్పగించినా కూడా తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నారు.

సునీతా రెడ్డి(ప్రతాప్ రెడ్డి)



ఆసియాలో అత్యంత విశ్వసనీయమైన ఆరోగ్య సేవల ఆసుపత్రుల్లో అపోలో హాస్పిటల్స్ కూడా ఒకటి. ఆ సంస్థ అధిపతి ప్రతాప్ సి రెడ్డి కుమార్తే సునీతా రెడ్డి. ప్రస్తుతం అపోలో హాస్పిటల్స్‌కు ఎండీగా ఆమె బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చెన్నైలోని స్టెల్లా మేరీస్ కళాశాలలో ప్రజా సంబంధాలు, ఆర్థిక శాస్త్రం, మార్కెటింగ్‌లో డిగ్రీ పొందిన ఆమె ఆ తర్వాత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్‌లో డిప్లొమో పొందారు. హార్వర్డ్ బిజినెస్ స్కూల్(హెచ్‌బీఎస్) నుంచి ప్రెసిడెంట్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ పూర్తి చేశారు కూడా.
ఆ ఘనత ఆమెదే: వ్యవస్థాపక కుటుంబ సభ్యుల్లో ఒకరైన సునీతా అపోలో హాస్పిటల్స్‌లో 1989 నుంచీ పనిచేస్తున్నారు. 140 దేశాల్లో 5 కోట్ల మందికి ఆరోగ్య సేవలందించిన ఈ గ్రూప్ వెనక ఈమె పాత్ర కూడా కీలకమే. భారత్‌లో ఆరోగ్య సంరక్షణ రంగంలో తొలి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి(ఎఫ్‌డీఐ) రావడంలో ఈమె చురుగ్గా స్పందించారు. అంతే కాదు.. సంస్థను అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లోకి తీసుకెళ్లడంలో సునీతాదే ప్రధానపాత్ర. తండ్రికి తగ్గ తనయగా పలు పరిశ్రమ సంఘాలు, గ్రూప్‌నకు చెందిన సంస్థల్లో వివిధ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్నారు.



తాన్యా దుబాష్ (ఆది గోద్రేజ్)

గోద్రేజ్ బ్రాండును ప్రత్యేకంగా పరిచయం చేయనక్కర్లేదు. తాళాలు దగ్గర నుంచి సబ్బులు, షాంపూలు ఇలా ఏదోక నిత్యావసర వస్తువు రూపంలో మనం గోద్రేజ్ ఉత్పత్తులను వాడుతూనే ఉంటాం. ఈ సంస్థ వ్యవస్థాపకుడు ఆది గోద్రేజ్ పెద్ద కూతురే తాన్యా దుబాష్. ప్రస్తుతం గోద్రేజ్ గ్రూపులో చీఫ్ బ్రాండ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు హోదాలో ఉన్నారు. తాన్యా అమెరికాలోని బ్రౌన్ యూనివర్శిటీ నుంచి ఎకనమిక్స్‌లో పట్టా తీసుకున్నారు. హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లోనూ చదివారు. ఆ తర్వాత గోద్రేజ్ ఇండస్ట్రీస్, గోద్రేజ్ కన్జ్యూమర్ ప్రోడక్ట్స్, గోద్రేజ్ ఆగ్రోవేట్ సహ గోద్రేజ్ గ్రూపులోని పలు కంపెనీల్లో ఆమె బోర్డు డైరెక్టరు బాధ్యతలు నిర్వహించారు.
ప్రత్యేకత: తాన్యా ఓ మంచి వ్యూహకర్తగా పేరు తెచ్చుకున్నారు. స్ట్రాటిజిక్ మార్కెటింగ్ గ్రూపునకు ఆమె నాయకత్వం వహిస్తున్నారు. గోద్రేజ్ గ్రూపులో అడుగుపెట్టిన వెంటనే బ్రాండు విశిష్ఠతను మరింత పటిష్ఠం చేయడంపై దృష్టి సారించారు. విదేశాల్లో సంస్థల కొనుగోళ్లు, విలీనాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా గోద్రేజ్ బ్రాండు విస్తరించేలా చేశారు.



అనన్య బిర్లా (కుమార మంగళం బిర్లా)


సిమెంటు దగ్గర నుంచి ఉక్కు వరకు ఇలా ఎన్నో రంగాల్లో బిర్లాల సామ్రాజ్యం విస్తరించి ఉంది. అందులో ముఖ్యమైంది ఆదిత్యా బిర్లా. ఈ సామ్రాజ్యానికి అధినేత కుమార మంగళం బిర్లా. ఆయన కూతురే అనన్య. ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో ఎకనమిక్స్, మేనేజ్‌మెంట్ విభాగంలో పట్టా పొందారు.
ప్రత్యేకత: దేశంలోనే దిగ్గజ వ్యాపార కుటుంబం నుంచి వచ్చినప్పటికీ, స్వతంత్రంగానే తనకుంటూ ఓ గుర్తింపును అనన్య తెచ్చుకున్నారు. ఓ వైపు గాయని, పాటల రచయితగా రాణిస్తూనే వ్యాపార రంగంలోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. 17 ఏళ్లకే ఆమె స్వతంత్ర మైక్రోఫైనాన్స్ పేరుతో ఓ కంపెనీని స్థాపించారు. ఇప్పటికే రూ.500 కోట్లకు పైగానే ఈ కంపెనీ రుణాలిచ్చింది. 90కి పైగా శాఖలున్నాయి.

రోషిణి నాడార్ (శివ్ నాడార్)



యాపిల్, ఐబీఎం తర్వాత ప్రపంచానికి కంప్యూటర్లను పరిచయం చేసిన సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్. ఆ కంపెనీ అధినేత శివ్‌నాడార్ కూతురే ఈమె. ప్రస్తుతం హెచ్‌సీఎల్ కార్పొరేషన్‌కు సీఈఓగా పనిచేస్తున్నారు. నార్త్ వెస్ట్రన్ యూనివర్శిటీ నుంచి కమ్యూనికేషన్‌లో రోషిణి అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. కెలాగ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ చదివారు.
ప్రత్యేకత: చదివిన చదువు, పనిచేస్తున్న రంగం భిన్నమైనవి కావడంతో హెచ్‌సీఎల్ టెక్‌లో బాధ్యతలు చేపట్టిన తొలి రోజుల్లో రోషిణి కొంత ఇబ్బంది పడ్డారు. అయితే ఆ తర్వాత క్రమక్రమంగా వాటిని అధిగమించి కంపెనీ వృద్ధిలో కీలక పాత్ర పోషించారు. చిన్న వయస్సులోనే ఫోర్బ్స్ అత్యుత్తమ శక్తిమంత మహిళల జాబితాలో చోటు దక్కించుకున్నారంటే ఆమె ప్రతిభను అర్థం చేసుకోవచ్చు. అంతేనా శివ్ నాడార్ ఫౌండేషన్‌కు ట్రస్టీగా కూడా ఉన్నారు.

వినీతా గుప్తా (దేశ్ బంధు గుప్తా)



దేశీయ ఔషధ రంగానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన కంపెనీల్లో లుపిన్ ఒకటి. 1968లో దేశ్ బంధు గుప్తా దీనిని స్థాపించారు. ప్రస్తుతం ఆయన వారసురాలిగా వినీతా గుప్తా లుపిన్‌కు సారథ్యం వహిస్తున్నారు. యూనివర్శిటీ ఆఫ్ ముంబయి నుంచి ఫార్మసీలో ఆమె డిగ్రీ పట్టా తీసుకున్నారు. అమెరికాలోని కెలాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ పూర్తి చేశారు.
ప్రత్యేకత: వినీతా 1993లో లుపిన్‌లో అడుగుపెట్టారు. సోదరుడు నీలేశ్ గుప్తాతో కలిసి ప్రపంచ దిగ్గజ కంపెనీల్లో ఒకటిగా లుపిన్‌ను తీర్చిదిద్దారు. అమెరికా, ఐరోపా లాంటి అభివృద్ధి చెందిన విపణుల్లో లుపిన్ అడుగుపెట్టడంలోనూ ఆమె కీలక పాత్ర పోషించారు.

ప్రపంచ మహిళా కుబేరుల సంపద
రూ.65 లక్షల కోట్లు

ప్రపంచంలో 256 మంది మహిళలు ఫోర్బ్స్ కుబేరుల జాబితాలో చోటు చేసుకున్నారు. ఇంత అధిక సంఖ్యలో మహిళలుండటం ఇదే తొలిసారి. వీరి అందరి సంపద విలువ కలిసి ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ.65 లక్షల కోట్లు) అని ఫోర్బ్స్ తెలిపింది. ఈ జాబితాలో 72 మంది మాత్రం సొంతంగా వ్యాపార సామ్రాజ్యాలు సృష్టించుకుని ఎదిగిన వారున్నారు.

మనవాళ్లు 8 మంది

మహిళా కుబేరుల్లో మనవాళ్లు 8 మంది ఉన్నారు. వీరిలో దేశీయంగా అగ్రస్థానం సావిత్రి జిందాల్-కుటుంబానిదే. 8.8 బి.డాలర్ల సంపదతో ఈమె మొత్తం జాబితాలో 176వ స్థానంలో ఉన్నారు.

- ✦ బయోకాన్ అధినేత కిరణ్ మజుందార్ షా 3.6 బి.డాలర్ల సంపదతో 629వ స్థానంలో నిలిచారు. దేశీయ మహిళా కుబేరుల్లో రెండో స్థానంలో ఉన్న ఈమె, సొంతంగా తన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు.
- ✦ 2.9 బి.డాలర్ల సంపదతో స్మితా క్రిష్ణ-గోద్రేజ్ ఈ జాబితాలో 822వ స్థానంలో ఉండగా, దేశీయ మహిళల్లో 3వ స్థానం పొందారు. మధుమేహ, హృద్రోగ ఔషధాలు, బయోసిమిలర్లు, ఇన్‌జెక్టబుల్స్, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రేడియెంట్స్ తయారు చేసే ప్రైవేటు సంస్థ యూఎస్‌వీని నిర్వహిస్తున్న లీనా తివారీ 2.4 బి.డాలర్ల సంపదతో 1,020వ స్థానంలో నిలిచారు. దేశీయంగా 4వ స్థానం పొందారు.
- ✦ 2.2 బి.డాలర్లతో 1,103వ స్థానాన్ని దక్కించుకున్న వినోద్, అనిల్ రాగా గుప్తాకు దేశీయంగా 5వ స్థానం లభించింది.
- ✦ 1.4 బి.డాలర్లతో 1,650వ స్థానాన్ని పొందిన అను ఆగా, దేశీయ మహిళా కుబేరుల్లో 6వ స్థానంలో ఉన్నారు. ఈమెకు చెందిన ఇంజినీరింగ్ సంస్థ థర్మెక్స్ షేర్ల విలువ పెరుగుదల వల్ల, రెండేళ్ల విరామం తరవాత మళ్లీ ఈ జాబితాలో నిలిచారని ఫోర్బ్స్ తెలిపింది.
- ✦ స్లీప్‌వెల్ పరుపుల తయారీ సంస్థ అయిన షీలా ఫోమ్‌ను 1971లో స్థాపించిన షీలా గౌతమ్, 1.1 బి.డాలర్లతో జాబితాలో 1,999వ స్థానం పొందారు. దేశీయ మహిళల్లో 7వ స్థానం సాధించారు.
- ✦ యెస్ బ్యాంక్‌లో 9.3 శాతం వాటా కలిగిన మధు కపూర్, ఈసారి కొత్తగా ఈ జాబితాలో చోటు సాధించారు. 1.1 బి.డాలర్లతో ఈమె 1,999వ స్థానం పొందారు.

సమానత్వం ఎక్కడ?

మహిళా వ్యాపారవేత్తలకు సమానత్వం విషయంలో అమెరికా, చైనాతో పోలిస్తే భారత్ చాలా వెనుకబడి ఉందని మాస్టర్‌కార్డ్ ఇండెక్స్ ఆఫ్ వుమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (ఎంఐడబ్ల్యూఈ) నివేదిక తెలిపింది. భారతదేశ సంస్కృతి, ఆర్థిక వ్యవహారాల్లో మహిళలకు సరైన ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం, సమాజంలో దక్కాల్సిన గుర్తింపు దక్కకపోవడం వంటి అంశాలతో సమానత్వం లేకుండా పోయిందని సర్వే తెలిపింది. 57 దేశాల్లో నిర్వహించిన ఈ సర్వేలో భారత్ 52, అమెరికా 4 , చైనా 29వ స్థానంలో నిలిచాయి.

✦ వేతనాల్లో వ్యత్యాసం తగ్గుతోంది!

భారత్‌లో మహిళల వేతనాలు పురుషులతో పోలిస్తే 20 శాతం తక్కువగా ఉంటున్నాయని మాన్‌స్టర్.కామ్ నివేదిక తేల్చింది. దీనికి ప్రధాన కారణం లింగ వివక్షే అని తెలిపింది. మాన్‌స్టర్ శాలరీ ఇండెక్స్ (ఎంఎస్‌ఐ) ప్రకారం గంటకు పురుషుల వేతనం రూ.231గా ఉంటే, మహిళలకు రూ.184.80లు మాత్రమే అందుతోంది. 2016లో 24.8 శాతం వరకూ మహిళల వేతనాలు తక్కువగా ఉండేవి. ప్రస్తుతం ఆ తేడాను 20 శాతానికి తగ్గించగలిగారు. పనిలో అనుభవం వచ్చే కొద్దీ ఈ తేడా తగ్గుతూ వస్తోందని నివేదిక వెల్లడించింది. రెండేళ్ల పని అనుభవం ఉన్న పురుషులతో పోలిస్తే 7.8 శాతం, 6-10 ఏళ్ల అనుభవం ఉన్న వారితో పోలిస్తే 15.3 శాతం, 11 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న వారితో పోలిస్తే 25 శాతం తక్కువ వేతనాలు మహిళలు అందుకొంటున్నారని మాన్‌స్టర్.కామ్ వెల్లడించింది.

రెనో ప్రత్యేక ఆఫర్లు

మహిళా వినియోగదారులకు ప్రత్యేకమైన ఆఫర్లు ప్రకటించింది రెనో ఇండియా కార్ల తయారీ సంస్థ. మార్చి 6-11 తేదీల మధ్య మహిళా వినియోగదారులు ఉచిత పికప్, డ్రాపింగ్ సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చని, ఉచిత వాహన చెకప్ కూడా చేయించుకోవచ్చని ప్రకటించింది. లేబర్ ఛార్జీలు, విడిభాగాల కొనుగోలు, ఇతర సేవలపై 10 శాతం రాయితీ పొందవచ్చని సంస్థ తెలిపింది.

స్నాప్‌డీల్ కానుక

స్నాప్‌డీల్ పలు వస్తువులపై రాయితీ ప్రకటించింది. మహిళల దుస్తులు మొదలుకొని ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆభరణాలు, వంటింటి ఉపకరణాలు, వంట సామాను సెట్లు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులపై రాయితీ ఇస్తున్నారు.

✦ 25% మహిళలే: టాటా మోటార్స్

టాటా మోటార్స్ సంస్థ మహిళా ఉద్యోగులకు పెద్దపీట వేయాలని భావిస్తోంది. రాబోయే కాలంలో వారి సంఖ్యను భారీగా పెంచుకొనే ఆలోచనలో ఉంది. వచ్చే నాలుగు, అయిదేళ్లలో కంపెనీలో 20-25 శాతం మంది మహిళా ఉద్యోగులు ఉండేలా ప్రణాళిక రచిస్తోంది.

ఫండ్ మేనేజర్లుగా రాణింపు



మహిళలు ఫండ్ మేనేజర్లుగానూ రాణిస్తున్నారు. దాదాపు రూ.3,06,500 కోట్ల ఆస్తుల నిర్వహణ (అసెట్ మేనేజ్‌మెంట్) బాధ్యతల్ని ప్రస్తుతం వీరు చూస్తున్నారు. ఇది మొత్తం మ్యూచువల్ ఫండ్ల ఆస్తుల్లో 15 శాతానికి సమానం. ఎప్పటికప్పుడు మార్కెట్లను జాగ్రత్తగా గమనిస్తూ.. మదుపర్లకు నష్టం రాకుండా ఏ ఏ షేర్లలో పెట్టుబడి పెట్టాలి? అధిక రాబడి ఎలా రాబట్టాలి? అనే కోణంలో ఆలోచిస్తూ వారు విజయవంతంగా ముందుకెళుతున్నారు. వీరి నిర్వహణలో ఉన్న ఫండ్ల ఆస్తులు 2017లో 32 శాతం పెరిగాయంటే వారు ఎంత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారో అర్థమవుతోంది. 2016లో 18 మంది ఫండు మేనేజర్లు ఉండగా 2017కు ఆ సంఖ్య 24కు చేరింది. వీరిలో లక్ష్మి అయ్యర్, బెక్సీ కురియకోస్, సునైనా, అంజు ఛాజెర్, రోషి జైన్, సోహిని అందానీ, స్వాతి కులకర్ణి తదితరులు ఉన్నారు.

✦ మహిళా సిబ్బందితోనే విమానాలు!

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విమానయాన సంస్థలు మహిళా సిబ్బందితో నేడు విమానాల్ని నడపబోతున్నాయి. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, విస్తారా, స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా సంస్థలు కేవలం మహిళా సిబ్బందితో తమ విమానాల్ని నడిపేందుకు సిద్ధమయ్యాయి. 'ఎంపిక చేసిన మార్గాల్లో విమానాల్ని మహిళా సిబ్బందితో నడపడంతోపాటు మహిళా ప్రయాణికులకు అధిక ప్రాధాన్యం ఇస్తామ'ని విస్తారా ఎయిర్‌లైన్స్ తెలిపింది. మహిళా కాక్‌పిట్, క్యాబిన్ సిబ్బందితో మూడు ప్రత్యేక విమానాలను నడుపుతున్నట్లు స్పైస్‌జెట్ సంస్థ తెలిపింది. అంతర్జాతీయ విమానాలతో పాటు, దేశీయంగా కొన్ని మార్గాల్లో మహిళా సిబ్బందితో విమానాలు నడిపిస్తున్నట్లు ఎయిర్ ఇండియా తెలిపింది.

✦ చౌకగా విమాన ప్రయాణం

దేశీయ విమానాల్లో రూ.1099కే ప్రయాణం చేసే అవకాశాన్ని విస్తారా ఎయిర్‌లైన్స్ కల్పిస్తోంది. మహిళా దినోత్సవం సందర్భంగా నేడు టికెట్ బుక్ చేసుకొన్న వారు మార్చి 16 నుంచి అక్టోబరు 10వ తేదీ మధ్య ప్రయాణం చేయవచ్చని సంస్థ తెలిపింది. చెన్నై-కోచి రూట్‌లో రూ.1099, దిల్లీ-చండీగఢ్, దిల్లీ-లఖ్‌నవూ రూట్లలో రూ.1199, దిల్లీ-హైదరాబాద్ రూట్‌లో రూ.2,199లకు టికెట్లు అందుబాటులో ఉంటాయి.

సెన్సెక్స్ ▼ 284 **33033**

నిఫ్టీ ▼ 95 **10154**

డోజోన్స్ 24598 ▼ 287 | నాస్‌డాక్ 7348 ▼ 24 | రూపాయి 64.89 ▲ 07 పైసలు (ఒక అమెరికా డాలరుకు) | ముడి చమురు 64.15 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).



ఘనం (+)

నిఫ్టీ	7న	మార్పు %
HCL TECH	949.55	1.80
ITC	259.90	1.33
ZEE ENTERTAINMENT	565.10	1.00
MARUTI SUZUKI	8679.10	0.73
ASIAN PAINTS	1107.25	0.51
TATA MOTORS	347.80	0.38
KOTAK MAHI BANK	1085.10	0.24

గ్రహణం (-)


నిఫ్టీ	7న	మార్పు %
ADANI PORT	376.95	-6.98
SBI	246.65	-3.86
INDIABULLS HSG	1196.25	-3.43
ICICI BANK	286.70	-2.83
BHARTI AIRTEL	403.20	-2.59
RELIANCE IND	889.75	-2.32
AMBUJA CEM	235.20	-2.26

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	59.05	68.47	బహ్రెయిన్ దీనార్	159.91	183.25
పౌండ్ స్టెర్లింగ్	82.02	95.14	కువైట్ దీనార్	179.03	222.87
యూరో	73.31	85.02	ఒమన్ రియాల్	156.59	179.15
జపనీస్ యెన్/100	55.86	64.80	సౌదీ రియాల్	15.70	18.61
ఆస్ట్రేలియా డాలరు	46.09	53.33	యూఏఈ దిర్హమ్	16.07	18.79
సింగపూర్ డాలరు	44.84	53.12	మలేషియా రింగిట్	14.82	18.23
థాయ్ బాత్/100	188.30	225.80	చైనీస్ యువాన్	7.25	11.76



భారతీయం.. సుసంపన్నం

● ధనవంతుల సంఖ్య పైపైకి ● 2022 కల్లా 71% పెరగొచ్చు ● ఆసియాలోనే మూడోస్థానం: సర్వే

ముంబయి

2022 కల్లా సంపన్న భారతీయుల జనాభా 71 శాతం పెరగవచ్చని ఓ సర్వే తేల్చింది. 50 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.325 కోట్లు) కంటే ఎక్కువ సంపద ఉన్న భారతీయులను ఇందులో పరిగణనలోకి తీసుకున్నారు. కాగా, 2022 కల్లా సంపన్నుల జనాభా విషయంలో ఆసియాలోనే మూడో స్థానం మనకు దక్కుతుందని నైట్ ఫ్రాంక్ వెలువరచిన 'వెల్త్ రిపోర్ట్ 2018' అంచనా వేస్తోంది. ఆ నివేదిక ఇంకా ఏమంటోందంటే..



- 2012-2017 మధ్య 54 శాతం వృద్ధితో సంపన్నుల జనాభా పెరిగింది.
- 2022 కల్లా 71% వృద్ధితో 2000 మంది కొత్తగా సంపన్నుల జాబితాలోకి జతచేరుతారు.
- 2017-2022 మధ్య ఏటా 2.5 లక్షల డాలర్ల కంటే ఎక్కువ సంపాదించేవారి సంఖ్య అధికంగా ఉండే తొలి 10 నగరాల్లో ముంబయి, దిల్లీల వంటివి ఉండొచ్చు.
- చైనా, జపాన్‌ల తర్వాత ఆసియాలో అత్యధిక ధనవంతుల జనాభా గల దేశంగా భారత్ మారుతుంది.
- మొత్తం 52 దేశాల్లోని 314 నగరాల్లోని సంపన్నుల జనాభా(50 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఉన్న వారు)ను పరిగణనలోకి తీసుకుంటే.. 2017లో వీరి సంఖ్య 11,630 పెరిగింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా 1,29,730 మంది సంపన్నులు ఉన్నట్లు లెక్కతేలింది.
- భారత్ విషయానికొస్తే.. 2016, 2017 మధ్య ధనవంతుల(5 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ) సంఖ్య 21 శాతం వృద్ధి చెంది 47,720కు చేరింది. ఇది అంతర్జాతీయ సగటు వృద్ధి అయిన 9 శాతంతో పోలిస్తే రెట్టింపు కావడం గమనార్హం. ఆసియా సగటు అయిన 14%తో పోలిస్తే ఒకటిన్నర రెట్లు ఎక్కువ.
- కాగా, ఆస్తుల్లో పెట్టుబడుల విషయంలో అంతర్జాతీయ సంపన్నులతో పోలిస్తే భారతీయులు వెనకబడి ఉన్నారు. కేవలం 23 శాతం మాత్రమే భారతీయులు అలా చేస్తుండగా.. అంతర్జాతీయంగా మాత్రం 43 శాతంగా ఉంది.



యువ కుబేరుడు పేటీఎం శర్మ

● సంపన్నుల్లో వృద్ధుడు సంప్రద సింగ్ ● ఫోర్బ్స్ బిలియనీర్ జాబితా విశేషాలు

దిల్లీ: పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ (39) భారత కుబేరుల్లో పిన్న వయస్కుడిగా, ఆల్కెమ్ లేబొరేటరీస్ గౌరవ ఛైర్మన్ సంప్రద సింగ్ (92) అత్యంత పెద్ద వయస్సు వ్యక్తిగా నిలిచారు. ప్రపంచంలోని 2,208 మంది కుబేరులతో ఫోర్బ్స్ సంస్థ జాబితాను విడుదల చేసిన సంగతి విదితమే.

పెద్దనోట్ల రద్దు కలిసొచ్చింది!

1.7 బిలియన్ డాలర్ల సంపదతో ఈ జాబితాలో 1,394వ స్థానాన్ని శర్మ పొందారు. 40 ఏళ్ల లోపు కుబేరులు 63 మంది ఉండగా, భారతీయుల్లో శర్మ ఒక్కరే ఉన్నారు. 2011లో మొబైల్ వాలెట్ పేటీఎంను స్థాపించిన శర్మకు, ఆ సంస్థలో 16 శాతం వాటా ఉంది. ఇది ఆర్థిక సేవల సంస్థ. పెద్దనోట్ల రద్దు సమయంలో, కొనుగోళ్లు-చెల్లింపులకు పేటీఎం వాడకం విస్తృతమైంది. 25 కోట్ల మంది నమోదిత వినియోగదారులుండగా, రోజూ 70 లక్షల లావాదేవీలు ఈ సంస్థలో జరుగుతున్నాయి. ఆ సంస్థ విలువ 9.4 బిలియన్ డాలర్లుగా ఫోర్బ్స్ ప్రకటించింది. ఇదే కాక వస్తువుల విక్రయాలకు, ఇకామర్స్ పోర్టల్ పేటీఎంమాల్‌ను స్థాపించారు.

ఔషధ దుకాణంలో పనిచేసి.. సొంత పరిశ్రమ స్థాపించి..

1.2 బి.డాలర్ల సంపదతో 1,867వ స్థానంలో సంప్రద సింగ్ నిలిచారు. ఔషధ సంస్థ ఆల్కెమ్ లేబొరేటరీస్‌ను 45 ఏళ్ల క్రితం సింగ్ స్థాపించారు. తొలుత ఒక ఔషధ విక్రయశాలలో పనిచేసిన సింగ్, తరవాత సొంతగా ఔషధ పంపిణీ వ్యాపారాన్ని చేపట్టారు. అనంతరం జనరిక్స్ తయారీ ప్రారంభించారు. అత్యధికంగా విక్రయమయ్యే యాంటీబయోటిక్స్ క్లావమ్, టాక్సిమ్‌ను ఈ సంస్థే తయారు చేస్తోంది.

అవే భయాలు..

వెంటాడిన వాణిజ్య యుద్ధం ● 3 నెలల కనిష్ఠానికి సెన్సెక్స్

సమీక్ష

వరుసగా ఆరో రోజూ సూచీల నష్టకష్టాలు కొనసాగాయి. వాణిజ్య యుద్ధానికి అమెరికా సిద్ధంగా ఉందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించడంతో అంతర్జాతీయ సంకేతాలు ప్రతికూలంగా మారాయి. స్వేచ్ఛా వాణిజ్యానికి అనుకూలంగా ఉండే ట్రంప్ ఆర్థిక సలహాదారు గ్యారీ కోన్ రాజీనామా చేయడం ఇందుకు తోడైంది. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్, ఔషధ షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తాయి. ఫలితంగా సెన్సెక్స్ మూడు నెలల కనిష్ఠానికి చేరగా, నిఫ్టీ 10,200 దిగువకు చేరింది. ఆసియా, ఐరోపా మార్కెట్లు కుదేలయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 33,279.39 పాయింట్ల వద్ద బలహీనంగా ప్రారంభమైంది. అనంతరం అదే తీరును కొనసాగించిన సూచీ.. ఒకానొకదశలో 32,991.14 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 284.11 పాయింట్ల నష్టంతో 33,033.09 పాయింట్ల దగ్గర స్థిరపడింది. డిసెంబరు 7 తర్వాత సూచీకిదే కనిష్ఠ ముగింపు కావడం గమనార్హం. గత ఆరు సెషన్లలో సూచీ ఏకంగా 1,412.66 పాయింట్లు కోల్పోయింది. ఇక నిఫ్టీ సైతం 95.05 పాయింట్లు తగ్గి 10,154.20 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,141.55- 10,243.35 పాయింట్ల మధ్య కదలాడింది.

ఐసీఐసీఐ బేజారు: పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం కేసులో బ్యాంక్ సీనియర్ అధికార్లకు తీవ్ర నేరాల దర్యాప్తు కార్యాలయం (ఎస్ఎఫ్ఐఓ) సమన్లు జారీ చేయడంతో ఐసీఐసీఐ బ్యాంక్ షేరు డీలాపడింది. ఇంట్రాడేలో రూ.285.30 వద్ద కనిష్ఠానికి చేరిన షేరు.. చివరకు 2.85% నష్టంతో రూ.2.85 వద్ద ముగిసింది. యాక్సిస్ బ్యాంక్ సైతం 0.77% తగ్గి రూ.512.80 దగ్గర స్థిరపడింది.

చిన్న పట్టణాలకూ విమానయానం

● 56 విమానాశ్రయాలు, 31 హెలిపోర్టులు నవీకరణ ● రూ.4,500 కోట్లు కేటాయింపు ● పౌర విమానయాన శాఖ సంయుక్త కార్యదర్శి ఉషా పాఢీ

ఈనాడు, హైదరాబాద్: దేశంలో విమానయానం ద్వితీయ, తృతీయ, అంతకంటే తక్కువ స్థాయి పట్టణాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. కొండ ప్రాంతాలకు కూడా హెలికాప్టర్లు తక్కువ సీటర్ల విమానాలతో సేవలను విస్తరించనుంది. ఇందు కోసం రూ.4,500 కోట్లతో 56 విమానాశ్రయాలను, 31 హెలిపోర్టులను నవీకరించనున్నట్లు పౌర విమానాయాన శాఖ సంయుక్త కార్యదర్శి ఉషా పాఢీ తెలిపారు. ఏడాదిన్నరలో ఇది పూర్తవుతుందన్నారు. మిలటరీ ఆధీనంలోని 60 విమానాశ్రయాలను కూడా పౌర విమానయాన సేవలకు వినియోగించుకోవడానికి రక్షణ మంత్రిత్వ శాఖ సానుకూలంగా స్పందిస్తోందని వివరించారు. బిజినెస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఆపరేటర్ల సంఘం (బీఏఓఏ) నిర్వహించిన 'బిజ్‌ఏవ్ ఇండియా 2018' కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు.

16 విమానాశ్రయాల ద్వారానే..: దేశంలోని 80 శాతం విమాన ప్రయాణాలు 15-16 ప్రధాన విమానాశ్రయాల ద్వారానే జరుగుతున్నాయని, 20 శాతం మందే సుదూర ప్రాంత విమానాశ్రయాల ద్వారా రాకపోకలు నిర్వహిస్తున్నారని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఉడాన్) జి.కె.చౌకియాల్ తెలిపారు. బెనారస్, అహ్మదాబాద్ వంటి 10-15 ఏఏఐ విమానాశ్రయాలను నవీకరిస్తున్నట్లు చెప్పారు.

20 శాతం వృద్ధి..: దేశంలో పౌర విమానయాన రంగంతోపాటు బిజినెస్ ఏవియేషన్ కూడా దేశంలో ఆకర్షణీయంగా వృద్ధి చెందుతోందని గత ఏడాది 20 శాతం పెరుగుదల నమోదైందని బిజినెస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు రోహిత్ కపూర్ తెలిపారు. 'మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసి, కఠినమైన నిబంధనలు తొలగిస్తే.. దేశంలో కమర్షియల్ ఏవియేషన్ మరింతగా అభివృద్ధి చెందుతుంది. ఉడాన్ రెండో విడత అమలులోనైనా ఈ విభాగానికి ప్రాధాన్యం ఇవ్వాల'ని కోరారు. వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) అమలు వల్ల చార్టర్ విమానాల్లో ప్రయాణించే వారిపై పన్ను భారం 15 శాతం నుంచి 18 శాతానికి పెరిగిందని బీఏఓఏ పేర్కొంది. కొనుగోలు ద్వారా దిగుమతి చేసుకున్న విమానాలపై 5 శాతం పన్ను భారాన్ని విధించడం వల్ల నాన్ షెడ్యూల్ ఆపరేటర్లపై భారం పెరిగిందని తెలిపింది. బిజినెస్ ఏవియేషన్‌పై జీఎస్‌టీ భారాన్ని డెలాయిట్ అంచనా వేసి నివేదికను విడుదల చేసింది.

డేటా నేటి ఇంధనం

ఐఎంటీ స్నాతకోత్సవంలో కిరణ్ మజుందార్ షా

ఈనాడు, హైదరాబాద్: కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల్లో నిపుణులకు చాలా గిరాకీ ఉందని.. గత ఏడాది కాలంలో దేశంలో డేటా విశ్లేషకుల (అనలిటిక్స్) ఉద్యోగాలు దాదాపు రెట్టింపు అయ్యాయని బయోకాన్ ఛైర్‌పర్సన్, ఎండీ కిరణ్ మజుందార్ షా అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా డేటా విశ్లేషణ నైపుణ్యాల కొరత ఉందని, దీంతో అంతర్జాతీయ కంపెనీలు డేటా ఎనలిటిక్స్ ప్రాజెక్టులను భారత్‌లోని నిపుణులకు అప్పగిస్తున్నాయని (పొరుగు సేవలు) ఆమె అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్ టెక్నాలజీ (ఐఎంటీ), హైదరాబాద్ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సందర్భంగా మజుందార్ షా మాట్లాడారు. ఐఎంటీ ప్రాంగణాలకు మొదటి సారిగా వచ్చిన తొలి మహిళా ముఖ్య అతిథి కిరణ్ మజూందార్ షానే అని ఐఎంటీ, హైదరాబాద్ ప్రెసిడెంట్ కమల్‌నాథ్ అన్నారు. ఐఎంటీ హైదరాబాద్ విద్యను పూర్తి చేసిన 300 మందికి పైగా పీజీడీఎం విద్యార్థులు స్నాతకోత్సవంలో పట్టాలను స్వీకరించారు. ఐఎంటీ హైదరాబాద్ డైరెక్టర్ సతీశ్ ఐలావడి వార్షిక నివేదికను సమర్పించారు.

విస్తరణ దిశగా క్లిక్2క్లినిక్

ఈనాడు, హైదరాబాద్: ఇంటి వద్దనే వైద్య సేవలను అందిస్తోన్న హైదరాబాద్ అంకురం క్లిక్2క్లినిక్ దేశంలో మరో 12 నగరాలకు విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది. దీనికోసం 'హోమ్ హీల్' యాప్ అభివృద్ధి కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో మరో రూ.3కోట్లను సమీకరించాలని లక్ష్యంగా విధించుకుంది. ఇప్పటికే సమీకరించిన రూ.6కోట్లకు ఇది అదనం. ఈ విస్తరణలో భాగంగా 1400 మంది నర్సులు, ఇతర సిబ్బందిని కొత్తగా నియమించుకోనుంది. త్వరలోనే ముంబయి, పుణె, చెన్నై, అహ్మదాబాద్‌లో పేషెంట్-డాక్టర్ సేవలను ప్రారంభించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ డాక్టర్ సుజీత్ ఆర్ పున్నం తెలిపారు.

టెలికాం సంస్థలకు ఊరట

స్పెక్ట్రమ్ చెల్లింపులకు మరింత గడువు

దిల్లీ: రూ.4.6 లక్షల కోట్ల రుణభారంతో ఇబ్బంది పడుతున్న టెలికాం సంస్థలకు ఊరట కలిగించే నిర్ణయాన్ని కేంద్ర మంత్రివర్గం తీసుకుంది. వేలంలో కొనుగోలు చేసిన స్పెక్ట్రమ్‌కు చెల్లింపులు జరిపేందుకు గడువును మరింత పెంచేందుకు ఆమోదం తెలిపింది. ఒక్కో నెట్‌వర్క్ సంస్థ కలిగి ఉండే స్పెక్ట్రమ్ పరిమితిని సడలించాలనీ నిర్ణయించింది. టెలికాం రంగ స్థితిగతులను అధ్యయనం చేసేందుకు నియమించిన మంత్రివర్గ సంఘం (ఐఎంజీ) సిఫారసుల మేరకు ఈ నిర్ణయాలు తీసుకుంది. స్పెక్ట్రమ్‌కు ఇంకా చెల్లించాల్సిన మొత్తాలు పునర్‌వ్యవస్థీకరించాలని నిర్ణయించినందున, టెలికాం సంస్థలకు నగదు రూపేణ సత్వర ఉపశమనం లభిస్తుందని పేర్కొంది. స్పెక్ట్రమ్ గరిష్ఠ పరిమితిని సడలించినందున, టెలికాం రంగంలో ఏకీకరణకు అవకాశం లభిస్తుందని, భవిష్యత్తు వేలాల్లో మరింత చురుకుగా పాలుపంచుకుంటారని ఆశిస్తున్నారు.

31లోగా రిటర్నులు దాఖలు చేయాలి

ఈనాడు, హైదరాబాద్: నోట్ల రద్దు సమయంలో రూ.కోటికిపైగా డబ్బు బ్యాంకుల్లో జమచేసి ఆదాయపన్ను రిటర్న్‌లు దాఖలు చేయని రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 681 మందిపై దృష్టి సారించామని హైదరాబాద్ ఆదాయపన్ను శాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఆదాయపన్నుశాఖ కార్యాలయం బుధవారం ఒక ప్రకటన జారీ చేసింది. నోట్ల రద్దు సమయంలో రూ.కోటికిపైగా డబ్బు జమచేసి, రిటర్నులు దాఖలు చేయనివారు దేశవ్యాప్తంగా 10238 మంది ఉన్నారని, రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సంఖ్య 681 అన్నారు. రిటర్నులు దాఖలు చేయని సంస్థలు 79, భాగస్వామ్య సంస్థలు 177 ఉన్నాయన్నారు. వీరందరి వ్యాపార కార్యకలాపాలు, ప్రస్తుత లావాదేవీలు తమ నిఘాలో ఉన్నాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. తాము జమచేసిన నగదుకు సంబంధించి తగిన ఆధారాలు చూపించలేకపోతే చట్టపరంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. వీరంతా మార్చి 31వ తేదీలోగా రిటర్నులు దాఖలు చేయాలని స్పష్టం చేశారు.

మ్యూచువల్ కాలర్ ఆవిష్కరణ

ఈనాడు, హైదరాబాద్: గుర్తు తెలియని ఫోన్ నెంబరు నుంచి కాల్ వచ్చినప్పుడు అది ఎవరి నెంబరో తెలుసుకునేందుకు వీలుగా ఓ కొత్త యాప్‌ను హైదరాబాద్ అంకురం ఎంటర్ యాప్స్ విడుదల చేసింది. మ్యూచువల్ కాలర్ పేరుతో దీన్ని ఆండ్రాయిడ్ వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది. దీన్ని గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కాల్ చేసిన వ్యక్తి నెంబరు, మీకు తెలిసిన వ్యక్తుల ఫోనులో నిక్షిప్తం అయి ఉంటే ఆ వివరాలూ తెలుస్తాయి. ఇందులో వర్చువల్ కాలర్ సదుపాయాన్ని కల్పించినట్లు ఎంటైర్ యాప్స్ వ్యవస్థాపకుడు మునిపల్లె సాంబశివరావు తెలిపారు.



కోడిగుడ్లు — 7న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	345	వరంగల్	347
చిల్లరగా(ఒక గుడ్డు)	4.05	విశాఖపట్నం	350
బెంగళూరు	375	చెన్నై	385
8వ తేదీకి...		చిత్తూరు	378
విజయవాడ/గోదావరి	340	నమక్కల్	370

జపాన్ ఎస్ఎంఈలకు ప్రత్యేక పార్కు

● మంత్రి కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: భారత దేశంలో పెట్టుబడులు పెట్టి, ఇక్కడి పరిశ్రమలతో కలిసి పనిచేయాలనుకునే జపాన్ ఎస్ఎంఈల కోసం ప్రత్యేకంగా ఒక పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.టి.రామారావు అన్నారు. జపాన్ అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు తన జపాన్ పర్యటనలో వివిధ సంస్థలతో చర్చించినట్లు పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో) సంయుక్తంగా ఏర్పాటు చేసిన భారత్-జపాన్ వ్యాపార భాగస్వామ్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో 30 జపాన్ కంపెనీలు ఉన్నాయనీ.. ఏసె ఫుడ్స్ ఇక్కడ తమ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఎంఓయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. జపాన్ పెట్టుబడులు హైదరాబాద్‌కు వచ్చేలా జెట్రో-సీఐఐ కలిసి కృషి చేయాల్సిందిగా కోరారు. జెట్రో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శిగేకీ మయెదా మాట్లాడుతూ.. భారత్‌లో జపాన్ కంపెనీలు ఇప్పటికే గణనీయంగా పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. మొత్తం 1369 కంపెనీలు, 4838 కేంద్రాలను నిర్వహిస్తున్నాయన్నారు. ఆటోమొబైల్స్, గృహోపకరణాలు, ఐఓటీ, ఏఐ కంపెనీలు ఇక్కడకు వచ్చాయని తెలిపారు. జపాన్‌లో సాంకేతిక నిపుణుల కొరత ఉందనీ, భారత్ నుంచి వచ్చే ఐటీ నిపుణులకు అక్కడ మంచి అవకాశాలున్నాయని తెలిపారు. ప్రభుత్వం కూడా వారికి అనేక ప్రయోజనాలను కల్పిస్తోందన్నారు. 2030 నాటికి 9,20,000 మంది నిపుణుల అవసరం ఉందనీ, అయితే, ఇందులో 1,70,000 వరకూ కొరత ఉందన్నారు. భారత కంపెనీలు ముఖ్యంగా ఫార్మా కంపెనీలకు జపాన్ మంచి పెట్టుబడి అవకాశాలను కల్పిస్తోందన్నారు. సీఐఐ తెలంగాణ విభాగం ఛైర్మన్ వి.రాజన్న మాట్లాడుతూ.. జపాన్ భారత్‌లో నాలుగో అతి పెద్ద పెట్టుబడిదారు అని తెలిపారు. ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ హాజరయ్యారు.

హోదా అసాధ్యం

అందుకు సమానంగా నిధులు ఇవ్వడానికి సిద్ధం

- ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా ఎస్పీవీని ఏర్పాటు చేసుకోవాలని చెప్పాం
- ఆంధ్రప్రదేశ్ స్పందన కోసమే ఎదురుచూస్తున్నా...
- ఇప్పటికే పన్ను రాయితీలు ప్రకటించాం
- ఈశాన్య రాష్ట్రాల తరహాలో ఇస్తే.. ఏపీ కంటే అల్పాదాయ రాష్ట్రాలూ అడుగుతాయి
- ఉద్యమాలు డబ్బును పెంచలేవు
- కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టీకరణ

ఈనాడు – దిల్లీ



ఆంధ్రప్రదేశ్‌కు 'ప్రత్యేక హోదా'తో సమానమైన మొత్తాన్ని అందించడానికి కేంద్రం కట్టుబడి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లు ఈ మొత్తాన్ని నాబార్డు ద్వారా కూడా అందించడానికి సమ్మతమేనని వెల్లడించారు. అయితే... ద్రవ్య బాధ్యత-బడ్జెట్ నిర్వహణ (ఎఫ్‌ఆర్‌బీఎం) చట్టం పరిధిలోకి రాకుండా ఉండటానికి ప్రత్యేక ప్రయోజక వాహనం ఏర్పాటు చేసుకోవాలని ఏపీకి గతంలోనే చెప్పామన్నారు. దీనిపై ఏపీ ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూస్తున్నామనీ... వారు సానుకూలంగా స్పందిస్తే వెంటనే నిధులు ఇస్తామని జైట్లీ అన్నారు. ప్రత్యేక హోదా కోసం ఆంధ్రప్రదేశ్ డిమాండ్ చేస్తున్న తరుణంలో- బుధవారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో ప్రత్యేకంగా విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేసి, దీనిపైనే మాట్లాడారు.

"ప్రత్యేక హోదాను ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చారు. వాటికి తగినన్ని సొంత ఆదాయ వనరులు లేనందునే ఆ ప్రయోజనం కల్పించారు. కేంద్ర, రాష్ట్రాలు ఎవరి పన్నుల్ని అవి వసూలు చేసుకుంటాయి. ఇప్పుడు జీఎస్టీ వచ్చింది. దాన్ని కేంద్ర, రాష్ట్రాలు పంచుకుంటాయి. కేంద్ర వాటా కిందికొచ్చే పన్నుల్లో కొంత మొత్తాన్ని ప్రతి ఐదేళ్లకోసారి ఆర్థిక సంఘం చేసే సిఫారసుల ఆధారంగా రాష్ట్రాలకు పంపిణీ చేస్తారు. అది కూడా రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం కిందికే వస్తుంది. తర్వాత మిగిలే మొత్తంతో కొన్ని ప్రాయోజిత పథకాలను కేంద్రం అమలు చేస్తుంది. ప్రస్తుతం ఇలాంటి అన్ని పథకాలకూ కేంద్రం 60%, రాష్ట్రాలు 40% సమకూర్చుకోవాల్సి ఉంది. ఇప్పుడు ప్రత్యేకహోదా అన్నది ఎవరికీ లేనప్పటికీ... ఈశాన్య రాష్ట్రాలతోపాటు, మూడు హిమాలయ పర్వత ప్రాంతాలకు కేంద్రం 90% నిధులను సమకూరుస్తోంది. మిగిలిన 10% మొత్తాన్ని ఆ రాష్ట్రాలు సొంత వనరుల నుంచి సమకూర్చుకోవాల్సి ఉంటుంది. తద్వారా ఆయా రాష్ట్రాలకు 30% ఆదా అవుతుంది. విభజనను తెలంగాణ కోరుకుంటే, ఆంధ్రప్రదేశ్ వ్యతిరేకించింది. దానివల్ల ఆంధ్రప్రదేశ్ వనరుల కొరత ఎదుర్కొంటుందన్నది ప్రతి ఒక్కరికీ స్పష్టంగా తెలుసు. ఏపీకి కొంత ప్రత్యేక సాయం చేయాల్సి ఉంది. విభజన సమయంలో 'ప్రత్యేక హోదా' విధానం అమల్లో ఉన్నందున- ఏపీకి ఆ హోదా ఇస్తామని వాగ్దానం చేశారు. రాజ్యాంగపరంగా ఏర్పాటైన 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదా ఎవ్వరికీ ఇవ్వొద్దని సిఫారసు చేసింది. దానికి బదులు రెవిన్యూలోటు ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు పరిహారం ఇచ్చింది. అప్పటివరకూ ఉన్న పన్నుల పంపిణీని 32% నుంచి 42%కి పెంచడంతోపాటు... కొన్నేళ్ల పాటు ప్రతి రాష్ట్ర రెవిన్యూలోటును భర్తీ చేస్తామని చెప్పింది. అందుకు తగ్గట్టుగానే ఆంధ్రప్రదేశ్ రెవిన్యూలోటు భర్తీకి తగిన ఏర్పాటు కూడా జరిగింది. అయినా మేం దాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సంప్రదించి ఐదేళ్ల పాటు హోదా ఉన్న రాష్ట్రాలతో సమానంగా కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ఆంధ్రప్రదేశకూ 90:10 నిష్పత్తిలో సహాయం చేయాలని నిర్ణయించాం. ఇప్పటికే మూడేళ్లు పూర్తయింది. ఏ సంవత్సరం ఎంత మొత్తం కేంద్ర ప్రాయోజిత పథకాల కింద వచ్చిందన్న వాస్తవ లెక్కలు అందుబాటులో ఉన్నాయి. దీని ప్రకారం 30% తేడా మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వడానికి అంగీకరించాం. విదేశీ ఆర్థిక సంస్థలైన ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, జైకా వంటి సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు రుణాలు అందిస్తే... అందులో 90% మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం చెల్లించడానికి 2016లోనే సంప్రదింపుల సందర్భంగా అంగీకారం కుదిరింది. ఇప్పటికీ మేం దానికి కట్టుబడి ఉన్నాం. ఈ ఏడాది జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం తమకు ఆ మొత్తాన్ని విదేశీ ఆర్థిక సంస్థల నుంచి కాకుండా.. నాబార్డు నుంచి అందించాలని కోరింది. నాబార్డు నేరుగా కేంద్రానికి ఆ రుణం అందిస్తే... అది మా ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలోకి వస్తుంది. ఒకవేళ రాష్ట్రానికి ఇస్తే వారి ఎఫ్‌ఆర్‌బీఎంపై ప్రభావం పడుతుంది. దానివల్ల ఎవరో ఒకరి రుణపరిమితి తగ్గిపోతుంది. దీనిపై నాబార్డుతో మాట్లాడ్డానికి ఇప్పటికీ సిద్ధంగా ఉన్నామనీ... అయితే మీ ఆర్థికలోటుపై ప్రభావం పడకుండా ఆ మొత్తాన్ని ఎలా తీసుకోవాలనుకుంటున్నారో చెప్పాలని ఆంధ్రప్రదేశ్‌ను కోరాం. ఫిబ్రవరి 6, 7 తేదీల్లో కేంద్ర, రాష్ట్ర అధికారుల మధ్య జరిగిన చర్చల్లో నాబార్డు రుణం తీసుకోవడానికి ప్రత్యేక మార్గం (ఎస్పీవీ) కింద ఏదైనా కంపెనీనిగానీ, కార్పొరేషన్‌నుగానీ ఏర్పాటు చేసుకోవాలని సూచించాం. నాబార్డు రుణాలు దానికి వస్తాయని, దాన్ని 90:10 నిష్పత్తిలో మేం చెల్లిస్తామని చెప్పాం. నాబార్డు ద్వారానైనా; విదేశీ ఆర్థిక సంస్థల ద్వారానైనా ప్రత్యేక హోదాకు సమానమైన మొత్తాన్ని ప్రత్యేక ప్యాకేజీ రూపంలో అందించడానికి కేంద్రం సుముఖంగా ఉంది. ఈ మొత్తాన్ని ఏ రూపంలో కావాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెప్పాలి. వారి స్పందన కోసం మేం ఎదురుచూస్తున్నాం. అక్కడి నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నాం. మేం ఇవ్వబోమని ఎప్పుడూ చెప్పలేదు. ప్రత్యేకహోదా అంటే కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 60:40కి బదులు 90:10 నిష్పత్తిలో నిధులు అందుతాయి. అంతకుమించి ఇంకేమీ లేదు. ఆ 30% కింద ఎంతమొత్తం వస్తుందన్నది అణాపైసాతో సహా లెక్కపెట్టొచ్చు. ఆ మొత్తాన్ని పైసాతో సహా మరోరకంగా అందుకోండి. విదేశీ ఆర్థిక సంస్థల ద్వారాగానీ; నాబార్డు ద్వారాగానీ ఆ మొత్తాన్ని అందించడానికి సిద్ధం. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. ఎంపీలు, మంత్రులు కలిసినప్పుడు కూడా నేను అదే చెప్పాను. ఆ రాష్ట్రానికి ఆర్థిక మద్దతు అవసరముందని నమ్ముతున్నాను కాబట్టే వారి పట్ల నాకు పూర్తి సానుభూతి ఉంది" అని జైట్లీ అన్నారు.

యూపీయే ప్రభుత్వం ఇదివరకే ప్రత్యేక హోదాకు ఆమోదముద్ర వేసింది కదా?

దాని తర్వాతే ఆర్థిక సంఘం సిఫారసులు వచ్చాయి. అది మొత్తం ప్రాతిపదికను మార్చేసింది. పన్నుల పంపిణీని 32% నుంచి 42%కి పెంచింది. తర్వాత రెవిన్యూలోటును ప్రత్యేక పద్ధతిలో లెక్కించారు.

మీరు ఇందులో పెద్దగా సమస్యలేదంటున్నారు? మరి రాష్ట్ర ప్రభుత్వమెందుకు అర్థం చేసుకోవడంలేదు?

ఆంధ్రప్రదేశ్ మిత్రులు అర్థం చేసుకుంటారని నేను నమ్ముతున్నాను. విభజన చట్టం కింద చెప్పిన ప్రాజెక్టులకు దేనిపై ఎంత ఖర్చుచేసిందీ మా దగ్గర లెక్కుంది. చట్టం ప్రకారం చెప్పిన ప్రతి వాగ్దానానికీ కేంద్రం కట్టుబడి ఉందని మరోసారి చెబుతున్నా.

11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదాను కొనసాగిస్తున్నప్పుడు మాకెందుకు ఇవ్వరు అని చంద్రబాబు ప్రశ్నిస్తున్నారు కదా?

దీనిపై ఆర్థికసంఘం కొన్ని అభిప్రాయాలను వ్యక్తం చేసింది. దానికి రాజ్యాంగం ప్రకారం ఒక ప్రక్రియ ఉంది. అన్ని విషయాలనూ అదే నిర్ణయిస్తుంది.

'హోదా ఇవ్వొద్దని మేం చెప్పలేదు' అని అందులోని సభ్యులు చెబుతున్నారు కదా?

ముందు మీరా నివేదికను చదవండి. ఈశాన్య రాష్ట్రాలు, మూడు హిమాలయ రాష్ట్రాలకు మేం విభిన్న విధానం అనుసరిస్తున్నామని ఆర్థిక సంఘం చెప్పింది.

వాటికి 90:10 నిష్పత్తి ప్రకారం నిధులు పొందడానికి అర్హత ఉందని పేర్కొంది.

మీరు బిహార్‌ను ఉదహరిస్తున్నారు. కానీ... కొన్ని షరతులకు లోబడి ఏపీ విభజన జరిగింది కాబట్టి వాటన్నింటినీ అమలుచేయాలని పార్టీలు కోరుతున్నాయి కదా?

ప్రతి షరతునూ సంతృప్తి పరచడానికి మేం సిద్ధంగా ఉన్నాం. విభజన చట్టంలో చెప్పిన ప్రతి వాగ్దానానికీ కేంద్రం కట్టుబడి ఉంది. ఇప్పటికే ఈ విషయం పార్లమెంటులో చెప్పాను. ఇప్పుడు మరోసారి చెబుతున్నా. 14వ ఆర్థిక సంఘం సిఫారసుల తర్వాత ప్రత్యేక హోదా బదులు మేం ప్రత్యేక ప్యాకేజీ అంటున్నాం. అంతకుమించి రెండింటి మధ్య ఎలాంటి తేడా లేదు.

కేంద్ర-రాష్ట్రాల మధ్య సంబంధాలు చివరిదశకు వచ్చాయన్న ఉద్దేశంతోనే మీరిలా బహిరంగంగా కేంద్ర ప్రభుత్వ వాదనను వినిపిస్తున్నారని అనుకోవచ్చా?

మా విధానం గురించి ఆంధ్రప్రదేశ్ మిత్రులతోపాటు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కోరుకుంటున్నా. ప్రత్యేక హోదాకు సమానమైన ఆర్థిక ప్రయోజనాలు కల్పించడానికి సిద్ధంగా ఉన్నాం. రాష్ట్రం తొలుత 'ఈఏపీ' అని చెప్పింది. ఇప్పుడు నాబార్డు ద్వారా ఇవ్వాలని కోరింది. దానికి అంగీకరించాం. ఏ ఖాతాలో ఆ డబ్బు జమచేయాలన్న దాని కోసం నేను వేచిచూస్తున్నా.

ప్రత్యేక హోదా రాష్ట్రాలకు సాధారణ ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టు (ఈఏపీ) రుణాల్లోనూ 90% కేంద్రమే భరిస్తుంది కదా?

అలాంటి వెసులుబాటు లేదు. అది కేవలం కేంద్ర ప్రాయోజిత పథకాలకే వర్తిస్తుంది.

రెవెన్యూ లోటు సంగతేంటి?

రాష్ట్రం ఏర్పడిన తొలి పది నెలల కాలానికి మేం చెల్లింపులు జరపాల్సి ఉంది. మిగతా ఐదేళ్ల కాలానికి ఆర్థిక సంఘం రెవిన్యూ లోటును లెక్కించింది. 2013-14లో చేసిన ఖర్చులను తదుపరి పది నెలలకు వర్తింపజేసి చూస్తే... దాదాపు రూ.4 వేల కోట్ల మేర ఉంది. అది ఇప్పటికే ఇచ్చాం. ఇంకా రూ.138 కోట్లే మిగిలింది. అది కాకుండా మరో ప్రత్యామ్నాయం ఉంది. 14వ ఆర్థిక సంఘం 2015-16కి సంబంధించి 12 నెలలకు రెవిన్యూలోటును నిర్ధారించింది. దాన్ని పాత సంవత్సరంలోని పదినెలలకూ కలిపి మొత్తం 22 నెలలకూ వర్తింపజేస్తే... మునుపు ఇచ్చిన రూ.4వేల కోట్లు కాకుండా మరో రూ.1,600 కోట్లు ఇవ్వాల్సి వస్తుంది. 2015-16 లెక్కల ప్రకారం వెళ్తే ఆంధ్రాకు లబ్ధి జరుగుతుంది. ఈ సమస్యకు ఇంతటితో ముగింపు పలకాలనుకుంటున్నాం. కాబట్టి ఆ ప్రతిపాదనకూ మేం సిద్ధంగానే ఉన్నాం. వాళ్లకు తొలి ఆప్షన్ కంటే రెండో ఆప్షన్ వల్లే ఎక్కువ లబ్ధి జరుగుతుంది. ఒకసారి ఈ రెండు అంశాలు పరిష్కారమైతే, మిగిలిన అంశాలన్నీ పరిష్కారమవుతాయి. మేం ప్రకటించిన అన్ని విద్యాసంస్థలూ నిర్మాణ దశలో ఉన్నాయి.

పన్ను రాయితీల సంగతేంటి?

ఆంధ్రప్రదేశ్‌కు తొలి రెండు బడ్జెట్‌లలోనే పెట్టుబడి (ఇన్వెస్ట్‌మెంట్), డిప్రిషియేషన్ (తరుగుదల) అలవెన్స్ రూపంలో పన్ను రాయితీలు ప్రకటించాం. ఈ విషయంలో ఒక విధానాన్ని అనుసరించాలి. ఒకసారి వీరికి ఈశాన్య రాష్ట్రాలతో సమానంగా రాయితీలిస్తే... ఆంధ్రప్రదేశ్ కంటే ఎంతో తక్కువ ఆదాయ వనరులున్న రాష్ట్రాలు మాకెందుకివ్వరు అని అడుగుతాయి. బిహార్ కూడా విడిపోయింది. అందువల్ల మనం దేశాన్ని మొత్తంగా చూడాలి. నేను ఈరోజు రెండు ప్రధాన అంశాలు పరిష్కారం కావాలని కోరుకుంటున్నాను. ప్రత్యేక హోదాకు సమానమైన మొత్తాన్ని వారు ఏ రూపంలో కోరుకుంటే ఆ రూపంలో అందించడానికి సిద్ధంగా ఉన్నాం.

ఇప్పుడిది రాజకీయాంశంగా రూపుదిద్దుకొంది కదా?

రాజకీయాంశాలు వనరుల పరిమాణాన్ని (క్వాంటమ్ ఆఫ్ మనీని) పెంచలేవు. ఎందుకంటే కేంద్రానికి అయాచిత నిధుల ప్రవాహం లేదు. కేంద్ర నిధుల్లో దేశంలోని అన్ని రాష్ట్రాలకూ ఒకే రకమైన హక్కు ఉంటుంది. సెంటిమెంట్ అన్నది వనరుల పరిమాణాన్ని నిర్ధారించలేదు. ఏ రాష్ట్రానికి ఎంత నిధులివ్వాలన్నది ఆర్థిక సంఘం నిర్ణయిస్తుంది. విభజన కారణంగా ఏపీ దెబ్బతిన్న విషయం నాకు తెలుసుకాబట్టి వ్యక్తిగతంగా వారి పట్ల సానుభూతి ఉంది. అన్ని సమస్యలనూ కేంద్ర-రాష్ట్ర సంబంధాల పరిధిలో పరిష్కరించుకోవాలి.

మేం అధికారంలోకి వస్తే మొదటి సంతకం ప్రత్యేకహోదాపైనే పెడతామని రాహుల్‌గాంధీ చెబుతున్నారు కదా?

ఆల్‌రైట్. థ్యాంకూ. మేమైతే రాజ్యాంగం ఇచ్చిన అవార్డును అనుసరించాల్సి ఉంది.

ఈశాన్య రాష్ట్రాలు సీజీఎస్టీ, ఐజీఎస్టీ (రిఫండ్) తిరిగి పొందుతున్నాయి. అలా ఆంధ్రప్రదేశ్‌కూ ఇవ్వొచ్చు కదా?

ఇదివరకు పన్నురాయితీ ప్రయోజనం పొందిన రాష్ట్రాలకు మాత్రమే అది వర్తిస్తుంది.

మరి ఆంధ్రప్రదేశ్‌కు?

అలాగైతే బిహార్, ఝార్ఖండ్‌కు ఎందుకివ్వరు? అన్న ప్రశ్న తలెత్తుతుంది. కేంద్ర ప్రభుత్వం 29 రాష్ట్రాలనూ చూడాలి.

బిహార్ విభజన సమయంలో ప్రధానమంత్రులెవరూ ఎలాంటి హామీలు ఇవ్వలేదు కదా?

మనం ఒక నిర్దుష్టమైన విధానాన్ని అనుసరించాలి. ఎవరెన్నిచెప్పినా... భారత్ అన్నది రాష్ట్రాల సమాఖ్య. బలమైన కేంద్రం ఉన్నప్పుడే అది నిలబడుతుంది. డబ్బంతా రాష్ట్రాలకు ఇచ్చేసి... 'నా దగ్గర ఏమీలేదు' అని కేంద్రం చెప్పలేదు. దేశభద్రత కేంద్రం బాధ్యత.

హోదా ఇస్తామని భాజపా తన మేనిఫెస్టోలో చెప్పింది కదా?

అందుకేగా హోదాకు సమానమైన మొత్తాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతున్నాం.

పన్ను రాయితీలు ఇవ్వడంలేదు కదా?

ఇప్పటికే మూడు రాయితీలు బడ్జెట్‌లో ప్రకటించాం.

2014 ఫిబ్రవరి 20న మన్మోహన్‌సింగ్ మిగతా రాష్ట్రాల మాదిరి ఏపీకి పన్నురాయితీలు కల్పిస్తామని చెప్పారు కదా?

అది ఇందులో భాగంగా లేదు.

మీరు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఎందుకు నచ్చజెప్పలేకపోతున్నారు?

అది నేను సమాధానం చెప్పే ప్రశ్నకాదు. వాళ్లే చెప్పాలి.

రైల్వేజోన్ అంశం ఎంతవరకు వచ్చింది?

తొలి రెండు ప్రధాన అంశాలను కేంద్ర, రాష్ట్రాలు సానుకూల దృక్పథంతో చూస్తే... మిగిలిన అన్ని సమస్యలకూ సానుకూల పరిష్కారం లభిస్తుంది.

దిల్లీని మించిన రాజధానిని నిర్మిస్తామని ప్రధానమంత్రి చెప్పారు కదా? దానికి ఎందుకు నిధులివ్వట్లేదు?

కేంద్రం ఇప్పటికే ముందస్తుగా చాలా డబ్బు ఇచ్చింది. రాజధాని త్వరగా అభివృద్ధి అవుతుందని ఆశిస్తున్నాం. రాజధాని కోసం ఇప్పటికే వారికి రూ.2,500 కోట్లు ఇచ్చాం.

వెనుకబడిన జిల్లాలకు రూ.50 కోట్ల చొప్పున ఇవ్వడం ఏమాత్రం చాలదంటున్నారు..

అది చాలా ప్రగతిశీల రాష్ట్రం కాబట్టి అంతకంటే ఎక్కువ ఖర్చుచేస్తే బాగుంటుందని భావిస్తున్నా.

ప్రత్యేకహోదా కోసం పోరాడతామని ఈ రోజు శాసనసభలో కూడా ముఖ్యమంత్రి ప్రకటించారు కదా?

దట్స్ ఆల్‌రైట్.

విశాఖ రైల్వేజోన్ అక్కడి ప్రజల సెంటిమెంట్‌గా మారింది. దానిపై పురోగతి ఏమైనా ఉందా?

నేను రెండు విషయాల గురించి మాట్లాడాను. వాటికే పరిమితమవుతాను.

పోలవరం సంగతేంటి? పునరావాస (ఆర్అండ్ఆర్) ప్యాకేజీ పూర్తిగా కేంద్రమే భరించాలని కోరుతున్నారు కదా?

పోలవరం నిర్మాణాన్ని వేగవంతం చేయనీయండి. ఇప్పటికే రూ.5 వేల కోట్లు దానికిచ్చాం. అందులో సానుకూల కోణాన్ని చూడండి.

29 సార్లు దిల్లీకి వెళ్లినా ఎలాంటి ప్రయోజనం కలగలేదని చంద్రబాబు చెబుతున్నారు?

నేను రెండు లెక్కలు చెప్పాను. పోలవరానికి ఇప్పటికే రూ.5 వేల కోట్లు ఇచ్చాం. అందులో పురోగతి ఉందని నేనూ నమ్ముతున్నా.

ఆర్అండ్ఆర్‌కు డబ్బులిస్తారా?

విలేకర్ల సమావేశంలో డబ్బులు నిర్ణయించరు. కేంద్ర, రాష్ట్రాలకు వేర్వేరు ఆదాయాలుంటాయి. రాష్ట్రంలో రాజకీయ ఉద్యమాలు ఉన్నాయని నేను కేంద్ర ప్రభుత్వ ఖర్చులను బంద్ చేయలేను. కేంద్రాన్ని బలంగా నిలబెట్టడం కూడా మా బాధ్యత.

తల్లినీ బతికించమని కోరుతున్నా!



శాసనసభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆనాడు బిడ్డను బతికించి తల్లిని చంపేశారన్న మోదీ.. విభజన చట్టాన్ని ఎందుకు అమలు చేయడం లేదు

- ఇతర రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇస్తున్నప్పుడు మాకెందుకు ఇవ్వరు?
- అసలు మాతో పొత్తు ఎందుకు పెట్టుకున్నారు?
- తమిళుల, ఒరియావాసుల ఆత్మగౌరవం అంటూ లీకులిస్తారా?
- శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఈనాడు – అమరావతి

'**కాం**గ్రెస్ పార్టీ బిడ్డను బతికించి తల్లిని చంపేసింది... నేనయితే తల్లి, బిడ్డ ఇద్దర్నీ బతికించేవాణ్ని' అంటూ రాష్ట్ర విభజనపైన ఎన్నికల ప్రచారంలో మాట్లాడిన నరేంద్రమోదీ విభజన చట్టంలోని అంశాలను ఎందుకు అమలు చేయడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. తామే అధికారంలో ఉండుంటే రెండు ప్రాంతాలకు సమ న్యాయం చేసి చూపించేవాళ్లమని అప్పట్లో చెప్పారని, ఇప్పుడు అదే చేయమని తాను అడుగుతున్నానని వ్యాఖ్యానించారు. విభజన చట్టంలోని అంశాలు, అప్పటి ప్రధాని పార్లమెంటులో ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలపై రెండు, మూడు రోజుల్లోనే స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాలకు ప్రత్యేక హోదా? పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటివి ఇస్తున్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు హక్కుగా రావాల్సిన వాటిని ఎందుకివ్వడం లేదని నిలదీశారు. రెవెన్యూ లోటును ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. అలాంటప్పుడు తమతో పొత్తు ఎందుకు పెట్టుకున్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి మరింత లాభం చేకూరుతుందనే ఉద్దేశంతోనే ఎన్నికల ముందు పొత్తు పెట్టుకున్నామని, అందుకే అప్పట్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్రంపై మరింత ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపైన అసెంబ్లీలో బుధవారం ఆయన దాదాపు మూడున్నర గంటల పాటు సుదీర్ఘంగా ప్రసంగించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసమే తెలుగుదేశాన్ని ఎన్టీఆర్ స్థాపించారని పార్లమెంటులో ప్రధాని చెప్పారని, ఇప్పుడు రాష్ట్ర ప్రయోజనాల గురించి మనం మాట్లాడుతుంటే ఒకరు తెలుగువారి ఆత్మగౌరవం తరహాలోనే.. ఇతరులు తమిళుల ఆత్మగౌరవం, ఒరియా ఆత్మగౌరవం అంటూ మాట్లాడితే ఏం చేయాలంటూ కేంద్రం లీకులివ్వడం ఎంతవరకు న్యాయమని నిలదీశారు. రాష్ట్ర ప్రజలందరూ తమకు రావాల్సిన హక్కును కోరుకున్నప్పుడు వారి మనోభావాలను గౌరవించాల్సిన కేంద్రం ఇలా చేయడం సమంజసమేనా? అని అన్నారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

★ అర్ధరాత్రి 12 గంటలకు విలేకరుల సమావేశం నిర్వహించి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ఆర్థిక సాయం ఇస్తామని అరుణ్‌జైట్లీ ప్రకటించారు. ప్రత్యేక హోదాలోని అంశాలన్నీ అందులో ఉంటాయంటేనే అంగీకరించాం. ఏడాదిన్నరైనా అవేవీ అమలు కాలేదు. ఈ ఏడాదిన్నరలో ప్రధానిని కలవలేదు. తర్వాత ఫోన్ చేసి కలిశాను. మా రాష్ట్ర ప్రజలు బాధపడుతున్నారు. అసహనంగా ఉన్నారు. మా వాళ్లు సున్నితంగా ఉంటారు. రోడ్లపైకి రారు. నిర్ణయం తీసుకుంటే మాత్రం చాలా కఠినంగా ఉంటారని చెప్పాను. అయినా చివరి బడ్జెట్‌లో కూడా రాష్ట్రానికి సంబంధించి ఏమీ ప్రస్తావించలేదు. ఇతర రాష్ట్రాల గురించి కూడా అందులో పేర్కొనకపోయి ఉంటే ఊరుకునేవాణ్ని. కొన్ని రాష్ట్రాల సబర్బన్, మెట్రో రైళ్లకు రూ.వేల కోట్లు కేటాయించి మనకు ఇవ్వకపోవడం ఏం న్యాయం?

★ మీరు బాగా పనిచేసుకుంటున్నందున ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వాలి? రెండంకెల వృద్ధి సాధించినందున ప్రత్యేక హోదా ఇవ్వం అని అంటున్నారు. రెండంకెల వృద్ధి చూపించినందునే కేంద్రం డబ్బులు ఇవ్వడం లేదని మరికొందరంటున్నారు. ఇదేం వాదనో అర్థం కావడం లేదు. కేంద్రం ఏమీ ఇవ్వడం లేదంటూ అభివృద్ధి చేయనని ప్రజలకు చెప్పాలా? కాంగ్రెస్, భాజపాలు ప్రజల మనోభావాలతో ఆడుకోవడం మంచిది కాదు.

★ ప్రతి మనిషికి ఆత్మగౌరవం ఉంటుంది. అన్యాయం జరిగినప్పుడు చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ దానిపైన ప్రశ్నిస్తారు. రాష్ట్రంలో ప్రస్తుతం అదే జరుగుతోంది. మాకు అన్యాయం జరిగిందా? లేదా అని ప్రజలు అడుగుతున్నారు. దాన్ని సరిచేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందా? లేదా? అని ప్రశ్నిస్తున్నారు. అవమానానికి గురై బాధపడుతున్న ప్రజానీకం తిరిగి న్యాయం కోరుకోవడం సమంజసమా? కాదా? న్యాయం కోసం నాలుగున్నరేళ్లు నిరీక్షించాక కూడా మళ్లీ అదే అన్యాయం జరుగుతోందన్న భావన ఏర్పడితే ప్రజలు ఎలా స్పందిస్తారో చెప్పలేం.

★ నేనేదో అధికారం కోసం కేంద్రంలో ఉన్నానని కొందరు విమర్శిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 29 మంది ఎంపీలు ఉన్నా.. కేంద్రంలో ఏడెనిమిది మంత్రి పదవులిస్తానని అప్పటి ప్రధాని వాజపేయి చెప్పినా అవసరం లేదని అన్నా. ప్రస్తుతం కేంద్రాన్ని మంత్రి పదవులను కోరడం లేదు. ఏ శాఖ ఇచ్చారనీ అడగడం లేదు. గవర్నర్ పదవో, కార్పొరేషన్ పదవో కావాలనడం లేదు. న్యాయం చేయమని మాత్రమే కోరుతున్నాం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే అడుగుతున్నాం. కేంద్రంలో మొదటిసారో, రెండోసారో మంత్రులుగా ఉన్నవారి వద్దకు కూడా వెళ్లి రాష్ట్ర ప్రయోజనాల కోసం విన్నవించా. ఈ విషయంలో నాకు భేషజాలు లేవు.

★ రాష్ట్రానికి వేరే ప్రాజెక్టులు చాలా ఇచ్చామని భాజపా నాయకులు చెబుతున్నారు. వాటిపైనా చర్చిద్దాం. మన రాష్ట్రానికి ఎంతిచ్చారు? వేరే రాష్ట్రాలకు ఎంతిచ్చారు? జనాభా దామాషా ప్రకారం ఎంతిచ్చారు? ఏయే రాష్ట్రాలకు కేంద్రం ఏ విధంగా న్యాయం చేసిందో? సమగ్రంగా చర్చించేందుకు సిద్ధం. సమాఖ్య స్ఫూర్తికి లోబడి ఉన్నా. కేంద్రం, రాష్ట్రం పరస్పరం సహకరించుకోవాలని ఆలోచిస్తున్నా. సహకార సమాఖ్య వ్యవస్థలో విభజన చట్టంలోని అంశాలన్నీ అమలు చేయండి. ఆ చట్టాన్ని గౌరవించండి. విభజన చట్టంపై చర్చ సందర్భంగా పార్లమెంటులో మీరు అడిగినవి, ఎన్నికల ప్రణాళికలో పెట్టిన ప్రత్యేక హోదాను ఇవ్వండి.

★ ఏ రాష్ట్రాలయితే కష్టపడి పనిచేస్తాయో, సంపద సృష్టించడంలో ముందున్నాయో అలాంటి వాటిని శిక్షించొద్దని వాజపేయి హయాం నుంచి పోరాడుతున్నా. ఇప్పటికీ అదే చెబుతున్నా. చేసే పనుల్లో ఎక్కడా లోపం లేకుండా చూసుకుంటూనే కేంద్రం ఇవ్వాల్సిన న్యాయపరమైన హక్కుల కోసం పోరాడతాం. కొందరు రాయలసీమలో సెంటిమెంట్‌ను రెచ్చగొట్టాలని ప్రయత్నిస్తుండటం దారుణం. అసెంబ్లీ జరుగుతుంటే హాజరుకానీ ప్రతిపక్షాన్ని ఎన్నడూ చూడలేదు. ప్రతి అంశంలోనూ వారు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారు.

★ ఆంధ్రప్రదేశ్‌లో 175 శాసనసభ స్థానాలను 225కు పెంచాలని చట్టంలో పేర్కొన్నారు. పైసా ఖర్చులేకపోయినా ఇప్పటికీ చేయలేదు. అయినా నేను దాని గురించి అడగదలుచుకోలేదు కూడా.

పార్లమెంటులో ప్రాతినిధ్యం కలిగిన అన్ని పార్టీలు ఆంధ్రప్రదేశ్‌పై సానుభూతి చూపిస్తున్నాయి. ప్రత్యేక హోదా ఇవ్వాలని అంటున్నాయి. అయినా ఎందుకు కనికరించడం లేదు? ఆ రోజు రాష్ట్రానికి అన్యాయం చేసిన పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కూడా మేం అధికారంలోకి వస్తే తొలి సంతకం ప్రత్యేక హోదాపైనే పెడతామని ప్రకటిస్తున్నారు. ఆ రోజు అంగీకరించి మీరెందుకు ఇవ్వలేకపోతున్నారు?

తీవ్రమైన ఆవేదనతో ఓపిక పట్టి 29 సార్లు కలిసి సమస్యలు పరిష్కరించమని కోరినా కనీస కనికరం లేదా?

విభజన చట్టంలో పొందుపరిచినవన్నీ కేంద్రం తుచ తప్పక అమలు చేయాలని బాధతో, ఆవేదనతో కోరుతున్నా. రాజకీయంగా అడగడం లేదు. కష్టపడతామంటూ మా పట్ల వివక్ష దారుణం.

చివరి బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి అన్యాయం జరిగినప్పుడు కూడా ప్రశ్నించకపోతే చరిత్రలో ప్రజలు నన్ను క్షమించబోరనే ఉద్దేశంతోనే కేంద్రాన్ని గట్టిగా నిలదీశా. అంతే తప్ప ఎవరూ అడగమనలేదు. ప్రజల ఆత్మాభిమానాన్ని, హక్కును కాదన్నప్పుడు వారికి కలిగే అవమానం, వచ్చే కోపం జీవితంలో మరెప్పుడూ రాదు.

విసిగి.. వేసారే తెగతెంపులు

కేంద్రసాయంపై నిరాశతోనే నిర్ణయం ◆ భాజపాతో బంధం తెగటంపై తెదేపా నాయకుల మనోగతం

ఈనాడు, అమరావతి

కొన్నాళ్లుగా రాష్ట్రానికి ఆర్థిక సాయం, వివిధ ప్రాజెక్టుల మంజూరుతోపాటు తాజాగా ప్రత్యేక హోదా కోసం పట్టుబట్టిన తాము.. భాజపా వైఖరితో విసిగి వేసారే కేంద్ర మంత్రివర్గం నుంచి వైదొలగాల్సి వచ్చిందని తెదేపా అగ్రనేతలు చెబుతున్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాలన్నింటినీ సాధించటానికి, విభజన బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా అప్పటి ప్రధాని ఇచ్చిన హామీల అమలుకు శాయశక్తులా ప్రయత్నించినా ఫలితం లేకపోవటంతో ఈ నిర్ణయం తీసుకోవటం తప్పనిసరైందని అంటున్నారు. విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని కోరినా, కేంద్రం నుంచి ఆశించినంత సానుకూలత లేకపోవటంతో మంత్రివర్గం నుంచి బయటికొచ్చినట్లు చెబుతున్నారు. ప్రస్తుతానికి ఎన్‌డీఏలో కొనసాగినా. . అది నామమాత్రమే. ఏ రోజైనా దాన్నుంచి బయటకు వచ్చే వీలుంది. విభజన హామీలను నెరవేర్చటానికి చొరవ చూపని కేంద్రంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని భావించిన తెదేపా... ఫిబ్రవరి ఒకటో తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటి నుంచి అసంతృప్తి ధ్వనులు వినిపించసాగింది. ఏడాదిలో ఎన్నికలు వస్తున్నందున కేంద్రం వైఖరిలో మార్పు రాకపోవటంతో క్రమంగా నిరసన స్వరం పెంచి ఆందోళన బాట పట్టింది. పార్లమెంటు తొలి విడత బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర డిమాండ్లను వినిపిస్తూ పదేపదే సభ కార్యకలాపాలకు అంతరాయం కలిగించింది. పార్లమెంటు సమావేశాల చివరి రోజు రాత్రి.. భాజపా అధ్యక్షుడు అమిత్‌షా సమక్షంలో సానుకూల ధోరణిలో చర్చలు జరిగాయి. తెదేపా వినిపించిన డిమాండ్లు అన్నింటినీ దాదాపు అంగీకరించినట్లే కనిపించారు. అధికారిక ప్రకటన ఏమీ రాకున్నా. . ఒక విధమైన ఆశ కల్పించారు. మలివిడత బడ్జెట్ సమావేశాల వరకు తెదేపా వేచి చూసేందుకు అది అవకాశం కల్పించింది. తీరా సమావేశాలు ప్రారంభమైనా.. అప్పటి భేటీలో ప్రస్తావించిన అంశాలపై కనీస పురోగతి లేకపోవటంతో తెదేపా ఆందోళన బాట పట్టింది. మళ్లీ అమిత్‌షా ఫోన్‌తో హడావిడిగా అధికారుల బృందంతో సహా రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు దిల్లీకి వెళ్లినానిష్ఫలమే అయింది. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీతో సమావేశమైనా.. పురోగతి లేకపోయింది. తిరిగి పార్లమెంటు సమావేశాల్లో ఆందోళన కొనసాగించింది. చివరికి రాష్ట్ర అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానంపై ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ.. రెండు, మూడు రోజుల్లో రాష్ట్ర డిమాండ్లపై స్పందించాలని కోరిన కొద్ది నిమిషాలకే కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ విలేకరుల సమావేశంలో పాత అంశాల్నే పునరుద్ఘాటించారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు వేగంగా చర్యలు తీసుకున్నారు. తొలుత ఎంపీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి వారి అభిప్రాయాల్ని తీసుకున్నారు. అనంతరం అందుబాటులో ఉన్న మంత్రులతో సమావేశమై వారి వాదననూ పరిగణనలోకి తీసుకున్నారు. అందరూ ఒకేమాట, ఒకేబాటగా కేంద్ర మంత్రివర్గం నుంచి వైదొలగాలని సూచించటంతో రాత్రి పదిన్నరకు నిర్వహించిన విలేకరుల సమావేశంలో తుదినిర్ణయం ప్రకటించారు.

ఎన్నో మలుపులు.... అర్ధరాత్రి ప్రకటనలు!

రాష్ట్ర విభజనతో ఆర్థిక వనరుల కొరతతో ఇబ్బందులకు గురైన ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి పురోగమనంలో పయనించాలంటే కేంద్రం మద్దతు అత్యవసరం. 2014 ఎన్నికల్లో భాజపాతో పొత్తు పెట్టుకున్న తెదేపా.. కేంద్రంలో మంత్రివర్గంలో చేరమని ఆహ్వానించటంతోనే రాష్ట్రానికి సంబంధించిన పనులన్నీ సానుకూలంగా చక్కబెట్టుకోవచ్చన్న ఉద్దేశంతో మారుమాట లేకుండా చేరింది. పోలవరం పనులు సజావుగా సాగేందుకు వీలుగా ముంపు మండలాల్ని ఆంధ్రప్రదేశ్‌లో కలపటం, జాతీయ విద్యాసంస్థల ఏర్పాటువంటి కొన్ని సానుకూల నిర్ణయాలు తొలుత వచ్చాయి. ప్రత్యేక హోదా, 2014-15 సంవత్సరపు రెవెన్యూ లోటు భర్తీ, ఉక్కు పరిశ్రమ, రైల్వేజోన్, కారిడార్లు, పెట్రో కెమికల్ కాంప్లెక్సుల వంటి కీలకాంశాల్లో మాత్రం అడుగు ముందుకు పడలేదు. ఏరాష్ట్రానికీ కొత్తగా ప్రత్యేక హోదా ఇవ్వరాదన్న కేంద్ర విధానం నిర్ణయం మేరకు... ప్రత్యేక ఆర్థిక సాయానికి చంద్రబాబు అంగీకరించారు. ఏడాదిన్నర కిందట ఓ రోజు అర్ధరాత్రి వరకు సాగిన చర్చల అనంతరం ఈఏపీ రూపంలో ప్రత్యేక సాయం ప్రకటనతో సమాధానపడ్డారు. చివరికి అదీ ఆచరణలోకి రాకపోవటంతో ఆ సాయమేదో. .నాబార్డు, హడ్కో నుంచి ఇప్పించాలని కోరారు. అదీ కొలిక్కిరాకపోవటం, ఇతర ప్రాజెక్టుల విషయంలోనూ కదలిక లేకపోవటం, మొదట్లో అడిగిన రాజకీయపరమైన అంశమైన శాసనసభ స్థానాల పెంపువంటి వాటిల్లోనూ సానుకూలత లేనందున కేంద్రం నుంచి వైదొలగటమే మేలని కొంతకాలంగా ఆలోచించసాగారు. క్రమంగా పార్టీ యంత్రాంగాన్ని, పార్టీకి ఓటు బ్యాంకుగా ఉన్న వర్గాల్ని ఆ నిర్ణయానికి తగినట్లు సిద్ధం చేశారు. పార్లమెంటరీ పార్టీ సమావేశం పెట్టినా, శాసనసభాపక్ష భేటీ జరిగినా అందరిదీ ఒకే మాట, ఒకే బాటగా కేంద్రం నుంచి వైదొలగాల్సిందేనని తేల్చిచెప్పారు. కాకుంటే...మరో రెండు, మూడు నెలలపాటు వేచి చూస్తే నిధుల విడుదల, పోలవరం విషయంలో ఇబ్బంది ఉండదని చంద్రబాబు తొలుత భావించారు. జైట్లీ ప్రకటనతో అప్పటివరకు ఆగలేని పరిస్థితి ఏర్పడింది. తక్షణమే తుదినిర్ణయం ప్రకటించాల్సి వచ్చింది. 'ఒక విధంగా తొలి 6నెలలు మినహాయిస్తే కేంద్రంలో సజావుగా సాగక అసంతృప్తికి గురయ్యాం. సంకీర్ణ ప్రభుత్వమన్న మాటేగాని ఎన్నడూ మా అభిప్రాయానికి విలువనిచ్చిన దాఖలాల్లేవు. ఈ నిర్ణయం తీసుకోవటానికి చాలా ఆలోచించాల్సి వచ్చింది. రాష్ట్రంలో ఎవరుగెలిచినా తమ వద్దకే వస్తారనే భాజపా వైఖరే దీనంతటికీ కారణం' అని తెదేపా సీనియర్‌నేత ప్రస్తుత పరిణామాల్ని విశ్లేషించారు.



వైదొలగాల్సిందే... ఎంపీలందరిదీ ఒకే మాట!

రాష్ట్ర డిమాండ్లపై జైట్లీ తాజాగా చేసిన ప్రకటనపై ఎంపీల అభిప్రాయం తెలుసుకునేందుకు సీఎం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వారంతా కేంద్ర మంత్రివర్గం నుంచి వైదొలగాల్సిందేనని తేల్చిచెప్పారు. కేంద్ర మంత్రి అశోక్‌గజపతి రాజు అందుబాటులో లేకపోగా, కేంద్ర సహాయ మంత్రి సుజనాచౌదరి సహా ఎంపీలంతా ఒకే మాటపై నిలిచారు. ప్రధానికి ఒక మాట చెప్పి మంత్రివర్గం నుంచి వైదొలుగుదామని సుజనాచౌదరి సూచించగా. . ప్రధాని వద్దని నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తే ఏం చేయాలని చంద్రబాబు అడిగారు. ఆయన వద్దన్నా రాజీనామాలకే కట్టుబడాలని అందరూ చెప్పారు. అనంతరం అందుబాటులో ఉన్న మంత్రులతో చంద్రబాబు భేటీ అయ్యారు. వారు సైతం ప్రజల్లో కేంద్రం వైఖరిపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఉందని, తాజా అరుణ్‌జైట్లీ ప్రకటన మరింత రెచ్చగొట్టేలా ఉందని అభిప్రాయపడ్డారు. తక్షణం మంత్రివర్గం నుంచి వైదొలగాల్సిందేనని వాదించారు. దీంతో తుది నిర్ణయం తీసుకున్నారు. ఈనేపథ్యంలో అశోక్‌గజపతి రాజు అందుబాటులోకి రావటంతో ఆయనకుసమాచారమిచ్చారు.

ప్రధాని కార్యాలయానికి ఫోన్!

రాజీనామాల విషయం ప్రధానికి తెలియజేసేందుకు సీఎం చంద్రబాబు ఫోన్లో ప్రయత్నించగా సాధ్యం కాలేదు. ప్రధాని అందుబాటులోకిరాలేదు. అప్పటికే పొద్దుపోయింది కూడా. ప్రధాని కార్యాలయం నుంచి స్పందన ఉంటుందేమోనని అరగంటపాటు వేచిచూశారు. ఒకవేళ ప్రధాని స్పందించి.. రాజీనామాలు వద్దని వారించినా, మీరు రాష్ట్రానికి ఏం చేస్తారో చేయండి.. తాము మాత్రం కేంద్ర ప్రభుత్వంలో కొనసాగలేమని చెప్పాలనుకున్నారు. చివరికి విలేకరుల సమావేశం పెట్టి బాబు తుదినిర్ణయం ప్రకటించారు.

మరోసారి తెగతెంపులు!

1999ఎన్నికల్లో భాజపాతో పొత్తు ఉన్న తెదేపా రాష్ట్రంలో ఘనవిజయం సాధించింది. 2004 ఎన్నికల్లో అదే పొత్తుతో ఎన్నికల బరిలో నిలిచి ఓడాక, 2009 ఎన్నికల్లో వీటి మధ్య ఎన్నికల అవగాహన కుదరలేదు. తిరిగి 2014లో పొత్తు ఏర్పడింది. తాజా నిర్ణయంతో రానున్న 2019 ఎన్నికల్లో రెండు పార్టీల మధ్య ఎన్నికల అవగాహన ఉండదని తేలిపోయింది. ఎన్టీఆర్ హయాంలో మాత్రం 1985, 1989ల్లో తెదేపా, భాజపాల మధ్య పొత్తు ఉంది.

తెదేపా కింకర్తవ్యం?

- జాతీయ రాజకీయాల్లో ఏం చేయబోతోంది
- ఎన్డీయే నుంచి వైదొలగడంపై నిర్ణయం తీసుకోలేదు
- ఎన్డీయేలో కొనసాగడమా? కేసీఆర్ ప్రతిపాదిత తృతీయఫ్రంటా, స్వతంత్రంగానేనా...

ఈనాడు, అమరావతి: ఎన్డీయే ప్రభుత్వం నుంచి తెలుగుదేశం వైదొలిగిన నేపథ్యంలో జాతీయ రాజకీయాల్లో ఇక పార్టీ పాత్ర ఎలా ఉండబోతోంది? అన్న ఉత్కంఠ సర్వత్రా వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి బయటకు వచ్చినా ఎన్డీయే కూటమి నుంచి తెలుగుదేశం వైదొలిగే విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం రాత్రి స్పష్టంగా ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ ఎన్డీయేతో కలిసి ఇక ఎంతో కాలం కొనసాగే వ్యవహారంగా కనిపించడం లేదు. ఇది ఇక నామమాత్రపు వ్యవహారమే అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన సందర్భంగా హామీల విషయంలో భాజపా పెద్దల వైఖరితో విసిగి వేసారి ఇక చివరి నిర్ణయంగా ప్రభుత్వం నుంచి వైదొలుగుతున్న నేపథ్యంలో ఎన్డీయేలో ఒక పార్టీగా కొనసాగడం అంత సులభమైన విషయమేమీ కాదని పార్టీలోనే అంతర్గతంగా చర్చ సాగుతోంది. ముందే రూపొందించుకున్న వ్యూహం ప్రకారమే కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఇలా వ్యవహరిస్తున్నారని ఇప్పటికే తెదేపా ఒక అంచనాకు వచ్చింది. అరుణ్‌జైట్లీ ప్రకటన విషయంలోను ముఖ్యమంత్రి ఆదే వ్యాఖ్యానం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో భాజపా, తెదేపా మధ్య సంబంధాలు మెరుగుపడే అవకాశాలు మృగ్యమే అన్నదే పార్టీ వర్గాల విశ్లేషణ. తాము అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదాకు సంబంధించే తమ తొలి నిర్ణయమని రాహుల్‌గాంధీ ప్రకటించారు. ముఖ్యమంత్రి బుధవారం శాసనసభలోనూ ఈ అంశం ప్రస్తావించారు. కాంగ్రెస్ వ్యతిరేక పునాదులపై ఏర్పడ్డ తెదేపా.. ఇప్పుడు భాజపాతోను విసిగిపోయి చర్చోప చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం, తృతీయ ఫ్రంట్ ప్రభుత్వాలు ఏర్పడిన సందర్భాల్లో చంద్రబాబు కీలకపాత్ర పోషించారు. ఎన్టీయే కన్వీనర్‌గాను జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పారు. ఈ పరిస్థితుల్లో ఇప్పటికే మరో తెలుగురాష్ట్ర అధినేత కేసీఆర్ తృతీయ ఫ్రంట్ ఆవిర్భావానికి అడుగులు వేయడం ప్రారంభించారు. చంద్రబాబుతోను తాను మాట్లాడతాననీ ప్రకటించారు. ఆ ఫ్రంట్ విషయంలో చంద్రబాబు వైఖరి ఎలా ఉంటుందనేది తెలియాల్సి ఉంది. తెదేపా ముఖ్య పాత్ర పోషిస్తుందా, స్వతంత్రంగా ఉండిపోతుందా, ఎన్డీయేలో ఎప్పటి వరకు కలిసి ఉంటుంది అన్నది తేలాల్సి ఉంది.

ఎప్పుడూ పూర్తికాలం లేరు

- మూడు పర్యాయాలూ ఇలాగే
- కేంద్రంలో తెదేపా మంత్రి పదవుల తీరిది

ఈనాడు, అమరావతి: కేంద్ర మంత్రివర్గంలో తెదేపా సభ్యులు చేరిన ప్రతిసారీ పూర్తి కాలం పదవుల్లో కొనసాగలేకపోతున్నారు. గతంలో ఏదో ఒక కారణంతో ప్రభుత్వాలు పడిపోవటంతో తొలి రెండు సందర్భాల్లో మంత్రి పదవులు కోల్పోగా...తాజాగా పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు కేంద్రంలో ఇద్దరు తెదేపా మంత్రులు రాజీనామా చేయనున్నారు. తొలిసారి పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఛైర్మన్‌గా వ్యవహరించిన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతిస్తున్న భాజపా దానిని ఉపసంహరించుకోవటంతో ప్రభుత్వం పడిపోయింది. అప్పట్లో మంత్రిగా వ్యవహరించిన ఉపేంద్ర పదవిని కోల్పోయారు. రెండోసారి చంద్రబాబు కన్వీనర్‌గా ఉన్న యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో భారీ సంఖ్యలోనే తెదేపా సభ్యులు మంత్రులయ్యారు. అప్పుడు కాంగ్రెస్ బయటి నుంచి మద్దతిచ్చింది. తొలుత దేవెగౌడ, అనంతరం ఎ.కె.గుజ్రాల్‌లు ప్రధానమంత్రులుగా వ్యవహరించారు. కాంగ్రెస్ మద్దతు ఉపసంహరించుకోవటంతో ఆ ప్రభుత్వం పడిపోయింది. భాజపా నేతృత్వంలో వాజ్‌పేయి ప్రధానిగా 13నెలల పాటు నడిచిన ఎన్‌డీఏ ప్రభుత్వానికి తెదేపా వెలుపలి నుంచి మద్దతిచ్చింది. ప్రభుత్వంలో చేరకుండా... లోక్‌సభ స్పీకర్ పదవిని మాత్రం తీసుకుంది. పార్టీ ఎంపీ బాలయోగి ఆ పదవికి ఎంపికయ్యారు. ఏఐఏడీఎంకే మద్దతు ఉపసంహరించుకోవటంతో ఆ ప్రభుత్వం పడిపోయింది. అనంతరం 1999లో జరిగిన ఎన్నికల్లో తిరిగి ఎన్‌డీఏ అధికారంలోకిరాగా అప్పుడూ... ప్రభుత్వం ఏర్పడటంలో కీలకమైన తెదేపా మంత్రివర్గంలో చేరకుండా వెలుపలి నుంచే మద్దతిచ్చింది. స్పీకర్‌గా బాలయోగి కొనసాగినా పదవీ కాలాన్ని పూర్తి చేయలేకపోయారు. ఓ ప్రమాదంలో ఆయన మరణించారు. ఆ తర్వాత తిరిగి స్పీకర్ పదవిని తెదేపా తీసుకోలేదు. 2014 ఎన్నికల్లో తెదేపా, భాజపా పొత్తు పెట్టుకున్నాయి. రాష్ట్రంలో తెదేపా ప్రభుత్వంలో ఇద్దరు భాజపా సభ్యులు, కేంద్రంలో భాజపా నేతృత్వంలోని ప్రభుత్వంలో ఇద్దరు తెదేపా సభ్యులు మంత్రి పదవులు పొందారు. ప్రత్యేక హోదాపై తెదేపా పట్టుదలతో వ్యవహరించిన నేపథ్యంలో... పార్టీకి చెందిన అశోక్‌గజపతి రాజు, సుజనాచౌదరిలు కేంద్ర మంత్రి పదవులకు రాజీనామా చేయనున్నారు. మరోసారీ పదవీ కాలం పూర్తికాకుండానే వైదొలిగినట్లవుతుంది.

నేడు ప్రధానికి రాజీనామాల సమర్పణ

ఈనాడు, దిల్లీ: కేంద్ర మంత్రివర్గంలో తెలుగుదేశం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు పి.అశోక్ గజపతిరాజు, సుజనాచౌదరి గురువారం రాజీనామాలు చేయనున్నట్లు తెలిసింది. ప్రధానమంత్రికి రాజీనామాలు సమర్పించాలని ఇద్దరూ నిర్ణయించుకున్నట్లు సమాచారం. అమరావతి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వారితో మాట్లాడి నిర్ణయం వెల్లడించిన తర్వాత వారూ దాన్ని సమర్థించినట్లు తెలిసింది. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఇద్దరూ కలిసికట్టుగా వెళ్లి ప్రధానికి రాజీనామాలు సమర్పించాలని నిర్ణయించారని తెదేపా వర్గాలు వెల్లడించాయి. ప్రధాని ఎప్పుడు అపాయింట్‌మెంట్ ఇస్తే అప్పుడు వెళ్లి రాజీనామాలు సమర్పిస్తారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. బుధవారం రాత్రి ఇద్దరూ ఈ అంశంపై మాట్లాడుకున్నట్లు సమాచారం. మరోవైపు చంద్రబాబునాయుడు నిర్ణయాన్ని తెలుగుదేశం లోక్‌సభాపక్షనేత తోట నరసింహం స్వాగతించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలుగుదేశం రాజీలేని పోరాటం చేస్తుందన్న విషయాన్ని అధినేత నిర్ణయం మరోసారి రుజువు చేసిందని చెప్పారు. గురువారం నుంచి పార్లమెంటు వేదికగా తమ ఆందోళనలు కొనసాగుతాయని వెల్లడించారు.

కేంద్రంలో తొలి కుదుపు

- ఎన్డీయే ప్రభుత్వానికి రాంరాం చెప్పిన మొదటి మిత్రపక్షం
- కత్తులు దూస్తూ మంత్రివర్గంలోనే ఉన్న శివసేన
- మెత్తగా మాట్లాడినా గట్టి నిర్ణయం తీసుకున్న తెలుగుదేశం

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వంలో తొలి కుదుపు! 2014 ఎన్నికలకు పూర్వం భాజపాతో జట్టుకట్టిన తొలి మిత్రపక్షం తెదేపా... మోదీ సర్కారు నుంచి బయటకు రావడం జాతీయ స్థాయిలో సంచలనం రేపుతోంది. కొన్నిరోజులుగా దిల్లీలో జరుగుతున్న పరిణామాలకు తెరదించుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం రాత్రి చేసిన ప్రకటన ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. మోదీపై కత్తులు నూరుతున్న విపక్షాలకు పదునైన ఆయుధం చేజిక్కినట్లయింది. 2014 ఎన్నికల్లో సంపూర్ణ మెజార్టీతో అధికారంలోకి వచ్చిన భాజపా... ముందస్తు పొత్తుల్లో భాగంగా తెలుగుదేశం, శివసేన, లోక్‌జనశక్తి, అప్నాదళ్, శిరోమణి అకాలీదల్ పార్టీలను ప్రభుత్వంలో చేర్చుకొని మంత్రి పదవులు ఇచ్చింది. మిత్రపక్షమైన తెదేపా నుంచి తొలి మంత్రివర్గంలో అశోక్‌గజపతిరాజు మాత్రమే క్యాబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి పౌరవిమానయానశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2014 నవంబరులో సుజనాచౌదరి రెండో విడత విస్తరణలో సహాయమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అశోక్‌గజపతిరాజు సీనియర్ అయినప్పటికీ-రాజకీయంగా పరిమితులు, పెద్దరికం, విలువల వంటి కారణాల వల్ల ఆయన కేవలం ప్రభుత్వ కార్యకలాపాలకే పరిమితమయ్యారు. దీంతో సీఎం చంద్రబాబు దిల్లీలో తెలుగుదేశం పార్టీని నడిపించే బాధ్యతలను సుజనాచౌదరికి కట్టబెట్టి ఆయనకు తెదేపాపా నాయకుడి హోదాను ఇచ్చారు. కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా ఆయన తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా కొనసాగుతూ వచ్చారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై ఏపీ ప్రభుత్వం తరుపున కేంద్రంతో మాట్లాడే బాధ్యతలు పూర్తిగా ఈయనే నిర్వర్తించారు. 2016 సెప్టెంబరు 7న ప్రత్యేక ప్యాకేజీపై కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రకటన చేయడంలో కీలక భూమిక పోషించారు. దేశ రాజధానిలో తెలుగుదేశం ముఖచిత్రంగా మారారు. కేంద్ర ఆర్థిక మంత్రితో మంచి సంబంధాలు కూడా నెరిపారు. అయితే, ప్రత్యేక హోదా విషయంలో కేంద్రాన్ని ఒప్పించడంలో విఫలమయ్యారు. దానివల్లే పరిస్థితి తెగదెంపులస్థాయికి వచ్చింది. ఎన్డీయే ముఖ్యమైన భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం బయటికి రావడంతో... కేంద్ర ప్రభుత్వంలో కూడా అలజడి రేగింది. గతంలో యూపీయే ప్రభుత్వాల హయాంలో ఉన్నంత మిత్రపక్షాల ఒత్తిళ్లు, బుజ్జగింపులు, బెదిరింపులు ఎన్డీయే ప్రభుత్వంలో ఈ నాలుగేళ్లలో కనిపించలేదు. యూపీయే-1 హయాంలో తెలంగాణ నినాదంతో తెరాస కేంద్రంనుంచి బయటికొచ్చింది. అణు ఒప్పందం కారణంగా వామపక్షాలు కేంద్రానికి మద్దతు ఉపసంహరించాయి. 2జీ కుంభకోణం కారణంగా యూపీయే2లో డీఎంకే మంత్రివర్గం నుంచి వైదలొగింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం గతంలో తెరాస కేంద్ర మంత్రివర్గం నుంచి వైదలొగినట్లుగానే తెదేపా ఇప్పుడు రాంరాం చెప్పింది. మహారాష్ట్రలో భాజపాకు ప్రధాన మిత్రపక్షంగా ఉన్న శివసేన కొన్ని రోజులుగా ప్రధాని, భాజపా వ్యవహారశైలిపై నిప్పులు కక్కుతూ, 2019లో ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటించింది. కేంద్ర మంత్రివర్గం నుంచి మాత్రం వైదొలగలేదు. తెలుగుదేశం మాత్రం మొదటి నుంచీ సున్నితంగా మాట్లాడుతూ వస్తూనే... అకస్మాత్తుగా గట్టి నిర్ణయం తీసుకొంది. దీని వల్ల కేంద్ర ప్రభుత్వానికి వచ్చిన నష్టం లేకపోయినా మిత్రపక్షాలు, ప్రతిపక్షాలకు ఒక కొత్త సంకేతం పంపడానికి దోహదపడుతుందన్న భావన రాజకీయవర్గాల్లోవినిపిస్తోంది.

ఏపీ రుణ భారం రూ.2.16 లక్షల కోట్లు

- అందులో విభజించని మొత్తం రూ.33వేల కోట్లు
- తెలంగాణపై రూ.1.40 లక్షల కోట్ల భారం

ఈనాడు, దిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం అంతానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రుణభారం రూ.2,16,027 కోట్లకు, తెలంగాణ రుణభారం రూ.1,40,523.17 కోట్లకు చేరుతుందని అంచనా వేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పొన్ రాధాకృష్ణన్ తెలిపారు. ఏపీ రుణాల్లో విభజించని మొత్తం రూ.33,478 కోట్లు కూడా కలిసి ఉన్నట్లు వెల్లడించారు. మంగళవారం రాజ్యసభలో వైకాపా సభ్యుడు విజయసాయిరెడ్డి, కాంగ్రెస్ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు అడిగిన వేర్వేరు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. 2017-18 ఆర్థికసంవత్సరంలో ఏపీ ప్రభుత్వం రుణంపై వడ్డీ కింద రూ.14,783 కోట్లు చెల్లించాల్సి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రుణ-జీఎస్‌డీపీ నిష్పత్తి 25.09% మేర ఉంటుందని 14వ ఆర్థిక సంఘం అంచనా వేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బడ్జెట్ అంచనా ప్రకారం ఈ నిష్పత్తి 28.11%గా ఉందని తెలిపారు. తలసరి రుణంపై తమవద్ద ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ఆర్థికలోటు జీఎస్‌డీపీలో 3%మేరకే పరిమితం కావాలని 14వ ఆర్థిక సంఘం నిర్దేశించినట్లు తెలిపారు. ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ఆంధ్రప్రదేశ్ నికర రుణంపై పరిమితి ఉన్నట్లు వెల్లడించారు. రెండు రాష్ట్రాల నికర రుణాల పరిమితి ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితికి లోబడే ఉన్నట్లు చెప్పారు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం రెండు రాష్ట్రాల నికర రుణ పరిమితి ఇలా (రూ.కోట్లలో)..

14వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం

2 రాష్ట్రాల నికర రుణ పరిమితి ఇలా (రూ.కోట్లలో)...

రాష్ట్రం	2015–16	2016–17	2017–18
ఆంధ్రప్రదేశ్	17,851	18,796	23,794
తెలంగాణ	15,295	18,731	21,445

రెండు రాష్ట్రాల రుణాలు

రాష్ట్రం	2.6.2014 వాస్తవం	2015–16 వాస్తవం	2016–17 సవరించిన అంచనా	2017–18 బడ్జెట్ అంచనా
ఆంధ్రప్రదేశ్	1,30,654.35	1,73,853.60	1,92,983.97	2,16,026.58
తెలంగాణ	69,517.28	97,992.29	1,14,813.82	1,40,523.17

◆ ఇందులో ఆంధ్రప్రదేశ్ రుణంలో విభజించని మొత్తం రూ.33,447.52 కోట్లుకలిసి ఉన్నాయి. తెలంగాణకు సంబంధించి 2016-17 (స.అ.), 2017-18 (బ.అ.)రుణభారంలో రిజర్వ్‌ఫండ్, డిపాజిట్లు కలపలేదు.

మాట నిలబెట్టుకోకపోతే ఎలా?

- భారత ప్రభుత్వమే ఇలాచేయడం సరికాదు • ఈ విషయంలో మాఫియానే నయమనిపిస్తుంది
- కేంద్రం మోసం చేసిందని ప్రజలు భావిస్తున్నారు • తెదేపా ఇప్పుడు వైదొలగితే ప్రయోజనం ఏమిటి?
- అప్పట్లో నన్ను వాడుకుని వదిలేశారు • మూడో ఫ్రంట్ అధికారం కోసం కాదు... నిలదీసే వ్యవస్థ
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ఈనాడు – హైదరాబాద్

భారత ప్రభుత్వం మోసం చేసిందనే అభిప్రాయం ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో ఉందని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. భారత ప్రభుత్వం ఇచ్చిన రెండు హామీల్లో ఒకటైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నెరవేరిందని, రెండో హామీ 'ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా' అమలు కాలేదన్నారు. భారత ప్రభుత్వం చెప్పిన మాటే అమలు కాకపోతే రాష్ట్రాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. 'మేం చెప్పాం కానీ అమలు చేయం అంటే ఎలా?' అని కేంద్రాన్ని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని అన్నారు. జనసేనకు ప్రజాప్రయోజనాలే ముఖ్యమన్నారు. ఈ నెల 14న జరిగే జనసేవ ఆవిర్భావ సభలో పొత్తులు సహా అన్ని ప్రశ్నలకు జనసేన సమాధానం ఇస్తుందన్నారు. మాట నిలబెట్టుకోవడంలో మాఫీయానే మేలంటూ, మాఫీయా లావాదేవీల్లో ఏదో నెంబరు ఆధారంగా జరిగే లావాదేవీలు వారి మధ్య నమ్మకంగా జరుగుతాయని అన్నారు. ప్రత్యేకహోదా లాంటి అంశాలకు సంబంధించి తెలుగుదేశం, భాజపాలు ఎన్నికల సమయంలోనే ఒప్పందం చేసుకుని ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. బుధవారం ఇక్కడ పవన్‌కల్యాణ్ మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. వివిధ ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

కేంద్రం అంటే భయం దేనికి?

భారతప్రభుత్వంతో యుద్ధం చేయడం చాలా కష్టం. కేంద్రం అంటే కేసులకు భయపడుతున్నారు. నాకు కూడా కాగితాలు పంపించి లెక్కలు అడిగారు. చొరవ చూపి బాధ్యత తీసుకుందామనుకుని ప్రత్యేక హోదాపై మాట్లాడినపుడు కేంద్రం, రాష్ట్రం రెండూ నీళ్లు చల్లుతున్నాయి.

'హోదా' సాధనకు ఐకాస అవసరమా?

అవసరమే. జిల్లా స్థాయిలో నేతలు పార్టీలకు అతీతంగా రావాలి. అప్పుడే ఐకాస సాధ్యమవుతుంది. ప్రస్తుతం ప్రత్యేక హోదా కోసం లీడ్ చేసే 'శక్తి' లేదన్నది ఒప్పుకుంటా. ప్రజల భాగస్వామ్యం లేకుండా పార్టీలు ఉద్యమాలు చేస్తున్నాయి. గుజ్జర్ల ఉద్యమం, తెలంగాణ ఉద్యమంలా ప్రత్యేక హోదా కోసం ఉద్యమం జరగాలి.

మూడో ఫ్రంట్ అవసరం ఏమిటి?

స్వతంత్రంగా వ్యవహరించే మూడో ఫ్రంట్ అవసరం. మూడో ఫ్రంట్ అంటే ప్రభుత్వం ఏర్పాటు కోసం లేదా అధికారం కోసం కాదు. భారత ప్రభుత్వాన్ని బలంగా నిలదీసేలే వ్యవస్థ కోసమే. భాజపా, కాంగ్రెస్‌లతో జతకట్టలేని వారికి ఇది వేదిక అవుతుంది. గుజరాత్ నేత జిగ్నేష్‌లాంటి వాళ్లు కూడా కలసి వస్తారు.

హోదాపై రాహుల్‌గాంధీకి మద్దతిస్తారా?

మొదటి సంతకం ప్రత్యేక హోదాపైనే అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చెప్పడం మంచిదే. తప్పు చేశామనే భావన కాంగ్రెస్‌లో వచ్చిందనుకుంటా. దీనివల్ల కాంగ్రెస్ పట్ల ఏపీ ప్రజల వైఖరి మారుతుందని అనుకోను. జనసేన మద్దతు ఎవరికైనా అంశాలవారీగానే ఉంటుంది.

గత ఎన్నికల్లో మోదీకి మద్దతు ఎందుకిచ్చారు?

నేను మోదీకి మద్దతు ఇవ్వడం వెనుక కారణాలు ఉన్నాయి. బలమైన వ్యక్తి వచ్చి ఏదైనా చేస్తారని నమ్మాను. నిరుత్సాహానికి గురయ్యాను. భవిష్యత్తులో మోదీకి వ్యతిరేకంగా ఉంటానా? లేదా అనేది జనం అభీష్టం మేరకు ఉంటుంది. 2014 ఎన్నికల సమయంలో నన్ను వాడుకుని వదిలేశారనే నేను అనుకుంటున్నాను.

దక్షిణాది రాష్ట్రాల వాదన వేర్పాటువాదానికి దారి తీయదా?

అలా అని ఎలా అనుకుంటారు? చెప్పినవి చేయమని అడగడం వేర్పాటు వాదానికి దారితీస్తుందా?

జనసేన ఎన్డీయే భాగస్వామి పార్టీ కదా?

గత ఎన్నికల్లో భాజపా, తెదేపాకు మద్దతిచ్చాను. నేను కూడా ఎన్డీయే భాగస్వామినని ఒకే ఒకసారి అన్పించింది. అది దిల్లీలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నిర్వహించిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో పాల్గొన్నప్పుడు.

తెలుగు రాష్ట్రాల మధ్య సయోధ్య ఎలా ఉండాలి?

రెండు రాష్ట్రాల మధ్య సయోధ్య ఉండాలి. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. దూరంలో ఉన్న కేంద్రంతో మాట్లాడుతున్నపుడు పొరుగునే ఉన్న రెండు రాష్ట్రాలు మాట్లాడుకుంటే తప్పేంటి.

దిల్లీలో మీరు పోరాటం చేయవచ్చు కదా?

నేను దిల్లీలో పోరాటం చేస్తే ఏమీ జరగదు.

ప్రధానిని కలసినప్పుడు ఏం చెప్పారు?

ప్రత్యేక హోదాపై ప్రకటన చేయకపోతే ఉత్తర దక్షిణాది రాష్ట్రాలు అనే తేడాలు వస్తాయని చెప్పాను. ఇలాగే కొనసాగితే ద్రవిడ ఉద్యమం తరహా ఆందోళన మళ్లీ వస్తుందని అన్నాను. ఈ పరిణామాలు జరగడానికి ఎంతకాలం పడుతుందో చెప్పలేమని పేర్కొంటూ... 1969, 1972 ఉద్యమాల నేపథ్యం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు దారి తీయడం గురించి వివరించాను.



కేంద్రం నుంచి తెదేపా వైదొలగితే ఏమవుతుంది?

ప్రస్తుతం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం, లేదా కేంద్రం నుంచి వైదొలగడం వల్ల పెద్ద ప్రయోజనాలు ఉంటాయని అనుకోవడంలేదు. గతంలోనే రాజీనామా చేయాల్సింది. అసలు మంత్రి పదవులు ఎందుకు తీసుకున్నారు?. హోదా రాకుంటే కేంద్రం నిధులు ఇవ్వలేదన్న సాకుతో... ఇక్కడ అభివృద్ధి చేయలేకపోయామని రాష్ట్ర ప్రభుత్వం తప్పించుకునే అవకాశం ఉంది.

మోదీని వ్యతిరేకిస్తున్నారా?

నేను ఇచ్చిన హామీని నిలబెట్టుకోమని భారత ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ముఖ్యమంత్రి అభ్యర్థిగా మీరు ఉంటారా?

నేను చాలా ప్రాక్టికల్‌గా ఉంటాను. సీఎం అభ్యర్థిని అని నేను ఎలా చెబుతాను. సినిమా వాళ్లు చెయ్యి ఊపేస్తే ఓట్లు పడిపోవు. ఎంజీఆర్ లాంటి వారు అంతకు ముందు తమిళనాడులో ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారని గుర్తించాలి.

రాజ్యసభ అభ్యర్థిగా వేమిరెడ్డి నామినేషన్ దాఖలు

ఈనాడు అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వైకాపా తరఫున రాజ్యసభ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ఆయన్ను ప్రతిపాదిస్తూ తొలిసంతకం చేశారు. ఆయనతోపాటు మరో 9 మంది ఎమ్మెల్యేలూ సంతకాలు చేశారు. వేమిరెడ్డితోపాటు ఆయన సతీమణి ప్రశాంతి రెడ్డి కూడా నామినేషన్ దాఖలు చేశారు.

ఛాంపియన్స్



అనుభవజ్ఞుల గైర్హాజరీలో ముక్కోణపు టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో దెబ్బతిన్న టీమ్‌ఇండియా మరో సమరానికి సిద్ధమైంది. బంగ్లాదేశ్‌తో పోరు నేడే. ఎప్పుడెలా ఆడుతుందో తెలియని ఆ జట్టుతో మ్యాచ్ సవాలే. తొలి మ్యాచ్‌లో శ్రీలంకకు తేలిగ్గా తలవంచిన భారత జట్టు ఎంతో మెరుగుపడాల్సివుంది.

భారత్ పుంజుకునేనా?

బంగ్లాదేశ్‌తో పోరు నేడు ● ముక్కోణపు టీ20 టోర్నీ

రాత్రి 7 నుంచి డి స్పోర్ట్స్‌లో ప్రసారం

కొలంబో

కోహ్లి సహా అనేక మంది కీలక ఆటగాళ్లు లేకుండా శ్రీలంకకు వెళ్లిన భారత్‌కు తొలి మ్యాచ్‌లోనే తేడా తెలిసొచ్చింది. బ్యాటింగ్, బౌలింగ్‌ల్లో తడబడి లంక చేతిలో పరాజయంపాలైంది. బ్యాటింగ్‌లో ధావన్ తప్ప ఎవరూ పెద్దగా రాణించలేదు. కుశాల్ పెరీరా దూకుడుకు అనుభవం లేని బౌలర్ల వద్ద సమాధానం లేకపోయింది. చాహల్ కూడా భారీగానే పరుగులు సమర్పించుకున్నాడు. తిరుగులేదనుకున్న భారత్ ఓటమి పాలవడంతో సిరీస్ కూడా ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో భారత్ తన రెండో మ్యాచ్‌లో గురువారం బంగ్లాదేశ్‌ను ఢీకొట్టనుంది. ఒత్తిడి భారత్‌పైనే. జట్టుకు నాయకత్వం వహిస్తున్న రోహిత్ ఫామ్‌లో లేకపోవడం కలవరపెడుతోంది. గత మ్యాచ్‌లో ఖాతా కూడా తెరవని అతడు ఈ కీలక మ్యాచ్‌లోనైనా పుంజుకుంటాడని జట్టు ఆశిస్తోంది. ధావన్‌తో కలిసి అతడు శుభారంభాన్నివ్వడం ముఖ్యం. పేసర్లు ఉనద్కత్, శార్దుల్ ఠాకూర్ తమ బౌలింగ్‌లో పదును పెంచకపోతే ఇబ్బందులు తప్పవు. ఈ మ్యాచ్‌కు జట్టులో పెద్దగా మార్పులేమీ ఉండకపోవచ్చు. చాహల్‌కు తోడుగా మరో స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను ఆడించే అవకాశముంది. పరిమిత ఓవర్ల క్రికెట్లో బంగ్లాదేశ్‌ను ఎదుర్కోవడం ఎప్పుడూ సవాలే. గురువారం కూడా పరిస్థితి భిన్నంగా ఏమీ ఉండబోదు. గాయపడ్డ షకిబ్ స్థానంలో బంగ్లాకు మహ్మదుల్లా నాయకత్వం వహిస్తున్నాడు. ఇటీవలే టెస్టు, టీ20, వన్డే ముక్కోణపు టోర్నీ ఫైనల్లో లంక చేతిలో ఓడిపోయిన బంగ్లా.. పరాభవ పరంపర నుంచి బయటపడాలనే పట్టుదలతో ఉంది. "ఈ టోర్నీ మాకు సవాల్. మేం అత్యుత్తమ ఫామ్‌లో లేమని మాకు తెలుసు. కానీ ఆటలో ఇది మామూలే. ఆటలో ఏ బ్యాట్స్‌మన్‌కైనా, బౌలర్‌కైనా పేలవ దశ ఉంటుంది. కొన్నిసార్లు మేం భయపడుతున్నాం. ఆ భయాన్ని మేం పోగొట్టుకోవాలి. మేం ప్రాథమికాంశాలపై దృష్టిపెట్టాలి" అని బంగ్లా బ్యాట్స్‌మన్ తమీమ్ అన్నాడు.



షమి మోసగాడు..!

- పలువురు మహిళలతో సంబంధాలున్నాయి
- చాలా రోజులుగా హింసిస్తున్నాడు
- భార్య హసీన్ సంచలన ఆరోపణలు
- బీసీసీఐ కాంట్రాక్ట్ కోల్పోయిన పేసర్

ముంబయి

టీమ్‌ఇండియా పేసర్ మహ్మద్ షమిపై అతడి భార్య హసీన్ జహాన్ సంచలన ఆరోపణలు చేసింది. అతడు మోసగాడని, పలువురు మహిళలతో సంబంధాలున్నాయని, తనపై గృహ హింసకు పాల్పడుతున్నాడని సామాజిక మాధ్యమాల్లో పేర్కొంది. ఆమె ఆరోపణలను షమి వెంటనే ఖండించాడు. తన కెరీర్‌ను దెబ్బతీసేందుకు జరుగుతున్న కుట్రగా అభివర్ణించాడు. ఐతే ఆ తర్వాత, బుధవారం సాయంత్రం హసీన్ కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌కు ఫిర్యాదు చేసింది. న్యాయవాదితో కలిసి కమిషనర్‌ను కలిసిన ఆమె.. తన ఆరోపణలకు తగిన ఆధారాలను సమర్పించింది! అంతకుముందు షమి రాసలీలలు నిజమేనంటూ.. వాట్సాప్‌లో ఇతర మహిళలతో అతడు జరిపిన అసభ్యకర సంభాషణల తాలూకు స్క్రీన్ షాట్‌లను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసింది. ఐపీఎల్ ఫ్రాంఛైజీ దిల్లీ డేర్‌డెవిల్స్ బహుమతిగా ఇచ్చిన ఫోన్‌లో ఈ సంభాషణలున్నట్లు సమాచారం. ఈ మధ్యనే అతడి ఫోన్ రహస్య పిన్‌ను సంపాదించిన తాను.. అతడి బూతు భాగోతాలను చూసి దిగ్భ్రాంతికి గురయ్యానని తెలిపింది. 2014 జూన్ 6న షమి, హసీన్ జహాన్ పెళ్లిచేసుకున్నారు. 2015 జులైలో వారికి ఆడపిల్ల జన్మించింది. పెళ్లయిన నెలకే షమి వ్యవహారాల గురించి తెలిసినా, ఊరికే ఉండక తప్పలేదని హసీన్ వాపోయింది. మొత్తానికి ఆమె మోపిన అభియోగాలతో షమి కెరీర్ సంకటస్థితిలో పడింది. తాజా వివాదం నేపథ్యంలో బీసీసీఐ వార్షిక కాంట్రాక్ట్ జాబితాలో అతడికి చోటు దక్కలేదు.

మరొకరితో వివాహం..!: షమిపై హసీన్ చేసిన ఆరోపణలు క్రికెట్ వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. ఇప్పుడు బయటపెట్టిన రాసలీలలు మచ్చుకు కొన్ని మాత్రమేనని ఓ ఛానెల్‌తో ఆమె పేర్కొంది. షమి, అతడి కుటుంబ సభ్యులు తనను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారని, తనను చంపేందుకు ప్రణాళికలు రచించారని ఆరోపించింది. "షమి కుటుంబ సభ్యులు నన్ను హింసించేవారు. అతడి తల్లి, సోదరుడు అసభ్య పదజాలంతో దూషించేవారు. తెల్లవారుజామున 2-3 గంటల వరకు వేధింపులు కొనసాగేవి. వాళ్లు నన్ను చంపాలనుకున్నారు కూడా. షమి తన తప్పును అంగీకరించడం మానేసి తన కోపాన్ని నాపై ప్రదర్శించేవాడు. బెదిరించేవాడు. మంచిగా ఉండాలనుకుంటే నోరు మూసుకుని ఉండమని హెచ్చరించాడు. నన్ను తన్నడం మొదలుపెట్టాడు. దక్షిణాఫ్రికా పర్యటన నుంచి తిరిగొచ్చాక కూడా అతడు కొట్టాడు. గత కొన్ని రోజులుగా ఈ తంతు జరుగుతోంది. నా కూతురు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని నేను ఎప్పటికప్పుడు సర్దుకుపోతూ వస్తున్నా. ఐతే అతడి ఆగడాలు మాత్రం తగ్గడం లేదు. ఫోన్‌లో ఇతర మహిళలతో అతడు జరిపిన సంభాషణలు చూశాక ఇక తట్టుకోలేకపోయాను. అందుకే నా దగ్గర ఉన్న ఆధారాలతో అతడిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నాను" అని ఓ ఛానెల్‌తో తెలిపింది. పాకిస్థాన్ అమ్మాయిని అతడు పెళ్లి చేసుకున్నాడని, దక్షిణాఫ్రికా పర్యటన నుంచి తిరిగొస్తూ ఆమెను కలిశాడని పేర్కొంది. పాకిస్థాన్, నాగ్‌పూర్ మహిళలతో అతడు సాగించిన సందేశాలను బయటపెట్టింది. ఆమె ఆరోపణలు దుమారం రేపడంతో వెంటనే మహ్మద్ షమి స్పందించాడు. తన కెరీర్‌ను నాశనం చేసేందుకు పన్నిన కుట్ర అని ట్వీట్ చేశాడు. "నా వ్యక్తిగత జీవితంపై వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదు. నా పేరును ఆటను దెబ్బతీసేందుకు పన్నిన కుట్ర ఇది" అని చెప్పాడు. ప్రస్తుతం షమి దేవధర్ ట్రోఫీలో భారత్-ఎ తరఫున ఆడుతున్నాడు.

"మేం కలిసే హోలీ సంబరాలు చేసుకున్నాం. నేను దక్షిణాఫ్రికా నుంచి తిరిగి వచ్చాక కలిసి షాపింగ్ కూడా చేశాం. ఇప్పుడు ఈ ఆరోపణల వెనక ఎవరి హస్తమో ఉంది. నా భార్యతో మాట్లాడేందుకు ప్రయత్నించా. కానీ ఆమె నా ఫోన్ ఎత్తట్లేదు. ఈ సమస్య త్వరగానే పరిష్కారమవుతుందని ఆశిస్తున్నా. నా భార్యతో అనుబంధాన్ని కొనసాగించాలనుకుంటున్నా"

– మహ్మద్ షమి

కాంట్రాక్టూ పోయింది...

బీసీసీఐ కొత్తగా ప్రకటించిన కాంట్రాక్ట్ జాబితాలో మహ్మద్ షమి చోటు కోల్పోయాడు. ఏ+, ఏ, బి, సి విభాగాల్లో మొత్తం 26 మంది క్రికెటర్లను బోర్డు ఎంపిక చేసింది. ఐతే టీమ్‌ఇండియాలో కీలక సభ్యుడైన షమికి ఏ విభాగంలోనూ చోటు లభించకపోవడం విశేషం. షమిపై అతడి భార్య ఆరోపణల నేపథ్యంలోనే బోర్డు అతడి పేరును కాంట్రాక్ట్ జాబితా నుంచి తొలగించినట్లు సమాచారం. "షమి వ్యక్తిగత జీవితంపై వచ్చిన ఆరోపణలను, వార్తలను బోర్డు పరిగణనలోకి తీసుకుంది. షమిపై ఆరోపణలు చేసిన మహిళ.. పోలీసు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో.. అధికారిక నివేదిక వచ్చే వరకు అతడి విషయంలో వేచిచూడడమే తెలివైన పని. అందుకే అతడి పేరును కాంట్రాక్ట్ జాబితాలో ప్రకటించలేదు" అని బీసీసీఐ అధికారి తెలిపాడు. షమి టీమ్‌ఇండియా తరఫున 30 టెస్టుల్లో, 50 వన్డేల్లో, 7 టీ20ల్లో ఆడాడు.

భారత క్రికెటర్ల ఎదురు చూపులు ఫలించాయి. కొన్నాళ్లుగా ప్రచారం జరుగుతున్నట్లే వారి జీతాలు భారీ స్థాయిలో పెరిగాయి. గత ఏడాది వరకు గరిష్ఠంగా ఒక ఆటగాడు రూ.2 కోట్ల వార్షిక వేతనం అందుకుంటుంటే.. అది ఈసారి ఏకంగా రూ.7 కోట్లకు పెరగడం విశేషం. కెప్టెన్ విరాట్ కోహ్లి సహా ఐదుగురు ఆటగాళ్లు ఏటా ఈ మొత్తం అందుకోనున్నారు. చాలా ఏళ్లుగా గరిష్ఠ వేతన విభాగంలో ఉన్న మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనికి ఒక గ్రేడ్ తగ్గించారు. మహిళా క్రికెటర్లకు సైతం భారీగా జీతాలు పెరగడం విశేషం. దేశవాళీ ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులూ పెరిగాయి.

జీతాల మోత

- భారీగా ఒప్పంద మొత్తాల పెంపు
- కోహ్లి సహా ఐదుగురికి ఏడాదికి రూ.7 కోట్లు
- ఒక గ్రేడ్ తగ్గిన ధోని, అశ్విన్
- మహిళల జీతాల్లోనూ గణనీయ పెరుగుదల

ముంబయి

భారత క్రికెటర్ల జీతాల పెంపు ప్రతిపాదనకు బీసీసీఐ ఎట్టకేలకు ఆమోదముద్ర వేసింది. బీసీసీఐ పాలకుల కమిటీ నుంచి కూడా అనుమతి లభించడంతో ఆటగాళ్లకు భారీగా జీతాలు పెంచుతున్నట్లు బోర్డు ప్రకటించింది. గత ఏడాది వరకు ఎ, బి, సి గ్రేడ్‌లు ఉండగా.. ఈసారి కొత్తగా 'ఎ+' గ్రేడ్‌ను తెచ్చారు. మూడు ఫార్మాట్లలోనూ రెగ్యులర్ ఆటగాళ్లుగా ఉన్న కోహ్లి, ధావన్, రోహిత్, భువనేశ్వర్, బుమ్రాలకు ఇందులో చోటు దక్కింది. వీరు ఏడాదికి రూ.7 కోట్ల వేతనం అందుతుంది. దాదాపు దశాబ్దం నుంచి అత్యున్నత గ్రేడ్‌లోనే ఉంటున్న మాజీ కెప్టెన్ ధోనికి 'ఎ+'లో చోటు దక్కలేదు. మూడేళ్ల కిందటే టెస్టుల నుంచి తప్పుకుని వన్డేలు, టీ20ల్లో మాత్రమే కొనసాగుతున్న నేపథ్యంలో అతడిని 'ఎ' గ్రేడ్‌కు పరిమితం చేశారు. పరిమిత ఓవర్ల క్రికెట్‌కు దాదాపుగా దూరమై, టెస్టుల్లో మాత్రమే కొనసాగుతున్న సీనియర్ స్పిన్నర్లు అశ్విన్, జడేజాలను కూడా ఈ గ్రేడ్‌లోనే ఉంచారు. టెస్టు ఆటగాళ్లకు ప్రాధాన్యమిచ్చే ఉద్దేశంతో ఆ ఒక్క ఫార్మాట్లో మాత్రమే కొనసాగుతున్నప్పటికీ పుజారా, సాహా, విజయ్‌లకు 'ఎ'లో చోటివ్వడం విశేషం. రహానె కూడా ఈ గ్రేడ్‌లోనే ఉన్నాడు. ఇందులోని ఆటగాళ్లు ఏటా రూ.5 కోట్ల వేతనం అందుకుంటారు. రూ.3 కోట్ల వార్షిక వేతనం దక్కే 'బి' గ్రేడ్‌లో కేఎల్ రాహుల్, ఉమేశ్ యాదవ్, కుల్‌దీప్ యాదవ్, చాహల్, హార్దిక్ పాండ్య, ఇషాంత్ శర్మ, దినేశ్ కార్తీక్ ఉన్నారు. చివరగా 'సి' గ్రేడ్‌లో కేదార్ జాదవ్, మనీష్ పాండే, అక్షర్ పటేల్, కరుణ్ నాయర్, సురేశ్ రైనా, పార్థివ్ పటేల్, జయంత్ యాదవ్ ఉన్నారు. వీరికి ఏటా రూ.కోటి వేతనంగా అందుతుంది. నిరుడు 32 మందికి కాంట్రాక్టులిచ్చిన బీసీసీఐ.. ఈసారి 26 మందికి పరిమితం చేసింది. ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ షమికి కూడా కాంట్రాక్టు ఇచ్చినప్పటికీ.. భార్యను వేధించిన కేసులో చిక్కుకున్న నేపథ్యంలో అతడి ఒప్పందాన్ని నిలిపి ఉంచినట్లు తెలిసింది. గత ఏడాది బీసీసీఐ కాంట్రాక్టు అందుకున్న సీనియర్ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ ఈసారి అవకాశం దక్కించుకోలేకపోయాడు. అతడితో పాటు యువ ఆటగాడు రిషబ్ పంత్‌ను కూడా కాంట్రాక్టు నుంచి తప్పించారు. గత ఏడాది కాలంలో భారత్ తరఫున కనీసం ఒక్క మ్యాచ్ అయినా ఆడిన వాళ్లకే కాంట్రాక్టులు ఇచ్చినట్లు బీసీసీఐ చెబుతుండగా.. చివరగా 2016లో టెస్టు మ్యాచ్ ఆడిన స్పిన్నర్ జయంత్‌కు మాత్రం 'సి' కాంట్రాక్టు దక్కడం గమనార్హం.

అమ్మాయిలకూ జాక్‌పాట్: మహిళా క్రికెటర్ల జీతాల్ని సైతం బోర్డు 300 శాతానికి పైగా పెంచడం విశేషం. గత ఏడాది 'ఎ' గ్రేడ్ క్రికెటర్లకు రూ.15 లక్షలు, 'బి' గ్రేడ్‌లోని వాళ్లకు రూ.10 లక్షలు చెల్లించేది బీసీసీఐ. ఈసారి మరో గ్రేడ్ పెంచి.. వరుసగా మూడు గ్రేడ్‌లకు రూ.50 లక్షలు, రూ.30 లక్షలు, రూ.10 లక్షలు చొప్పున ఇవ్వనున్నారు. కెప్టెన్ మిథాలీ రాజ్, సీనియర్ ఫాస్ట్‌బౌలర్ జులన్ గోస్వామి.. స్టార్ బ్యాటర్లు హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన 'ఎ'లో ఉన్నారు. 'బి'లో ఆరుగురికి, 'సి'లో తొమ్మిది మందికి చోటు దక్కింది.



దేశవాళీ ఆటగాళ్లకూ..: దేశవాళీ ఆటగాళ్లకూ మ్యాచ్ ఫీజులు పెరిగాయి. సీనియర్ స్థాయిలో నాలుగు రోజుల మ్యాచ్‌లకు తుది జట్టులోని ఆటగాడు రోజుకు రూ.35 వేల చొప్పున అందుకుంటారు. టీవీ హక్కుల మొత్తంలోంచి ఆటగాళ్లకు దక్కే ఫీజును కూడా కలిపితే ఒక రంజీ మ్యాచ్ ఆడే ఆటగాడికి నాలుగు రోజులకు కలిపి రూ.3 లక్షల దాకా దక్కుతుంది. రిజర్వ్ ఆటగాడికి రోజుకు రూ.17.500 చొప్పున అందుతుంది. అండర్-23, 19, 16 ఆటగాళ్లకు వరుసగా రోజుకు రూ.17,500, రూ.10,500, రూ.3,500 చొప్పున ఫీజు లభిస్తుంది. దేశవాళీ మహిళా క్రికెటర్లకు సీనియర్ స్థాయిలో రోజుకు రూ.12,500 ఫీజు అందుతుంది. అండర్-23, 19, 16 క్రికెటర్లకు సమానంగా రోజుకు రూ.5,500 ఫీజుగా దక్కుతుంది.



ఇదీ కాంట్రాక్టుల లెక్క..

గ్రేడ్	మొత్తం	ఆటగాళ్లు
ఎ+	రూ.7 కోట్లు	కోహ్లి, రోహిత్, ధావన్, భువనేశ్వర్, బుమ్రా
ఎ	రూ.5 కోట్లు	ధోని, అశ్విన్, జడేజా, రహానె, పుజారా, విజయ్, సాహా
బి	రూ.3 కోట్లు	రాహుల్, ఉమేశ్, కుల్‌దీప్, చాహల్, హార్దిక్, ఇషాంత్, దినేశ్ కార్తీక్
సి	రూ.1 కోటి	కేదార్ జాదవ్, మనీష్ పాండే, అక్షర్ పటేల్, కరుణ్ నాయర్, రైనా, పార్థివ్, జయంత్ యాదవ్

మహిళలకు ఇలా..

గ్రేడ్	మొత్తం	క్రికెటర్లు
ఎ	రూ.50 లక్షలు	మిథాలీ రాజ్, జులన్ గోస్వామి, హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన
బి	రూ.30 లక్షలు	పూనమ్ యాదవ్, వేద, రాజేశ్వరి, ఏక్తా బిష్త్, శిఖా పాండే, దీప్తి శర్మ
సి	రూ.10 లక్షలు	మాన్సి, అనూజ, మోనా, నుజత్, సుష్మ వర్మ, పూనమ్ రౌత్, జెమీమా, పూజా వస్త్రకర్, తానియా భాటియా



టేలర్ 181 నాటౌట్

ఇంగ్లాండ్‌పై 336 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన న్యూజిలాండ్

డునెడిన్: న్యూజిలాండ్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ కళ్లు చెదిరే బ్యాటింగ్‌తో పెను విధ్వంసం సృష్టించాడు. ఇంగ్లాండ్ బౌలింగ్‌ను తుత్తునియలు చేసిన టేలర్ (181; 147 బంతుల్లో 17×4, 6×6) భారీ శతకం బాదడంతో బుధవారం జరిగిన నాలుగో వన్డేలో న్యూజిలాండ్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-2తో సమం చేసింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్.. బెయిర్‌స్టో (138), రూట్ (102) సెంచరీలు చేయడంతో 9 వికెట్లకు 335 పరుగులు సాధించింది. ఓ దశలో 37.3 ఓవర్లలో 267/1తో ఉన్న ఇంగ్లాండ్ 400పై కన్నేసింది. కానీ సోధి (4/58), మున్రో (2/53) విజృంభించడంతో ఆ జట్టు ఇన్నింగ్స్ గతి తప్పింది. టాప్-3 తర్వాత నంబర్-9, 10 బ్యాట్స్‌మన్ మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. టేలర్‌తో పాటు లేథమ్ (71; 67 బంతుల్లో 2×4, 3×6) చెలరేగడంతో లక్ష్యాన్ని కివీస్.. 49.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వన్డేల్లో కెరీర్ అత్యుత్తమ స్కోరు సాధించిన టేలర్.. విలియమ్సన్ (45)తో మూడో వికెట్‌కు 84, లేథమ్‌తో నాలుగో వికెట్‌కు 187 పరుగులు జోడించాడు.

దేశం గర్వపడేలా చేశావ్

అరుణకు ప్రధాని లేఖ

దిల్లీ: ప్రపంచకప్ జిమ్నాస్టిక్స్‌లో కాంస్యం నెగ్గి చరిత్ర సృష్టించిన తెలుగు తేజం బుడ్డా అరుణ రెడ్డికి అభినందనలు తెలుపుతూ ప్రధాన మంత్రి మోదీ లేఖ రాశారు. "నీ అద్భుతమైన ప్రదర్శనతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడా అభిమానుల హృదయాలను గెలుచుకున్నావు. మరెంతోమంది క్రీడాకారిణులకు స్ఫూర్తిగా నిలిచావు. నీ ఘనత పట్ల దేశం గర్వపడుతోంది" అంటూ లేఖలో పేర్కొన్నారు.


రమణ్‌దీప్

మలేసియాపై భారత్ ఘనవిజయం

ఇపో (మలేసియా): అజ్లాన్ షా హాకీ టోర్నీలో భారత్ ఎట్టకేలకు బోణీ చేసింది. అర్జెంటీనా చేతిలో ఓడి.. తర్వాత ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌ను డ్రా చేసుకుని ఫైనల్ అవకాశాలను సంక్లిష్టం చేసుకున్న సర్దార్ సేన... బుధవారం చెలరేగిపోయింది. ఆతిథ్య మలేసియాను 5-1తో మట్టికరిపించి, ఫైనల్‌కు అర్హత సాధించేందుకు ఓ చిన్న అవకాశాన్ని సృష్టించుకుంది. భారత్ తరఫున గుర్జాంత్ సింగ్ (42వ, 57వ నిమిషాల్లో) రెండు గోల్స్ కొట్టగా.. శిలానంద్ లక్రా (10వ), సుమిత్ కుమార్ (48వ), రమణ్‌దీప్ సింగ్ (51వ) తలో గోల్ సాధించారు. ఈ విజయంతో భారత్ ఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. చివరి రౌండ్ రాబిన్ మ్యాచ్‌ల ఫలితాలు భారత్ ఫైనల్ చేరుతుందో లేదో తేల్చనున్నాయి. భారత్ ఫైనల్ చేరాలంటే శుక్రవారం భారీ తేడాతో ఐర్లాండ్‌ను ఓడించాలి. అర్జెంటీనాపై ఆస్ట్రేలియా నెగ్గాలి. అదే సమయంలో మలేసియా, ఇంగ్లాండ్ మధ్య మ్యాచ్ డ్రాగా ముగియాలి.

వార్నర్‌కు జరిమానా

డర్బన్: ఆస్ట్రేలియా వైస్‌కెప్టెన్ డేవిడ్ వార్నర్ జరిమానాకు గురయ్యాడు. తొలి టెస్టు సందర్భంగా మైదానం బయట దక్షిణాఫ్రికా ఆటగాడు డికాక్‌తో అతడు తీవ్ర స్థాయిలో గొడవకు దిగిన సంగతి తెలిసిందే. తప్పును అంగీకరించిన వార్నర్ మ్యాచ్ ఫీజులో.. రిఫరీ 75 శాతం కోత పెట్టాడు. డికాక్‌పైనా ఐసీసీ అభియోగాలు నమోదు చేసింది. కానీ తాను ఎలాంటి తప్పు చేయలేదని అతడు చెప్పాడు. దీనిపై బుధవారం విచారణ జరగనుంది.

కర్ణాటక X భారత్-బి

నేడే దేవధర్ టోర్నీ ఫైనల్

ధర్మశాల: విజయ్ హజారే ట్రోఫీ విజేత కర్ణాటక మరో ట్రోఫీపై కన్నేసింది. దేవధర్ టోర్నీలో వరుస విజయాలతో ఫైనల్ చేరిన కర్ణాటక.. గురువారం తుదిపోరులో భారత్-బితో తలపడనుంది. లీగ్‌మ్యాచ్‌లో భారత్-బిపై విజయం సాధించిన కర్ణాటకనే ఈ మ్యాచ్‌లో ఫేవరేట్. కర్ణాటక జట్టు బ్యాట్స్‌మన్ రవికుమార్, సమర్థ్ మంచి ఫామ్‌లో ఉన్నారు. స్పిన్నర్ శ్రేయస్ గోపాల్ రెండు మ్యాచ్‌ల్లో 5వికెట్లతో ఆకట్టుకున్నాడు.

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో



డీడీ కెప్టెన్‌గా గంభీర్

దిల్లీ: వచ్చే ఐపీఎల్ సీజన్లో దిల్లీ డేర్‌డేవిల్స్ (డీడీ) కెప్టెన్ ఎవరనే ఊహాగానాలకు తెరపడింది. అందరూ అనుకుంటున్నట్లుగానే డీడీ కెప్టెన్‌గా సీనియర్ ఓపెనర్ గౌతమ్ గంభీర్‌ను ఎంపికచేస్తూ జట్టు యాజమాన్యం బుధవారం ప్రకటించింది. కోల్‌కతా జట్టు కెప్టెన్‌గా తన జట్టును రెండు సార్లు ఐపీఎల్ విజేతగా నిలిపిన గంభీర్.. తిరిగి ఎనిమిదేళ్ల తర్వాత దిల్లీకి ఆడనున్నాడు.

ఆకాశంలో.. అన్ని వైపులకూ!

- రాజధాని నలువైపులా ఆకాశ మార్గాల నిర్మాణం
- రూ.2 వేల కోట్ల వ్యయంతో పనులు
- నిధుల మంజూరుకు కేంద్రం పచ్చజెండా
- ఇప్పటికే కొన్నింటి టెండర్ల ప్రక్రియ పూర్తి



వివిధ ప్రాంతాల్లో నిర్మించబోయే ఆకాశ మార్గాల నమూనా చిత్రం

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి

రాజధాని నలువైపులా దాదాపు రూ.2 వేల కోట్ల వ్యయంతో ఆకాశమార్గాలను నిర్మించేందుకు కేంద్రం ముందుకు వచ్చింది. ఈ మేరకు నిధులు కూడా పూర్తిస్థాయిలో కేటాయించడంతో..వాటి నిర్మాణ పనులకు ఇంజినీరింగ్ అధికారులు యుద్ధప్రాతిపదికన టెండర్లు పిలిచారు. అవన్నీ పూర్తయితే సంబంధిత మార్గాల్లో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకుతుందని అధికారులు భావిస్తున్నారు.

అంబర్‌పేట పై వంతెనకు మార్గం సుగమం

అదిగో ఇదిగో అంటున్న అతి పెద్దదైన అంబర్‌పేట ఆకాశమార్గానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ మార్గం రామంతపూర్ పబ్లిక్ స్కూలుకు దగ్గరలో మొదలై.. సెంట్రల్ పవర్ రీసెర్చి కేంద్రం వరకు 6.5 కిలో మీటర్ల పొడవున ఆరు వరుసల్లో రూపుదిద్దుకోనుంది. దీని నిర్మాణానికి రూ.626.80 కోట్లు, భూసేకరణకు రూ.250 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. భూసేకరణ నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తేనే నిర్మాణ నిధులను ఇస్తామని కేంద్ర జాతీయ ఉపరితల రవాణాశాఖ అధికారులు మెలికపెట్టారు. ఈ నిధులు భరించేందుకు రాష్ట్రం ముందుకు రావడంతో కేంద్రం ఎట్టకేలకు తన వాటా నిధులు మంజూరు చేసింది. భూసేకరణ నిధులను హైదరాబాద్ మహానగరపాలక సంస్థ భరించబోతోంది. వచ్చే నెల నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తిచేసేందుకు అధికారులు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

గోల్నాకా నుంచి ఛే నెంబర్ మీదుగా

ఇదే తరహాలో గోల్నాకా నుంచి ఛే నెంబర్ జంక్షన్ మీదుగా శ్రీరమణ థియేటర్ వరకు మరో పై వంతెన నిర్మించనున్నారు. దీని నిర్మాణానికి రూ.186.71 కోట్లు, భూసేకరణకు రూ.152 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. భూసేకరణ నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. ఈ వంతెన పైభాగంలో నాలుగు వరుసలు, కింది భాగంలో నాలుగు వరుసల రహదార్లు వస్తాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే ఈ పనులకు టెండర్లు పిలవగా.. ఆర్థిక బిడ్‌ను తెరిచి గుత్తేదారుకు పనులను అప్పగించబోతున్నారు.

విమానాశ్రయ రహదారుల విస్తరణ

పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే దిగిన వెంటనే ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు వేర్వేరు చోట్ల అయిదు పై వంతెనలు(ఫ్లై ఓవర్లు) నిర్మించే ప్రాజెక్టుకూ కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీనికి రూ.283 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇప్పటికే టెండర్లు పిలిచారు.

మెదక్ వైపు రహదారుల విస్తరణ

హైదరాబాద్ నుంచి మెదక్‌కు సులభంగా వెళ్లడానికి వీలుగా మరో విస్తరణ ప్రాజెక్టుకు కేంద్రం నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా జీడిమెట్ల దాటిన తరువాత వచ్చే భావ్యవలయ రహదారి నుంచి నర్సాపురం, మెదక్ వరకు 69 కిలో మీటర్ల పొడువున రహదారిని విస్తరించనున్నారు. ఈ మార్గం చాలా వరకు నాలుగు వరుసల్లో ఉంటుంది. దీనికి రూ.426 కోట్ల వ్యయం చేయబోతున్నారు. ఇప్పటికే దీనికి టెండర్లు పిలిచి బీవీఎస్ఆర్, లక్ష్మీమెటల్ ఇండ్రస్టీస్ కన్సార్టియంకు నిర్మాణ పనులను అప్పగించారు.

మరో భారీ వంతెనకు అడ్డంకులు

ఇది కాకుండా హైదరాబాద్ నుంచి షామీర్‌పేట సమీపంలోని లోతుకుంట వరకు దాదాపు 11 కిలో మీటర్ల పొడవున అతి పెద్ద ఆకాశమార్గాన్ని నిర్మించేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళిక సిద్ధంచేశారు. దీనికి రూ.2,500 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే దీని నిర్మాణానికి ఆర్అండ్‌బీ సిద్ధమైనా..రక్షణ శాఖ భూములు ఇవ్వకపోవడవంతో పనులు మొదలు కాలేదు.

రూ.3 వేల కోట్లతో నిర్మాణం

-గణపతిరెడ్డి, ఈఎన్‌సీ, ఆర్అండ్‌బీ



హైదరాబాద్ నగర పరిధిలో దాదాపు రూ.2 వేల కోట్లతో రహదారులు, వంతెనల నిర్మాణ పనులు మొదలయ్యాయి. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో రహదారులకు మరో రూ.1,000 కోట్లు కేంద్రం మంజూరు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా రూ.3 వేల కోట్లు కేంద్రం కేటాయించడం ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి వల్లనే సాధ్యమైంది.

కాటేసిన కలుషిత జలం

గుంటూరులో పదికి చేరిన మృతుల సంఖ్య

ఈనాడు-గుంటూరు: కోస్తాంధ్ర ఆరోగ్యప్రదాయినిగా పేరొందిన గుంటూరులో మరణ మృదంగం మోగింది. కలుషిత జలం కాటేయడంతో డయేరియా, కలరా వ్యాధులు విజృంభించాయి. కేవలం మూడు రోజుల వ్యవధిలో ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో పది మంది మృతి చెందారు. రాత్రి పది గంటల వరకు అందిన సమాచారం ప్రకారం బుధవారం ఒక్కరోజే ఏడుగురు చనిపోయారు. వేర్వేరు చోట్ల దాదాపు 370 మంది చికిత్స పొందుతున్నారు. వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉంది. సోమ, మంగళవారాల్లో ముగ్గురు చనిపోయిన విషయం విదితమే. చనిపోయిన వారిలో అడపాల వెంకట్రావు(65), చిన్న సామ్రాజ్యం(60), ఎస్.చినబాలకోటిరెడ్డి (65), గౌస్, మరో ముగ్గురు ఉన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న ఇద్దరు మంత్రులు పుల్లారావు, ఆనందబాబు బుధవారం రాత్రి గుంటూరు జీజీహెచ్‌కు చేరుకుని బాధితులను పరామర్శించారు. పరిస్థితిని సమీక్షించారు. గుంటూరు జీజీహెచ్‌లో నలుగురు, ప్రభుత్వ జ్వరాల ఆసుపత్రిలో ఒకరు మొత్తం ఐదుగురు చనిపోయారని, జీజీహెచ్‌లో 98 మంది చికిత్స పొందుతున్నారని మంత్రి పుల్లారావు వెల్లడించారు.

ఉపాధి కల్పన వివరాల సేకరణకు సర్వే

నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ డా.రాజీవ్‌కుమార్

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: మారుతున్న కాలానుగుణంగా మన ప్రాథమిక, ఉన్నత విద్యలో మార్పులు తీసుకువస్తేనే పోటీ ప్రపంచంలో నిలుదొక్కుకునే అవకాశముంటుందని నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ డా.రాజీవ్‌కుమార్ అన్నారు. యువత సృజనాత్మకపై దృష్టిసారించి నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. దేశంలో ఉపాధి కల్పన వివరాలను సేకరించేందుకు నీతిఆయోగ్ ప్రయత్నం చేస్తోందని.. ఇందు కోసం త్వరలో ఇంటింటికి సర్వే చేపట్టనుందని వెల్లడించారు. బుధవారం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మాను)లో "ఎంప్లాయిమెంట్ డిమాండ్ ఇన్ న్యూఇండియా - ఏ పాలసీ" అనే అంశంపై రెండ్రోజుల సదస్సు ప్రారంభమైంది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఏదైనా డిగ్రీ చదవితేనే సరిపోదని, ప్రతి విద్యార్థికి బహుముఖ ప్రతిభ చాలా అవసరమన్నారు.

శాటిలైట్ ఆధారిత విమానయానంపై వాతావరణ ప్రభావం

- పరిశోధనలో పురోగతి సాధించిన సీబీఐటీ సహాయ ఆచార్యురాలు సుప్రజారెడ్డి
- అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం




ఈనాడు, హైదరాబాద్: ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ఇక విమాన ప్రయాణాలు సాఫీగా సాగిపోనున్నాయి. ఇందుకోసం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)లు శాటిలైట్ ఆధారిత నేవిగేషన్ వ్యవస్థను రూపొందించాయి. ఇదే గగన్ (జీఏజీఏఎన్- జీపీఎస్ ఎయిడెడ్ జియో ఆగుమెంటెడ్ నావిగేషన్). ఈ విధానాన్ని భారత్ సహా పొరుగు దేశాల్లో జీపీఎస్ సంకేతాల్లో కచ్చితత్వం పెంచి విమానయానానికి ఉపయోగిస్తున్నారు. మరో శాటిలైట్ ఆధారిత నేవిగేషన్ వ్యవస్థ జీబాస్ (జీబీఏఎస్) చెన్నై ఎయిర్‌పోర్టులో మొదటిసారిగా ప్రయోగించనున్నారు. దీనిపైనా పరిశోధనలు సాగుతున్నాయి. ఈ పరిశోధనల్లో హైదరాబాద్ సీబీఐటీలో సహాయ ఆచార్యురాలిగా పనిచేస్తున్న డాక్టర్ సుప్రజారెడ్డి పాల్గొంటున్నారు. ఈ ప్రయోగాల్లో లోటుపాట్లు గుర్తించి విజయవంతంగా పనిచేసేందుకు సుప్రజ పరిశోధనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటలీలోని 'అబ్దుస్ సలాం ఇంటర్నేషనల్ ఫర్ థియరిటికల్ ఫిజిక్స్' సంస్థలో ఏప్రిల్ 23 నుంచి మే 4 వరకు జరగనున్న అంతర్జాతీయ సదస్సులో మనదేశం నుంచి ఆమె పాల్గొననున్నారు.

ప్రాచీన చరిత్రను తిరగరాసే ప్రణాళికలేవీ లేవు: మహేశ్‌శర్మ

ఈనాడు, దిల్లీ: ప్రాచీన భారతదేశ చరిత్రను తిరగరాయాలనే ప్రణాళికలేవీ ప్రభుత్వం వద్ద లేవని కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి మహేశ్ శర్మ స్పష్టం చేశారు. ఇలాంటి ప్రయత్నం జరుగుతోందనీ, పాఠ్య పుస్తకాల్లో ఈ మేరకు మార్పులు చేయబోతున్నారంటూ విదేశీ వార్తాసంస్థ 'రాయిటర్స్' ఇటీవల బహిర్గతం చేయడాన్ని ఆయన ఖండించారు. '12వేల ఏళ్ల క్రితం భారతదేశ సంస్కృతి ఆవిర్భవించిన తీరును అధ్యయనం చేయడానికి మాత్రమే మేం ఒక నిపుణుల కమిటీని నియమించాం. గత ఏడాది నవంబరు 11 నాటికి కమిటీకి ఇచ్చిన ఏడాది గడువు ముగిసింది. సంస్కృతం ఆవిర్భావం, భారత్-యూరోపియన్ సంగమం, కుషానుల కాలం వంటి అంశాలపై కమిటీ వివిధ సిఫార్సులు చేసింది. అంతకుమించి దీనిలో ఏమీ లేదు. దొడ్డిదారిన ఏదో చేయాలనే ప్రణాళికేమీ లేదు.' అని బుధవారం ఆయన 'ఈనాడు'కు తెలిపారు.

ఎదురుకాల్పుల్లో ఇద్దరు భద్రత సిబ్బంది మృతి

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో బుధవారం మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో సరిహద్దు భద్రత దళానికి చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.కాల్పుల్లో సహాయ కమాండెంట్ గజేంద్రసింగ్ (హరియాణా), కానిస్టేబుల్ అమ్రేష్‌కుమార్ (బిహార్) అమరులయ్యారని తెలిపారు.



బీబీనగర్ నిమ్స్ ప్రారంభంలో జాప్యమెందుకు

రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో రూ.125 కోట్లతో నిర్మించిన నిమ్స్ ఆస్పత్రిని ప్రారంభించడంలో జరుగుతున్న జాప్యంపై వివరణ ఇవ్వాలంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని బుధవారం ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. నిర్మాణం పూర్తయినా ఇప్పటివరకు ప్రారంభించకపోవడానికి కారణాలను వివరిస్తూ ప్రమాణపత్రం దాఖలు చేయాలని ఆదేశంచింది. ప్రజారోగ్యం మెరుగునకు తీసుకుంటున్న చర్యలపైనా మరో ప్రమాణపత్రం దాఖలు చేయాలంటూ తెలంగాణతోపాటు ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కార్పొరేట్ ఆస్పత్రులను నియంత్రిస్తూ, ప్రభుత్వ వైద్యారోగ్య వ్యవస్థను మెరుగుపరచాలంటూ కె.నరేందర్ వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.అమరనాథ్‌గౌడ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎన్.ఎస్.అర్జున్‌కుమార్ వాదనలు వినిపిస్తూ ఆరోగ్యశ్రీ పథకంలో ప్రైవేటు ఆస్పత్రులు పలు అక్రమాలకు పాల్పడుతున్నాయంటూ విజిలెన్స్ నివేదిక సమర్పించిందన్నారు. రూ.125 కోట్లతో నిర్మించిన నిమ్స్ భవనాన్ని ఏడేళ్లుగా ఖాళీగా ఉంచడాన్ని 2015 కాగ్ నివేదిక తప్పుపట్టిందని ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. నిమ్స్‌ను ప్రారంభించడంలో జాప్యంతోపాటు రెండు రాష్ట్రాల్లో ప్రజారోగ్యం మెరుగుకు తీసుకుంటున్న చర్యలపై నివేదిక సమర్పించాలంటూ విచారణను మార్చి 21కి వాయిదా వేసింది.

హార్వర్డ్, ఎంఐటీలకు 3 కోట్ల డాలర్లు

మార్క్ జుకెర్‌బర్గ్ వితరణ

కేంబ్రిడ్జ్: ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకెర్‌బర్గ్, అతడి భార్య ప్రిసిల్లాఛాన్‌లు హార్వర్డ్ విశ్వవిద్యాలయం, మసాచ్యుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ)లకు 3 కోట్ల డాలర్ల (సుమారు రూ.194 కోట్లు)ను అందచేయనున్నారు. అమెరికావ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల్లో సాక్షరతా నైపుణ్యాల పెంపునకు ఈ నిధులను ఉద్దేశించాలన్నది వారి అభిమతంగా ఉంది.





ఉద్యోగికి కారు తాళం అందిస్తున్న జి.ఆర్.సూర్యరాజ్

కంపెనీ లాభాలనుంచి..
ఉద్యోగులకు ఉచితంగా వాహనాల పంపిణీ

బాలానగర్, న్యూస్‌టుడే: హైదరాబాద్ బాలానగర్‌లోని డైనమిక్ టూల్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం ఉద్యోగులకు ఉచితంగా వాహనాలు పంపిణీచేసింది. బుధవారం కంపెనీ అధినేత జి.ఆర్.సూర్యరాజ్ జన్మదినం సందర్భంగా మొత్తం 62మంది ఉద్యోగులకు కార్లు, ద్విచక్ర వాహనాల తాళాలను ఆయన అందజేశారు. ఇందులో 50మందికి ద్విచక్ర వాహనాలు, 12మందికి కార్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యరాజ్ మాట్లాడుతూ.. కంపెనీకి వచ్చే లాభాలలో 2012 నుంచి ఏటా ఇలా ఉద్యోగులకు ఉచితంగా వాహనాలను ఇస్తున్నామన్నారు. సిద్దిపేట, గజ్వేల్ మండలం మార్‌కుక్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను కూడా దత్తత తీసుకున్నట్లు చెప్పారు.

తెలంగాణ ఔషధ పరిశ్రమల కోసం
దిల్లీలో ప్రత్యేక విభాగం ఏర్పాటు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని ఔషధ పరిశ్రమల సమస్యల పరిష్కారానికి దిల్లీలోని కేంద్రీయ ఔషధ ప్రమాణాలు, నియంత్రణ సంస్థ ప్రధాన కార్యాలయంలో పౌరసంబంధాల విభాగం(పీఆర్‌సెల్) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భారత ఔషధ నియంత్రణ అధికారి(డీసీజీఐ) ఎస్.ఈశ్వర్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వానికి ఈ సమాచారం అందించారు. ఇటీవల బయోఆసియా సదస్సులో మంత్రి కేటీఆర్, ఔషధ సంస్థల ప్రతినిధులు చేసిన వినతి మేరకు స్పందించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కొత్త విభాగం సహాయ ఔషధ నియంత్రణాధికారి సునిల్ కులశ్రేష్ఠ ఆధ్వర్యంలో నడుస్తుందని, ఔషధ పర్యవేక్షకుడు సంజయ్ అగర్వాల్, సహాయ పర్యవేక్షకులు విభా శర్మలు ఇందులో పనిచేస్తారని చెప్పారు. ఈ విభాగం ఔషధ పరిశ్రమలను క్రమబద్ధీకరించడంతో పాటు సంపూర్ణంగా సహకరించడం, అంకురాలు, నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. అంకుర పరిశ్రమల వినతులను సత్వరమే పరిష్కరించడంతో పాటు తగిన సమాచారం అందించడం, ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టంపై అవగాహన కల్పించడం, ఉత్పత్తులకు అనుమతులపై సందేహాలను నివృత్తి చేస్తుందని చెప్పారు. ఈ నిర్ణయాన్ని మంత్రి కేటీఆర్ స్వాగతించారు.

నేడు సీఎం కేసీఆర్‌తో ప్రవాసుల భేటీ
ప్రత్యామ్నాయ కూటమి ఏర్పాటుకు మద్దతు

దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు కోసం ప్రయత్నాలు చేపట్టిన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అభినందనలు తెలిపేందుకు వివిధ దేశాల నుంచి ప్రవాసులు హైదరాబాద్ చేరుకున్నారు. గురువారం వారు సీఎం కేసీఆర్‌ను కలిసి తమ మద్దతు తెలియజేయనున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, తదితర ప్రాంతాల నుంచి వీరు తరలివచ్చారు.

ఖజానా ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం: ఈటల

తెలంగాణ ఖజానా ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ హామీఇచ్చారు. ఖజానా శాఖ టీఎన్జీవో ఉద్యోగుల సంఘం నేతలు సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ట్రెజరీ ఉద్యోగుల పనితీరు అభినందనీయమని పేర్కొన్నారు. వారికి పనిభారం తగ్గిస్తామని చెప్పారు. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవీప్రసాద్, టీఎన్జీవో రాష్ట్రఅధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి, ట్రెజరీ టీఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.భూపాలరెడ్డి, కార్యదర్శి మహిపతి, ట్రెజరీ శాఖ సంచాలకుడు మూర్తి పాల్గొన్నారు.

చట్టసభ్యులపై క్రిమినల్ కేసుల విచారణ న్యాయస్థానం ప్రారంభం

విజయవాడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎంపీలపై నమోదైన క్రిమినల్ కేసులను త్వరితగతిన విచారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాన్ని డిజిటల్ విధానం ద్వారా ఉమ్మడి హైకోర్టు, కృష్ణా జిల్లా పోర్టుఫోలియో న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రహ్మణ్యం బుధవారం ప్రారంభించారు. అనంతరం న్యాయమూర్తి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న కేసులన్నీ విజయవాడలో ఏర్పాటైన ప్రత్యేక న్యాయస్థానానికి బదలాయించనున్నట్లు తెలిపారు. హైకోర్టులో ఉన్న న్యాయమూర్తి జస్టిస్ రామసుబ్రహ్మణ్యం సంక్షిప్త సందేశం పంపించి విజయవాడలోని ప్రత్యేక న్యాయస్థానాన్ని ప్రారంభించారు.

దేశంలో మొత్తం 1,581 కేసులు

ప్రత్యేక న్యాయస్థానం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.లక్ష్మణరావు మాట్లాడుతూ.. దేశంలో నేరచరిత గల నాయకులపై 1,581 కేసులు ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 124 కేసులుండగా కృష్ణా జిల్లాలో పది ఉన్నట్లు వివరించారు. ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ.1.90 కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు చెప్పారు.

వాడేసిన గ్రనేడ్‌తో అసెంబ్లీలోకి..!
కేరళలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కలకలం

తిరువనంతపురం: వాడేసిన గ్రనేడ్‌తో కేరళ అసెంబ్లీలోకి వచ్చి.. ఓ సీనియర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే బుధవారం కలకలం రేపారు. బడ్జెట్‌పై చర్చ జరుగుతున్న సమయంలో మాజీ హోంమంత్రి, తిరువంచూర్ శాసనసభ్యుడు రాధాకృష్ణన్ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఓ కవర్‌లోంచి గ్రనేడ్‌ను బయటకు తీసి చూపించారు. గతవారం సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న యువ కాంగ్రెస్ కార్యకర్తలపైకి పోలీసులు దీన్ని ప్రయోగించారని తెలిపారు. ఆందోళనకు దిగే తమ పార్టీ యువ కార్యకర్తలపై ప్రభుత్వం ఇలాంటి వాటిని ప్రయోగిస్తోందని ఆరోపించారు. కాగా దీనిపై సీపీఎం ఎమ్మెల్యే ఎస్.శర్మ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తుతూ సభలోకి ఆయుధాలు వంటివి తేవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి పినరయి విజయన్ జోక్యంతో రాధాకృష్ణన్ ఆ గ్రనేడ్‌ను స్పీకర్‌కు అందజేశారు.

'కాళేశ్వరం' టెండర్లలో మూడు సంస్థల పోటీ
• రిజర్వాయర్, పైపుల ద్వారా నీటి సరఫరా పనుల కోసం..

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా రిజర్వాయర్ నిర్మాణం, పైపుల ద్వారా ఆయకట్టుకు నీరు సరఫరా చేసే పనికి పిలిచిన టెండర్‌లో మూడు సంస్థలు పోటీపడ్డాయి. గతంలో టెండర్ పిలవగా ఒక సంస్థనే పాల్గొంది. ఆ సంస్థ అంచనా కంటే తక్కువకు కోట్ చేసినప్పటికీ ఒకే సంస్థ దాఖలు చేసిందని రద్దు చేసి మళ్లీ పిలిచారు. బుధవారం టెండర్ దాఖలు గడువు ముగియగా, ముగ్గురు గుత్తేదారులు పోటీపడ్డారు. ఇందులో తక్కువకు దాఖలు చేసిన వారికే పని అప్పగిస్తారు. నిజామాబాద్ జిల్లాలో కొండమచెరువు, మంచిప్ప చెరువులను కలిపి ఒకే రిజర్వాయర్‌గా మూడున్నర టీఎంసీల సామర్థ్యంతో నిర్మించనున్నారు. దీంతో పాటు నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో రూ.2465 కోట్లతో రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు పైపుల ద్వారా సరఫరా చేసే పనికి నీటిపారుదల శాఖ టెండర్ ప్రక్రియను చేపట్టింది. మొదట గతేడాది డిసెంబరులో టెండర్ పిలవగా ఎంఇఐఎల్ సంస్థ దాఖలు చేసింది. ఈ సంస్థ అంచనా కంటే ఒక శాతం తక్కువకు కోట్ చేసింది. అయితే ఒకే సంస్థ దాఖలు చేసినందున రద్దు చేసి మళ్లీ టెండర్ పిలిచారు. ఇందులో జీవీపీఆర్, మెగా ఇంజినీరింగ్, మ్యాక్స్ ఇన్‌ఫ్రాలు దాఖలు చేసినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. ఇందులో అర్హత సాధించిన కంపెనీల ఆర్థిక బిడ్లను తెరిచి తక్కువకు దాఖలు చేసిన సంస్థకే పని అప్పగిస్తారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.





బోర్లు వేసినా .. రాతిపొడి గుట్టలుగా పడిన దృశ్యం ★ గండీడ్ మండలం వెంకట్‌రెడ్డిపల్లిలో నీరులేక ఎండిన వరి ★ పాలమూరు మండలం వెంకటాపూర్‌లో నీరులేక ఎండిన టమాట తోట

అందని తడి.. ఎండిన మడి

500 అడుగులు తవ్వినా చుక్క రాని బోర్లు • దాచకపల్లిలో 30 రోజుల్లో 54 బోర్లు వేసిన రైతులు • అయినా ఫలితం శూన్యం

ఎండుతున్న పంటలు.. అప్పుల పాలవుతున్న అన్నదాతలు • యాసంగి పంటల దిగుబడులపై తీవ్ర ప్రభావం • పంట నష్టాలపై పరిశీలన చేయని వ్యవసాయశాఖ

ఈనాడు, హైదరాబాద్: వేసవి ఆరంభంలోనే ఎండలు మండుతుండటం, రాష్ట్రవ్యాప్తంగా భూగర్భజలాలు తగ్గడంతో పంటలు ఎండిపోతున్నాయి. మరో నెలరోజుల్లో పంటల చేతికి వస్తాయన్న సమయంలోనే నిలువునా ఎండిపోవడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. ప్రధానంగా వరి, వేరుశనగ, మొక్కజొన్న, కూరగాయల పంటలకు నష్టం అధికంగా ఉంది. భూగర్భ జలమట్టాలు తగ్గటం, 24 గంటల పాటు విద్యుత్ వల్ల బోర్లు నిరంతరం నడపటంతో సమస్యలు పెరిగాయని రైతులు వాపోతున్నారు. కొందరు అన్నదాతలు కొత్తగా బోర్లను తవ్విస్తున్నా చుక్కనీరు రావటంలేదు. ఏకంగా 500 అడుగుల వరకూ బోర్లను వేస్తున్నా నీరురాక వేలాది రూపాయలు నష్టపోతున్నారు. మెదక్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, నల్గొండ, వరంగల్ తదితర జిల్లాలన్నింటిలో బోర్లు, బావులు అడుగంటి పంటల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇప్పటివరకూ పంట నష్టాలపై వ్యవసాయశాఖ ఎలాంటి పరిశీలన చేయలేదు. నిలువునా ఎండిన పైర్లను పశువులకు, గొర్రెలకు మేపేందుకు రైతులు వదిలేస్తున్నారు.

అంతటా నష్టాలే దిగుబడి

పాత మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ, నవాపేట, కోయిల్‌కొండ, కోస్గీ, గండీడ్, మద్దూర్, దేవరకద్ర, భూత్పుర్, జడ్చర్ల, పాలమూరు తదితర మండలాల్లో పంటలు పూర్తిగా ఎండుతున్నాయి. హన్వాడ మండలం దాచకపల్లిలో గడిచిన పది రోజుల్లో దాదాపు 200 ఎకరాలకుపైగా పంటలు ఎండాయి. చేతికొచ్చే దశలో ఉన్న పైర్లను ఎలాగైనా కాపాడుకోవాలన్న ఆశతో అన్నదాతలు గత నెలరోజుల్లోనే 54 బోర్లను కొత్తగా తవ్వించినా తగినంత నీరు రాలేదు. చివరకు ఆశలు వదిలేసి పంటలను గొర్రెలకు, పశువులకు గ్రాసంగా మారుస్తున్నారు. ఈ యాసంగిలో బోర్లను నమ్మి వరి, పుచ్చ, టమాటా, వంకాయ, క్యాబేజి వంటి పంటలను సాగుచేసిన రైతులంతా పూర్తిగా నష్టపోయారు. మార్చి చివరి వరకూ భూగర్భ జలమట్టాలు ఉంటాయని ఆశించి పైర్లు వేస్తే వారి అంచనాలు తలకిందులై ఫిబ్రవరి నెలాఖరుకే అడుగంటాయి. ప్రస్తుత యాసంగిలో దాదాపు 18 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారని వ్యవసాయ శాఖ తెలిపింది. ఇందులో ఇప్పటికే 30 శాతం పంటలకు నీరు అందడం లేదని అనధికార అంచనా.

ఎండిపోతున్న బోర్లు

మరో 15రోజుల్లో భూగర్భ జలమట్టాలు మరింత పడిపోయి మరిన్ని బోర్లు ఎండిపోయే అవకాశాలున్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. విద్యుత్తు వినియోగం రికార్డు స్థాయిలో 10,109 మెగావాట్లకు గతనెల 28న నమోదైందని ట్రాన్స్‌కో వెల్లడించింది. ఈ నెలలో 10,500 మెగావాట్లు దాటవచ్చని అంచనా. సాగునీరు రాకపోవడం ఒక సమస్య అయితే పగటి ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా నాలుగైదు డిగ్రీలు అదనంగా పెరగడం మరింత ఆందోళన రేకెత్తిస్తోంది. ఈవారంలోనే గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకుడు వై.కె.రెడ్డి 'ఈనాడు'కు చెప్పారు. పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియక అప్పుల భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఇతని పేరు పోతట్ల బుచ్చయ్య, ఊరు హన్వాడ, రెండు ఎకరాల్లో వరి వేశాడు. రెండు బోర్లు ఉన్నాయనే ధీమాతో రూ.30 వేలను అప్పుగా తెచ్చి పంటలను సాగు చేశాడు. నీళ్లులేక పంట వాడిపోయింది. బోర్లు ఎండిపోవటంతో మరో బోరు వేశాడు ఆయినా నీరు రాలేదు. కళ్ల ముందే పైరు ఎండిపోవటంతో గొర్రెలను వదిలేశాడు. పంటల కోసం చేసిన అప్పులు రూ.రెండు లక్షల అప్పులకు చేరడంతో నిత్యం జిల్లా కేంద్రానికి మేస్త్రీ పనిచేసేందుకు కూలికి వెళ్తున్నాడు.



ఇతని పేరు నకిర్త శ్రీశైలం. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలోని కళ్లెం గ్రామం. తొమ్మిదెకరాల సాగు భూమిలో బావి, బోరు ఉన్నాయి. ఈ యాసంగిలో ఎకరా 30 గుంటలలో వరి పొలం సాగు చేశాడు. అన్నింటికీ కలిపి సుమారు రూ.24వేలు వెచ్చించాడు. 24 గంటల విద్యుత్తు సరఫరా ప్రారంభమయ్యాక బోర్లు నిరంతరాయంగా వాడటంతో బావి ఎండిపోయింది. బోరులో నీరు అప్పుడప్పుడూ వస్తోంది. పైరు ఎండిపోవడంతో భయపడిన శ్రీశైలంరెండుబోర్లు తవ్విస్తే ఫలితంశూన్యం. ఇందుకు రూ.82,500 వెచ్చించాడు. గతేడాది 9గంటల విద్యుత్తుఇస్తే ఇదే పొలంలో పంట పండింది. ఇప్పుడేమో అప్పే మిగిలింది.

పొట్ట దశలో వరి పైరు పశువుల పాలు

నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం రహత్‌నగర్ నర్సాగౌడ్ ఎకరం పొలంలో ప్రస్తుత యాసంగి పంటగా వరి వేశాడు.. రూ.12 వేలు అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టాడు. జనవరి దాకా నీరుబాగా వచ్చిన బోరు ఇప్పుడు పూర్తిగా ఎండిపోయింది. చుట్టుపక్కల పొలాల్లో బోర్లను రోజంతా నడపటం వల్ల చాలావరకూ భూగర్భజలాలు తగ్గిపోయి నీరు రావడం లేదు. పొట్టదశలో ఉన్న వరి పైరు ఎండిపోతున్నందున పశువులను అందులో వదిలేశాడు.

'చి'వరి' ప్రయత్నం

చివరి దశలో ఉన్న తమ పంటలను కాపాడుకోవడానికి రైతు చేయని ప్రయత్నం లేదు. ఎస్సారెస్పీ వరద కాలువలోని నీటి ఆధారంగా కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. వరద కాలువ రివర్స్ పంపింగ్ పనులవల్ల కాలువలో ఈఏడాది నీటి విడుదల ఉండదని అధికారులు ప్రకటించినా కాలువ నీటిపై ఆధారపడి రైతులు వేల ఎకరాల్లో వరి వేశారు. నీరులేక పంటఎండిపోయే దశకు చేరడంతో ప్రత్యామ్నాయం లేక నిబంధనలకు విరుద్ధమైనా వరదకాలువలో ఇలా బావులుతవ్వుతూ పంటలను కాపాడుకునేందుకు యత్నిస్తున్నారు.
– ఈనాడు, కరీంనగర్



కరీంనగర్ జిల్లా షానగర్ వద్ద ఎస్సారెస్పీ కాలువలో బావులు తవ్వుతున్న పొక్లెయిన్

బంగారం అక్రమ రవాణా గుట్టురట్టు!

- **బిల్లులు లేని బంగారంతో ఆభరణాల తయారీ**
- **ఆపై జాయ్ అలుక్కాస్ దుకాణాలకు సరఫరా**
- **రూ.5 కోట్లకుపైగా విలువైన నగలు స్వాధీనం**
- **ఐటీ అధికారులకు సమాచారం**

ఈనాడు, హైదరాబాద్: పాతబస్తీ నుంచి లెక్కాపత్రం లేకుండా 15.239 కిలోల బంగారు ఆభరణాలను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను హైదరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. హైదరాబాద్ సీపీ వి.వి.శ్రీనివాసరావు మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 'పాతబస్తీలోని రాజారామ్ జువెలర్స్ ఉద్యోగులు వైష్ణవ్ మనోజ్ కుమార్, ప్రదీప్ అగర్వాల్‌లు సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో 15.239 కిలోల బంగారు ఆభరణాలతో ప్యాసింజర్ ఆటోలో చార్‌కమాన్ నుంచి అరాంఘర్ వైపు వెళ్తున్నారు. ఆ రహదారిపై నాకాబందీ నిర్వహిస్తున్న షాలిబండ ఇన్‌స్పెక్టర్ లింగయ్య వారు ప్రయాణిస్తున్న ఆటోను ఆపగా వారు ఆపలేదు. పైగా వేగంగా ముందుకు వెళ్లారు. అప్రమత్తమైన ఆయన. .ఆటో నంబరు, వ్యక్తుల ఆనవాళ్లను చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్‌రెడ్డికి తెలిపారు. వేగంగా స్పందించిన ఆయన సిబ్బందితో వెళ్లి మహబూబ్‌నగర్ క్రాస్‌రోడ్స్ వద్ద ఆ ఆటోను నిలిపి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వారిరువురూ ఇచ్చిన సమాచారం ఆధారంగా రాత్రి 10 గంటల ప్రాంతంలో రాజారామ్ జువెలర్స్ యజమాని యశస్వి అగర్వాల్ ఇంటికి వెళ్లిన పోలీసులు ఆభరణాల తాలూకూ బిల్లులపై ఆరా తీశారు. లేవని సమాధానం చెప్పడంతో ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం హైదరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో ముగ్గుర్నీ ప్రాథమికంగా విచారించాం. వారా ఆభరణాలను బెంగళూరు, మైసూరు, మలబార్‌లలోని జాయ్ అలుక్కాస్ బంగారు, వజ్రాభరణాల దుకాణాలకు తరలిస్తున్నట్లు తేలింది. దీనిపై ఐటీ అధికారులకు సమాచారమిచ్చాం.' అని సీపీ వివరించారు.

అక్రమ రవాణాపై బలపడిన అనుమానాలు

సాధారణంగా ఆభరణాలు తయారు చేయాలనుకునే వాళ్లు..బిస్కెట్లు లేదా ముద్ద రూపంలోని బంగారాన్ని కొనుగోలు చేయాలి. దానికీ రసీదులు ఉండాలి. తయారీ తర్వాత ఆభరణాల విక్రయాలూ బిల్లుల ద్వారానే జరపాలి. 'బిల్లులు చూపకపోవడాన్ని బట్టి రాజారామ్ జువెలర్స్ యజమాని బంగారాన్ని అక్రమ మార్గాల్లో కొనుగోలు చేయడమో లేదా దుబాయ్ లేదా ముంబయి నుంచి అక్రమంగా తెప్పించుకోవడమో చేసి ఉంటాడని' పోలీసులు అంచనాకు వచ్చారు. బంగారు ఆభరణాల తయారీకి వినియోగించిన ముడి బంగారం జాయ్ అలుక్కాస్ యజమానులు ఇచ్చారా? యశస్వి అగర్వాల్ సొంతంగా సమకూర్చుకున్నారా? అన్న అంశాలను ఆదాయ పన్నుశాఖ అధికారులు దర్యాప్తు చేస్తారని పోలీస్ కమిషనర్ తెలిపారు.

రగులుతున్న సిరియా

800కు చేరిన మృతులు

దూమా (సిరియా): ప్రభుత్వానికి, తిరుగుబాటుదారులకు మధ్య జరుగుతున్న పోరుతో సిరియాలోని తూర్పు ఘౌటా ప్రాంతం అట్టుడికిపోతోంది. తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉన్న ఘౌటాపై.. రష్యా సేనల సాయంతో సిరియా ప్రభుత్వం గతనెల 18 నుంచి భీకర దాడులు చేస్తోంది. రెండు వర్గాల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ఘటనల్లో ఇప్పటివరకూ 800 మంది మృతిచెందారు. వీరిలో 177 మంది చిన్నారులు! మంగళవారం ప్రభుత్వం చేపట్టిన గగతల దాడుల్లో కనీసం 19 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయినట్లు సిరియాలో మానవహక్కుల పరిశీలన సంస్థ తాజాగా వెల్లడించింది. రష్యా రవాణా విమానం కుప్పకూలి అందులో ప్రయాణిస్తున్న 32 మంది ప్రాణాలు కోల్పోయారు. రాజధాని డెమాస్కస్ శివారులో ఉన్న తూర్పు ఘౌటాలోకి వారం రోజులుగా ప్రభుత్వ సేనలు చొచ్చుకొస్తున్నాయి. అక్కడ 40 శాతం భూభాగంపై సిరియా సైన్యం పట్టు సాధించినట్లు ఓ వార్తా సంస్థ వెల్లడించింది. కాగా, సిరియాలోని పరిస్థితిపై చర్చించేందుకు ఐరాస భద్రతా మండలి అత్యవసర సమావేశం కావాలని ఫ్రాన్స్, బ్రిటన్‌లు పిలుపునిచ్చాయి.

పాతబస్తీలో పట్టపగలు భారీ దోపిడీ

- **5 కిలోల నగలు అపహరణ**

ఈనాడు– హైదరాబాద్, చార్మినార్– న్యూస్‌టుడే: పాతబస్తీలోని బంగారు ఆభరణాల కార్ఖానాలో ఓ అంతర్‌రాష్ట్ర ముఠా దోపిడీకి పాల్పడింది. పట్టపగలు అందులోని కార్మికులను మారణాయుధాలతో బెదిరించి ఐదు కిలోల బంగారు ఆభరణాలను ముఠా సభ్యులు ఎత్తుకెళ్లారు. పాతబస్తీలోని షేర్ అలీ తబేలా సమీపంలోని నగర పోలీస్ సాయుధ విభాగం వెనుక మంగళవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుంది. ప్రత్యక్ష సాక్షులు, చార్మినార్ పోలీసులు వివరాలను తెలిపారు. పశ్చిమ బంగ రాష్ట్రానికి చెందిన నీతైదాస్ తన బంధువులు సాహెబ్‌దాస్(27), దీపాంకర్(25)లతో కలిసి రెండేళ్లుగా పాతబస్తీలోని షేర్‌అలీతబేలాలో బంగారు ఆభరణాలు తయారుచేసే కార్ఖానా నిర్వహిస్తున్నాడు. నీతైదాస్ ముంబయిలో ఉంటుండగా మిగిలిన ఇద్దరు.. 21మంది పశ్చిమబంగ కార్మికులతో ఆభరణాలు తయారు చేయిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో 12మంది దోపిడీ దొంగలు కత్తులతో వచ్చారు. ముసుగులు ధరించిన వీరు కార్మికులను బెదిరించి, వారి కాళ్లు చేతులు కట్టివేసి నోటికి ప్లాస్టర్ అతికించారు. తాము వెళ్లిపోయే వరకు చప్పుడు చేయరాదని దోపిడీ ముఠాలోని ఓ వ్యక్తి రివాల్వర్‌తో బెదిరించాడు. త్రిజోరీని (ఖజానాను) పగులగొట్టి అందులోని 5కిలోల బంగారు ఆభరణాలు, చూర్ణం వెంట తీసుకెళ్లారు. తమను గుర్తించకుండా అక్కడున్న సీసీకెమెరాల వైర్లు కత్తిరించడంతో పాటు, డీవీఆర్, హార్డ్ డిస్క్‌లను వెంట తీసుకెళ్లారు. వీరంతా గంటకుపైగా అక్కడే ఉన్నారు. తలుపు గడియవేసి పరారయ్యారు. ఆభరణాల కోసం వచ్చినవారు బయట తలుపు తీయడంతో దోపిడీ వెలుగులోకి వచ్చింది. దక్షిణ మండలం డీసీపీ వి.సత్యనారాయణ, టాస్క్‌ఫోర్సు డీసీపీ రాధాకృష్ణారావు, అదనపు డీసీపీలు గౌస్‌మోహినుద్దీన్, చైతన్యకుమార్(టాస్క్‌ఫోర్సు), చార్మినార్ ఏసీపీ బి.అంజయ్య, ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్‌రెడ్డిలు కర్మాగారమంతా క్షుణ్నంగా పరిశీలించారు. నిందితులను పట్టుకునేందుకు ఐదు పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని డీసీపీ వి.సత్యనారాయణ వెల్లడించారు. పదిమందిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నామన్నారు.



హైదరాబాద్ పాత నగరంలో బంగారం దొంగతనం జరిగిన ఇంటివద్ద గుమికూడిన జనం.. విచారిస్తున్న పోలీసులు

త్రిపురలో విధ్వంసకాండ

అగర్తలా: పాతికేళ్ల తర్వాత తొలిసారిగా అధికార మార్పు ముంగిట నిలిచిన త్రిపురలో అల్లర్లు చెలరేగాయి. రాష్ట్రవ్యాప్తంగా భాజపా, వామపక్ష కార్యకర్తల నడుమ ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. సోవియెట్ మాజీ నాయకుడు, కమ్యూనిస్టు దిగ్గజం లెనిన్ విగ్రహాలను ఆందోళనకారులు కూల్చివేశారు. భాజపా నేతలే ఈ ఘటనలకు పాల్పడ్డారని సీపీఎం, తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించాయి. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్.. రాష్ట్ర గవర్నర్, డీజీపీలతో మాట్లాడారు. కొత్త ప్రభుత్వం ఏర్పడేవరకూ హింసను అదుపుచేయాలని ఆదేశించారు.

గత శనివారం వెలువడ్డ త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో పాతికేళ్ల సీపీఎం పాలనకు ముగింపు పాడుతూ, భాజపా-ఐపీఎఫ్‌టీ కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత చెదుమదురు ఘటనలు ప్రారంభమైనట్లు పోలీసులు తెలిపారు. బెలోనియా, శాబ్రోమ్‌లో లెనిన్ విగ్రహాలను కూల్చివేశారని ఎస్పీ మోంచాక్ ఇప్పర్ తెలిపారు. బెలోనియాలోని విగ్రహాన్ని జేసీబీతో కూల్చివేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి తపస్ దత్తా చెప్పారు. అనంతరం 'భారత్ మాతాకీ జై' నినాదాలు చేశారని చెప్పారు.

వ్యాఖ్యలపై వివాదం..

మరోవైపు విగ్రహాల కూల్చివేతపై స్పందిస్తూ.. ' 'ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ఒక ప్రభుత్వం చేసిన పనిని.. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన మరో ప్రభుత్వం రద్దు చేయవచ్చు'' అంటూ త్రిపుర గవర్నర్ తథాగత రాయ్ చేసిన ట్వీట్ వివాదాస్పదమైంది. దీనిపై సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మండిపడ్డారు. గవర్నర్ వ్యాఖ్యలు దురదృష్టకరమని, రాజ్యాంగ పదవుల స్థాయిని తగ్గిస్తున్నారని ఇది స్పష్టం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అల్లర్ల నేపథ్యంలో పశ్చిమ త్రిపురలోని అనేక ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు విధించారు. భాజపా, ఐపీఎఫ్‌టీ కార్యకర్తలు భయాందోళనలు సృష్టిస్తున్నారని ఏచూరి కోల్‌కతాలో ఆరోపించారు. తమ పార్టీకి చెందిన 514 మంది కార్యకర్తలపైన, 1539 ఇళ్లపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. 196 ఇళ్లను తగులబెట్టారని ఆరోపించారు. తమ పార్టీకి చెందిన 134 కార్యాలయాలపై దాడులు చేసి, లూటీలకు పాల్పడ్డారన్నారు. 64 కార్యాలయాలను తగులబెట్టారని ఆరోపించారు. ఈ విధ్వంసాన్ని నిరసిస్తూ ఏచూరి పార్టీ అగ్రనేతలు ప్రకాశ్ కారాట్, బృందా కారాట్ తదితర నేతలు కోల్‌కతాలో ర్యాలీ నిర్వహించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఇలాంటి దాడులకు పాల్పడటం సరికాదని సీపీఐ నేత డి.రాజా చెప్పారు. ప్రపంచంలోనే అగ్ర నేతల్లో లెనిన్ ఒకరని, ఆయనను గౌరవించాలని కోరారు. లెనిన్ విగ్రహాల కూల్చివేతలో భాజపా-ఆరెస్సెస్ పాత్ర ఉందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. అధికారంలోకి రాగానే ఒక దిగ్గజ నాయకుడి విగ్రహాలను కూల్చివేయడం సరికాదన్నారు. త్రిపురలో హింసను నిలువరించేందుకు తక్షణం జోక్యం చేసుకోవాలని సీపీఎం.. ప్రధాన మంత్రికి ఒక విజ్ఞాపన పత్రాన్ని అందజేసింది.

మరోపక్క సీపీఎం కార్యకర్తలు తమ పార్టీకి చెందిన 49 మందిపై దాడులు చేశారని, 17 మంది ఆసుపత్రి పాలయ్యారని భాజపా ఆరోపించింది.

అణచివేతకు గురైనవారే..

వామపక్ష పాలనలో అణచివేతకు గురైనవారే లెనిన్ విగ్రహాన్ని కూల్చివేశారని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ పేర్కొన్నారు. హింసావాదాన్ని భాజపా ప్రేరేపించదని, ఆ పనిచేసేది వామపక్షమేనని పేర్కొన్నారు. విదేశీ నేతల విగ్రహాలకు భారత్‌లో చోటులేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ అహిర్ వ్యాఖ్యానించారు. "లెనిన్ విదేశీయుడు. ఒకరకంగా ఉగ్రవాది కూడా. అలాంటి వ్యక్తి విగ్రహం మన దేశంలో ఉండకూడదు. కావాలనుకుంటే కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యాలయంలో దాన్ని పెట్టుకొని, పూజలు చేసుకోమనండి" అని భాజపా ఎంపీ సుబ్రమణ్య స్వామి పేర్కొన్నారు. భాజపా సీనియర్ నేత రామ్ మాధవ్ స్పందిస్తూ.. "ప్రజలు లెనిన్ విగ్రహాన్ని తొలగించింది రష్యాలో కాదు.. త్రిపురలోనే. చలో పాల్టాయ్ (మార్చేద్దాం పదండి)" అని ట్విటర్‌లో తొలుత వ్యాఖ్యానించారు. ఆ తర్వాత ఈ వ్యాఖ్యలను తొలగించారు.

ఒక పథకం ప్రకారమే విగ్రహాల కూల్చివేతకు భాజపా పాల్పడుతోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి విమర్శించారు. విదేశీ నేతల విగ్రహాలకు భారత్‌లో చోటు లేదన్న మంత్రి హన్స్‌రాజ్ అహిర్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. మహాత్మా గాంధీ విగ్రహాలు అనేక దేశాల్లో ఉన్నాయని గుర్తు చేశారు.

తెరాస ప్లీనరీలో కూటమి శంఖారావం

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించిన కేసీఆర్ దీనికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఛత్తీస్‌గఢ్ మొదటి ముఖ్యమంత్రి, రాష్ట్ర జనతా కాంగ్రెస్ నేత అజిత్ జోగి, మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తదితరులు మద్దతు ప్రకటించారు. జాతీయ స్థాయిలో నేతలు, వివిధ వర్గాల ప్రముఖులు, మేధావులు, విశ్రాంత అధికారులను కలిసేందుకు దేశరాజధాని దిల్లీ సహా ముంబయి, కోల్‌కతా, చెన్నై, బెంగళూరులో సమావేశాలు నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారు. ఈనెల 12వతేదీ నుంచి నెలాఖరు వరకు శాసనసభ సమావేశాలున్నాయి. తర్వాత ఆయన కూటమిపై దృష్టి సారించనున్నారు. ముందుగా ప్లీనరీని నిర్వహించి, దాన్నుంచే తన సందేశం వినిపించాలని భావిస్తున్నారు. భావసారూప్యత గల పార్టీలతో పాటు తమ మద్దతుదారులైన మమత, ఇతర జాతీయస్థాయి నేతలను, ప్రాంతీయ పార్టీల ప్రముఖులను ముఖ్యమంత్రి ఆహ్వానిస్తారు. హైదరాబాద్ అనుకూలంగా ఉన్నందున ఇక్కడే ప్లీనరీని జరుపుతారు. తెరాస ఆవిర్భావ నిర్ణయాన్ని హైదరాబాద్‌లోనే తీసుకుని ప్రకటించిన సీఎం కేసీఆర్, ఇదే తరహాలో హైదరాబాద్ నుంచే కూటమి స్వరూపాన్ని ప్రకటించి, తమ వాణిని వినిపించడం ద్వారా కలసి వస్తుందనే భావనతో ఉన్నారు. సీఎం కేసీఆర్ అందుబాటులో ఉన్న పార్టీ నేతలతో మంగళవారం సమావేశమై కూటమి అంశాలపై చర్చించారు. జాతీయస్థాయిలో పార్టీ సమన్వయకర్తల నియామకాల కోసం ఆయన కసరత్తు చేసినట్లు తెలిసింది. పార్టీ ఎంపీలకు ఈ బాధ్యతలు అప్పగించారు.

12న పార్టీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు!

ఈనాడు, హైదరాబాద్: తెరాస రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్లు ఈనెల 12న దాఖలు చేసేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. ముహూర్తం బాగున్నందున అదే రోజును పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసినట్లు సమాచారం. ఈనెల 8వతేదీన కూడా మంచి ముహూర్తం ఉన్నా అప్పటికీ పార్టీ అభ్యర్థుల ఎంపిక జరిగే అవకాశం లేనందున 12నే నామినేషన్లు దాఖలు చేయించాలని భావిస్తున్నట్లు తెలిసింది.

12న బీఏసీ సమావేశం: రాష్ట్ర శాసనసభ కార్యకలాపాల కమిటీ సమావేశాన్ని ఈనెల 12న నిర్వహించాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నారు. ఆ రోజు ఉదయం గవర్నర్ ప్రసంగం అనంతరం బీఏసీ సమావేశం శాసనసభాపతి మధుసూదనాచారి అధ్యక్షతన జరుగుతుంది.

ఎంపీలకు అభినందనలు: ముస్లిం, ఎస్టీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం కోరడంతో పాటు ఇతర అంశాలపై పార్లమెంటులో నిరసనలతో తమ గళాన్ని వినిపిస్తున్న తెరాస ఎంపీలను మంగళవారం సీఎం కేసీఆర్ అభినందించారు.

రెవెన్యూ భర్తీలపై కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకత వ్యక్తమైంది. కొన్ని జిల్లాల్లో తహసీల్దార్లు కలెక్టర్లకు లేఖలు కూడా ఇచ్చారు. విధుల్లో వ్యత్యాసం, ఆర్థిక లావాదేవీల వ్యవహారాలు, ఆడిటింగ్ లాంటి ప్రక్రియలు తహసీల్దార్లను వెనకడుగు వేసేలా చేస్తున్నాయని చర్చ చోటుచేసుకుంది. కొద్దిరోజుల పాటు ఇచ్చే శిక్షణతో సబ్‌రిజిస్ట్రార్ల విధులు ఎంతమేరకు సక్రమంగా నిర్వర్తించగలమని అధికశాతం మంది సందేహిస్తున్నారు. మౌలిక వసతుల కొరత, సిబ్బంది ఖాళీలు, ప్రత్యేక బడ్జెట్‌లాంటి కీలకాంశాలను వారు లేవనెత్తారు. ఈ పరిణామం ప్రభుత్వవర్గాల్లోనూ చర్చకు దారి తీసినట్లు తెలిసింది. ఇంతలో సమస్యలు పరిష్కరిస్తే సబ్‌రిజిస్ట్రార్ల బాధ్యతలకు తహసీల్దార్లు సిద్ధమేనంటూ తెలంగాణ తహసీల్దార్ల సంఘం(టీజీటీఏ) ప్రకటించడం ప్రభుత్వానికి మార్గం సుగమం చేసిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు రిజిస్ట్రేషన్ల శాఖలో ప్రభుత్వ నిర్ణయంపై వ్యతిరేకత ప్రారంభమవ్వడం చర్చనీయాంశంగా మారింది.

అంతా 'ఆన్‌లైన్ రహితమే'

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికంటే బాగా పెరుగుతుంది. రాష్ట్రంలోని ప్రతి పంచాయతీకి స్వైపింగ్ యంత్రాలను అందజేసి, ప్రత్యేక బ్యాంకు ఖాతాను తెరిస్తే నగదు లావాదేవీలు కొంతమేరకైనా తగ్గిఉండేవని చెబుతున్నారు.

పోగుపడుతున్న నల్లధనం: రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లోనూ స్థిరాస్తి రంగం పుంజుకొంటోంది. బ్యాంకు రుణంతో కొనుగోలు చేసే సందర్భాల్లో తప్ప మిగతాచోట్ల ఆయా ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ మినహా మిగతా మొత్తాన్నంతా నగదు రూపేణా అమ్మకందారులు వసూలు చేస్తున్నారు. ఈ పైకమంతా వారి వద్ద నల్లధనంగా పోగుపడుతోంది. ఇళ్ల నిర్మాణ సామాగ్రి దుకాణాల్లో స్వైపింగ్ యంత్రాల్లో డెబిట్ కార్డు ద్వారా సొమ్మును చెల్లిస్తామంటే వ్యాపారులు అంగీకరించటంలేదు. నగదు రహితమైతే టర్నోవర్ పెరిగి ఆదాయపు పన్ను భారమూ పెరుగుతుంది. కాబట్టే వ్యాపారులు అదనపు రుసుములంటూ వినియోగదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలోనూ నగదు ఇవ్వాలనే పట్టుపడుతున్నారు. పన్నుల శాఖలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు కలసి కార్యాచరణ ప్రణాళికను చేపడితేనే కొంత వరకు ఫలితలు ఉంటాయని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

గ్రహం అనుగ్రహం

7–3–2018 బుధవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; బహుళ పక్షం
షష్ఠి: తె. 4-08 తదుపరి సప్తమి
విశాఖ నక్షత్రం: రా. 12-44 తదుపరి అనూరాధ
అమృత ఘడియలు: మ. 3-27 నుంచి 5-08 వరకు
వర్జ్యం: ఉ.శే. 7-02 వరకు తిరిగి తె. 5-01 నుంచి
దుర్ముహూర్తం: మ. 11-47 నుంచి 12-34 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6-19; సూర్యాస్తమయం: సా.6-04

బడి సమస్యలపై విద్యార్థుల లేఖాస్త్రం

- సౌకర్యాల కల్పనపై పాఠశాల విద్యాశాఖ నిర్లక్ష్యం
- అధికారులను అడిగి ప్రయోజనం లేదని హైకోర్టుకు లేఖలు
- స్పందిస్తున్న న్యాయమూర్తులు.. కదులుతున్న అధికారులు
- సమస్యల పరిష్కారంపై పిల్లల్లో పెరుగుతున్న చైతన్యం


హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసి విద్యావాలంటీర్లను సాధించుకున్న చింతలకుంట హైస్కూల్

ఊరు: చింతలకుంట.
మండలం : గట్టు. జిల్లా : మహబూబ్‌నగర్(పాత).
ప్రస్తుతం : గద్వాల జిల్లా కాలూర్ తిమ్మందొడ్డి మండలం.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అయిదు తరగతులకు ఒకేఒక ఉపాధ్యాయుడు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పరిస్థితిలో మార్పులేకపోవడంతో 57 మంది విద్యార్థులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. ఇది 2015 ఆగస్టులో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. దీనిపై న్యాయమూర్తి మీ పిల్లలను తప్పనిసరిగా సర్కారు బడుల్లో చేరేలా ఆదేశాలివ్వమంటారా? అంటూ ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో రాష్ట్రప్రభుత్వం ఆ పాఠశాలలకు ఆరుగురు విద్యావాలంటీర్లను నియమించింది.

ఊరు : కోరుట్ల.
జిల్లా : జగిత్యాల.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దాదాపు 300 మందికిపైగా బాలికలకు ఒకే మూత్రశాల ఉంది. ఎవరికి చెప్పుకున్నా స్పందన లేకపోవడంతో జిల్లా సెషన్స్ జడ్జికి లేఖ రాశారు. ఆయన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపించారు. ఫలితం.. విద్యాశాఖ అధికారులు హుటాహుటిన అంచనాలు రూపొందించి రూ. 11 లక్షలు మంజూరు చేశారు.

ఈనాడు - హైదరాబాద్

సర్కారు బడుల్లో సంవత్సరాల తరబడి తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కాకపోతే తమ గతి ఇంతేనని అనుకునే రోజులు పోతున్నాయి. పాఠశాల విద్యాశాఖ పట్టించుకోకపోయినా.. ప్రజాప్రతినిధులు స్పందించకున్నా తమ హక్కులను కాపాడుకోవడానికి.. న్యాయం పొందడానికి విద్యార్థులు కొత్త మార్గాన్ని వెతుకుతున్నారు. ఏకంగా జిల్లా, హైకోర్టు న్యాయమూర్తులకు లేఖలు రాస్తున్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను లేఖల్లో వివరిస్తున్నారు. న్యాయమూర్తులు వెంటనే స్పందించి సుమోటోగా స్వీకరించి విద్యాశాఖకు నోటీసులకు జారీ చేస్తున్నారు. హైకోర్టే రంగంలోకి దిగుతుండటంతో ఇక అధికారులు సమస్యల పరిష్కారానికి పూనుకుంటున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఓ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల నిర్మిస్తున్నారని, దీనివల్ల క్రీడామైదానం తగ్గిపోతుందంటూ అక్కడి విద్యార్థులు హైకోర్టుకు లేఖ రాశారు. అధికారులు విచారణ జరిపి సమస్యను పరిష్కరించారు. ప్రాథమిక హక్కులు, న్యాయం పొందడంపై పాఠాల్లో చదువుకోవడమే కాకుండా వాటికి భంగం కలిగితే ఎక్కడ? ఎలా పరిష్కరించుకోవచ్చో న్యాయం కోసం న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని నేటితరం విద్యార్థులు తెలుసుకుంటున్నారు. ఇది మంచి పరిణామమని ఎంపీ ఫౌండేషన్ ప్రతినిధి వెంకటరెడ్డి అభిప్రాయపడ్డారు.

విద్యాశాఖ వైఫల్యమే కారణం

పాఠశాల విద్యాశాఖలో మౌలిక వసతుల కల్పనకు సర్వశిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ), రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్(ఆర్ఎంఎస్ఏ) కింద ఏటా రూ. వందల కోట్ల నిధులొస్తున్నాయి. ఇక రాష్ట్రప్రభుత్వం కమిషనర్ కార్యాలయానికి కొంత మొత్తంలో కేటాయిస్తున్నారు. ఎస్ఎస్ఏ ప్రవేశపెట్టి దశాబ్దన్నర కాలమైనా ఇప్పటికీ సర్కారు బడుల్లో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు లేకపోవడం గమనార్హం. 2015 జూన్, జులై నెలల్లో యుద్ధప్రాతిపదికన 17,286 శౌచాలయాలను నిర్మించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇప్పటికీ శౌచాలయాలు లేవు. ప్రతి 40 మంది బాలికలకు ఒక శౌచాలయం ఉండాలన్నది నిబంధన. దానిపై 2016లోనే విద్యాశాఖ ప్రణాళిక రూపొందించినా అది కాగితాలకే పరిమితమైంది. సర్కారు బడుల్లో వసతులను పెంచకుంటే మున్ముందు మరింతమంది లేఖల బాట పట్టవచ్చని ఉపాధ్యాయ సంఘాల నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపై విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్‌ను వివరణ కోరగా బడుల్లో సౌకర్యాలు మెరుగుపరచాలంటే రూ.3 వేల కోట్లు అవసరమని చెప్పారు.

గ్రామీణుల ఆరోగ్య పరిరక్షణకు సమష్టి కృషి

ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి తోడుగా ముందుకొచ్చిన ధన్ ఫౌండేషన్, ఐఎస్‌బీ తదితర సంస్థలు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: గ్రామీణ పేదలకు వైద్య పరీక్షలు, సేవలను అందించాలని ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్వీపీఈఐ), ధన్ ఫౌండేషన్‌తో పాటు మరికొన్ని సంస్థలు ముందుకొచ్చాయి. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి.. నేత్ర సంరక్షణకు అమలు చేస్తున్న విధానాన్ని అన్ని రకాల అనారోగ్య సమస్యలకు వర్తింపజేసి వైద్యసేవలు విస్తృతంగా అందించాలని సిద్ధమవుతున్నాయి. బంజారాహిల్స్‌లోని ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో మంగళవారం దీనిపై మేధోమధన సదస్సు నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆసుపత్రి వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ జి.ఎన్.రావు మాట్లాడుతూ.. వైద్యం, విద్య, జీవనోపాధిలో అందరికీ సమాన అవకాశాలు అందించాలని ఈ ఆలోచన చేసినట్లు తెలిపారు. ఎల్వీపీఈఐ, ధన్ ఫౌండేషన్, ఐఎస్‌బీ, ఫెర్నాండెజ్ ఆసుపత్రి, మీడియం హెల్త్‌కేర్ కన్సల్టింగ్, అమేయ లైఫ్, వాత్సల్య డెంటల్, డాక్టర్స్ ఫర్ సేవా, స్మైల్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కోలో-ప్రాక్టాలజీ, సాక్షమ్, నానో హెల్త్ సంస్థల ప్రతినిధులు ఇందులో పాలుపంచుకునేందుకు ముందుకు వచ్చారన్నారు. ఎల్వీపీఈఐ ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ, ఒడిశాలలో ఇప్పటికే 170 ప్రాథమిక, 18 ద్వితీయ ఆరోగ్య కేంద్రాలు, మూడు టెర్షియరీ కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటి ద్వారా కేవలం కంటి పరీక్షలే కాకుండా ఇకపై అన్ని రకాల ఆరోగ్య సమస్యలను పరీక్షించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. పాల్వంచ, తూడుకుర్తి కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా ఈ సేవలను అందించి, రానున్న రోజుల్లో అన్ని కేంద్రాల్లో చేపట్టనున్నట్లు వివరించారు. ధన్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.పి.వశిమలై, ఐఎస్‌బీ ఆచార్యులు డీవీఆర్ శేషాద్రి తదితరులు మాట్లాడారు.

టీసీసీ ఫలితాలు విడుదల

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో గత జనవరిలో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) పరీక్ష ఫలితాలను విడుదల చేశామని తెలంగాణ ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్కుల ధ్రువపత్రాలను www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వెల్లడించారు.

తత్కాల్‌లో పరీక్ష రుసుం చెల్లించొచ్చు

సార్వత్రిక విద్యాపీఠం

వచ్చే ఏప్రిల్‌లో జరిగే సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) పది, ఇంటర్ వార్షిక పరీక్షలకు రుసుం చెల్లించని వారు తత్కాల్ పథకం కింద చెల్లించవచ్చని సంచాలకుడు వెంకటేశ్వరశర్మ ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతికి రూ. 500, ఇంటర్‌కు రూ.వెయ్యి అదనపు రుసుముతో ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

లెనిన్ విగ్రహాన్ని కూల్చడం నిరంకుశత్వం: చాడ

త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని కూల్చడం సంఘ్‌పరివార్ శక్తుల నిరంకుశత్వానికి నిదర్శనమని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వామపక్ష కార్యాలయాల మీద దాడులు చేసి ఆక్రమించుకోవడం సంఘ్‌పరివార్ వికృత స్వరూపాన్ని బహిర్గతం చేస్తోందనీ, లౌకికవాదులందరూ ఈ సంఘటనలను నిరసించాలని కోరారు.

యూరియా బస్తా బరువు, ధర తగ్గుదల

కలెక్టర్లకు పార్థసారథి లేఖ

యూరియా బస్తా బరువును 50 నుంచి 45 కిలోలకు తగ్గించినందున అదే నిష్పత్తిలో ధర కూడా తగ్గిందని, కొత్త ధరను బస్తాపై ముద్రించి అమ్మేలా చూడాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి సూచించారు. యూరియా ధరపై రైతులకు అవగాహన కల్పించేందుకు సమావేశాలు నిర్వహించాలని మంగళవారం కలెక్టర్లకు రాసిన లేఖలో ఆయన ఆదేశించారు. సాధారణ యూరియా 45 కిలోల బస్తా ధర రూ.242, జింకు కలిపింది. . రూ.266 అని బస్తాలపై తప్పకుండా ముద్రించాలని ఆయన తెలిపారు. ఇంతకన్నా ఎక్కువకు అమ్మితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బీటీ-3 పత్తి విత్తనాలకు కేంద్రం అనుమతి లేదని, వీటిని మార్కెట్‌లో అమ్మకుండా చూడాలని మరో లేఖలో కలెక్టర్లకు సూచించారు.

పురుషోత్తమ్‌రెడ్డి బంధువు నిశాంత్‌రెడ్డికి బెయిలు

ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు

హైదరాబాద్ పట్టణాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ప్రణాళిక విభాగం డైరెక్టర్ పురుషోత్తమ్‌రెడ్డి ఆదాయానికి మించి ఆస్తుల కేసులో మూడో నిందితుడిగా ఉన్న ఆయన బంధువు నిశాంత్‌రెడ్డికి మంగళవారం ఉమ్మడి హైకోర్టు బెయిలు మంజూరు చేసింది. రూ.20 వేల వ్యక్తిగత హామీతోపాటు అంతే మొత్తానికి మరో రెండు పూచీకత్తులను సమర్పించాలని షరతులు విధించింది. ఈ కేసులో అభియోగ పత్రం దాఖలు చేసేదాకా ప్రతి సోమ, బుధవారాల్లో ఏసీబీ దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని ఆదేశించింది. బెయిలు మంజూరు చేయాలంటూ నిశాంత్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.రజని విచారణ చేపట్టారు. వాదనలను విన్న న్యాయమూర్తి నిందితుడి అరెస్ట్ అనంతరం అదుపులోకి తీసుకుని విచారించిన నేపథ్యంలో జైలులో నిర్బంధం అవసరంలేదని అభిప్రాయం వ్యక్తం చేస్తూ బెయిలును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


పాఠశాలకు అటవీదారిలో వెళ్తున్న కొండతోగు గ్రామ చిన్నారులు


★ కష్టాల వంక దాటితేనే చదువు


★ ఆటో ఇటో అయితే.. మా గతేం కాను: ఎత్తుపల్లాల దారిలో ప్రయాణం

భావి బాధిత పౌరులం.. అక్షర వేటకు బాటసారులం!

గిరిజన బిడ్డలు నాలుగు అక్షరాలు నేర్చుకోవాలంటే ఎన్ని కష్టాలకు ఓర్చుకోవాలో చెప్పేందుకు ఈ చిత్రాలే సజీవ సాక్ష్యాలు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని గిరిజన ప్రాంతం కొండతోగు గ్రామంలో 16 మంది బడి ఈడు పిల్లలున్నా బడి లేదు. మూడు కిలోమీటర్ల దూరంలోని పండువారిగూడెం పాఠశాలే దిక్కు. అక్కడికి వెళ్లే క్రమంలో రోజూ అడవిలో అర కిలోమీటరు దూరం రాళ్లు రప్పలు, ముళ్లపొదలతో కూడిన కాలిబాటలో పడుతూ లేస్తూ..మధ్యలో వాగు దాటుతూ..పసివాళ్లు అక్షర ప్రస్థానాన్ని ఇలా కొనసాగిస్తున్నారు.

'వాగు దాటాక ఆటో ఎక్కినా గోతులు, ఇరుకు దారిలో ప్రమాదకర పరిస్థితిలో ప్రయాణం సాగించి పాఠశాలకు చేరుకోవాలి. వర్షాకాలంలో వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తే చదువుకు స్వస్తిపలకాల్సిందే. అధికారులు ఇప్పటికైనా స్పందించి కొండతోగు గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేస్తే బిడ్డలకు కష్ట తప్పుతుంది.' అని గ్రామ గిరిజనులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, అశ్వారావుపేట గ్రామీణం

సైన్సు రంగంలో మహిళలను మరింతగా ప్రోత్సహించాలి

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉద్ఘాటన

దిల్లీ: సైన్సు రంగంలో మహిళలు మరింతగా భాగస్వాములయ్యేలా వారిని శక్తివంచనలేకుండా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మంగళవారం నొక్కి చెప్పారు. ఈ రంగంలో వివక్షను రూపుమాపకుంటే... సైన్సు పరంగా ఆశించిన విజయాలు సాధ్యపడవన్నారు. ఐఐఎస్సీ, ఐఐటీలు, ఐఐఎస్ఈఆర్‌ల సంచాలకులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడారు. ప్రజారోగ్యం, పేదరిక నిర్మూలన, ఆహార, ఇంధన భద్రత తదితర అనేకానేక సమస్యలను మనదేశం ఎదుర్కొంటోందన్నారు. ఇవన్నీ కూడా పెనుసవాళ్లేనని ఉద్ఘాటించారు. నిత్యకృత్యమై పోయిన ఈ తరహా ఇబ్బందులను అధిగమించడంలో ఐఐటీ, ఐఐఎస్సీ వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ నేపథ్యంలోనే సాంకేతిక, సైన్సు రంగంలో మహిళల పాత్ర, భాగస్వామ్యం చురుగ్గా పెరగాలని ఆయన అభిప్రాయపడ్డారు.

అయోధ్య సమస్యకు ఉభయలాభ పరిష్కారం

- **ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్**

బరేలీ: అయోధ్యలో రామ జన్మభూమి-బాబ్రీ మసీదు వివాదానికి ఉభయలాభ (విన్-విన్) పరిష్కారాన్ని కనుగొంటామని ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీరవిశంకర్ అన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా ఈ సమస్య పరిష్కారానికి కృషిచేస్తున్న ఆయన... మంగళవారమిక్కడ ఇత్తెహాద్-ఎ-మిలాత్ కౌన్సిల్ అధ్యక్షుడు మౌలానా తాకిర్ రజాఖాన్‌తో సమావేశమయ్యారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. సిరియాను ఉటంకిస్తూ గతంలో తానుచేసిన వ్యాఖ్యలపై రవిశంకర్ వివరణ ఇచ్చారు. "అది కేవలం ఉదాహరణగా చెప్పిన మాట. భయపెట్టడం కోసం సిరియా విషయాన్ని ప్రస్తావించలేదు. మనం శాంతినీ, సుహృద్భావ పరిస్థితుల్ని కాంక్షిస్తున్నాం. ఇతర దేశాల్లో నెలకొన్న దారుణ పరిస్థితుల్లాంటివి మన దేశంలో ఉండకూడదు. మతవిద్వేషాలు మనకొద్దు. రామ మందిరాన్నీ నిర్మించాలి. మసీదునీ నిర్మించాలి. రెండు వర్గాలవారూ ఆనందంగా ఉండాలి. త్వరలోనే ఉభయులకూ లాభదాయకమైన పరిష్కారాన్ని కనుగొంటాం" అని రవిశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అయోధ్య వివాద పరిష్కారానికి ఉభయ వర్గాలు కూర్చుని మాట్లాడుకునే వాతావరణం కల్పిస్తామని రవిశంకర్ తనతో అన్నట్లు రజాఖాన్ వెల్లడించారు. "ఆయనపై అనుమానం అక్కర్లేదు. చాలా మంది అనుకుంటున్నట్లు రవిశంకర్ భాజపా కీలుబొమ్మ కాదు. అయోధ్య సమస్య పరిష్కారానికి ఆ పార్టీ సుముఖంగా లేదన్నది వాస్తవం. రవిశంకర్ ఉద్దేశాలు మాత్రం మంచివే. ఆయన ఆలోచనలను స్వాగతిస్తున్నా" అని రజాఖాన్ అన్నారు.


మంగళవారం హైదరాబాద్ హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ సలహాదారు వివేక్ కుమారుడి వివాహ విందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి మంత్రి నాయిని నర్సింహారెడ్డి సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను దాచుకునేందుకు అనుమతి

ఈనాడు, హైదరాబాద్: సొంత అవసరాలకు (క్యాప్టివ్) విద్యుదుత్పత్తి కేంద్రాలను ఏర్పాటుచేసుకున్న వారు మిగులు విద్యుత్‌ను నిల్వ(బ్యాంకింగ్) పేరుతో దాచుకునేందుకు అనుమతిస్తూ 'తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ)' మంగళవారం ఆదేశాలిచ్చింది. ఇలా విద్యుత్‌ను నిల్వ చేసుకునేందుకు సదరు ప్లాంటు ఉన్న పరిధిలోని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)తో ముందుగా ఒప్పందం చేసుకోవాలి. విద్యుత్‌ను నిల్వ చేసుకునేందుకు 'బ్యాంకింగ్ రుసుము'లను డిస్కం వసూలు చేస్తుంది. ఒకసారి నిల్వ చేసిన విద్యుత్‌ను తిరిగి సదరు ప్లాంటు వాడుకోకపోతే దానికి ఈఆర్సీ నిర్ణయించిన ప్రకారం ధరను డిస్కం తిరిగి చెల్లిస్తుంది. దీనివల్ల అవసరాలకు మించి విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునే క్యాప్టివ్ ప్లాంట్లకు అదనపు ఆదాయం డిస్కం నుంచి వస్తుంది. ఒకవేళ తిరిగి వాడుకోవాలంటే మాత్రం.. డిస్కం నిర్ణయించిన 'గరిష్ఠ(పీక్) డిమాండు' ఉండే సమయంలో తిరిగి ఇవ్వరు. ఉదాహరణకు రోజులో సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకూ గరిష్ఠ డిమాండు సమయంగా నిర్ణయించారనుకుంటే ఆ సమయంలో బ్యాంకింగ్ విద్యుత్‌ను క్యాప్టివ్ ప్లాంటుకు ఇవ్వరు. ఒప్పందం చేసుకునే సమయంలోనే షరతులను ఆమోదించినట్లు క్యాప్టివ్ ప్లాంటు తెలపాలి.

కేసీఆర్.. రాజకీయాలను మారుస్తారంటే నమ్మగలమా..?: కోదండరాం

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ఉద్యమ కాలంలో ఇచ్చిన వాగ్దానాలు మరచిపోయిన కేసీఆర్ దేశ రాజకీయాలు మారుస్తానంటే నమ్మగలమా? అని రాజకీయ ఐకాస రాష్ట్ర ఛైర్మన్ ఆచార్య కోదండరాం అన్నారు. మహబూబాబాద్‌లో మంగళవారం నిర్వహించిన 'రైతాంగ-నిరుద్యోగ సదస్సు'లో ఆయన పాల్గొని మాట్లాడారు. 'సచివాలయానికి పోని ఆయన దిల్లీకి పోతారట. . పోయి అక్కడ ఏదో మారుస్తారట.. ఇక్కడ ఏం చేయని ఆయన దిల్లీకి పోయి ఏం చేస్తారు' అని కోదండరాం వ్యాఖ్యానించారు. మనుషులను కలవరు.. ప్రతిపక్ష పార్టీలకు కలిసే అవకాశం ఇవ్వరు.. కనీసం ఆ పార్టీ శాసనసభ్యులకు సైతం సమయం కేటాయించని ఆయన అక్కడికి వెళ్లి ఏం మారుస్తారో చూద్దామన్నారు. రాజకీయాలను మార్చదలచుకుంటే ముందుగా రాష్ట్ర ఆవిర్భావ ఆశయాలను అమలు చేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయ విలువలను మార్చాల్సిన అవసరం ఉందని అందుకోసం కలిసి ముందుకు సాగుదామని విద్యార్థులు, రైతులకు కోదండరాం పిలుపునిచ్చారు.